# భారతి

సంపుటము 25 | అక్టోబరు, 1948 | సంచిక 10

సర్వధారి భాద్రపదము

# పోతరాజుతో కవిరాజు

శ్రీ ముదిగొండ కోటయ్యశాస్త్రి

కాగిన పాలమీగడలు, కమ్మను కమ్మని జుంటితేనియల్
బాగగు కండచక్కెరల పానకముల్ భవదుక్తు లట్టి నీ
భాగవతప్రబంధరసబంధురదివ్యకథావిశేష సం
యోగము సర్వమానవశుభోదయమూలము కాదె సత్కవీ!

శ్రీవసుదేవనందనవిచిత్రపవిత్రచరిత్రచిత్రసం
భావితసర్వధర్మపథభాగనియోజితపాండితీకళా
భావవినూత్నకల్పితవిభాసితవాణీవిభూషణంబుగా
నీ వలరించినట్టి కృతి నెవ్వడు తా దలదాల్పకుండునే?

ఒక పద్యంబున కొక్క లక్షవరహా లొప్పైన నీకావ్య మూ
రక మూల న్పడవైచి కుంకుమహరిద్రాచూర్ణపుష్పంబులం
దిక నెన్నాళ్లు పుటంబు బెట్టెదవు నీ వేమందువోగాని లే
మి కటన్ జెందగ నేల బ్రాతుకికగా మేల్గాదె యోజింపుమీ.

బావా, నే నిటు లంటి నంచు కినుకన్ బల్కాడరాకున్న నా
కావం తేనియు నీమొడ న్గలుగ దయ్యా రోస మెల్లేని నీ

వేవో చల్లగ ధర్మపన్నముల నెన్నో చెప్పు ముం దింత యే
దోవో తిండికి చూచుకోవలెనో లేదో శూన్యగేహంబునన్.

పాలిపోయిన దున్నల పాలవడిన
అతుకులంటల నాగలి హాలికుడవు
నీవు-మల్లన్నతోడ్పాటు- నేల చవిటి
పర్ర-బాపన సేద్యము- బాగు బ్రతుకు
తెరవునకు జెప్పవలసిన దేమి కలదు
విత్తనాలైన మళ్లెడి విధము వలదే ?

రావుసింగమహీపాలరాజకొలువు-భారతీదేవి కాటల పట్టుగొమ్మ
వాస్తవంబుగ బుధులు సర్వజ్ఞు డనుట-లో విశేషము లేని సుశ్లోకు డతడు.

కొమ్మని సత్కవీంద్రులకు కొల్లలుగా ధన మిచ్చినాడు లో
కమ్మున పేరునొందిన యఖండయశంబు గడించినాడు నీ
సమ్మతి నొంది భాగవతసత్కృతి గైకొన గోరుచున్న వా
డమ్మనుజాధినేత విను మాతడు మెచ్చిన దక్కవే మికన్.

ఈడువచ్చిన కన్యక నెంతకాల-మింట నుంచెద మటుచేయకుంట లెన్న
కన్యయె వృణించు.స్వయముగ గాంతు కాని-యెడల దప్పదు గాంధర్వ మెప్పుడేని.

చెల్లునో చెల్లదో యిటుల జెప్పితి దోచిన రీతి చూడగా
నొల్లక మీ దరిద్రదశ యొప్పగొ తప్పగొ నీ వెరుంగవే
బల్లిదు లౌచు మీరు బహుధంగుల చింతల దూలుచుండ మా
యుల్లము చల్లనౌనె సుఖ ముండియు నేమి ప్రయోజనంబగున్ ?

ఈపని కీ వొడంబడితివేని సతంబును కాలుమీద గా
లొమ్మపుక గూరుచుండి సుఖభోగము లొందెద వెంతయేని నీ
వోపెద యట్లుగానియెడ నూకొని రా జొనరించు సేతకున్
కాపుర మున్న యీ యినుపగజ్జెలతల్లి విధించు కైదుకున్.

కడుపే నిండని కార్యసాధనలకై కష్టింపగా నేల నీ
మిడిమేలంపు దరిద్రసంకటవిధి న్మీరంగ లేకుంటి వీ
వడుగ న్నాకదను శాస్త్రిరా జెవడు నీ కామాటయే లేదురా
ముడు నీవా డయి కూళ్ళనేమొ సిరుల న్ముందేల కాదంచనన్.

తెలిసి యవ్యక్తమున బడు తెన్ను దోచ-విష్ణురూపుడుగాక భూవిభుడు కాడు
అతని కిడు కృతి శ్రీహరి కర్పణమెగ-నిర్విచారపథంబు వే నిర్ణయింపు.

# ‘ఉదీర్ధ్వం జీవో!!’

[ఊహాచిత్రము]

●

## శ్రీ తెన్నేటి సూరి

"ఉదీర్ధ్వం జీవో అసుర్నఆగాద్ ప్రపాగ్ అత్తమ ఆజ్యోతిరేతి
అరైక్పంథాం యాతవే సూర్య్య అగన్మ యత్రః ప్రతిరంతరాయుః" —ఋగ్వేదము

"ఉదీర్ధ్వం జీవో!!!"—

"ఆహ్హా!......"

"ఉదీర్ధ్వం జీవో!!!"

"ఆ!......నీ వెవరవు...?"

"ఉదీర్ధ్వం జీవో!"

"అవును......జ్యోతి వచ్చుచున్నది...మానవుడను"

"ఉదీర్ధ్వం జీవో!"

"నేను బ్రతుకుచున్నానువలె నున్నది—ఏదో ఒక యుగాంతమందు చైతన్యమును కోల్పడి, స్తబ్ధముడై, శబ్దగ్రహణపారీణత నశించిపోయిన నా శ్రోత్రపుటములలో జివ్వుజివ్వున రేడియో విద్యుత్తరంగములు ప్రవహించుచున్నవి."

"శరీరము పులకించుచున్నది—ఈ అంధకార గర్భమునంతయూ జ్వలించుచూ, జగత్ప్రబోధకమై, గగనపథమున మెరయుచున్న యీ విశుద్ధఘోషధ్వని యెవరిది?—యెవరవు నీవూ?—

"లెమ్ము నాయనా! లే లే!"

"భగవంతుడవా?—"

"కాదు—లేచిరమ్ము"

"విశుద్ధమైన యీ శాంతిగంభీరమంగళనిస్వనము పూజ్యపాదులైన నా వంశకర్తల గాత్రస్వనిని పోలియున్నదే!—యెవరు మీరూ?"—

"దివ్యర్షుల పునీతరక్తము నా నాళములలో ప్రవహించుచున్నది. నా గాత్రమునకు కొంచెమా పోలిక లుండవచ్చును. చిమ్మచీకటుల బలమయియున్న యీ అంధకారమహాకుహరాంతరమునుండి బయటికి లేచి రమ్ము. ఆ మృత్యుగర్భమునుండి బయల్పడుము—ఇచ్చట దిగ్దిగంతముల విస్ఫురితము గావించుచు, ఉజ్జ్వలముగా మహోదయ మగుచున్నది; పునీతము లైన యీ అమృతకిరణములలో స్నాతుడవై సజీవుడవు కమ్ము!"—

"ఓ పూజ్యుడా! క్షమించి నన్ను విడువుము; నీకు నమస్కారము చేసెదను—"

"ఎందు కింత కలవరము!"

"నాకు చాల భయముగా నున్నది."

"కారణము?—"

"ఆ తేజఃపుంజములలో నేను బ్రతుకజాలనేమో!—యుగయుగములుగా యీ చీకటిలో బ్రతుకుటకు నా శరీరము అలవాటుపడియున్నది."

"భ్రమపడకుము—అసలు నీ విప్పుడు బ్రతికే లేవు; నీవు తిరిగి సజీవుడవు కావలయునన్న యీ అమృతరేఖలు నీపై ప్రసరింపవలసియున్నది.

"క్షమింపుడు—జీవితాశ...నాకు లేదు."

"వ్యర్థుడవు కాకుము—నీవు బ్రతుకునట్లు చూచుట నా విధి."

"ఆః!...ఎందు కింత బలవంతము?—"

"ముందు లేచివచ్చెదవా?—"

"అంత ఉజ్వలముగా పిలువకు స్వామీ!— ఆ పిలుపు నాకంఠమును పాశమువలె బిగించి, ముందుకు పడనీడ్చుచున్నది. పడిపోవుచున్నాను."

"అట్లయిన పిలువను లెమ్ము...నీయంతనీవే మెమ్మదిగా లేచిరమ్ము"—

"నేను చాల బలహీనముగా నున్నానయ్యా! లేచి నిలచిన తూలిపడిపోయెదనేమో...లేచి నిలచుటకు అసలు నా శరీరములో ఎముక లుండవలెనా?—"

"నీ శరీరములో బలిష్ఠమైన ఎముక లున్నవి. నీబలము నీవు తెలుసుకొనజాలకున్నావు—అనంతమైన బలసంపన్నత నీలో కలదు; దైన్యభావములను విదలించివైచుకొని, నీ శక్తినంతయు ఒక్కుమ్మడి జృంభించి, చివాలున లేచి నిలువుము."

"ఆశ్చర్యము స్వామీ! ఇంద్ర జా ల ము వలె నున్నది. నాలోనున్న జీవనాడు లన్నియు కదలి మేల్కొనుచున్నవి. ఆపాదమస్తకము నాశరీరమంతయు రేవో శక్తితరంగములు వ్యాపించుచున్నవి—ఇదుగో! చివాలున లేచినిలచినాను."

"మంచిపని చేసితివి. ఇక కదలిరమ్ము!"

"నా కాళ్లకూ, చేతులకూ లోహశృంఖలములు తగిలించియున్నవి. నడచుటకుమాత్రము వీలుపడదు లెండు."

"అసంభవము—నీవు మానవుడవు—లోహశృంఖలములు నిన్ను బంధింపజాలవు. నిన్ను నీవు బంధించుకొనకున్న, నిన్ను బంధింపగల శక్తి యీ బ్రహ్మాండమున లేదు."

"మరి వీని నేమందురు స్వామీ!"

"నీ పాదముల గమనమును ప్రతిరోధించుచున్నవి లోహములు కావు—నీ ఊహాలతో నిన్ను నీవు బంధించుకొనుచున్నావు. అవి విభ్రాంతచేతస్కుడవైన నీ యూహాలు—త్రెంచుకొనుము."

"ఏదిదేమో చెప్పుచున్నారు—అయినను ప్రయత్నించిచూచెదను...ఆహా! విపరీతముగానున్నదే!... ఈ లోహములు సర్పములుగా మారి, నా పాదముల నుండి దిగజారి, యీ అంధకారములో లీనమైపోయినవి—సరే, వచ్చుచున్నాను...స్వామీ!"—

"ఏమి నాయనా?"—

"నేను బయటికి రాగలుగుట అసంభవము—నా చుట్టును ఉక్కుతలుపులు మూసుకొనియున్నవి."

"ఇదియు నీయూహాకల్పితమగు మరియొక దుర్భ్రమ; నిశ్శంకుడవై ముందునకు నడచిరమ్ము; నీ ముందు నిరోధము లేవియూ లేవు."

"అబ్బా!..."

"ఏమైనది?"—

"తల పగిలిపోయినది—రక్తము స్రవించుచున్నట్లున్నది."

"కలవరపడకుము—అసలు నీకు దెబ్బతగులనే లేదు."

"క్షమింపుడు—ఏదో తగులనేతగిలినదని భయపడితిని. అసలిచ్చట నిరోధము లేవియు నున్నట్లు కాని ఎంచుటలేదు. ఉక్కుతలుపులు భూగర్భములోనికి దించుకొనిపోయిన ట్లున్నవి."

"మంచిపని జరిగినది—సరే, ఇక త్వరగా నడచిరమ్ము."

"మీ రేమి చెప్పుచున్నారు—ఈ నిమ్నోన్నతములలో గండుశిలలు తగిలి నా మోకాళ్లు బ్రద్దలై రక్తము లోడిపోవుచున్నవి. కన్నులు పొడుచుకొన్నను కనుపించుటలేదు—ఈ చీకటిలో నడచుటెట్లు? ఎచ్చట నేమి తగిలి తల పగులునో!—అబ్బా!!! ...ఎంత దెబ్బ తగిలినది!"—

"తొందరలేదు నాయనా......మెమ్మదిగా రమ్ము."

"ఈ అంధకారగర్భమున మార్గమే కనుపించుట లేదు—ఎటువైపునకని నడచిరావలయును?"—

"ఇదుగో, నా చిటికనవ్రేలు పుచ్చుకొనుము—నా అడుగులో అడుగుగా, వెన్ను నానుకొని, మెమ్మదిగా నడచిరమ్ము."

"అబ్బబ్బా! ఈ కఠోరకంటకశిలాపథమువెంట నీ పయన మింకెంత కాలము!—ఇక...నేనూ...నడువ జాలకున్నానే—నా పాదములు మాంసఖండములుగా ప్రిదిలి రక్తము వరదలై పోయినది. రక్తము ఈ గులక రాళ్లలోనికి జలజలా యింకిపోవుచున్నది."

"కాదు కాదు; చైతన్యయుతులమైన, మన పదక్రమములో ఈ శిలాజాలము నిద్రలేచుచున్నది."

"విషసర్పముల భూత్కారములవలె యేవియో విషవాయువులు నా చుట్టును ఆవరించి ఉక్కిరి బిక్కిరిగా నున్నది—నాయవస్థను పోల్చుకొనియు నీకు చీమయైన కుట్టుటలేదు.

"ఆయుఃప్రదములైన స్వేచ్ఛావాయువులు నిన్న లముకొనుచున్నవి—ప్రాణధారణము చేయుము. మనము గుహాప్రాంగణమును చేరుచున్నాము."

"ఈ గుహాబహిర్భాగమున సహితము మంచు తెరలు గప్పి, యీ వనభూమియంతయు నా మానసము వలెనే అయోమయముగా నున్నదే!"

"క్షణములో సూర్యప్రకాశ మావిర్భవించి ఈ మంచుతెరలను పటాపంచలు చేయగలదు. అప్పుడు రెల్లెడల తేజమే—అదుగో, ఆ శిఖరాగ్రము వంక చూడుము! విజ్ఞానభాస్కరుని స్వర్ణారుణ రేఖలలో సంక్షిప్తమై వెలుగులు జిమ్ముచున్నది."

"అబ్బా! భగ్గున కన్నులు తెరువబడిపోయి నవే"—

"దివాంధమునవలె ఆ మహాతేజమును చూచి కన్నులు మూసికొనకుము—భయము లేదు—ఒక్క సారి కన్నులు విచ్చి చూడుము—ఆ కిరణముల స్పర్శతో నీ కనుపాపలు చైతన్యము నొంది ఆ దివ్య దర్శనమునకు అర్హములు కాగలవు."

"కృతజ్ఞుడను—మహదానందముగా నున్నది. దివ్యతేజోవిరాజితుడగు అరుణదేవునకు మోకరిలి నమస్కరించుకొనవలయునని యుత్కంఠగా నున్నది. అనుమతియా?"

"ఉపాసింపుము—విజ్ఞానభాస్కరుని ప్రసాదమున నీజీవితము తేజోమయము కాగలదు."

"........................"

"వందనసమర్పణము ముగిసినదా?—రమ్ము, యీ పర్వతము నధిరోహింతము. దివ్యతేజోవిరాజితమైన ఆ శిఖరాగ్రము మన పరమలక్ష్యము."

"అబ్బో! అంత యెత్తునకే!—ఇప్పటికే చాల అలసియున్నానే!—ఇక మన మిచ్చట నిలిచిపోకూడదా?"

"ఈ నైరాశ్యమును వదలుము. నీ విశ్రాంతికి ఇచ్చట స్థావరము లేదు. నీ లీలావసథ మా శిఖరాగ్రముననే యున్నది."

"ప్రభూ!—"

"భయభ్రాంతుడవు కాకుము— ఏమైనది"—

"ఆ కొండచరియయందు...అటు చూడుము!—"

"ఏమున్నదోయీ?—"

"జడలు విరియ పర్వతోపమానములుగా ఆ లోయనంతను తమోమయముగా చేసివైచుచు, గంగ శివాలాడుచున్నవి...ఆ పిశాచములు చూడుము. వాని భయంకరరావములతో నా శ్రవఃపుటములు ప్రిదిలిపోవుచున్నవి.

"అవి పిశాచములు కావు; అంధకారచ్ఛాయలు ఈ దివ్యతేజమును భరింపజాలక ఆర్చుచున్నవి—అవి నిన్నేమియు చేయజాలవు. ముందునకు నడువుము."

"ప్రభూ! అటు చూడుము. ఆ కిరాతు డెవడో నా సోదరునిపై కత్తి నెత్తుచున్నాడు—వానిని చేదించి వత్తునా?"

"ఆ కత్తి నెత్తుచున్నవాడు మాత్రము నీ సోదరుడు కాడటోయీ?"

"కాడే!"

"నీ యభిప్రాయము?"—

"మతాంతరుడు—నా మతమునకు విరోధి"

"పవిత్రములైన మతముల మధ్య పరస్పరము విరోధభావ మున్నదని యీ సాధుమాటలు నీ కెవరు చెప్పిరి?"

"ఎందరు చెప్పుట లేదు ?"—

"ఆ చెప్పుచున్నవారు కట్టి అజ్ఞానులు."

"నా దైవమును దూషించుచున్న ఆ నీచుల సంగతి మీకు తెలియదు లెండు."

"నీ దైవమును దూషించువాడు తన దైవమును తాను దూషించుకొనుచున్నాడు"—

"బాగున్నది మీవాదము"

"ఎవరికైనను ఉన్నవాడు భగవంతుడొక్కడే"

"క్షంతవ్యుడను"—

"అది సరిగాని — ఈ దూషణభూషణముల నుండి భగవంతుని రక్షింపుమని ఈ అధికారము నీ కెవ్వరిచ్చినారోయీ ?—భగవంతుడు నీ రక్షణలేనిది బ్రతుకజాలనంత బలహీనుడని నీ కెవరు చెప్పిరి?"

"సమాధానము చెప్పుకొనజాలనుగాని నా సోదరుని రక్షణమాత్రము నా కవశ్యకర్తవ్యము—ఈ ఖడ్గముతో ఆ కిరాతుని సంహరించుచున్నాను."

"సంహరింపవలసినది ఆ కిరాతుని గాదు; యుగయుగములుగా నీలో స్తబ్ధముగా దాగియుండు నీ బలహీనహృదయమును అవకాశముగా తీసికొని పిశాచ రూపమున బయల్పడజాలుచున్న నీ పశుత్వమును"—

"మీరా వచించెదరుగాని, సోదరుని హత్యను కన్నులార జూచుచు ఇట్లూరకుండవలసినదే నటయ్యా?"

"హత్యచేయబడనున్న నీ సోదరుని రక్షణార్థము నీ వేమి త్యాగము చేయగలవు?"

"ఏమిచేయను—ప్రాణము లొడ్డెదను."

"ధీరునివలె మాట్లాడితివి—అట్లు చేయుము; నీ సోదరుని కంఠముపై నీకంఠము నాచ్ఛాదనగా నిడి ఆ కిరాతుని ఖడ్గము నాకు బలిగా నొసంగుము"

"నా కంఠము తెగిపో వలయుననియా మీ యూహా ?"

"నీసోదరుడు రక్షింపబడును."

"నా సర్వనాశనముసంగతి తలపోయరేమండీ !"

"నీకు నాశములేదు—నీవు అనంతుడవు. కన్నులు తెరువుము. కల్పాంతములవరకును నీ దృష్టిని ప్రసరించి చూచుకొనుము—నీవు శాశ్వతుడవు".

"ప్రబుద్ధోస్మి... నా కంఠమును నా సోదరుని కంఠమునకు రక్షణగా ఆచ్ఛాదించుచున్నాను."

"అమరజీవివి కమ్ము! ఆ ఖడ్గాఘాతము నీ కంఠమున విజయమాల యగుగాక!—నీ శత్రువులెల్ల నశించిరి."

"ఓ మహనీయుడా! నన్నాశీర్వదింపుము... మీ దివ్యనామముతో పవిత్రమైన ఆ యక్షరపంక్తి నైన తెలిసికొననైతిని."

"అహంకారములకు తావలములైన ఈ నామములతో పని యేమి నాయనా ?—విజయమూర్తివై నిరంతరాయముగ శిఖరాగ్రము నధిష్ఠింపుము—మంగళ మగుగాక! నీకు సర్వదా నా ఆశీస్సులు కలవు."

"చరితార్థుడను."

"మరి యిక నేను పోయివచ్చెదను... నాకు పిలుపు వచ్చినదే."

"ఆః! ఆ!...భయదము!! కర్ణపుటములు చిటిలిపోవునట్లు పిడుగులురిమిన ప్రళయాంభోద మెవ్వరు!!!—ప్రభూ!!!"

"హారే రాం!!"

"......మహాత్మా!!!..."

# అంగయు కన్యాంబ

## శ్రీ కోట సుందరరామశర్మ

ఈ సమాసం ధూర్జటి రచించిన 'శ్రీ కాళహస్తి మాహాత్మ్యము' లోనిది. మూడవ ఆశ్వాసంలో నత్కీరుని కథ వస్తుంది. ఆ నత్కీరుడు పాండ్యదేశపు ఆరాజుస్థానంలోవాడు. కవిత్వానికి సంబంధించిన ఒక విషయంలో శివునితో వాదం పెట్టుకోగా, శివుడాతణ్ణి శపిస్తాడు కుష్ఠరోగివి కమ్మని. శాపమోక్షం వేడగా, కైలాసశిఖరం చూస్తే రోగనివారణ అవుతుందని శివుడు సెలవిస్తాడు. నత్కీరుడట్లే తీర్థయాత్రాపరుడై పోతూ, ఆర్యావర్తం చేరుకొంటాడు. ఇంకా కైలాసం ఎంతో దూరం ఉంది. దారిలో యాత్రికు లందరికీ సంభవించిన ఒక భూతమువల్ల కలిగిన బాధను నివారిస్తాడు సుబ్రహ్మణ్యస్వామి. నత్కీరుడు ఒక్కడూ మిగిలి 'సేనాని'ని ప్రార్థిస్తాడు తన అవస్థ వివరిస్తూ. అంత కుమారస్వామి, "శివుడు కైలాసమే అన్నాడుగాని 'ఉత్తరదిశాకైలాస' మనలేదు గదా. దక్షిణకైలాసమయిన శ్రీ కాళహస్తిదర్శనం చేస్తే చాలు. నీ శాపం పోతుంది" అని పలుకుతాడు. పైగా "ఈ చెరువులో స్నానం చెయ్యి. ఒక్కమాటుగా శ్రీ కాళహస్తిలోకి వెళ్ళగలవు" అనికూడా ప్రసాదిస్తాడు. నత్కీరుడట్లే స్నానంచేసి తలయెత్తేసరికి, శ్రీ కాళహస్తి ప్రత్యక్షమయి, అతని కుష్ఠవ్యాధి పోతుంది.

ఈ పై కథనుబట్టి నత్కీరచరిత్ర ఈ కాళహస్తి మాహాత్మ్యంలో రావలసివచ్చింది.

ఈ నత్కీరచరిత్ర అరవవాఙ్మయంలో ప్రసిద్ధికెక్కిందే. మన తెలుగులో 'నత్కీర' అంటే, అరవంలో 'నక్కీర' అని ఉంది.

పాండ్యరాజ్యానికి మధురానగరం ముఖ్యపట్టణం. కాబట్టి ఈ కథలో మధురానగరవర్ణనకు ప్రసక్తి వచ్చింది. ఈ సందర్భంలో ధూర్జటికి అరవవాఙ్మయ పరిచయం కలిగిఉంటుంది. ఈ వ్యాసానికి హృదయము ఇదే. ఏతత్పరిచాయకములయిన నాలుగైదు ముక్కలు దొరుకుతాయి. వరుసగా వాటిని పేర్కొని విమర్శించుకొందాం.

### ౧. వాలవాయి

"కపటచతుష్షష్టికేళల నాడిన వాల
వాయి చొక్కటు నివాసభూమి" (మధుర)

తెలుగుపంక్తినిబట్టి చూస్తే 'వాలవాయి' అనే పదం తప్పు. 'ఆలవాయి' అని ఉండాలి. అరవంలో 'ఆలం' అంటే విషము. వాయి అంటే నోరు. విషము నోటియందు కలది సర్పము. 'హాలాస్య' క్షేత్ర మనగా మధుర. హాలము (విషము) ఆస్యమునందు కలది అని అర్థము. ఈ పేరు ఎలా వచ్చిందో కొంచెం వివరిస్తాను.

వెనుక ఒకానొక పాండ్యరాజు—శివభక్తుడు—తపస్సుచేసి శివుణ్ణి ప్రత్యక్షంచేసికొని శివసాయుజ్య మిమ్మని ప్రార్థిస్తాడు. "రాజధర్మాన్ని అనుసరించి రాజ్యపాలన చెయ్యి, తరువాత నీకు మోక్ష మిస్తా" నంటాడు శివుడు. శివభక్తిలీనుడయిన రాజు, "రాజ్యమేమిటి, రాజధాని ఏమిటి" అని అడుగగా, నాగభూషణుడు తన ఒంటిమీది ఒక సర్పమును క్రిందికి విసరివేస్తాడు. అది మహాసర్పమై పెద్దవలయాకారంగా చుట్టుకొంది. ఆ వలయము మధురానగరముహద్దును సూచించింది రాజునకు. అందువల్ల మధురకు 'ఆలవాయి' అనే పేరు వచ్చింది.

ఇక 'వాలవాయి' అని ధూర్జటి వాడడానికి కారణం. శ్రీశబ్దార్థకమైన 'తిరు' + ఆలవాయి కలిసి, 'తిరువాలవాయి' అని అరవభాషలో ఉంది. తీసివేయగా మిగిలిన 'వాలవాయి'ని ధూర్జటి వాడినాడనడం భాషాశాస్త్రదృష్ట్యా సమంజసంగానే ఉంది.

ఇక ఇక్కడ ఒక చమత్కారం చూపి ధూర్జటి వాడిన 'వాలవాయి' పదాన్ని సమర్థించవచ్చు. వాల మనగా తోక (అరవమందుకూడాను). వాయి = నోరు. ఇక వాలవాయి అనగా, సర్పము చుట్టచుట్టుకొన్నప్పుడు, నోరు తోక కలిసికొన్నదికదా. ఈ పదం సర్పం వలయాకారంగా చుట్టుకొన్నదని నిరూపిస్తోంది.

### ౨. కూడలళఘుయ

ఈ పదం ఈ మధురానగరవర్ణనకు సంబంధించిన సీసపద్యంలోనే ఎత్తుగీతిలో "కూడలళఘుయపై కుంత, కుంతితాఘు" అని 'అళఘుర్' అనగా అందమైనవాడు అనే అర్థంలో మధురలో ఉండే విష్ణుదేవునికి పేరు. అయ్య (అయ)అనే ఆర్యవాచకం చేర్చి, అళఘుయ అని ధూర్జటి తెలుగులో

ప్రయోగించాడు. 'కూడలళఘియ' అంటే, ఘోరవర్షం మధురానగరంలో కురవబోగా, ఈ విష్ణుదేవుడు తన మహిమను వెలయించాడు. నాల్గు పెద్ద మేఘములు అడ్డువచ్చి ఆకాశమంతా వ్యాపించినాయట, పైనున్న మేఘాలు వర్షం కురవకుండా. ఈ నాల్గుమేఘముల కూడలి-కలయిక గల విష్ణువుకు 'కూడలళఘియ' అనే పేరు వచ్చినట్టు అరవవాఙ్మయం చెపుతోంది. ఈ వైష్ణవస్థలం మధురకు పద్దెనిమిదిమైళ్ళ దూరంలో ఉంది.

## 3. మణ్ణాన, పెణ్ణాన

శప్తుడైన నక్కీరుడు తీర్థయాత్రలు చేస్తూ, ఉణ్ణామల ప్రదేశం దగ్గఱకు వచ్చాడు. ఉణ్ణామల అంటే 'అపీతకుచాంబ'. ప్రపంచాలన్నీ కన్న తల్లి గారి (అమ్మల గన్న యమ్మ, ముగురమ్మల మూలపుటమ్మ—భాగవతం.) కన్యగా వెలిసింది. ఆమెను దర్శించాడు నక్కీరుడు.

"ఉణ్ణాముల జగదంబిక
నణ్ణామలవిశ్వనాథు నారాధించెన్"

ఈ అణ్ణామల అరుణాచలం. అరుణపదం అణ్ణ, అణ్ణ క్రింద మారింది. అచలశబ్దంలోని అకారం వలన సవర్ణదీర్ఘసంధి వచ్చి అణ్ణా అని దీర్ఘరూపం కనిపిస్తోంది. ఇక పర్వతపర్యాయమైన 'మలై' (మల) కలిసి 'అణ్ణామల' అయింది—జ్యోతిర్లింగం ఉన్న చోటు. ఈ అచలశబ్దం తెలుగువాళ్ళ పేర్లలోనూ ఒక విచిత్రం కలిగించింది. తెలుగువారి దేవుడయిన వెంకటాచలపతి, శేషాచలపతి (వేంకట + అచల) (శేష + అచల) అని కావలసివస్తూవుండగా, తెలుగువాళ్ళలో ఎంతమంది చలపతిరావు లున్నారో!

పైన ఉదాహరించిన కందానికి ఉత్తరార్థము—

"మణ్ణాసయు బోన్నాసయు
పెణ్ణాసయు లేనివారి పెన్నిధు లగుటన్"

ణకారద్విత్వప్రాసను గమనించండి—పూర్వార్థంలో అణ్ణామల ఉణ్ణామల మార్చరానివి. ఇక, మణ్ణాస = మణ్ + ఆస (అరవసంధి). తెలుగులో మన్ను + ఆస = మన్నాస అనే అంటాం. రాజ్యాశ, లేక భూసంపాదనేచ్ఛ అని అర్థం. అరవంలో మణ్ అనేగాని, 'మన్' అని నేల,మన్ను అనే అర్థంగల పదం లేదు. దంత్య, మూర్ధన్యములయిన 'న ణ'ల ఉచ్చారణను ఆ భాషలో చాలా పట్టింపు. ఆలాగే 'పెణ్ + ఆస' యున్నూ. పెణ్ అనగా స్త్రీ (తెలుగులో పెంటి). ప్రాసస్థానంలో లేని 'పొన్నాస'లో (బంగారుమీది ఆశ) పొన్ దంత్యనకారాంతమే.

ఈపద్యాన్నిబట్టి ధూర్జటికి అరవభాషాపరిచయం ఉందంటారా, లేదా చదువరులు.

## ౪. ఓ ది పి చ్చ న య నా రి

ఇంకా నక్కీరుడి యాత్ర పూర్తికాలేదు. తిరువత్తూరిపురంలో ఈ నయనారు ప్రతిష్ఠ జరిగింది. నయనార్లు శివభక్తులు. ఈ ఓడిపిచ్చ నాయనారనే పేరుకు అర్థమేమిటి? (ప్రతి పేరుకు ఒక అర్థముండవలయును గదా!)

ఆదిభిక్షునయనార్ అని ఊహించడానికి సావకాశం ఉంది. భిక్షుశబ్దానికి అరవంలో ఇప్పటికీ 'పిచ్చ' అని తద్భవం పేర్లరూపంగా కనిపిస్తోంది. పిచ్చుఅయ్యర్ మొ. ఇక 'ఓడి' 'ఆదికి' సంబంధించినదై ఉంటుంది. ఆదిభిక్షువు శివుడు. నయనారుకా పేరు బింలో తగి ఉంటుంది.

## ౫. అంగయకన్యాంబ

ఇప్పుడు కడపటికి, 'అంగయకన్యాంబ' పదరూప విచారణకు వద్దాం. దీన్ని వ్యాకరిద్దాం:

అల్ + కయల్ = అంగయల్ అని అరవంలో అవుతుంది. అందమైన చేప అని అర్థం. కణ్ = కన్ను. అంగయల్ + కణ్ = అంగయక్కణ్ అందమైన చేపవంటి కన్ను. అది కలది 'అంగయక్కణ్ణి.'

మధురమీనాక్షికి ఈ పేరు అరవవాఙ్మయంలో వాడతారు. ధూర్జటి అంబాశబ్దంచేర్చాడు,ఉపపదంగా. అంగయక్కణ్ణి + అంబ=అంగయక్కణ్యంబ కావాలి-సంస్కృతసంధిసూత్రంప్రకారం యణాదేశం వచ్చి. లేదా అంగయక్కణ్ణంబ కావాలి తెలుగు సంధిప్రకారం. కాని అంబాశబ్దం అనేకఆకారాంత సంస్కృతపదాలకే చేరుతూ ఉండడంచేత, సంస్కృతప్రియమైన తెలుగుకవిమనస్సుకు కన్యాంబ అని వాడడం నచ్చింది. పైగా 'క' ద్విత్వము తీసివేసి వినసొంపుగా ఉండేటట్లు 'అంగయకన్యాంబ'గా ప్రయోగించాడు ధూర్జటి.

"గంగాధరుని మహోగ్రా
పాంగము రతి విధవ జేసె నాలోపల నా
యంగయకన్యాంబకృపా
పాంగం బంగజుని దేవి వైదువ జేసెన్" (3-33).

ఇంతేకాక ఈవిధంగా క్షేత్రము ఉనికినిబట్టీ, అచటి వాఙ్మయమునుబట్టీ, ఇతరభాషాపదము లాయా పురాణములలో దొర్లుచుండు నగుట స్పష్టమవుతోంది. ధూర్జటికి అరవభాషాపరిచయ మున్న దని ఈ చర్చవలన మనం తేల్చుకోగలుగుతున్నాము.

# భాష-దాని ఉత్పత్తి స్వభావములు

★

శ్రీ గురుభాగవతుల ధర్మారావు

భాషాపరిణామంలో మూడు దశలు ఒకదాని తరువాత మరొకటి విశిష్టంగా కనుపిస్తవి. మొదటిది బహుపురాతన మైనది. ఈ దశలో జంతువులు తమ మనోవికారములను తెలుపుటకు చేయు గొంతు ధ్వనులకు కారణము కేవలము అవి జన్మతః సంపాదించిన ప్రవృత్తియే (*Instinct*). ఇదిగాక, అవి చేయు శబ్దములందే ఆ శబ్దముల భావము ఇమిడియుండును రెండవ దశ: ఇదికూడ జంతువులకు సంబంధించినదే. ఈ దశలో పెంపుడుజంతువులు మనము చేయు కొన్ని కంఠధ్వనుల కర్థము జతపఱచగలవు. కాని ఈ అర్థగ్రహణము జంతుస్థజీవవస్తువు (*Germplasm*) పైగాక, కేవల బాహ్యపరిస్థితిపై ఆధారపడియుండును. ఇక మూడవ దశ—మనుష్యజాతికి సంబంధించినది. ఈ దశలో ఫలానాశబ్దానికి ఫలానా అర్థమని కల్పించుట, అది నిర్ణయించుట మనుష్యుడే చేయును. ఈ మూడు దశలున్నూ మరికొంత పరిశీలిద్దాం.

ప్రాణవృక్షమునకు మూలమువద్దనున్న కొన్ని జంతువులలో భాష కేవలము ప్రావృత్తిక (*instinctive*) మని చెప్పవచ్చును. అనగా తమ మనోవికారములను వ్యక్తీకరించుటకు అవి చేయు ధ్వనులు, పుట్టిన తరువాత అవి అలవరుచుకొనిన అనుభవజన్యములు గాక—భయావేశమున పరుగెత్తుట, ఆకలికై వేటాడుట ఇత్యాదివ్యవహారములవలె—కేవలము స్వాభావిక ప్రవృత్తులే. జంతువుల యరుపు లెట్లు ప్రావృత్తికములో, ఏకజాతికి జెందిన మృగములు తమతమ ధ్వనులర్థముచేసుకొనుటకూడ ప్రావృత్తికమే. ఒక కుక్కగాని, పిల్లిగాని భౌ అని, మ్యావు అని అరచినప్పుడు, ఆజాతికి చెందిన కుక్కలు, పిల్లులు ప్రకృతి (*Nature*) పుట్టుకతోనే ప్రసాదించిన సాధనసామగ్రి (*Neuro - Sensory Equipment*) వల్ల అర్థము చేసుకొనును. జంతుసమూహములలో ధ్వనులుచేయుట, ఆధ్వనులను అర్థము చేసుకున్నట్లు తెలుపుటకై అవి చేయు కార్యములు—ఈ రెండును స్వాభావిక ప్రవృత్తిజన్యములే. ఈ ధ్వనులయొక్క అర్థములు ఆ ధ్వనులలోనే అంతర్భూతమై యుంటవి.

పెంపుడు జంతువులను కనిపెట్టిచూస్తే ఒక విశేషం గోచరిస్తుంది. అవి మనము చేయు కంఠధ్వనులను బోధపరచుకొన్నప్పుడు, ఆ యర్థము కేవలము వాటి అంతరశక్తులపైగాక కొంతవరకు బాహ్యపరిస్థితిపై కూడా ఆధారపడి ఉంటుంది. కుక్కకు స్వాభావిక నిరోధక్రియ (*Conditioned Reflex*) అని చెప్పబడు ఒక నరముల నిర్మాణవిశేషము కలదు. అందుచేత, మనం షేక్‌హాండ్ అని చేయిచాచినప్పుడు, ఆ మాటలను అర్థం చేసుకోలేక పోయినా, ఈ 'నిరోధక్రియ' వలన అర్థముచేసికొని మోకాళ్ళలో ఒకటి పైకెత్తును. మొదటి దశకును, రెండవదశకును భేద మేమనగా—మొదటి దశలో కంఠ ధ్వనులను అర్థం చేసుకొనే శక్తి దాని ప్రకృతిలో ఉండును. రెండవ దశలో—అర్థగ్రహణము బాహ్యప్రపంచ సహాయము వలన కలుగును.

కుక్కవలె అన్నిజంతువులూ 'నిరోధక్రియ' కలవి అని చెప్పుట కష్టం. కాని, షేక్‌హాండ్ అని మనము దానికి చెప్పినపుడు ఆ యాదేశము కేవలము తన ప్రాకృతికప్రవృత్తివల్లకాక బాహ్యప్రపంచపు సంపర్కమువల్ల కలిగిన అనుభవంచేత అది గ్రహించగలిగింది.

ఇక మూడవదశ. మానవసమాజమునందు కంఠధ్వనులు చేయు మనుష్యులే యా కంఠధ్వనుల కర్థము

కల్పించుచున్నారు. ఒక ఉదాహరణ—'దా' అని మనము శిశువును పిలిచినప్పుడు, ఆ శబ్దమునకు మనము "నీ వున్న స్థలము విడిచి నా వైపునకు కదలు" అనే అర్థము నిస్తున్నాము. ఆ శబ్దమునకు స్వతహాగా ఏమీ అర్థములేదు. అర్థము మనము కల్పించినది. 'కాకి' అనే శబ్దమునకు "ఒకవిధమయిన పక్షి" అనే అర్థము ఆ శబ్ద నైసర్గికస్వభావంలో లేనట్లే, 'దా' అనే శబ్దంలో కూడా పైని వివరింపబడిన అర్థం శబ్దతః లేదు. ఈ రెండు ఉదాహరణలలోను (శిశువు, కుక్క) అర్థం అనుభవంవల్ల పుట్టుతున్నది.

ఈ రెండు ఉదాహరణలలో ఉండే సమాన ధర్మాన్ని బట్టే డార్విన్ అనే విద్వాంసుడు తన 'Descent of Man' అనే గ్రంథంలో ఇలాగు చెప్పేడు: "The lower animals differ from man in his almost infinitely larger power of associating together the most diversified sounds and ideas." (chapter III) ఇట్లే యితరశాస్త్రజ్ఞులుకూడా జంతువుల మనస్సూ, మనుష్యుని మనస్సూ ఒకేరకమైన దనిన్నీ, రెండింటికీ తరతమభేదములే కాని వస్తుతత్వ మొకటే అనిన్నీ చెప్పేరు.

కాని ఈ సిద్ధాంతం కొంచెం పరిశీలిస్తే డార్విన్ ప్రమాదపడినట్లు తేలుతుంది.

సర్ లెస్లీ ఎ. వైట్ అనే పండితుడు 'The symbol as origin and basis of human behaviour' అనే గ్రంథంలో శబ్దార్థ సంబంధం గురించి వ్రాస్తూ "Man is able to use symbols; no other creature possesses this ability" అని అన్నాడు. మనుష్యునకు జంతువులకు లేని శక్తి యొకటి యున్నది. అది ప్రతీకములను, ద్యోతకములను వాడుట. ప్రతీకము (symbol) యొక్క స్వభావమిది: ఏ మానవులు పరస్పరమనోభావవ్యక్తీకరణమునకై వాడెదరో, వారే దాని యర్థమును నిర్ణయించెదరు. దీని స్వరూప మేమైనను కావచ్చు—ఒక ఆంగిక న్యాసము (gesture), ధ్వని (sound), ఆకృతి (shape), రంగు (colour), రుచి (taste), వాసన (odour). కాని వీటి అన్నిటిలోనూ స్పష్టమైన ఉచ్చారణ గల కంఠధ్వనులే ముఖ్యమైనవి. 'చూడు' 'పిల్లి' 'చక్కని' అనే మాటల కాకూయర్థములు అనుద్దేశకంగా కల్పించి, ఈ అర్థములతోనే ఆ శబ్దాలను వాడుదామనే సమాధానానికి వచ్చి వ్యవహరిస్తూ వచ్చేవారు.

కాని ఈ సిద్ధాంతానికి డార్విన్ ఒక పూర్వపక్షం చేసేడు. "షేక్ హేండ్ అనగానే పడుకున్న కుక్క లేచి, మోకాలు యజమాని కందించి, ఏవిధంగా ఎల్లాగ యజమాని మాటలూ, వాక్యాలూ అర్థంచేసుకున్నదో, అదేవిధంగా మనుష్యులుకూడా 'చూడు' 'చక్కని' 'పిల్లి' అనే మాటలు అర్థం చేసుకుంటున్నారని ఎందుకు భావించకూడదు?" అని.

కాని ఈ పూర్వపక్షంలో ఒక లోపం ఉంది. కుక్క మాటలను అర్థం చేసుకోగలదుకాని అర్థసృష్టి చేయలేదు. ఈమాట కీయర్థం, ఆమాట కా యర్థం అనే నిర్ణయమూ చేయలేదు. మనుష్యునికిని, కుక్కకును గల భేద మిందులోనే ఉన్నది. మనుష్యుడు తన భావమును, ఉద్దేశమును అనుసరించి మాటల కర్థం కల్పించగలడు. ఆ యర్థంతోనే మాటలు వాడుకలోనికి వచ్చేటట్టు నిర్దేశించనూకలడు. గణితంలో X అనే చిహ్నం. ఒక వీసెడు వంకాయలనుగాని, వెయ్యి మనుష్యులనుగాని, ఒక రాజునుగాని, లేక తనకు తోచిన మరే అర్థంతోగాని వాడగలడు. 'పసుపు' అనే శబ్దమును (౧) స్త్రీలు వాడుకచేయు పదార్థమునిగాని, (౨) లేక మంగళస్వరూప మనిగాని, (౩) లేక జాతీయపతాకలోని ఒక వర్ణమని కాని అర్థము చేసుకో గలము. ప్రతీకప్రపంచమున (Symbolic World) మానవుడు సర్వస్వతంత్రుడు. ఏ వస్తువుకైనా తన చిత్తం వచ్చిన అర్థం కల్పించగలడు. మానవత్వ మంతా మనకు గల ఈ విశిష్టశక్తిపై ఆధారపడిఉంది. ఈ శక్తి మూలంగానే మానవుడు ప్రపంచచరిత్రలో గల సభ్యతలన్నీ సృష్టించుకున్నాడు. మానవజీవితంలో ఈ Symbolic faculty వల్ల కలిగిన ఫలితాలు విచా

రించకపూర్వం కుక్కకూ, మనుష్యునికీ గల భేదం ఇంకా కొంచెం గమనించాలి.

కుక్క మాటలను గ్రహించగలదని మనం అంగీకరించాం. మన ఆదేశానుసారం అది పండుకొంటుంది. చెయ్యి చాచిగాని, అరచిగాని అడుగుతుంది; నేలమీద దొర్లుతుంది. నిజంగా, ఈ చేష్టలన్నీ *Response to Stimuli* అని వ్యవహరింపబడే సిద్ధాంతానికి దృష్టాంతాలు. 'షేక్ హాండ్' అనేమాట *stimulus*; అది వినగానే మోకాలు మనవైపున కెత్తడం *Response*. షేక్ హాండ్ అన్న మాట ఒక *sign*; అనగా గురుతు; చిహ్నం. ఒకటి మరొకదానిని సూచిస్తే దాన్ని *sign*, లేక సాంకేతిక-చిహ్నం అంటాం. పొగను చూచి అగ్ని ఉన్నదని అనుమానిస్తాం. రోడ్డు మీద రాత్రి నడుస్తూ మునిసిపాలిటీవారి ఎర్రదీపం చూచి 'ప్రమాదం' అని తెలుసుకుంటాం. పొగ యొక్క అర్థం దాని నైసర్గికగుణాల్లోనూ, దానికీ అగ్నికీ కల సన్నిహితకార్యకారణసంబంధంలోనూ ఉన్నది. అనగా సాంకేతిక-చిహ్నాలకు అర్థం దాని నైసర్గికగుణాల్లోనూ, అవి తెలుపుదుచేసే వస్తువునకూ ఆ గుణాలకూ కల సంబంధంలోనూ ఉన్నదన్న మాట. ఎరుపుదీపం విషయంలో పైని చెప్పబడిన 'నిరోధక్రియ' వర్తిస్తుంది. ఈ 'నిరోధక్రియ' ద్వారా దీపానికీ ప్రమాదానికీ మన మనస్సులో అన్యోన్య సంబంధం కల్పిస్తాం *Association* వల్లకాని, *Conditioning* వల్లకాని, సాంకేతిక చిహ్నం, దాని అర్థం ఏకీభావం పొందుతవి. అందుచేత సాంకేతికంలోనే దాని అర్థం లీనమవుతుంది......ఇక మనము దైనిక జీవితంలో వాడుక చేయు మాటలను పరిశీలిద్దాం.

ప్రతీకము (*Symbol*) అనేదాని అర్థం దానిని వాడు మన నిర్ణయంపై ఆధారపడి ఉంటుందనీ, *Sign* (సాంకేతిక-చిహ్నం) అనేదాని అర్థం మనుష్యులు నిర్ణయించినా, నిర్ణయించకపోయినా మరొక వస్తువును సూచించేదనీన్నీ ఇదివరకే తెలుసుకున్నాం. నిత్యవ్యవహారం మనం వాడు మాటలు *Symbols* గానూ, *Signs* గానూ — రెండువిధాలుగా ఉపయోగపడుతున్నవి. అనగా ఒకప్పుడు వాటిని మనము *Symbol Contexts* లోనూ (ద్యోతకసందర్భాలు అనుకుందాం), ఇంకొకప్పుడు *Sign Contexts* (చిహ్నసందర్భాల)లోనూ ప్రయోగిస్తాం. ప్రతీకముల అర్థము త్వక్, చక్షు మొదలగు పంచేంద్రియములచేత గ్రహించలేం. ఒక కొత్త భాష మనం వినేటప్పుడు, ఆభాషాశబ్దముల యర్థం మనకు తెలియదు. *It is Greek to us*. ఒక ఆంధ్రుడు మొదటిసారి తమిళ దేశంలో ప్రయాణంచేస్తూ, ఇద్దరు అరవసోదరుల సంభాషణలో 'ఆమా' అనే మాట విన్నాడనుకొందాం. ఆమాట అతనికి ఏమీ అర్థం కాదు. అరవసోదరుల ప్రద్యోతకనిర్మాణం (*Symbol Mechanism*) ఆంధ్రుల ప్రద్యోతకనిర్మాణం కన్న భిన్నం. 'ఆమా' అనే సూచకంయొక్క అర్థం గ్రహించేందుకూ, వాడేందుకూ ఒకవిధమైన *Neural Structure*, లేక ప్రద్యోతకనిర్మాణం అవసరం. తదితరప్రద్యోతకములుకూడా ఇట్టివే. ఒక రంగు చూపగానే, అది సూచించేది విచారమో, ధైర్యమో, లేక ఒక రోగమో తెలుసుకోవాలంటే, దానిని వాడినవారి ప్రద్యోతకనిర్మాణంతో మనకు పరిచయం ఉండాలి. ద్యోతకముల విలువలు (*Values of Symbols*) మనం గుర్తించలేము అనే విషయాన్ని, శాస్త్రీయంగా ఇట్లా చెప్పవలసి ఉంటుంది: "ద్యోతకార్థములకు (*Values of Symbols*) ఉత్పత్తిస్థానం వాటియందుగాక, అన్యత్ర ఉన్నది" అని. ఉప్పుయొక్క క్షారగుణం, పంచదార మధురగుణం, ఆ వస్తువుల (*Atomic Structure*) నైసర్గికనిర్మాణమునందే కలదు. కాని, ఈ వస్తువులను ఎంత పరీక్షచేసినా, ఎంత పదార్థవైజ్ఞానిక, రసాయనికపరిశోధన ఒనర్చినా, వాటి బజారుధర మనము కనుక్కోలేము. ఎందుచేత ననగా—బజారుధర ఒకవిధమయిన ప్రతీకమూల్యము (*Symbolic Value*). సమాజం ఈ ధరను నిర్ణయిస్తుంది. ఇల్లాగే ఎర్రదీపానికి ప్రమాదం అనే అర్థం సమాజకల్పితము. కాబట్టి సూచకప్రపంచం (*Symbolic World*) ఇంద్రియాతీతమని చెప్పవచ్చును. ఈ ప్రపంచకంలో అర్థములు, విలువలు జీవిస్తూ నిత్యవ్యవహారం జరుపుతూ ఉంటవి. కాని,

మనము వాటి విలువ రుచిచూచిగాని, తదితరేంద్రియ సహాయంవల్లకాని గ్రహించలేం. ఈ ప్రతీకములకు నైసర్గికంగా స్వరూపం అవసరము. ఆ స్వరూపాలు ఇంద్రియగోచరములు కాకపోతే అవి మన యనుభూతి లోనికి ప్రవేశించలేవు. కాని ప్రతీకముయొక్క భౌతికాకారము వేరు; దానియర్థము, విలువ వేరు. ప్రతీకములు భౌతికాకారసహితములైన అతీంద్రియమూల్యములు. ఏ మానసికశక్తిచేత ఈ ధర్మములు సృష్టింపబడినవో, ఆ శక్తిచేతనే అవి యితరులకు ప్రకటింపబడుతవి. ఈ శక్తిని పాశ్చాత్య భాషాతత్త్వవేత్తలు *Neurological Symbolic Faculty* అని నామకరణం చేసేరు. అర్థజ్ఞానం ఈ *Symbolic Faculty* వల్ల కలుగుతుంది. ఇందువల్లనే జంతువుల అనుభూతప్రపంచకానికీ, మానవానుభూతప్రపంచకానికీ భేదం ఏర్పడింది. జంతువులు మానవసమాజంలోనికి ప్రవేశించలేవు.

*Physical form* నకు అర్థము, మూల్యము ఆపాదించుటచేత ప్రతీకము లేర్పడుచున్నవి. శిశువు తల్లి వద్ద మాటల నభ్యసించు మార్గము పరికిస్తే, మాట లెట్లు ప్రతీకములుగ జనిస్తుంటవో గ్రాహ్యమవుతుంది. తల్లి ఒక క్రొత్తమాట శిశువునకు నేర్పునపుడు, ఆ మాట నెన్నో సారులు ఆమె ఉచ్చరించును. దీనిమూలంగా శబ్దము, శబ్దార్థము శిశువుయొక్క అనుభవంలో మిళితములై క్రొన్నాళ్లకు శబ్దమే శబ్దార్థమును వ్యక్తముచేయు పరిస్థితి ఏర్పడును. ఇందు కుదాహరణ: మనము 'బోటా' అను నూతనశబ్దమును సృష్టించి, దానికి 'తలటోపు' అనే అర్థమును కల్పించి, పదేపదే ప్రయోగించినయెడల, ఆ వాడుక శబ్దార్థమును మనమనస్సులో స్ఫురింపజేయును. క్రమక్రమంగా ఈ శబ్దార్థమునకును, తదితరశబ్దార్థములకును గల భేదముకూడ శిశువు గ్రహింపగలదు. *Psychologists* (మనశ్శాస్త్రవేత్తలు) శబ్దమునకును, దాని యర్థమునకును సంబంధమును కల్పించు నరముల వృత్తికి *Conditioning* అని పేరుపెట్టినారు. శబ్దార్థముల సంయోగము మన మనస్సులలో ఏర్పాటయినతరువాత శబ్దము వినగానే దాని యర్థము మనకు స్ఫురిస్తుంది. మన శ్రోత్రేంద్రియముద్వారా ఈ అర్థమును గ్రహిస్తాము. కాని, ఇది ప్రతీకసందర్భము ఎంతమాత్రమును కాదు. ఇచ్చట (*Symbol Context*) ప్రతీకసందర్భము గడిచి, మరియొక సందర్భము ఏర్పడినది. ఇందులో శబ్దములు (*Symbolic Function*) ప్రతీకధర్మముగాక సాంకేతికచిహ్నధర్మము నిర్వర్తిస్తున్నవి. కాబట్టి, మానవవ్యవహారములలో శబ్దములు ప్రతీకములుగా నుద్భవించి, వాటి యర్థము మనము గ్రహించినపిదప సాంకేతికములుగ మారుతవి. ఇప్పుడు, మాటలు, వాక్యములు బోధపరచుకొను కుక్క పరస్థితి పరిశీలిద్దాం.

'పాడో' అనే మాటను సృష్టించి, ఆ మాటకు 'కూర్చో' అనే అర్థము కల్పించి, అది ఉచ్చరించినప్పుడల్లా కూర్చునేటట్లు కుక్కకు పాఠం బోధపరిస్తే, కుక్క ఆ మాట వినగానే తప్పక కూర్చుంటుంది. కుక్కకు బదులు శిశువుకే ఈ పాఠం బోధపరిచే మనుకుందాం. కుక్కవిషయంలో మనం చేసిన ప్రయోగము (*Experiment*) నకును, శిశువువిషయంలో మనం చేసే ప్రయోగమునకును ముఖ్యమైన భేదం ఉన్నదా? ఏమీ లేదు. శిశువు కుక్కకన్న త్వరగా పాఠం బోధపరచుకొన్నా, కుక్క ప్రవర్తనకూ (*Behaviour*) శిశువుప్రవర్తనకూ ఏమీ భేదా లేదు. ఈ రెండు సందర్భాల్లోనూ, మాట లర్థమును పొందుతవి: మృగముకాని, శిశువుకాని ఒకేవిధంగా (అనగా కూర్చోడంవల్ల) అర్థం గ్రహించినట్లు తెలుపుడుచేస్తవి. అయితే మాటలను అర్థంచేసుకోవడంలో కుక్కకును, శిశువునకును భేదం ఏమిటి? మాటలు కుక్కకు కేవలము సాంకేతిక చిహ్నాలు (*Signs*). మానవునికిమాత్రము సాంకేతికములే కాక, ప్రతీకములుకూడను.

కుక్క చేయలేనిది వస్తువుల కర్థముకల్పించుట. క్రొత్త అర్థములను సంపాదించుకోగలదుకాని, వాటిని సృష్టించలేదు. 'పాడో' అనే శబ్దార్థమును గ్రహించగలదుకాని, ఆ శబ్దాని కర్థం కల్పించే ప్రమేయంలో, దాని కేమీ సమర్థత లేదు...ఇంతే కాదు. ఎంతవరకు తన పంచేంద్రియములద్వారా భౌతికప్రపంచాన్ని అది *Perceive* చేయగలదో, అంతవరకే దాని అర్థజ్ఞానము యొక్క పరిమితి. ప్రతీకార్థములు, మూల్యములు (*Symbolic Meanings and values*) దాని జ్ఞానప్రపంచానికి

అవతలివి. 'పుణ్యం' 'పాపం' అనే శబ్దా లుచ్చరించి, అవి ఉచ్చరింపబడినపుడు తాను చేయవలసిన పని కుక్కను అభ్యసింపజేసినచో, అది మన బోధనల ననుసరించి చెప్పినట్లు చేయగలదు. కాని 'పుణ్యం' 'పాపం' అనే మాటలు మన కేయర్థము నిస్తవో, ఆ అర్థం కుక్క చేసుకోలేదు. ఎందుచేత ననగా, ఈ మాటలకు సాంకేతికార్థమే కాక, ప్రతీకార్థముకూడా కలదు. ఈ రెండు రకాల అర్థాలను గ్రహించేందుకు సాధనభూతమైన విశేష మేధానిర్మాణము (*Special neural mechanism*) ఒక్క మనుష్యుడే పొందియున్నాడు.

దీన్నిబట్టి కుక్క మనస్సుకూ, మానవుని మనశ్శక్తికీ భేదం స్పష్టమవుతుంది. తనకు తోచిన దేనికైనా, అంతకుపూర్వము లేనిఅర్థము సృష్టించి, దానికా అర్థమును సంధించగలడు. ఈ అర్థములను ఇతరులు తెలుసుకోనేటట్లు శబ్దములద్వారాగాని, సంజ్ఞలద్వారాగాని, లేక ఏ యింద్రియగోచరములగు క్రియారూపమునగాని వ్యక్తపరచగలడు. కుక్కలు, కోతులు, ఎలుకలు—ఈ జంతువులు తమ యనుభవంలో ఏవో కొన్ని శబ్దములతోనూ, ఇతర రూప, రస, గంధములతోనూ ఏకీభావం పొందిన కొద్దిపాటి యర్థములనే అవగాహన చేసుకోగలవు. ఆ యర్థములను ఎంతమాత్రమూ నిర్ణయింపజాలవు. ఈజంతువుల అర్థగ్రహణము *Sense perception* అని చెప్పబడు క్రిందిసోపానమునకే చెందుతుంది. ఈ భేదంలో ఒక సూత్రం ఇమిడిఉంది.... అర్థగ్రహణంలో గల ఈ భేదపరిశీలన అల్లాఉంచి, అది ఎందువల్ల పుట్టుచున్నదో—అనగా, *Psychological origin* విచారించవలెను.

మనుష్యుడు కళ్లతో చూస్తాడు. చెవిలో వింటాడు. ముక్కుతో వాసన చూస్తాడు. కాని ప్రతీకములను అతనిలో ఉన్న ఏ ఇంద్రియం సృష్టి చేస్తుంది? భాషయే ప్రతీకవ్యక్తీకరణమునకు ముఖ్య సాధన మగుటచేత, కొందరీ ప్రతీకశక్తి పదోచ్చారణయందు పనిచేయు దవుడలు, నాలుక, పెదవులు, కంఠము మొదలగు అవయవములందే యున్నదని భ్రమపడ్డారు. ఈ యవయవములు కోతుల కున్నవి. కాని ప్రతీకములచే భావములు వ్యక్తపరచుటకు నోటిమాట లనవసరము. అక్షరముల ద్వారాగాని, బొమ్మలు గీచికాని, ఇతర సంజ్ఞలద్వారాగాని—ఇవియు ప్రతీకములే—మనోభావములను మనము తెలుపగలము. ఏ వస్తువునకైనను అర్థము కల్పించే ప్రతీకశక్తిచే ఒక భాషయేకాదు, పరస్పరమనోభావవ్యక్తీకరణమునకై తదితరమైన సాంకేతికసమామ్నాయమును కల్పింపగలము. సంజ్ఞారూపకముగా కాలివ్రేళ్ళను, చేతివ్రేళ్ళను, టెలిగ్రాఫ్‌పద్ధతిలోవలె చుక్కగీరలను (*dot, dash*) ప్రయోగించగలము. చెవి ఎన్నోవిధములుగా కదపగలిగితే, చెవులతోకూడా ఒక ప్రతీకసమామ్నాయమును కల్పించడం సాధ్యమే. కాని ఇవన్నియు మాని శబ్దజాలమునే ప్రతీకవ్యక్తీకరణమునకై మానవు డేల వాడెను? భాష సుస్పష్టము, సులభము, సదుపాయముగా *Most Economical* కాబట్టి.

వక్తృతావయవములు(*Organs of speech*)—పెదవులు, నాలుక, దవుడలు, *Vocal chords* మొదలగునవి—ప్రతీకశక్తియొక్క ఉత్పత్తిస్థానములు కావు. ఇంకేదియై యుండును? ఇంతవరకు ఈ ప్రతీకశక్తి అనే గంగాప్రవాహానికి గంగోత్రి కనుక్కోలేక పోయేరు శాస్త్రజ్ఞులు. కాని *Nervous System*, లో, అందులో ముఖ్యముగా, పూర్వమేధస్సు (*Fore Brain*) లో ఈ శక్తి జన్మించినదని నిస్సందేహంగా చెప్పవచ్చును. కాని ఈ విషయంలో త్వరగా ఒక నిశ్చితాభిప్రాయానికి రావడం ప్రమాదకరం. కోతి మేధస్సుకన్న మానవుని మేధస్సు పెద్దది. దానియందు *Convolutions*, జాడలు చాలా బాహుళ్యంగా ఉంటవి. కాని *Brain Cell* లో (మేధస్సునందున్న జీవాణువులు) మనకూ, కోతికీ తేడా ఏమీ కనపడదు. రెండింటి నిర్మాణం ఒక నమూనాగా ఉంటుంది. అయితే మనుష్యుడు ప్రతీకించగలుగుటకును, కోతికా శక్తి యసాధ్య మగుటకును కారణం ఊహింపవలసి ఉంటుంది. ప్రస్తుతము మనకు గలిగిన జ్ఞానము ననుసరించి ఒక సమాధానం చెప్పవచ్చును. అది ఏదనగా—మానవుని మేధస్సు కోతిమేధస్సుకన్న పెద్దది. ప్రమాణభేదంవల్ల (*Quantitative difference*) గు

భేదాలు కలుగవచ్చు. కొన్ని డిగ్రీల వేడివల్ల నీటి యొక్క Structure మారి ఆవిరి బయలుదేరుతుంది. గ్రుడ్డునందు పరిణామం ఒక దశకు రాగానే కోడిపిల్ల పొడచూపి అంతేతరమును తన జీవికలో గల విశిష్టతను చాటుతుంది. ఈవిధంగానే అడవిమనుష్యుని మేధస్సు ఎన్నోయుగాలకు పరిణామం పొంది క్రొత్తదశకు వచ్చినప్పుడు, నూతనశక్తి ఒకటి ఆవిర్భవించింది. ఇది కేవలం అంచనా—నిరూపించడం కష్టం. ఎందుచేత ననగా—ప్రతీకశక్తి పనిచేసేటప్పుడు (Symboling) నరములలో కలుగు ప్రభేదము లింతవరకును శాస్త్రరీత్యా పరిశోధింపబడలేదు.

కొందరు జీవతత్త్వశాస్త్రవేత్తలు (Biologists) భాషోత్పత్తిని *Mutation*—అనగా హఠాత్తుగా వచ్చిన మార్పు అని అభిప్రాయపడుతున్నారు. కాని పూర్వ ప్రాతీకదశ (*Sub symbolic Level*) నుండి ప్రాతీకదశకు (*Symbolic level*)మార్పు అకస్మాత్తుగా కలిగినదని భావించకూడదు. శిక్షణలేకుండా శిశువు ప్రతీకములను వాడగలుగుచున్నాడా? లేదు. తలిదండ్రులు శిశువునకు శబ్దార్థముల పరస్పరసంబంధం బోధించి, భావయుక్తంగా మాట్లాడే అభ్యాసం అలవరచుటకు ఎంతోకాలం పట్టుతుంది. ఈవిధంగానే **Anthropoids** అనబడు ఒకరకం కోతులు *Symbolic* ***Faculty*** సంపాదించి, ఆశక్తిని భావమూలకంగా వ్యక్తపరచగలిగేసరికి, వేలకువేలు సంవత్సరాలు గడిచి ఉండాలి. తరువాత దైనికవ్యవహారాల్లో సార్థకమైన శబ్దజాలం పరిపాటిగా వాడబడే యుగం వచ్చేసరికి ఇంకా మరెన్నో లెక్కలేనన్ని యుగాలు గతించి వుండాలి.

పూర్వ ప్రాతీకదశ నుండి ప్రాతీకదశకు వచ్చేటప్పుడు ఈ మార్పు జనసముదాయంలోనూ, ప్రత్యేకవ్యక్తిలోనూ హఠాత్తుగా కాక—**Mutation Theory** ఇక్కడ కేవలం వర్తించదు—క్రమక్రమంగా వచ్చిందని అనుకొనుట సబబుగా కనిపిస్తుంది. ఇంక రెండోవిషయం: పూర్వప్రాతీకదశకును ప్రాతీకదశకును గల భేదం — ఈ భేదం సజాతీయం గాదు; విజాతీయం. పూర్వప్రాతీకదశలోఉన్న తరక్కలు, పిల్లులు ఇవి ప్రతీకించలేవు. ఆశక్తి వాటికి లేదు. వీటివిషయంలో పైని చెప్పబడిన రెండు దశలకును మధ్యనున్న అంతరస్థితి—అంచీ—లేదు. కోతులకు మనుష్యులభాష నేర్పుటకై ఎన్నో ప్రయత్నాలు చేసేరు. కాని అవి ఫలించలేదు.

ప్రతీకములతో వాడుటవల్ల సమాజజీవితంలో కలిగిన ఫలితాలేమి? అనే ప్రశ్నకు ఇప్పుడు జవాబు కనుక్కొందాం. జంతువులకన్న మానవునికి గల ఉచ్చస్థితికిన్ని, మానవప్రత్యేకతకూ, మానవసభ్యతకూ అతని ప్రతీకశక్తియే ముఖ్యకారణము. *Anatomically* (అంగనిర్మాణంలోనూ) *Temperamentally* (మనఃప్రవృత్తుల్లోనూ) మనుష్యుడు, ఇతరజంతువులను, కోతిని పోలియున్నాడు. శారీరకధర్మములలో(*Physiologically*) కూడా అనగా *Digestion*, *Respiration*. ***Reproduction*** మొదలగు ధర్మములవిషయంలో మానవునికిన్ని, కోతి-తదితరమృగములకూ ఎన్నో సామ్యాలు ఉన్నవి. కాని ఒక్కవిషయంలోమాత్రం మనుష్యుడు ఇతరమృగాలకన్న చాలా భిన్నుడు. ఈ భిన్నత్వమే అతనిని ప్రాణికోటులకల్లా అగ్రస్థానం వహించేటట్లు చేసింది. అది ప్రతీకశక్తి. "శబ్దం పరబ్రహ్మస్వరూపం" అనే సత్యాన్ని ఆర్యులు దివ్యదృష్టివల్ల కనుక్కున్నారు. శబ్దములకూ, ధ్వనులకూ సృష్టించే శక్తి కలదని తెలుసుకున్నారు. కోతిని మనుష్యునిగను, అడవిజాతిమనుష్యులను సభ్యతాసంస్కృతులు గలవారినిగను మార్చినవి శబ్దములే.

కొందరు నాగరికత మానవుడు ఉపకరణములు (*Tools*) ఉపయోగించుట ఆరంభించినప్పటినుండి జన్మించినదని చెప్పుచున్నారు. కోతులుకూడా ఉపకరణములను, సాధనములను ఉపయోగింపగలవు. కాని ఆంతరంగికదృష్ట్యా (*Subjectively*) చూచినా, బాహ్యదృష్ట్యా (*Objectively*) చూచినా, కోతులకు గల ఈ శక్తి అవిచ్ఛిన్నంగా, ఏకధారగా అభివృద్ధి పొందినట్లు కనపడదు. ఉపకరణాలు వాడుకచేయడంలో ఇప్పటి కోతులకూ, ఇక్ష్వాకులనాటి కోతులకూ ప్రభేదం లేదు.

పైని చెప్పినదానివల్ల తేలిన సంగతి ఏమనగా—మానవునికి ఉపకరణము బాహ్యప్రపంచమందలి వస్తువుమాత్రమే కాదని. అది భావము (*Idea*) కూడను. అది ప్రాతీకస్వరూపమున (*Symbolic form*) ప్రకాశింపజేయబడు ఒక మాత్రిక భావము (*Concept*).—*A concept expressed in symbolic form*. ఒక గొడ్డ పార-వ్యవసాయోపకరణమును తీసుకొందము. ఇది మన కళ్ళముందుగాని, చేతిలోగాని లేకపోవచ్చును. కాని సర్వదా భావరూపమున మనలో నుండును. ఈ *Idea-tool* కమ్మరి తయారుచేయుదానికన్న నిత్యమూ, పరిపూర్ణముగా. అదే, నమూనాలైన కమ్మరిచే తయారు చేయబడిన గొడ్డపారలకు మాతృక. ఏ ఉపకరణమైనప్పటికీ, భావప్రపంచమందు తరమునుంచి తరమునకూ, యుగంనుండి యుగానికీ అవిచ్ఛిన్నంగా వస్తూఉండటం చేత క్రమక్రమాభివృద్ధి జెంది, అభివృద్ధిసూచకమౌతుంది. ప్రాతీకశక్తి ఉద్భవించకపూర్వము ఈ ఉపకరణజనితానుభవము మానవపరిణామంలో ఏకధారగా ప్రవహించక, ఒకప్పు డున్నట్లూ, ఒకప్పుడు లేనట్లూ విచ్ఛిన్నంగా ఉండేది. కాని ఈ శక్తి యుద్భవించిన తరువాత, ఒక తరంవారి అనుభవం తరువాతివారి అనుభవంతో సమ్మేళనం పొంది, ఒకవిధమైన సంజ్ఞానం,సభ్యతా ఏర్పడి, ఈ సంజ్ఞానసభ్యతలు అఖండ ప్రవాహంగా పురోగమించే అవకాశం కలిగింది.

నాగరికతలను, సభ్యతలను నాణ్యముచేయుటకు ఎన్నో కొలబద్ద లున్నవి. అందులో ముఖ్యమైనది ఉపకరణము. ఈ ఉపకరణం పునాది. ఈ పునాదిపైని నాగరికతాసౌధముయొక్క సాంఘిక, వైజ్ఞానికగోపురములు నిర్మింపబడ్డవి. ఉపకరణం సభ్యతకు పునాది. కాని ప్రతీకము సభ్యతాసాధనము. ఈ సాధనం లేనిదీ సాంఘిక, వైజ్ఞానికజీవితం సాధ్యం కాదు.

భాష లేకుంటే సాంఘికజీవనాన్ని సరియైన దారిలో నడపడానికి తగిన సూత్రాలు మృగ్యమౌతవి. కామము, పశుబలము, నిరంకుశేచ్ఛ ఇవియే సంఘజీవనాన్ని నడుపు శక్తు లౌతవి. ఏకపత్నీత్వము, బహుపత్నీత్వము—ఈ *Concepts* మనుష్యు లొండొరులకు తెలుపుదు చేసి, సూత్రీకరించుటకు అవకాశ మిచ్చినది ప్రతీకశక్తి. ఇది లేకపోతే నీతి, ధర్మము అను భావములు జనించవు. 'అమ్మ', 'నాన్న', 'అన్న', 'తమ్ముడు', 'అక్క', 'చెల్లెలు'—మొదలగు బాంధవ్యవివేచనము గాని, దగ్గరబంధువులను వివాహమాడకూడదనిగాని, శాస్త్రవిషయములుగాని, కళలవిషయములు గాని తెలుసుకొనుటకు భాషయే ముఖ్యసాధనము. జన్మ, జన్మాంతరం, మంచి, చెడ్డ, ఇహం, పరం—ఇట్టి భావములు భాష లేకపోతే స్వరూపింపజాలవు. నాగరికతలో స్వల్పవిషయము మొదలు ప్రపంచరాజ్యము అనే విషయము వరకు శాస్త్ర వేదాంతములు—ఈ *Concepts* అన్నిటికీ ప్రతీకమే మూలాధారం.

ఈ దృష్టితో చూస్తే మానవప్రపంచమందు గల ప్రాతీకానుభవంయొక్క ఆధిక్యమును గ్రహించవచ్చు. కుక్కకుగాని, పిల్లికిగాని 'అన్న' 'సోమవారం' 'మూడు' 'సామ్య' అనే *Concepts* బోధపరచగలమా ? *Stimulus and Reaction* పద్ధతిపై కుక్కలచేతగూడా "౪ × ౩ = ౧౨" అనే లెక్కలు చేయించవచ్చునట. కాని ప్రతీకమయమైన భావప్రపంచంలోనికిమాత్రం జంతువులు ప్రవేశించలేవు. మన స్వర్గం, నరకం, దేవతలు, సంస్థలు, న్యాయములు, వేదాంతము, నీతి, కర్మకాండ, కళలు, శాస్త్రములు—మన ప్రపంచమంతా—ప్రతీకములచే నిర్మింపబడిన భవనం. ఎడ్లతో భూమి దున్నుతాం ; ఇంకా ఎన్నో జంతువులు, పక్షులు భగవత్సృష్టిలో మన అన్నదమ్ములే. కాని అవి మన ఇంటి గడప దాటలేవు. మనతో కలిసి ప్రతీకానుభవం పొందలేవు. ప్రాతీక ప్రపంచం మానవుని స్వకీయం.

# ధన్య జీవితము

●

శ్రీ బెళ్లారి శ్రీనివాసమూర్తి

౧

చదలన్ వార్షికవారిదోత్కరము లాచ్ఛాదించె; నత్యంత భీ
ప్రదమై తోచె నిరమ్మదమ్ములు; జగద్భాండంబు భేదించు చు
న్నది నిర్ఘోషము ఘోరమైన ప్రళయధ్వానంబువోలెన్; రసా
స్పదమార్గంబున ద్రిప్పమోయి హృదయస్థానంబు లోకప్రభూ!

౨

ఆశావీథుల తీవ్రమై విసరు ఝంఝాకీర్ణమై వృక్ష శా
ఖాశాఖానిచయంబు లూగెడు విహంగశ్రేణి కంపింప; నా
వేశించెన్ గగనంబు నాదు హృదయోర్విన్ భావనోన్మత్త కే
కీశోభల్ నటియించు హృద్యమగు తత్కేకారవారంభముల్.

3

దెసలెల్లన్ సురభీకరంబులుగ ధాత్రిన్ వర్షబిందూత్కరం
బెసగెన్, ధారలు గ్రుమ్మరించెడిని వాహిన్యాకృతుల్ వోయె నీ
వసుధాగర్భములోన వెల్వడి శుభప్రారంభముల్ దెల్పుచున్
రసవద్భేకనినాద మెల్లెడల శ్రోత్రప్రీతి గావించెడిన్.

౪

ఓ విశ్వస్తవనీయ రాగనిధి, న న్నుయ్యాలలూగించు నీ
ప్రావీణ్యంబు ఋతుప్రవేశమున నిన్ ప్రార్థింతు నీ వర్షధా
రావేగంబున రాలు నొక్క చినుకై రాణింపనిమ్మోయి నే
నీ విశ్వంభరలో ప్రయోజనముగా వీక్షింతు నాజీవికన్.

———

# ప్రాక్ - పాణిని

శ్రీ
శివశంకరశాస్త్రి

(గత సంచిక తరువాయి)

## కర్మంది వివరణము :

## కా ర్మం ద వి వ ర ణ ము

"వ్యాచకార తదా సర్వం కర్మందశ్చ మహాకవిః."

అవైయాకరణులయిన శిష్యులకొఱకు వ్యక్తావధూత, క్రాంతదర్శియగు భగవాన్ కర్మందుడు తన భిక్షుసూత్రమునకు పూర్వవృత్తరూపమున వ్యాకరణసూత్రములు కొన్ని రచించినట్లు సన్యాసిసంప్రదాయమున ప్రసిద్ధి కలదు. భిన్నవిషయకము లయినను ఈ సూత్రములు ప్రస్తావనావశమున భిక్షుసూత్రాంశములే అవవచ్చును. ఇది కేవలము జనశ్రుతి కాదు. కవీంద్రాచార్యసూచీపత్రమున వ్యాకరణప్రస్తావనలో 'కర్మంది వివరణ' నామకగ్రంథోల్లేఖనము కలదు. కవీంద్రాచార్యుడు సన్యాసి యని, గ్రంథము తత్కృతముగా నధిగతమయినది. కర్మందప్రోక్తవ్యాకరణసంబంధిసూత్రములు భిక్షుసూత్రముకంటె భిన్నముగా భావించువారు ఈగ్రంథమును 'కార్మందవివరణ' మందురు.

సరస్వతీదేవి ప్రథమమున కర్మందునికి ఈ సూత్రము లిచ్చె ననియు, అనుభూతిస్వరూపాచార్యునికి పూర్వుడగు పరివ్రాజకనరేంద్రాచార్యుడు ఈ సూత్రము లన్నింటిని కూర్చి, స్వకీయవృత్తివార్తికాదులతో కలిపి సారస్వతవ్యాకరణ మనుపేర లోకమున వెలయించె ననియు కొందరు కొంద రందురు. దీనికి పూర్వ మీ గ్రంథము సన్యాసులకడ నుండెడిది. ఇం దాశ్చర్యము లేదు. నేటికిని సన్యాసులకడ గుప్తముగా నున్న కొన్ని విద్యలు గృహస్థాశ్రమములోని పండితులకు స్వప్నాతీతము లన్నను అతిశయోక్తి కాదు.

"కర్మందకృశాశ్వాదినిః" (అష్టా. ౪-౩-౧౧౧) సూత్రమువలన కర్మందమస్కరి పాణినికి పూర్వు డని తెలియుచున్నది. కర్మందుని భిక్షుసూత్రము వ్యాసుని భిక్షుసూత్రముకంటె పూర్వ మని కొంద రనుచున్నారు. వ్యాసుని భిక్షుసూత్రమునకు తరువాత మరియొక భిక్షుసూత్రము ప్రణీతము కాకుండుట హేతువు. కర్మందుని గ్రంథ మేదియు లభింపలేదు.

## కాశకృత్స్న వ్యాకరణము

"కాశకృత్స్నేన యత్ ప్రోక్తం
తత్ కాశకృత్స్నకం శుభమ్."

కాశకృత్స్ననామముతో నొక వ్యాకరణము కలదు. దానిని రచించినది కాశకృత్స్నుడో, కాశకృత్స్నియో. శబ్దము రెండువిధములను సాధింపవచ్చును—కాశకృత్స్నేన ప్రోక్తం కాశకృత్స్నం; వా కాశకృత్స్నినా ప్రోక్తం కాశకృత్స్నమ్. కాని, కవికల్పద్రుమప్రారంభమున బోపదేవగోస్వామి కాశకృత్స్నుడు ఆదిశాబ్దికు డని యిట్లు వ్రాసినాడు:

"ఐంద్రః చంద్రః కాశకృత్స్నాపిశలీ శాకటాయనః
పాణి న్యమర జైనేంద్రా జయం త్యష్టాదిశాబ్దికాః."

కాశకృత్స్నుడు మీమాంసకు డనియు ప్రసిద్ధి. కాత్యాయనసూత్రమందు యాజ్ఞవల్క్యపుత్రుడు కాత్యాయనుడును, మహాభాష్యమున (౪-౧-౧౮)పతంజలియు

ఇతనిని మీమాంసకు డన్నారు. దీనినిబట్టి కాశకృత్స్నుడే వ్యాకరణకర్త యని చెప్పవచ్చును.

అష్టాధ్యాయియం దీతని నామము కనబడకున్నను ఈతడు పాణినికి తర్వాతివాడు కాడు. "పారాశర్యశిలాలిభ్యాం భిక్షునటసూత్రయోః" (అష్టా. ౪-౩-౧౧౦) అను సూత్రమున పాణిని వ్యాసుని నామము, వేదాంతసూత్రమును స్మరించినాడు. "అవస్థితేరితి కాశకృత్స్నః" అను వేదాంతసూత్రమున (౧-౪-౨౨) వ్యాసభగవానుడును ఇతనిని స్మరించినాడు. ఈ సూత్రమునుగూర్చి శ్రీభాష్యమున రామానుజాచార్యు డిట్లు వ్రాసినాడు: "పరమాత్మన ఏవ జీవేఽన్తరాత్మతయాఽవస్థితేః జీవాత్మశబ్దస్య పరమాత్మని పర్యవసాన మితి కాశకృత్స్నీయం మతం సూత్రకారః స్వీకృతవాన్." పారాశర్యుడే వ్యాసభగవాను డగుటకు సంశయము లేదు. తైత్తిరీయారణ్యకమునందు వ్యాసుడే పారాశర్యనామమున ఆమ్నాతుడయినాడు (౧-౯-౩౫). "గర్గాదిభ్యో యఞ్" (౪-౧-౧౦౫) అను సూత్రముపై కాశికావృత్తియందు "వ్యాసః పారాశర్యః. అంతరాపత్యవివక్షాయాంతు.... పారాశర ఇతి". అని జయాదిత్యుడు లిఖించినాడు. "పారాశర్యో వ్యాసః" (౪-౩-౧౧౦) అని బాలమనోరమలో వాసుదేవదీక్షితుడు వ్రాసినాడు. పారాశర్యుని భిక్షుసూత్రములే వేదాంతసూత్రములు (బ్రహ్మసూత్రములు) అనుట నిస్సంశయము.

భామతి ప్రారంభమున వాచస్పతి మిశ్రుడు—

"బ్రహ్మసూత్రకృతే తస్మై వేదవ్యాసాయ వేధసే
జ్ఞానశక్త్యవతారాయ నమో భగవతే హరేః"

అన్నాడు.

"భిక్షవః సన్న్యాసినః, తదధికారికం సూత్రం భిక్షుసూత్రమ్, వ్యాసప్రణీతం ప్రసిద్ధమ్." అని బాలమనోరమలో (౪-౩-౧౧౦; సిద్ధాంతకౌముది ౧౪౯౦) నున్నది. వేదాంతసూత్రములు బాదరాయణసూత్రములని కొన్నికొన్ని గ్రంథములయందు గానవచ్చును. కాని వేదవ్యాసునికి బాదరాయణ శబ్దము నామాంతరము. మత్స్యపురాణము పరాశరపుత్రు డనియు, ద్వైపాయను డనియు వ్యాసుని పేర్కొన్నది (౧౪-౧౬). పురాతత్త్వవేత్తయగు అభయకుమారగుహ మహాశయుడు వ్యాసుడు బాదరాయణుడే అని ప్రతిపాదించినాడు డౌసన్ మహాశయుడు దీనిని సమర్థించినాడు.

పాణిని వ్యాసుని పేర్కొన్నాడు, వ్యాసుడు కాశకృత్స్నుని పేర్కొన్నాడు. కావున ఇతడు వ్యాసపాణినులకు పూర్వుడు. "శతాచ్చ ఠన్యతావశతే" (౫-౧-౨౧) అను సూత్రమునుగూర్చి ప్రదీపమున కైయటాచార్యుడు "ఆపిశల కాశకృత్స్నయోస్త్వగ్రంథ ఇతి వచనా దస్యత్ర ప్రతిషేధాభావో నియతకాలాశ్చ స్మృతయో వ్యవస్థాహేతవ ఇతి మునిత్రయమతే నాద్యత్వే సాధ్వసాధుప్రవిభాగః" అన్నాడు. ప్రౌఢమనోరమలో యఙ్‌లుక్ ప్రకరణమున భట్టోజి "కిం బహునా? కాశకృత్స్నాదిమతానామపి మునిత్రయవిరోధ ఇదానీ మగ్రహణ మేవ. దృశ్యంతే హి నియతకాలాశ్చ స్మృతయో యథా కలౌ పారాశరీ స్మృతి రితి. ఏతచ్చ 'శతాచ్చ ఠన్యతావశతే' (౫-౧-౨౧ సి. కౌ.) ఇతి సూత్రే కైయటహరదత్తాది గ్రంథే స్పష్టమ్. మునిత్రయమధ్యేఽపి యథోత్తరప్రామాణ్యమాశ్రిత్య భాష్యమతోఽధేనైవ వ్యవస్థేతి తత్త్వమ్. ఏతచ్చ భర్తృహరికైయటహరదత్తాదిసకలసమ్మతమ్" అని వివరించినాడు.

వేంకటాచలమహాశయు డిట్లు వ్రాసినాడు: "శతాచ్చ ఠన్యతావశతే ఇతి సూత్రే శాకల్యకాశకృత్స్నవ్యాకరణాంతరస్థం శతాచ్చ ఠన్యతాకగ్రంథే ఇతి సూత్ర ముపన్యస్య తన్మతే శత్యః శతికోవా గోసంఘ ఇతి సాధుః. పాణినిమతేతు శతకో గోసంఘ ఇత్యేవ సాధురితి వ్యాకరణయో ర్విరోధ ముపన్యస్య, నియతకాలాశ్చ స్మృతయో వ్యవస్థాహేతవః, కలౌ పారాశరాః స్మృతాః ఇతివత్ మునిత్రయమతే నాద్యత్వే సాధ్వసాధుప్రవిభాగః ఇత్యుక్తమ్."

మాఘకవీంద్రుని "వ్యథాం ద్వయేషా మపి మేదినీభృతాం" (౧౨-౧౩) ప్రయోగమునుగూర్చి భట్టోజి యి ట్లన్నాడు: "యత్తు చాంద్రవర్మణవ్యాకరణే ద్వయశబ్దస్యాపి సర్వనామతాభ్యుపగమాత్ తద్రీత్యాఽయం ప్రయోగ ఇతి, తదపి న. మునిత్రయమతే

చేదానీం సాధ్వసాధుప్రవిభాగః; తస్యై చేదానీంతన శిష్టైః వేదాంగతయా పరిగృహీతత్వాత్. దృశ్యతే హి నియతకాలాశ్చ స్మృతయో యథా కలౌ పారా శరీ స్మృతిః."

దీనివలన పాణినీయవ్యాకరణము పూర్వుల గ్రంథములకంటె బలవత్తరమయిన దని తేలుచున్నది. ఇంతేకాక, పాణినికంటె కాత్యాయనుడు, అతనికంటె పతంజలి రచించిన వాక్యములు అధికతరాదరణీయములు అని పర్యవసానము. అందుచేతనే కైయటాదుల మతమున ఆపిశలిశాకల్యచాక్రవర్మణులవలె కాశ కృత్స్నుడు పాణినికంటె పూర్వు డని స్పష్టము.

అష్టాధ్యాయియం దీ మునినామము లేకున్నను పాణినికి కాశకృత్స్నవ్యాకరణ మవిదిత మనుటకు వీలులేదు. "ప్రత్యయోత్తరపదయోః" అని కాశ కృత్స్నమున కలదు; "ద్విగుసంఖ్యా" అని దానికి పూర్వ ముండియుండును. పాణినిముని "తద్ధితార్థోత్తరపద సమాహారేచ" (౨-౧-౫౧), "సంఖ్యాపూర్వో ద్విగుః" అనియు సూత్రీకరించినాడు. ఈ రెండు సూత్రములను మనసులో నుంచికొని వార్తికకారుడు కాత్యాయనుడు "ద్విగుసంజ్ఞాప్రత్యయోత్తరపదయో శ్చే దితరేతరాశ్రి యత్వా దప్రసిద్ధిః" అన్నాడు. దీనిపై ప్రదీపకారుడను కైయటుడు "కాశకృత్స్నస్య 'ప్రత్యయోత్తరపదయో' రితి సూత్రం తావ ద్విచారయతి, పాణినీయం తు పశ్చా ద్విచారయిష్యతి" అని వ్రాసినాడు. రెండు సూత్ర ములలో ఇతరేతరాశ్రయదోషమున్నదని తెలుపుటకు పతంజలిమహర్షి, ద్విగుసంజ్ఞానిమిత్తే ప్రత్యయోత్తర పదే, ప్రత్యయోత్తరపదనిమిత్తాచ ద్విగుసంజ్ఞా. తదేత దితరేతరాశ్రయం భవతి, ఇతరేతరాశ్రయాణి చ కార్యాణి న ప్రకల్పంతే." అని వివరించినాడు. కాశకృత్స్న సూత్రవ్యవస్థలో ద్విగునిమిత్తము ప్రాతి పదికోత్తరప్రత్యయమును భావింపవలెను. ప్రత్యయము పరముం దుండుటవలన ద్విగుసంజ్ఞను గ్రహింపవలెను. కాబట్టి యిక్కడ ఇతరేతరాశ్రయదోషము దుర్వార మగును. దీనిని నివారించుటకు పాణినిముని ప్రత్య యోత్తరపదయోః అను స్థానమున అర్థశబ్దాన్విత 'తద్ధి తార్థోత్తరపదసమాహారేచ' అను సూత్రము చేసినపిమ్మట 'భావిని భూతవ దుపచారః' అను న్యాయప్రకారము ద్విగుసంజ్ఞావిధానము చేసినాడు. అందులకే భాష్యమున నిట్లున్నది: "ఏవం తర్హి అర్థే ఇతి వక్ష్యామి. అర్థేచేత్ తద్ధితానుత్పత్తిః బహువ్రీహివత్. అర్థేనచేత్ తద్ధితో త్పత్తి ర్నప్రాప్నోతి. ద్వైమాతురః ......... ప్రత్యయోత్తరపదయోః ద్విగుసంజ్ఞా భవతీతి వక్తవ్యమ్. నను చోక్తమ్— ద్విగుసంజ్ఞా ప్రత్యయోత్తరపదయో శ్చే దితరేతరాశ్రయత్వా దప్రసిద్ధిరితి. నైష దోషః. ఇతరేతరాశ్రయమాత్ర మేతచ్చోదితమ్. సర్వాణి చేత రేతరాశ్రయా ణ్యేక త్వేన పరిహృతాని—సిద్ధంతు నిత్య శబ్దత్వా దితి. నేదం తుల్య మన్యై రితరేతరాశ్రయైః. నహి సంజ్ఞా నిత్యా. ఏవం తర్హి భావినీ సంజ్ఞా విజ్ఞా స్యతే. తద్యథా: కశ్చిత్ కంచిత్ తంతువాయ మాహ– అస్యసూత్రస్య శాటకం వయేతి. సపశ్యతి—యది శాటకః న వాతవ్యః; అథ వాతవ్యః న శాటకః. శాటకో వాతవ్యశ్చేతి విప్రతిషిద్ధం భవతి. భావినీ ఖల్వస్య సంజ్ఞా అభిప్రేతా. స మన్యే, వాతవ్యో యస్మిన్నుతే శాటక ఇత్యేతత్ భవతీతి." పాణిని యే యాలో చనతో సూత్రీకరించెనో భాష్యము దానిని బాగుగా ప్రదర్శించినది.

పాణిని సూత్రవ్యవస్థను గమనించినచో కాశ కృత్స్నముని భ్రమపడియుండడు. ఈతని సూత్ర దోషమును గ్రహించియే పాణిని చక్కగా నివారించి నాడు. కాశకృత్స్నుని 'ప్రత్యయోత్తరపదయోః' అను సూత్ర మిచట ప్రత్యాఖ్యాత మయినను, ప్రసంగాంతర మున పాణిని ఇట్టి శబ్దవిన్యాసముతోడనే 'ప్రత్యయోత్తర పదయోశ్చ' (౭-౨-౯౮) అను సూత్రము విధించినాడు. పాణినీయగణపాఠమునందు కాశకృత్స్న నామమున్నది. కావున నీ ముని పాణినికి పూర్వుడు కానోపును.

పతంజలి కాశకృత్స్నవ్యాకరణమును జూచి యుండవచ్చును; కాని భర్తృహరి చూచినాడో, చూడ లేదో తెలుపుట కష్టము. ఒకచోట 'తదర్హమ్ (పా. ౫-౧-౧౧౭) ఇతి నారబ్ధం సూత్రం వ్యాకర ణాంతరే' అన్నాడు భర్తృహరి. దీనిపై వ్యాఖ్య వ్రాసిన హేలరాజు "వ్యాకరణాంతరే కాశకృత్స్న చాపిశలే" అని వివరించినాడు. కీల్‌హారన్‌మహాశయుడు

జయాదిత్యుడుగాని, వామనుడుగాని దానిని చూడలే దన్నాడు:

*Why Chandra is passed over in Kasika on Panini (4. 2. 65 and 5. 1. 58). The authors of Kasika had occasion to speak of the three Adhyayas of Kasakritsna's sutra, of the eight of Panini, of ten of Vyaghrapada, they surely could not have helped thinking of the sutra of Chandra which contains six adhyayas. Amuse though I am to conjucture, I would venture to ask. Was Chandra Vyakarana good enough to be copied from, but too modern a work to be honourably mentioned together with the sutras of sages like Kasakritsna and others, of which Jayaditya and Vemana knew very little more than we do. (The Indian antiquary, vol. 5. pp 183-4).*

కాశికావృత్తిలో చాంద్రవ్యాకరణవిషయము నుదాహరింపని వామనజయాదిత్యులను గూర్చి కీల్‌హారన్ పై వాక్యములు లిఖించినాడు.

క్రీ. శ. ౧౨వ శతాబ్దిలోని క్షీరతరంగిణియందు "కాశకృత్స్నా అస్యా నిష్ఠాయా మనిట్త్వ మాహుః" అని వ్రాసిన క్షీరస్వామి కాశకృత్స్నము చూడక యీ మాట లెట్లు లిఖించియుండును? క్రీ. శ. ౧౧, ౧౨ శతాబ్దులలో ఈ గ్రంథము లేకపోవచ్చును. కాని భారద్వాజసంప్రదాయమందో, సౌనాగసంప్రదాయమందో కల. గురుపరంపరాశ్రవణమువలన నిట్లు క్షీరస్వామి వ్రాసియుండవచ్చును. మాధవీయధాతువృత్తియందుసాయణాచార్యుడు నిట్లే వ్రాసియుండును: "నిష్ఠాయా మిదం నేచ్ఛంతి కాశకృత్స్నా ఇతి స్వామి కాశ్యపౌ" (౨-౫౯). స్వామి అన్నప్పుడు క్షీరస్వామి యనియు, కాశ్యపుడు బాలావబోధనవ్యాకరణ రచయిత యగు వృద్ధకాశ్యపు డనియు గ్రహింపవలెను. వీ రిరువురు ౧౧, ౧౨ శతాబ్దులలోనివారు.

"త్రయోఽధ్యాయాః పరిమాణ మస్య సూత్రస్య త్రికం కాశకృత్స్నమ్" (౫-౧-౫౮), "ఏవం త్రికాః కాశకృత్స్నాః" (౪-౨-౬౫) అని కాశికావృత్తియం దున్నది.

జైన శాకటాయనుడును అమోఘవృత్తియందిట్లే లిఖించినాడు. వీనినిబట్టి కాశకృత్స్నవ్యాకరణము మూడధ్యాయముల గ్రంథ మనియు, దానిని పఠించువారలను కాశకృత్స్నా లనుచుండి రనియు తేలుచున్నది. ఈ వ్యాకరణమున మూడునాలుగు సూత్రములు మాత్రము నేడు లభించుచున్నవి. ఈతడు కాశకృత్స్నతంత్రి యని తోచును.

## సే న కీ య వ్యా క ర ణ ము

"సేనకేఽనాథ వై గ్రంథః ప్రణీత స్తదనంతరమ్."

"గిరేశ్చ సేనకస్య" (౫-౪-౧౧౨)అను సూత్రము అష్టాధ్యాయియం దున్నది. ఇంతకుమించి సేనకుని పేరు మరి యే గ్రంథమునందును కానరాదు. దీనినిబట్టి సేనకుని గ్రంథము బహుకాలముక్రిందటనే లోపించియుండును. పాణినిముని సేనకుని వ్యాకరణము స్వయముగా చూచినాడో, గురుపరంపరలో వినాడో చెప్పుటకు వీలులేదు.

## కాశ్యపి వ్యాకరణము

"శిష్యాణాం హితకామేన కశ్యపేనాఽథ కాశ్యపి."

"తృషిమృషికృశేః కాశ్యపస్య" (౧-౨-౨౫); "నోదాత్తస్వరితోదయ మగార్గ్యకాశ్యపగాలవానామ్" (౮-౪-౬౭) అను సూత్రములు అష్టాధ్యాయియం దున్నవి. వీనివలన కాశ్యపి వ్యాకరణగ్రంథ మేదో ఒకానొక కాలమున నున్నట్లు గోచరించును. కాశ్యపి పాణినికి ప్రమాణపురుషు డనియు, మహర్షి యనియు తోచును. "కాశ్యపకౌశికాభ్యా మృషిభ్యాం ణినిః" (౪-౩-౧౦౩) అను పాణినిసూత్రమువలన, కాశ్యపిప్రోక్తమైన కల్పసూత్రమో, వ్యాకరణమో 'కాశ్యపి' నామమున ప్రసిద్ధ మయియుండు ననిపించును. కాశ్యపి ఋషిగ్రంథ మేదియు లభ్యము కాలేదు.

వాజసనేయిప్రాతిశాఖ్యలో కాత్యాయనమహర్షి కాశ్యపీయమతమునుగూర్చి ఉల్లేఖించినాడు. "లోపం కాశ్యపశాకటాయనౌ" (౪-౫): అనగా కాశ్యపశాక

టాయనుల మతమున రేఫముకాని, ఊష్మవర్ణముగాని పరమందుండగా మకారముగాని, నకారముగాని లోపించును. వానికి పూర్వమున నున్న స్వరము సానునాసికమగు నని భావము. ఈ ప్రాతిశాఖ్యలో "అథ పదగోత్రాణి" (౮-౯౪) అను సూత్రము తరువాత—

"భరద్వాజక మాఖ్యాతం భార్గవం నామ భాష్యతే
వాసిష్ఠ ఉపసర్గస్తు నిపాతః కాశ్యపః స్మృతః"
(౮-౫౦)

అని యున్నది. పురందరశిష్యుడు మహర్షి భరద్వాజుడు ఆఖ్యాతమునుగూర్చియు, భృగుమహర్షి నామమునుగూర్చియు, బ్రహ్మర్షి వసిష్ఠుడు ఉపసర్గను గురించియు, కాశ్యపమహర్షి నిపాతమునుగురించియు విశేషముగా నాలోచనచేసినవా రని ప్రతీతమగుచున్నది.

బ్రూహ్లో లీబిష్ మహాశయులు ప్రకటించిన క్షీరతరంగిణియందును,మాధవీయధాతువృత్తిప్రభృతిగ్రంథములందును తరచుగా కాశ్యపనామమున నానావిధ సూత్రములు, వచనములును ఉద్ధృతము లయినవి. మహర్షి కాశ్యపునకును, ఈ కాశ్యపునకును సంబంధము లేదు. ఈతడు క్రీ. శ. ౧౧, ౧౨ శతాబ్దులలోని సింహళ బౌద్ధపండితుడు. ఈతని 'బాలావబోధన' వ్యాకరణము సుప్రసిద్ధము. చాంద్రవ్యాకరణసారాంశము లీ గ్రంథమున సంకలితములు. ఇది ప్రచారము నొందుటచే చాంద్రవ్యాకరణము సింహళమునుండి తిరోధాన మందినది. ఇప్పు డక్కడగూడ బాలావబోధనవ్యాప్తి తగ్గిపోయినది.

## స్ఫోటాయన వ్యాకరణము

"స్ఫోటాయనేన యోగాత్తు తథా స్ఫోటాయనం కృతమ్."

"అవఙ్ స్ఫోటాయనస్య" (౬-౧-౧౨౩) అను పాణినిసూత్రముచే స్ఫోటాయనమత ముల్లిఖితము. "తపర స్తత్కాలస్య" (౧-౧-౭౦) అను సూత్రముపై భాష్యమున పతంజలి స్ఫోటాయనశ్లోకము నుద్ధరించి యుండవచ్చును :—

"ధ్వనిః స్ఫోటశ్చ శబ్దానాం ధ్వనిస్తు ఖలు లక్ష్యతే,
అల్పో మహాంశ్చ కేషాంచి దుభయం తత్ స్వభావతః".

స్ఫోటాయనవ్యాకరణ ముండె ననుటకు సందేహము లేదు. హైరణ్యగర్భమున స్ఫోటశబ్దము నామతః లేకున్నను స్ఫోటబీజము నిహితము. స్ఫోట మనగా శబ్దార్థప్రకాశక మగు స్వయంప్రభవశక్తివిశేషము. "స్ఫుటతి అభివ్యక్తీభవతి అస్మా దితి స్ఫోటః. స్ఫోటత్వ మర్థప్రకాశకత్వమ్. ప్రకాశశ్చ జ్ఞానమ్. తథా చార్థనిష్ఠవిషయతాప్రయోజకశక్తిమత్వం పర్యవస్యతి" అన్నారు స్ఫోటవాదులు. మహాభాష్యాది తాత్పర్యానుసారముగా మనియర్ విలియమ్సు మహాశయుడు స్ఫోటసందర్భమున నిట్లు వ్రాసినాడు:

*"The eternal and imperceptible element of sound or words and the real vehicle of idea which bursts or flashes on the mind when a sound is uttered."*

కక్షీవత్పర్వతముపై ఔశిజనాము డను వైయాకరణయోగి నిజగ్రంథమున శబ్దమున కుండెడి అర్థప్రకాశకశక్తివిశేషమును ప్రపంచించి, దానికి స్ఫోటమని పే రిడినాడు. ఈ నూతననామమువలన నతనికి స్ఫోటాయను డను పేరు ప్రసిద్ధమయినది. అతడు పాణిని కెంత పూర్వుడో తెలియదు; వ్యాసభగవానునకు తరువాతివాడు మాత్ర మగును. మహాభారతమున స్ఫోటశబ్దము కానరాదు. కాని వ్యాసభాష్యమున స్ఫోటతాత్పర్యము నిహితమగుటచే స్ఫోటాయనుడు వ్యాసునకు తరువాతివాడు, పాణినికిపూర్వుడు ననుట అసంగతము కాదు.

వ్యాసభాష్యము వేదవ్యాసప్రణీతము కాదనియు, మహాభాష్యపరవర్తి యనియు చాలమంది యందురు. వారి యుపపత్తులు, వానికి సమాధానములు పూర్వపక్షసిద్ధాంతరూపమున గానవచ్చును:

(౧) పూర్వపక్షము: మహాభాష్యముతో పోల్చి చూచినచో వ్యాసభాష్యరచనాపద్ధతి హీన మనియు, అది వేదవ్యాసవిరచితము కానేర దనియు డాక్టర్ రాజేంద్రలాల్ మైత్రామతము.

సిద్ధాంతము : యోగవార్తికములో విజ్ఞానభిక్షువు వ్యాసభాష్యము వేదవ్యాసప్రణీత మన్నాడు :

"సర్వవేదార్థసారోఽత్ర వేదవ్యాసేన భాషితః;
యోగభాష్యమిషేణాలో ముముక్షూణామిదంగతిః"

(౧ సూత్రవార్తికము). విజ్ఞానభిక్షువునకు పూర్వము వాచస్పతిమిశ్రుడు కూడ నిట్లే వ్రాసినాడు. యోగసూత్రములపై తత్త్వవైశారదీటీకారంభమున వాచస్పతి మిశ్రుడు—

"నత్వా పతంజలి మృషిం వేదవ్యాసేన భాషితే,
సంక్షిప్తస్పష్టబహ్వర్థా భాష్యే వ్యాఖ్యా విధీయతే"

అన్నాడు.

(౨). పూర్వపక్షము: వ్యాసభాష్యమున వార్షగణ్యనామ మున్నది (౩-౫౩). *'Yoga system of Patanjali'* అను గ్రంథభూమికలో **Haughton Woods**, *"There is little room to doubt that Varshaganya was an older contemporary of Vasubandhu"* అని వ్రాసినాడు. ***Professor Takakusu*** అను జపానీయవిద్వాంసుడు వసుబంధు క్రీ. శ. ౫, ౬ శతాబ్దులలోనివా డని నిర్ధారణ చేసినాడు. కావున వ్యాసభాష్యము ౫ వ శతాబ్దికి ముం దుండుటకు వీలు లేదని హోటకామహాశయుని వాదము.

సిద్ధాంతము: క్రీ. శ. ౫, ౬ శతాబ్దులలోని సిద్ధసేనగణి, ఉమాస్వాతిప్రణీత 'తత్త్వార్థాధిగమసూత్ర' భాష్యటీకలో ప్రసంగోపాత్తమయిన "సోపక్రమం నిరుపక్రమంచ" (విభూతిపాదము, ౧౨ సూత్రము) అను యోగసూత్రవ్యాఖ్య చేయునపుడు వ్యాసభాష్యము నుండి "యథాఽఽర్ద్రం వస్త్రం వితానితం హ్రసీయసా కాలేన శుష్యేత్ తథా సోపక్రమమ్; యథా చ తదేవ సంపిండితం చిరేణ సంశుష్యేత్ తదేవం నిరుపక్రమమ్..." ఇత్యాదివాక్యరాశి నుద్ధరించినాడు. ౫, ౬ శతాబ్దులలో వ్యాసభాష్య ముదాహృతమయి, అందు వార్షగణ్యుడు పూర్వాచార్యరూపమున నుల్లిఖితు డయినచో వార్షగణ్యుడు ౫, ౬ శతాబ్దులలోని వసుబంధువునకు సమకాలికు డెట్లు కాగలడు?

వసుబంధువునకు బహుపూర్వవర్తియగు ఈశ్వరకృష్ణాచార్యుని సమర్థించుటకై సాంఖ్యకారికపై 'యుక్తిదీపికా'వ్యాఖ్యలో కపిల-కణాద-వసిష్ఠ-హారీత-వృషగణాదిపూర్వాచార్యులవలె వార్షగణ్యుని వాదము కూడ ఉద్ధృత మయినది. యుక్తిదీపిక అధునిక గ్రంథము కాదు.

ఈశ్వరకృష్ణునకు చిరకాలముముందే "ఊరణ్‌రపరః" (౧-౧-౫౦) అను పాణినీయసూత్రముపై మహాభాష్యములో క్రీ. శ. పూర్వము ౩, ౨ శతాబ్దులలోని పతంజలి వార్షగణ్యుని పేర్కొన్నాడు: "కర్తా హర్తా వార్షగణ్యః", "వార్షతి: వృషగణ స్యాపత్యమ్. గర్గాదిత్వాద్ యఞ్"అని ఛాయ.

పతంజలికి పూర్వమే పాణినీయగణపాఠమున, నడాదిగణమున "అగ్నిశర్మన్ వృషగణే"అని యున్నది. అభినవశాకటాయనుని "శరద్వచ్ఛునకదర్భాగ్నిశర్మకృష్ణదర్భాత్ భృగువత్సవసిష్ఠవృషగణబ్రాహ్మణాగ్రాయణే" (౨-౪-౩౬) అను సూత్రము చూచి పాణినీయగణపాఠమున నీయంశము ప్రక్షిప్తమైన దనవచ్చును. కాని, అతనికి పూర్వమే "నడాదిభ్యః ఫక్" (౪-౧-౯౯) అను సూత్రముపై కాశికావృత్తిలో నడాదిగణ ముద్ధృతమయినది. కాశీనాథ బాపూ పాఠక్ మతమున, దేవనందికృతజైనేంద్రవ్యాకరణమందలి "శరద్వచ్ఛునకదర్భాగ్నిశర్మ కరణాత్.." (౩-౩-౧౩౪) అను సూత్రమును జూచి, పాణినీయగణపాఠాంశము కాశికకు పూర్వమునను, దేవనందికి పరమునను ప్రక్షిప్తమయినదట. ఈ యూహ యుచితము కాదు. జైనేంద్రవ్యాకరణమునకు పూర్వమే యున్న చాంద్రవ్యాకరణమున "నడాదిభ్యః" (౨-౪-౩౫) అను సూత్రముపై వృత్తిలో చంద్రగోమి పాణిని ననుసరించి "అగ్నిశర్మన్ వృషగణే"అని రచించినాడు. అగ్నిశర్మాయణ వార్షగణ్యుడు వృషగణపౌత్రుడు. వార్షగణ్యునితోపాటు వృషగణవీరుని నామము, వాదము యుక్తిదీపికలో గానవచ్చును. పాణిని ప్రాతిపదికపాఠమునందు వృషగణుని పేర్కొన్నప్పుడు వార్షగణ్యుని తప్పక ఎరిగియుండును.

పాణినికి పూర్వమే ద్వైతవనవాసియు, సామాచార్యుడు నగు జైమినిముని తన గృహ్యసూత్రములోని తర్పణప్రకరణమున వార్షగణ్యుని పేరు స్మరించినాడు.

తదనుసారముగా సామవేదశాఖావిశేషమునందు వార్షగణ్యు నుద్దేశించి నేటికిని తర్పణము విడుతురు. సుబ్రహ్మణ్యశాస్త్రికృత గోభిలగృహ్యకర్మప్రకాశికాగ్రంథమున నిత్యాహ్నిక ప్రయోగమును జూడనగును.

మహాభారతశాంతిపర్వమున ౩౧౮ అధ్యాయములో గంధర్వరాజు విశ్వావసువు వార్షగణ్యుని స్మరించినాడు:

"జైగీషవ్యస్యాసితస్య దేవలస్య మయా శ్రుతమ్,
పరాశరస్య విప్రర్షేః వార్షగణ్యస్య ధీమతః"

కొందరుకొందరు వార్షగణ్యుని మంత్రద్రష్టగా భావించినారు. వాగీ గాయత్రీ-ఉదాహరణమున తన్మంత్ర మొకటి "యస్యేదం రిదం విశ్వ మేజతి తా విద్యాంసా హవామహే వామ్; పీతం సోమ్యం మధు" అనునది వినవచ్చుచున్నది. పింగళచ్ఛందస్సూత్ర (౩-౧౨) టీకలో యాదవప్రకాశుడు ఈ మంత్రమును వార్షగణ్యదృష్టముగా బలికినాడు.

వార్షగణ్యుడు వసుబంధువుకు సమకాలికు డను విషయమున *Woods* మహాశయుడు ఉపపత్తి చూపలేదు. కాబట్టి అయన భ్రమకు లోనయినాడు.

(౩) పూర్వపక్షము: "యథైకా రేఖా శతస్థానే శతం దశస్థానే దశైకా చైకస్థానే" (౩-౧౩) అను వ్యాసభాష్యము చూచిన, వ్యాసభాష్యకారుడు దశమికామానము నెరుగును. అది క్రీ. శ. ౬వ శతాబ్దిలోని వరాహమిహిరప్రవర్తిత మగుటచే వ్యాసభాష్యము అంతకు ముం దుండుటకు వీలు లేదని కొందరను చున్నారు.

సిద్ధాంతపక్షము: దశమిశ్రమానశబ్దమువలన దశమిశ్రసంఖ్యయా (*decimal numerals*), దశమిక భగ్నాంశమా (*decimal fraction*) వీరు భావించునది? దశమికసంఖ్య వేదమున (యజు. ౧౭-౨) వ్యవహృతము. కావున దానితో వరాహమిహిరునకు సంబంధము లేదు. భాష్యకారుని యూహలో దశమిక భగ్నాంశ లేదు. అభిప్రాయ మది యగుచో "యథైకా రేఖా శతస్థానే శతతమాంశో (.౦౧) దశస్థానే దశతమాంశ (.౧) ఏకా చైకస్థానే (౧)" అని లిఖించి యుండును.

(౪) పూర్వపక్షము: మాఘకవికి పూర్వము సంస్కృతభాషలో సంస్కారార్థక 'పరికర్మ'శబ్ద ప్రయోగము లేదు. శిశుపాలవధలో (౪-౫౫) "మైత్ర్యాదిచిత్తపరికర్మవిదో విధాయ క్లేశప్రహాణ మిహ లబ్ధసబీజయోగాః" అని యున్నది. మాఘుడు మొదట సంస్కారార్థకపరికర్మశబ్దప్రయోగము చేయగా, అనంతరము "మైత్రీకరుణాముదితోపేక్షాణామ్..." అను సమాధిపాదసూత్రముపై వ్యాసభాష్యమున పరికర్మశబ్దము ప్రయుక్త మయినది. కావున వ్యాసభాష్యము ౭, ౮ శతాబ్దులలోని మాఘునికి పరవర్తియో, సమకాలికమో కావచ్చును.

సిద్ధాంతపక్షము: సనత్సుజాతీయభాష్యమున శంకరులు రాగిగీతలనుగూర్చి వ్రాసినారు: "ప్రసాదం కురు తన్వంగి, క్రియతాం పరికర్మ తే" అని రాగిగీతలో నున్నది. మాఘునికి పూర్వుడును, ౫, ౬ శతాబ్దులలోనివాడును అగు అమరసింహుడు "పరికర్మాంగసంస్కారః" అన్నాడు. అమరసింహునికి పూర్వుడైన కాళిదాసు "విబుధై రపి యస్య దారుణై రసమాప్తే పరికర్మణి స్మృతః" అని కుమారసంభవమున ప్రయోగించినాడు. కాళిదాసునకు అత్యంతపూర్వుడగు ఆశ్వలాయనుని శ్రౌతసూత్రమున పరికర్మశబ్దము ప్రయుక్తము. మహాభారతములో అంగసంస్కారచిత్తసంస్కారార్థములందు పరికర్మశబ్దము కానవచ్చును. కావున యోగభాష్యకారుడు మాఘునివద్ద శబ్దము గ్రహింపలేదు.

(౫) పూర్వపక్షము: "తదస్యాస్త్యస్మి న్నితి మతుప్" (౫-౨-౯౪) సూత్రముపై మహాభాష్యమున "అథాస్తిగ్రహణం కిమర్థమ్? సత్తాయా మర్థే ప్రత్యయో యథా స్యాత్. నైత దస్తి ప్రయోజనమ్. న సత్తాం పదార్థో వ్యభిచరతి" అన్నాడు పతంజలి. దీనిని జూచి వ్యాసభాష్యమున "సర్వపదేషు చాస్తి వాక్యశక్తిః. వృక్ష ఇత్యుక్తేఽస్తీతి గమ్యతే. నసత్తాం పదార్థో వ్యభిచరతి" (౩-౧౭) అను రచన చేరిన దని కొందరన్నారు. దీనివలన వ్యాసభాష్యము మహాభాష్యమునకు పరమం దున్నది.

సిద్ధాంతము : “న సత్తాం పదార్థో వ్యభిచరతి” అను వాక్యము రెండుభాష్యములలోను కానిపించుచుండుటచే ఇం దెవ్వరిది కాదు; ప్రాచీనకాలము నుండి ప్రతీతిలో నున్న ఆభాణక మనిపించును. ఏ సంప్రదాయమునకు చెందినదో చెప్పుట కష్టము. ఈ వాక్యము వైయాకరణగోష్ఠిలో సుద్గీత మని వాచస్పతిమిశ్రుని యభిప్రాయము. మహాభాష్యములో నున్న ఆభాణకములకు ప్రథమప్రవక్త లెవరో తెలియదు, అందులకే పాణిని అస్తిశబ్దము ప్రయోగించినాడు. తన కాలములోని వ్యాకరణమందలి ఆభాణకమును వ్యాసు డుపయోగించియుండును.

(౬) పూర్వపక్షము : విభూతిపాదములోని ౪౪వ సూత్రముపై వ్యాసభాష్యమున “అయుతసిద్ధావయవభేదానుగతః సమూహో ద్రవ్య మితి పతంజలిః” అని యున్నది. ఇందు మహాభాష్యకారుడే లక్షితుడు. ఈ వాక్యతాత్పర్యము మహాభాష్యములో “గుణసముదాయో ద్రవ్యమ్” (౪-౧-౩) అని కానవచ్చును.

సిద్ధాంతము: యుతసిద్ధావయవ మనియు, అయుతసిద్ధావయవ మనియు సమూహము రెండు విధములు. ఏ సమూహావయవములు అపృథగ్భావమున—అనగా పరస్పరసంశ్లిష్టభావమున అవస్థానము పొందునో ఆ సమూహము అయుతసిద్ధావయవము. దీనికి శరీర ముదాహరణము. “అయుతసిద్ధావయవభేదానుగతః సమూహో ద్రవ్య మితి పతంజలిః” అని వ్యాసభాష్యము. (*According to Patanjali substance is a collection, having for its basis the distinguishing features of its inseparable components.*) వాచస్పతిమిశ్రు డిట్లన్నాడు : “యుతసిద్ధాః పృథక్ సిద్ధాః సాంతరాలా అవయవా యస్య స తథోక్తః, యూథం వన మితి. సాంతరాలా హి అవయవా......అయుతసిద్ధావయవశ్చ సమూహో వృక్షో గౌః పరమాణు రితి. నిరంతరా హి అవయవాః” మహాభాష్యమున “గుణసముదాయో ద్రవ్యమ్” అని యున్నది (*Substance is a collection of properties, such as form, i. e. object of sight etc.*). కైయటాచార్యుడు దీనిపై “గుణసముదాయ ఇతి. రూపాదిసన్నివేశమాత్ర మి త్యర్థః” అని, మరియొకచో “గుణానా మాశ్రయో ద్రవ్య మి త్యర్థః” అని వ్యాఖ్యానము చేసినాడు. భాష్యములోని యీ రెండు వాక్యములును ఏకార్థకములు కావు. సముదాయగత మయినను, సమూహగత మయినను పార్థక్యప్రదర్శనమే వ్యాసభాష్యప్రధానోద్దేశము.- తత్ప్రసంగమున పతంజలివాక్య మని వినబడిన దానివలన అయుతసిద్ధావయవభేదానుసారియగు ద్రవ్యసమూహము నిర్ధారితమయినది. కావుననే వాచస్పతిమిశ్రుడు “త దేతేషు సమూహేషు ద్రవ్యభూతం సమూహం నిర్ధారయతి—అయుతసిద్ధేతి” అన్నాడు. మహాభాష్యమున “కస్య తావత్ భవా న్నీతం గుణం వ్యాఖ్యాం మన్యతే స్త్రీత్వం నామ ?” అని ప్రశ్నించి ‘ద్రవ్యస్య’ అను సమాధానము నంగీకరించుచు, ద్రవ్యస్వరూపనిర్ణయాభిప్రాయముతో పూర్వపక్షరూపమున “యది తావత్ గుణసముదాయో ద్రవ్యం, కా గతి ర్యదేతే భావాః కృదభిహితా స్తద్ధితాభిహితాశ్చ చికీర్షా గోతేతి” (౪-౧-౩) అని పతంజలి వ్యాఖ్యానించినాడు. కావున నిచ్చట “గుణసముదాయో ద్రవ్యమ్” అనునది చరమసిద్ధాంతము కాదు. దానికై ౫-౧-౧౧౯ సూత్రముపై భాష్యమున “కింపునః ద్రవ్యం? కే గుణాః ? శబ్దస్పర్శరూపరసగంధా గుణా స్తతో ఽన్యత్ ద్రవ్యమ్” అని పతంజలి ద్రవ్యగుణభేదమును ప్రదర్శించినాడు. వైశేషికులు పదార్థవిభాగప్రసంగమున ద్రవ్యము, గుణము భిన్నపదార్థము లన్నారు. కావున ఉభయదృష్టికిని సంపూర్ణపార్థక్యహేతువగు వ్యాసభాష్యధ్వనిని మహాభాష్యమున కారోపించుట సంగతము కాదు.

ప్రాచీనకాలమున ఒకానొక మునిపుత్రుడు పతంజలినామధేయు డుండెను. సామశాఖాప్రవర్తకుడగు కౌథుమముని కాతడు శిష్యుడు. ఈ పతంజలి యొక సంహిత రచించినా డట. వ్యాసభాష్యకారు డీ సంహితనుండియే యీ వచనము నుద్ధరించియుండును.

ఇం దొకచో యుక్తిప్రదీపికాప్రసక్తి వచ్చినది. ఆ సందర్భమున కొన్ని విశేషములు చూడనగును. షడ్దర్శనటీకాకారుడగు వాచస్పతిమిశ్రుడు యుక్తిప్రదీపికాకర్త యని ప్రసిద్ధి కలదు. కాని యీ గ్రంథ

భూమికలో సాంఖ్యవ్యాకరణతీర్థ పులినవిహారీచక్రవర్తి "*Statement of the Colophon at the end of the Poona Mss. which ascribes the work to Vachaspati Misra is far from convincing*". అని వ్రాసినాడు. నిజమే. కొన్ని కొన్ని యెడల యుక్తి ప్రదీపికకును, తత్త్వకౌముదికిని మతభేదములు గోచరించుటయే కాక యెడనెడ రెంటిలోని మూలశ్లోకములలోగూడ పాఠభేదములు కానవచ్చుచున్నవి. యుక్తి ప్రదీపిక యెప్పటి గ్రంథము? తత్కర్త యెవరు?

కర్త యెవరో తెలియవచ్చుట లేదు. పండిత పులినవిహారీముద్రితగ్రంథమున అవతరణికలో డాక్టరు సాతకడి ముఖోపాధ్యాయుడు, "*I think that the work Yuktipradipika cannot be much later than Vasubandhu and Dignaga......... There is not a single quotation from Uddyotakara's famous work......Not even a single quotation can be traced to Bhartrihari's Vakyapadiya*" అని వ్రాసినాడు. ఇది అనపేక్షణఫలము. యుక్తిదీపికలో (౭, ౩౭ పుటలలో) 'ఆహ చ' అనియు, కొన్ని యెడల అవికలముగాను, కొన్ని తావుల ఈషత్పాఠాంతరసహకారముగాను వాక్యపదీయద్వితీయకాండమునుండి—

'పృథక్ నివిష్టతత్త్వానాం
పృథగర్థాభిపాతినామ్
ఇంద్రియాణాం యథా కార్య
మృతే దేహాన్నలభ్యతే' (౪౨౬)

మొదలగు శ్లోకము లుద్ధృతము లయినవి. కావున యుక్తిదీపిక క్రీ. శ. ౬-వ శతాబ్దితరువాతిది.

వర్తమానసాంఖ్యప్రవచనసూత్రమును, ప్రాచీన షడధ్యాయీసూత్రమును భోజుడు పేర్కొన్నాడని ప్రాజ్ఞులన్నారు (భూమిక, పంపాం౨ ౨౮౧). రాజవార్తిక మను పేర భోజకర్తృకమగు సాంఖ్య వార్తికము కలదు. న్యాయసూచీనిబంధాదిప్రణేత వాచస్పతి భోజుని పేర్కొన్నాడు; నామగ్రహణపూర్వకముగా రాజవార్తికమునుండి బహుశ్లోకముల నుద్ధరించినాడు. ౧౦వ శతాబ్దిలోని న్యాయమంజరీకారుడు జయంతభట్టు వాచస్పతి పేరు చెప్పినాడు. ౮౪౧ లో వాచస్పతి న్యాయసూచీనిబంధన చేసినట్లు స్పష్టము. రాజవార్తికప్రణేతయగు భోజుడు ధారానగరాధిపతి కానేరడు. ధారాధిపతి ౧౦వ శతాబ్దిలోనివాడు. ధారాధిపతియగు భోజుడు సాంఖ్యముపై వృత్తిగాని, వార్తికముగాని రచింపలేదు.

పాంచాలాంతర్గతమగు కాన్యకుబ్జమున ౮౪౦-౯౦ వరకు పరిపాలించిన భోజుడు కలడు. ఇతడు రామభద్రతనయుడు, పరిహారవంశీయుడు, రణరంగమల్ల, ఆదివరాహ, మిహిరభోజనామప్రసిద్ధుడు. ఈతడు బహుభూభాగమును జయించి కాన్యకుబ్జగౌరవము వృద్ధి చేసినాడు. "*Ramabhadra's son Mihir usually known by his title Bhoja enjoyed a long reign (circa 840-90) and beyond question was a very powerful monarch whose dominions may be called an empire without exaggeration...*" (*E. H. I. 379-80*) అని డా. విన్సెంటు స్మిత్తు లిఖించినాడు. ఈ భోజుడే 'తత్త్వసమాసము' మీదను, ప్రాచీన 'షడధ్యాయీ సాంఖ్యసూత్రము' మీదను రెండు వార్తికగ్రంథములు రచించినాడు. అందు షడధ్యాయి రాజవార్తిక మని పేరొందినది. రాజవార్తిక మిప్పుడు లభింపదు. డా. కీతు "*Vachaspati Misra cites a Rajavartica of Ranaranga Malla or Bhoja*" (*H. S. L 489*) అన్నాడు. ఈ భోజుడు కాన్యకుబ్జాధిపతియేగాని ధారాధిపతి కాడు. క్రీ. శ. ౯వ శతాబ్దిలోని రణరంగమల్లభోజుడే యుక్తిప్రదీపిక రచించినట్లు తలంపవచ్చును.

వాచస్పతిమిశ్రుడు "లోకవత్తు లీలాకైవల్యమ్" (౨-౧-౩౩) అను సూత్రముపై భామతీవ్యాఖ్యలో, అనాయాసముగా కార్యసంపాదనకై లౌకికోదాహరణము లిచ్చుటకు, "న చాద్యాపి న దృశ్యంతే లీలామాత్రవినిర్మితాని మహాప్రాసాదప్రమోదవనాని శ్రీమన్నృగనరేంద్రాణా మన్యేషాం మనసాపి దుష్కరాణాం నరేశ్వరాణామ్" అనియు, 'భామతి' శేషములో నిట్లును లిఖించినాడు:

"నృపాంతరాణాం మనసా ప్యగమ్యాం
భ్రూక్షేపమాత్రేణ చకార కీర్తిమ్
కార్తస్వరాసారసుపూరితార్థ
సార్థః స్వయం శాస్త్రవిచక్షణశ్చ.
నరేశ్వరా యచ్చరితానుకార
మిచ్ఛంతి కర్తుం నచ పారయంతి
తస్మిన్ మహీపే మహనీయకీర్తౌ
శ్రీమన్నృగేఽకారి మయా నిబంధః"

'కల్పతరు' కారుడగు అమలానందు డిట్లు వ్రాసినాడు: "కార్తస్వరం సువర్ణం, తస్యాసారో అనవరత వర్షణం, తేన సుపూరితో ఽర్థః కాంక్షితో యస్య సార్థస్య జనసమూహస్య స తథోక్తో బహువ్రీహిః. తథావిధః సార్థో యస్య ప్రకృత త్వేన వర్తతే స నృగ స్తథోక్తః. నృగ ఇతి రాజ్ఞ ఆఖ్యా."

మిహిరభోజునకు నృగు డను నామాంతర ముండవచ్చును. అతని కీపేరెట్లు వచ్చెనో అనుసంధానము చేయవలెను. నృశబ్దముపై గమ్ధాతు-ఉత్తర-డ ప్రత్యయమువలన నృగశబ్దము నిష్పన్నమయినది. నృగు డనగా నరునకు గమ్యస్థానము గాని, ఆశ్రయము గాని యగును. శివుడో, విష్ణువో అని భావము.

మహామహేశ్వరాచార్యవర్యు డగు శ్రీపుష్పదంతుడు "నృణా మేకో గమ్య స్త్వ మసి పయసా మర్ణవ ఇవ" అని మహిమ్నస్తోత్రమున మహేశ్వరుని స్తుతించినాడు. నృగమహారాజు ప్రసిద్ధుడు. భోజుడు నృగనామప్రసిద్ధి గాంచుటకు కారణ మున్నది. సాంఖ్యతత్త్వప్రకాశకుడగు కపిలుడు విష్ణువవతార మని పౌరాణికమతము. విన్సెంటు స్మిత్తు ఇట్లు వ్రాసినాడు:

"*Bhoja liked to pose as an incarnation of Vishnu and therefore assumed the title of Adivaraha, the primaeval boar, one of the incarnations of the God. Base silver coins inscribed with the title are exceedingly common in Northern India, and by their abundance attest the long duration and wide extension of Bhoja's rule. Unfortunately no Megasthenes or Bana has left a record of the nature of his internal government.*"

కావున రాజు విష్ణ్వంశసంభూతు డని తదభిమానులు నిర్వచించి, నృగశబ్దము వాడియుందురు. వాచస్పతియంతటి మహానుభావుడు భామతిలో రెండుమారులు నృగశబ్దము రాజపరముగా వాడినాడు. అమలానందసరస్వతీస్వామి 'కల్పతరు' వ్యాఖ్యలో "ఆచార్యం యో మహీపతిః మహాన్ చకార తస్య నామ నృగ ఇతి" (౨-౧-౩౩) అని లిఖించినాడు. దానవీరుడు, శాస్త్రవిచక్షణుడు, మహనీయకీర్తియు నగు భోజుని ప్రాజ్ఞులు స్తుతించుట యుక్తమే.

మహామహోపాధ్యాయ వింధ్యేశ్వరీప్రసాద ద్వివేది న్యాయవార్తికభూమికలో నిట్లు వ్రాసినాడు: "చాహమానవంశీయు డగు నృగప్రభువు దేహలీ (ఢిల్లీ) రాజ్యమును పరిపాలించినాడు. వాచస్పతి భామతిలో అతనిని పేర్కొన్నాడు." ఐతిహాసికులు నృగరాజు విలసిలినట్లు సమ్మతించుట లేదు. "నృగశబ్దమువలన గౌడాధిపతి ధర్మపాలుడు లక్షితుడు. వాచస్పతి అతని కాశ్రితుడు" అని ప్రజ్ఞానందసరస్వతి వ్రాసినాడు. ఇది సంభావ్యము కాదు. ఆధునికచరిత్రకారులును, పండితులును ధర్మపాలుడు క్రీ. శ. ౭౮౫-౮౨౦ వరకు రాజ్యము చేసినవా డనియు, శ్రీ శంకరాచార్యుల వారు ౭౮౮ లో ఆవిర్భవించి ౮౨౦ లో ఇహలీల చాలించి రనియు నమ్ముచున్నారు. వాచస్పతిమిశ్రుడు శంకరభగవత్పాదులకు సమకాలికుడు కానేరడు; కాని మిహిరభోజునికాలమువా డయినచో భగవత్పాదులకు పరవర్తియు, జయంతభట్టుకు పూర్వవర్తియు కాగలడు.

న్యాయసూచీనిబంధనను బట్టి చూచినచో మిహిరభోజుని పుత్రుడు మహేంద్రపాలుడు వాచస్పతికి సమకాలికుడు. కానేరడు వాచస్పతి మిహిరపాలుని యాస్థానమున నున్నచో రాజశేఖరునివలన నతని వృత్తాంతము గ్రంథస్థ మగును. భామతిసమాప్తిశ్లోకములో 'మహీప' శబ్ద మున్నది. దానివలన మహేంద్రపాలుని పౌత్రుడు మహీపాలుడు లక్షితు డగుటకు వలను పడదు. మహీపాలుడు ౯౦౮-౯౧౭ వరకు రాజ్యము చేసి, రాష్ట్రకూటవంశ్యుడగు తృతీయఇంద్రదేవునితో యుద్ధములో నోడిపోయి, రాజ్యము విడిచిపోయినాడు. వాచస్పతి వర్ణించిన గుణగణము, సంపదలును మిహిరభోజునకే అన్వయించును.

(సశేషము)

# ఎరుక

[ప్రాచీనగేయము]

★

సంపాదన: శ్రీ చింతా దీక్షితులు

చిన్నదానా, చిన్నదానా,
రూపురేఖా లేదె నీకూ
పాపపుణ్యము లేదె నీకూ
కులము గోత్రము లేదె నీకూ.

చిన్నదానా, చిన్నదానా,
ఇంత చక్కని చిన్నదాన్ని
ఇంత దగ్గిర ఉంచుకోనీ
ఎన్నెరో యుగములనుంచీ
నిన్ను విడిచి బతికినానే
వట్టిబతుకు బతికినాను.

చిన్నదానా, చిన్నదానా,
ఈ సంధిలో నిను జూచినాను
నీ రాక పోకా చూచినాను
నిన్ను జూచిన వేళనుంచీ—నీ
పొందు గోరీ చిన్నదానా,
నీమీద కన్ను వేసితిని.

పోవోయీ పోవోయీ
చిన్నడా, నను పొందలేవూ, పోవోయీ
చిన్నవాడా చిన్నవాడా
నేను చిక్కను మాటలాకు
నేను చిక్కను మూటలాకు
నేను చిక్కను ప్రజ్ఞలకు
నేను చిక్కను తెలివికీ
చిన్నవాడా చిన్నవాడా
నన్ను పొందలేవు పోవోయీ.

ఓ చిన్నదానా చిన్నదానా
కొండంతా శెట్టు కొట్టి
నీవు తెగువుతో పలుకుతున్నావూ
నీవు పలుకు పలుకు వింటేను
నా గుండెలో గుబు లెత్తుతుందీ
నా వళ్లు వణుకు ఎత్తుతుందీ
చిన్నదానా చిన్నదానా
కఠినముగా పలుకబోకే.

చిన్నవాడా చిన్నవాడా
ఆలుపిల్లల వదలితేనూ
అన్నదమ్ముల వదలితేనూ
ధనధాన్యము వదలితేనూ
నీ చుట్టపక్కాలు వదలితేనూ
చిన్నవాడా చిన్నవాడా
ఆపై చూతాములేరా.

చిన్నదానా చిన్నదానా
ఆలు పిల్లలు ఉండె ఏమీ
అన్నదమ్ములు ఉంటేఏమీ
చుట్టపక్కా లుంటె ఏమీ
ధనధాన్యా లుంటె ఏమీ
వాళ్ళూ ఉంటారు లేవే
నువ్వూ ఉంటావు లేవే.

ఓ చిన్నవాడా చిన్నవాడా
ఎంత పిచ్చివాడవోయీ

ఎంత అమాయికుడవోయీ
ఒక్క మగడికి అయితేనూ
ఇద్దరూ పెళ్లాలు ఉంటేను
ఒక పెళ్లాం ఇటు లాగా
ఒక పెళ్లాం అటు లాగా
వాడికి హాయి ఏమైన చిక్కేనా?

చిన్నదానా చిన్నదానా
నీ వన్నమాటా నిజమేనే
ఆలుపిల్లల వదులుతాను
అన్నదమ్ముల వదులుతాను
నా చుట్టపక్కాల్ వదులుతాను
ధనధాన్యాల్ వదులుతాను
కాలికింద కొమ్మ పోతే
నాకు
చేతి కందే కొమ్మ ఏదే?

చిన్నవాడా చిన్నవాడా
అంత పుణ్యము నీకు ఉంటే
వాళ్ళ నందరి వదులుకుంటే
కాలికింద కొమ్మ పోతే
చేతి కందే కొమ్మ నేనే
మంచి దిట్టమైన కొమ్మనిరా
ఆలునూ పిల్లలును నేనే
అన్నలూ తమ్ములును నేనే
చుట్టాలు పక్కాలు నేనే
ఈ లోకమూ నీ దేహము నేనే
చిన్నవాడా చిన్నవాడా
నీ జీవనముకూడాను నేనేరా.

చిన్నవాడా చిన్నవాడా
ఇక నన్ను పొందుతా వోయీ
మనము ఇద్దర మేక మైనాక—
బద్ధులన్నీ తీరిపోనూ
ఈ రాజాబజారులోనూ
బలే రామభజన చేద్దామూ.

[ఈ పై పాట ఆడవాళ్లు పాడుకొనేది. రేపల్లెలో పెద్దమ్మగా రనే యోగిని పాడగా నా మిత్రులు శ్రీ యక్కా. బలరామ రెడ్డిగారు వ్రాసుకొన్నారు. ఇది ప్రాచీనగేయము. ఉచితమని తోచినచోట కొద్ది సంస్కరణ చేసితిని. 'ఎరుకు' అనే పేరు నేను పెట్టితిని. చింతా దీక్షితులు.]

# హేమంతరథము

[నాటిక]

## శ్రీ తల్లావఝ్ఝల కృత్తివాస తీర్థులు

స్వర మేళ

హోరు మని హోరు మని మ్రోగు రథ మేమి!
భోరు మని భోరు మని రోదించు నెదలు!
రాలి పడి ధూళి చెడి శ్రీలి చను ఆశల్
బలి యైన హృదయాల రుధిరాల జాలంల్
హోరు మని హోరు మని మ్రోగు రథ మేమి!

[శ్రావస్తిలో హోరుగాలి. కుటీరద్వారం చప్పుడు. దూరాన రథచక్రరవం. ఆకుల మర్మరధ్వని. చంటిపిల్ల కేరు మని ఏడుపు. సమయం సంధ్య]

వాచస్పతి

ఎవ రా తలుపు? సుప్రియా! పర్ణను సముదాయించు తల్లీ!

సుప్రియ

నాన్నా! ఎవరో పిలుస్తున్నారు. పిల్ల నిద్రరోదు. (క్షణం నిశ్శబ్దం) ఈసారి నీహారికాదేవి, ఆమె సోదరి మాంత్రికురాలు శ్రావస్తికి వస్తారట. (గాలిహోరు) ఈ పిలుపు ఎవరిదై ఉంటుంది? ఎవ రహో?

వాచస్పతి (వృద్ధకంఠం)

ఎందుకు తల్లీ? ఏ మాంత్రికురా లయితే నేమి, జరగవలసింది జరక్కుండా మానుతుందా?

సుప్రియ

నీహారిక, ఆమెసోదరి ఎక్కడ్నించి వస్తున్నారు? పర్ణను ఆశీర్వదించమని ప్రార్థించనా?

వాచస్పతి

పిచ్చితల్లీ, ఆ అక్కచెల్లెళ్లు అనాదినుంచీ ఉన్నారు. ఎప్పుడూ ఉంటూనేఉంటారు...ఎందుకు తల్లీ, కలతగా ఉన్నావు?

సుప్రియ

నాన్నా, ఈ హేమంతంలో ఆకులు రాలిపోతూ వుంటే నా గుండెలు దూసుకుపోతున్నాయి. అబ్బా! ఆకులు రాలడం, చలిగాలి వీచడం!

వాచస్పతి

ఇచ్చినవాడు మరిచిపోతే పర్ణ వెయ్యేళ్లు వర్ధిల్లాలి. వేయి వసంతాలు చూడాలి. నిత్యం తిరిగే చక్రాన్ని ఆపగలమా?

సుప్రియ

అవు నండీ...... బజ్జో చిట్టితల్లీ...... ఉయ్యాలకు కట్టిన గిలకలు చూస్తూ కన్ను మూస్తుందేమో అంటే, పడుకోదు. తల్లిదగ్గిరా పడుకోదు. దిష్టి అయినా తియ్యలేను.

వాచస్పతి

ఎందు కలా బాధపడతావు?

సుప్రియ

ఎవ రా తలుపు?......నాగుండెలకు ఏదో పిలుపు!

(కుటీరద్వారంవెనుక మాంత్రికురాలు)

మాంత్రిక

నేను మాంత్రికను. మా అక్క నీహారిక శ్రావస్తిలో హేమంతరథ మెక్కి విజయం చేస్తున్నది. ఊళ్లోవాళ్లందరూ ఆమె దర్శనానికి కానుకలు తీసుకు రావాలి. 'ఊరుబేల' ఉద్యానందగ్గిరికి రావాలి.

సుప్రియ

కానుకలా ?

మాంత్రిక

ప్రియమై అమూల్యమైన మీ ఫలాలు.

వాచస్పతి

నీహారిక చల్లని తల్లి ! మానవకోటిరక్తం ఆ తల్లికి ఇష్టం !

సుప్రియ

నాన్నగారు ప్రవాహంలో ప్రతికెరటానికీ తల వొంచుతారు. మీ స్తిమితం నా కెలాగుండెను ఎలా వస్తుంది ?

మాంత్రిక

ప్రవాహవేగానికి తల వొంచకపోతే తలమునక లవుతుంది. మా అక్కగారి రాత్రిరథచక్రాన్ని ఎవ రాపగలరు ? నీహారిక రథారోహణం చేసి ఊరువేల ఉద్యానంలో ఊరేగుతుంది. ఆమె హోరుగాలిలో కొమ్మ లూపి, ఆకులు రాల్చుతుంది ! నేను శంఖం పూరించి 'ఓం హ్రీం' అనేసరికి రాలిన ఆకులు మా వశమై ధూళిపుప్పొడిలో దీనంగా పొర్లుతాయి ! తప్ప కుండా మీరు కానుకలతో రావాలి. ప్రతి హృద యమూ, ప్రతికుటీరమూ నైవేద్యము అర్పించాలి.

వాచస్పతి

(బాధలు అనుభవించి, అనుభవాతీతమైన కంఠం)

మాంత్రికురాలా ! నీవు అనాదిగా అదృశ్యంగా ఉంటూ మానవకోటిని వశం చేసుకొంటున్నావు. నీకు ఎదు రీదగలమా ?

సుప్రియ

నీహారికకు మా కానుకలే కావాలా ?

మాంత్రిక

ఓం హ్రీం— తప్పక కావాలి. హేమంత తుషారంవంటి మీ కన్నీటిజల్లుతో మా అక్క అభి షేకం చేసుకొంటుంది.

వాచస్పతి

సుప్రియా ! చిన్నదానివి ! ఆమెను మానవులు ఎదిరించలేరు. ఆ రథచారిణి ఎలాంటిదో నీ వెరగవు !

మాంత్రికురాలు శంఖారావం చేసేసరికి తీవ్రజంఝా మారుతం చెలరేగడం, మనం రాలడం, ఎండి ధూళిలో కలవడం జరుగుతుంది. మాంత్రికమాట తోసివెయ్యకు తల్లీ !

[మాంత్రికురాలు శంఖారవం చేస్తూ నిష్క్రమణ]

సుప్రియ

తండ్రీ, ఏదో కాచి వడపోసిన అనుభవం చెలు తావు. నీహారికాదేవి వినీలకైశికాలతో తన నేత్రాలు కనపడకుండా బంధించుకొని అంధకారం కోరుతుందట ! ఆ భయంకరమూర్తిని ఎలా దర్శించను తండ్రీ ?

వాచస్పతి

మే మంతా ఎలా దర్శిస్తామో అలాగే. వెర్రితల్లీ ! నీహారిక అంటే అంత భయ మెందుకమ్మా ?

సుప్రియ

అమ్మయ్యో ! రాలిపోయే తరుపర్ణాలతో విలా సంగా ఆడుకొంటుందా ?

వాచస్పతి

తల్లీ, ఆమెకు అదే విలాసక్రీడ !

సుప్రియ

ఆమె విలాసక్రీడ మానవులకు భయం కలిగిస్తుంది. ఏది ఎలా జరిగినా, మీరు స్తిమితంగా ఉండగలరు. ఈ హేమంతపరిదేవనం నా హృదయాన్ని కలచివేస్తు న్నది. నా చిన్నితల్లిని చూచుకొన్నకొద్దీ ఆరని తృప్తి, తీరని వేదన !

వాచస్పతి

శాక్యసింహుడు ఉండగా ఎందుకీ తపన తల్లీ ! వెళ్లు, త్వరగా వెళ్లు.

సుప్రియ

అయ్యో పిల్ల ! కదలదు, మెదలదు ! ఎంత పని చేశావే మాంత్రికా ! అయ్యో. మందు, మందు !

వాచస్పతి

తల్లీ, మందూ మాకూ పనిచెయ్యవు. నవ్వు పద. నేను రాలేను. శాక్యమునిపాదాలముందు నీ చిన్నారిని అర్పించు. ఆ స్నేహసింధువు ఏ మంటాడో ?

సుప్రియ

(పరుగెత్తిన చప్పుడు) మందు! నా బిడ్డకు మందు! శాక్యమునీ! స్నేహసింధూ!

[౨]

[సుప్రియ పర్ణను ఎత్తుకొని పరుగెడుతుంది. అందెల రవళి. ఆకుల మర్మరధ్వని]

సుప్రియ

అబ్బా, హోరుగాలి! నా తల్లీ! అబ్బా, నీహారికను ఎలా చూడను? అబ్బా, వినలేను రథచక్రరవం! వినలేను.

(దూరంగా రథధ్వని)

పాంథులు

ఘోష లహో, ఘోష లహో
రథ ఘోటక హేష లహో
ఆకుల పంకుల ఘోష లహో
ఘోష లహో, ఘోష లహో!

ఒక పాంథుడు

హిమదాహకీలలో
శిశిరంపు టార్తిలో
ఈ పర్ణబ్రతు కింక
ఏమౌ ఏ మయిపోనో!
నాళమే తెగిపోనో
రంగు లేమైపోనో
అందాల పరువమ్ము
అశ్రువుల పాలౌనో!

మరొక పాంథుడు

ఈ హేమంతశోణఫలాధరం శిశిరానలకరాసి చేటుకు తెగి పాంథ్యరక్తమై జాలిగా హరిదంతాక్రాంత మైనదే!

కవి

ఈ తరుపర్ణపాండిమ విరహకృశాంగి ప్రేయసీ శరీరకాంతి!

పాంథుడు

విధిజంఝాప్రభంజనధాటికి వశమై జీర్ణపర్ణాలు రణాగతి వేడుకొంటున్నాయి. ఏ నవవాసంతీకవో స్వాలింగనంకోసం వృక్షహృదయం తపిస్తున్నదో!

కవి

ఈ హేమంతప్రకృతి జగజ్జననీవసనం! మాంత్రికురాలు రంగులతో, రేఖలతో, రుచులతో, అల్లిన వసనం!

సుప్రియ

అబ్బా! ఈ హేమంతతుషారం! నా చిన్నతల్లిముఖంకూడా కనపడదే! మంచుజడికి చిన్నారికళ్లు మూసుకొనిపోతున్నాయి. నా గుండెల్లో ఎంత దాచుకొందా మన్నా నీహారిక లాక్కొంటే ఎలాగ? ఏం దారి! శాక్యమునీ! స్నేహసింధో, నువ్వే దిక్కు!

[3]

[శాక్యముని, సుప్రియ]

సుప్రియ

కృపాసింధూ! బుద్ధదేవా!

శాక్యముని

అలసి సొలసిన విహంగినివి తల్లీ...

సుప్రియ

అయ్యో, నా పర్ణ...పసికందు...ప్రాణం...

శాక్యముని

...ఊరుకో తల్లీ!

సుప్రియ

రెక్కలూడిన పక్షిని......నా కన్నతల్లిని బతికించాలి!

శాక్య ముని

వెర్రితల్లీ! ఈ శ్రావస్తిలో నిరుపేదకుటీరాల్లో గాని, సౌధాలలో గాని నీహారికారథనేమిధ్వానం, మాంత్రికురాలి శంఖారావం విననివాళ్లుంటే, వాళ్ళదగ్గర పిడికెడు ఆవాలు పట్టుకురా, వెళ్లు తల్లీ!

సుప్రియ

ఎందుకిలా పరీక్షిస్తావు తండ్రీ! నా చిన్నారిని నా కియ్యి తండ్రీ!

[౪]

[శ్రావస్తి. సుప్రియ ధనవంతుల గృహద్వారందగ్గిర]

సుప్రియ

ఎవరు తండ్రీ, ఎవరు తల్లీ, తలుపు తలుపు!

అబ్బా, హోరుగాలి ! పిల్లలు గలదాన్ని ! తియ్యండి తలుపు ! అబ్బా, పిలుపు వినబడనంత బాధిరమా ?

స్త్రీ కంఠం

ఎవ రమ్మా, ఉండు. (తలుపు తీస్తుంది) ఏం తల్లీ, ఇలా వచ్చావు ముసురులో ?

సుప్రియ

తల్లీ, నీహారి రథచక్రరవం విన్నావా? విన్నావా తల్లీ ?

స్త్రీ (ఇంట్లోనుంచి)

విన్నా నమ్మా విన్నాను. ఎన్నో సార్లు విన్నాను. ఎన్నో కానుకలు . ఆ తల్లి మాగృహంలోంచి తీసుకొన్నది.

పురుషుడు

వినవో వినవో ! రథచక్రారవ మదిగో !
వినవో వినవో ! రథచక్రారవ మదిగో !

సుప్రియ

అమ్మా, తలుపు తలుపు!

(ఇంట్లోనుంచి కంఠం)

ఎవరి దా పిలుపు ?

సుప్రియ

పేదసుందరిపిలుపు !

వృద్ధకంఠం

ఏ మిలా వచ్చావు సుప్రియా ! పిల్లదానికి సుస్తీ చేసిందా ?

సుప్రియ

చెప్పు తల్లీ, చెప్పవా ? విన్నావా రథచక్ర ధ్వానం—నీహారికరథధ్వానం !

వృద్ధకంఠం

ఏం తల్లీ ?

సుప్రియ

వెంటనే చెప్పు తల్లీ...శాక్యముని పిడికెడు ఆవాలు తీసుకు ర మ్మని......(డగ్గుత్తిక)

వృద్ధకంఠం

తరతరాలనుంచీ ప్రతిగృహంలో ప్రతిచెవికీ పాషాణరథనేమిధ్వని వినబడక తప్పదు. నా చేతి మీదుగా చెట్టంత కొడుకుల్ని దోసతోటలాటి ఇంత వాళ్ళను, అంతవాళ్ళను (రోదిస్తూ) నీహారికకు అర్పించాను. నా తల్లీ, మనచేతుల్లో ఏదీ లేదు !

సుప్రియ

ఏ యిల్లయినా...ఏ కుటీరం గానీ, ఎక్కడా చక్రధ్వని వినని......ఇల్లే...లేదా ? లేదా ?

వృద్ధకంఠం

పిచ్చితల్లీ ! ఊరుకో. శాక్యముని దయాశీతల సుధాహృదయం నీకు ఉపశాంతి కలిగిస్తుంది. వెళ్ళు.

సుప్రియ

శాక్యమునీ, ఎంత కఠినపరీక్ష ? ఏది దారి ? నీహారికా ! (కోపంతో దుఃఖం దిగమింగుతూ) ఓ శిశిరానిలకీలోజ్జ్వలకరాళీ ? క్రూరక్షుధార్తుభిత్తాట్టహాసీ ! అబ్బా ! మానవకోటిని నీ చతురంగపాళిలో ఓడించి, కరాళహాసంతో విలాసంగా అంధకారపేటికలో వేసుకొంటున్నావే !

[౫]

ఘోరు మని హోరు మని మ్రోగు రథనేమి !
భోరు మని భోరు మని రోదించు ఎదలూ !

సుప్రియ

కృపాసింధూ ! గృహమే లేదు...చక్రధ్వని వినని...రెక్క లూడిన పక్షిని...

శాక్యముని

ఏం తల్లీ, ఆవాలు పిడికెడయినా దొరకలేదా?

సుప్రియ

ఎందు కిలా పరీక్షిస్తావు తండ్రీ !

శాక్యముని

నీహారికను జయించి నీ పుత్రిక నిత్యమై వెలుగుతుంది.

సుప్రియ

ఈ తల్లిగుండె ఎంత తపిస్తున్నదో ఎరగవా ? కడుపుతీపి ఏం చెప్పను ?

శాక్యముని

రాలిన ఫలం మంటిలో బీజమై, వృక్షమై వసంతంలో దివ్యసుందర మవుతుంది. హిమానీజడశిశిర

కవాటం నీహారిక పాటవం చేస్తుంది. వెర్రితల్లీ, వసంతం విరియపుండా ఉంటుందా ? మిహికాద్వారంతో యాత్ర పరిసమాప్తి కాదు.

కొమ్మలమీద పక్షులు

రాలవే పర్ణమా, అలరుశోభల వీడి
అందాలు పోవిడిచి, అమరధామము పోవె, రాలవే.
రాల్పవే ఆశలను రగులు నీ మిహికలో
శిశిరానిలమ్మునకు శీర్ణమై పోతివే, రాలవే
కన్నీరు గుండెలో కలచి శిలయై పోయె
రాల్పవే మఱ్ఱుపుల్, రాలమై పోతిమే ! రాలవే

సుప్రియ

అమ్మయ్యో ! నీహారిక వస్తున్నది. ఇవ్వను ఇవ్వను నా పర్ణను. అమ్మో, కరాళకుంతలాలతో కన్నులు కట్టుకొన్నదే! మానవలోకం చూస్తే హృదయం కరుగుతుం దని భయమా ? మా రోదనం విన బడనంత బధిరవా ? నీహారికా ! ఎన్నిగుండెలమీద నీ రాతిరథం నడిపించావే ? (గాలిహోరు—రథచక్రం స్పర్శ చేస్తూ) అబ్బా, స్పందనం లేని జడశిశిరం !

ఎద పాషాణమె ఓ రథచారిణి ?
మా గుండెలు నీ మార్గమ్ము లటే ?
శిశిరకరాసిని దూసి కోసెదే ?
మా రక్తములే మధురము లగునా ?
మందారమ్ముల మంట కలిపెదే ?

నీహారిక

మానవరోదన మెంత మధురమో ! మాంత్రికా, రథం అవతరించి పర్ణను అందుకో.

మాంత్రిక (శంఖారవం)

ఏది సుప్రియా, నీ హృదయఫలం ?

సుప్రియ

నా పర్ణ ! నా గుండె ! ఇయ్యను, ఇయ్యను, నా బాలమందారాన్ని !

శాక్యముని

తల్లీ ! వినమ్మా తల్లీ ! నీ కుమారి వసంతవనీ కుసుమంగా కుసుమిస్తుంది. కల్పలతికాప్రసూనమై దివ్యపరిమళం విరజిమ్ముతుంది. నీహారికాజటి పరిణామం అప లేదు. మాంత్రికురాలు శంఖారవం చేస్తుంటే మృత్యు సంహారచక్రం తిరిగి పోక తప్పదు. రావమ్మ నా దగ్గరికి !

సుప్రియ (రుద్ధకంఠి)

బుద్ధం శరణం గచ్ఛామి, ధర్మం శరణం గచ్ఛామి ! సంఘం శరణం గచ్ఛామి, నమో తస్స భగవతో అహరతో సమ్మా సంబుద్ధస్స నమో......

నీహారిక

శ్రావస్తిలో మనకు లభించిన కానుకలు రథ చక్రాలకు కట్టు. సంతోషంతో ధైర్యంగా వాచస్పతి స్వయంగా కానుక అయినాడు. మాంత్రికా, రథ చక్రానికి కట్టెయ్యి.

మాంత్రిక

ఓం హ్రీం. (శంఖారవం) సరేనమ్మా !

నీహారిక (వికటహాసం)

జీర్ణశరుపర్ణాల బాధామంద్రగానం మధురం కాదే చెల్లెలా ?

మాంత్రిక

అక్కా ! నీ రథమార్గం హృదయరక్తాలతో సిక్తమై శోణమైంది !!

నీహారిక

నాకు హృదయరక్తం కావాలి.
హృదయాలలో నా ఆట !
మానవాశ్రువులలో నా జలక్రీడ !
రోదనమే కాహళి !
(దూరాన జనుల హాహాకారాలు)

స్వరమేళ

నమో తస్స భగవతో అరహతో సమ్మాసం బుద్ధస్స !

రథనేమి తడిసింది రాగరక్తాలతో
ముసిరింది ముసిరింది మూగగా తమసమ్ము.
పగిలింది పగిలింది పగిలింది ఒక్కగుండె.
శిశిరానిలమ్ములో శీర్ణమై పోయింది.
వాసంతమధువుకై పసరింది పసరింది.

# వెయ్యని శిక్ష

[కథానిక]

శ్రీ రా. సీ. ఆంజనేయశాస్త్రి

చాలాకాలంనుంచీ తీసుకుంటూఉండి యిప్పుడు చచ్చిపోవడంవల్ల రామయ్య భార్య మాణిక్యమ్మమృతి కెవరూ వ్యాఖ్యానాలు చెయ్యలేదు. లోలోపల ఏమి ఆవేదన పడుతున్నా, రామయ్యకైనా, భార్య మరణానికీ, తను చేసిన హత్యకూ సంబంధ మేమీ స్ఫురించలేదు. కాని నెల తిరక్కముందే, గిండీ ఇంజనీరింగ్ కాలేజీలో చదువుకుంటున్న అతని పెంపుడుకొడుకు సుదర్శనం ప్రమాదవశాత్తు ఎలెక్ట్రిక్ ట్రెయినులోంచి పడి మరణించాడని తంతివార్త రాగానే ఊరంతా "నిండుప్రాణం తీసిన ఉసురు..." అని నిర్ధారణగా చెప్పేశారు. రామయ్యకూ నమ్మక తప్పలేదు. అవును. తను తాసిల్దారు సుబ్రహ్మణ్యాన్ని చంపిన మాట వాస్తవమే. చంపాలని చంపలేదు. పదహారు వేలిస్తానన్నా ఒప్పుకోక, తనమీద "పర్మిటు లేకుండా బియ్యం రవాణాచేస్తున్నా"డనే కేసు పెట్టటానికి కూర్చున్నాడయ్యె! కేసే పడితే తను తలెత్తుకు తిరగగలడూ? బెదిరిద్దామనే ఉద్దేశంతో కర్రఎత్తినమాట నిజమే. నిర్లక్ష్యంగా నవ్వుతూ జీప్ కారెక్కి "ఇక పోనియ్యవోయ్ కాసిం" అనేసరికి ఒళ్ళు భగ్గుమంది. ఆలోచించటానికి టైమేదీ? వెయ్యనే వేశాడు దెబ్బ! అలా వచ్చాయి రోజులు! మాడు పగిలే పోవాలీ? సరే, చచ్చిపోయాడా పుణ్యాత్ముడు. తన నెవరూ అరెస్టు చేయలేదు. ఇదివరకటంత పెద్దమనిషిగానే తిరుగుతున్నాడిప్పుడూను. దొంగవ్యాపారం కూడా యథాపూర్వం చక్కగానే జరుగుతోంది... అయినా ఏదో బాధ, మంట, ఆవేదన ఎందుకు వేధించాలి తనని? ఆఖరికొక్కమాటైనా సుబ్రహ్మణ్యం తనకు కలలోకూడా కనపడలేదు. కాని క్షణక్షణమూ అతను తనను వెంబడించి "నన్నెందుకు చంపావు? ... నాపిల్లల గతేం కాను?... లంచం పుచ్చుకోకపోయినందుకు నాకు చావూనూ, అలాంటి నన్ను చంపిన నీకు స్వేచ్ఛానా?" అని ప్రశ్నిస్తున్నట్టు బాధపడుతున్నాడు. ఆ ప్రశ్నలకు సమాధానం భూతలంలో ఎక్కడా కనిపించలేదు రామయ్యకు. ఒక్కొక్కప్పుడు-అర్ధరాత్రివేళ పెనుభూతాలల్లే ఆప్రశ్నలు అతని గుండెలమీద ఎక్కికూర్చుని కంఠం పిసికి ఊపిరి సలపకుండా ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. సుబ్రహ్మణ్యం దగ్గరికే తను వెళ్ళగలిగితే తప్పంతా తనదేననీ, ఏ శిక్షకన్నా తల ఒగ్గుతాననీ చెప్పేసేవాడే! కాని అలాంటి అవకాశ మేమీ

యీ లోకంలో కనిపించేటట్టు లేదు. "హంతకుడను నేనే" నని పోలీసుస్టేషను కెళ్ళి చెప్పేద్దా మనుకున్నాడుకూడాను ఓ మాటు. తీరా వెళ్ళి చెబితే "వీడు పిచ్చివా" డని నెట్టేస్తారేమో! అంతకుముందే నలుగురు యానాదివాళ్ళను అరెస్టు చెయ్యడమూ, సుబ్రహ్మణ్యాన్ని చంపింది వాళ్లేనని కోర్టులో ఋజువవడమూ జరిగిందయ్యె! సెషన్సుజడ్జి కన్నా అసలువిషయం తెలియకపోదనీ, కేసు తప్పకుండా కొట్టేస్తాడనీ రామయ్య అనుకున్నాడు. కాని ఆయన హంతకులలో ఒకడికి ఉరిశిక్షా, తక్కిన ముగ్గురికీ యావజ్జీవ శిక్షా వేశాడు. ఆ సాయంత్రమే చెన్నపట్నంనుంచి తంతి ఒచ్చింది రామయ్యకు— "సుదర్శనం ఎలెక్ట్రిక్ రైలుకింద పడి చచ్చిపోయా" డని. అతనికి గంగవెర్రులెత్తాయి. కొడుకు పోయిన దుఃఖంకంటె నిరపరాధిని ఉరితీస్తారేమో ననే బాధ భరింపరానిదై పోయింది. శవాన్ని చూడటానికని పట్నం వెళ్లిన రామయ్య వారంరోజులయినా తిరిగి రాలేదు.

౨

అర్థబలంగాని, అంగబలంగాని ఏమాత్రమూ లేని యానాదులు హైకోర్టుకు అప్పీలుచేస్తారని ఎవరూ అనుకోలేదు. తన పేరు బయటికి రానియ్యవద్దని లాయరుతో ఎంత గట్టిగా చెప్పినా, ఊళ్లో మటుకు అందరికీ తెలిసిపోయింది-రామయ్యే అప్పీలుఖర్చంతా పెట్టుకుని ముద్దాయీలపక్షాన పనిచేశాడని. "ఎవడికోసం చేస్తాడు? లేకపోతే పురుగులు పడి చావడూ—ఏపాపమూ ఎరగనివాళ్లని ఉరితీయిస్తే!" అన్నారు జనం చాటుచాటుగా. హైకోర్టువారు కేసు కొట్టేశారు. విడుదలయిన యానాదులు నలుగురూ ఒచ్చి "ప్రాణం రక్షించిన ప్రభువులు మీరు!" అంటూ రామయ్యకాళ్లకు మొక్కితే, అతను దుఃఖం ఆపుకోలేకపోయాడు. ఎక్కెక్కిడుస్తూ, కన్నీళ్లు చాటుగా తుడుచుకుని, తలోవందా యిచ్చి "మీరసలు దొంగజాతుల లిస్టులో కెందుకొచ్చారు?... హాయిగా ఏపనన్నా చూసుకోండి..." అని పంపించేశాడు.

ప్రపంచంలోని బరువైన వస్తువులన్నీ తన ఎదురొమ్ముమీద ఎవరో పేరుస్తున్నట్టు కుంగిపోతున్న రామయ్యకు యానాదుల విడుదల ఒక విశ్రాంతిని కలగజేసినట్టనిపించింది. కుమారుని మరణంవల్లకూడా తను మరింత తేలికపడ్డానని తరవాత తెలుసుకున్నాడు. భార్యమరణంమటు కతని బాధ నేమీ తగ్గించలేదు. అప్పటికింకా, పోలీసువాళ్లు తనను పట్టుకుంటారేమో, పట్టుకుంటే ఎలా లంచాలిచ్చి తప్పించుకోవాలి, తీరా విచారణకే వస్తే జడ్జికికూడా చెప్పాల్సొస్తుందేమో అనే ఆలోచనల్లోనే ఉన్నాడు.

ఏకోర్టులూ వెయ్యలేని శిక్ష సంఘం వెయ్యగలదు. సంఘంకూడా వెయ్యలేని శిక్ష మనస్సు వెయ్యగలదు. భార్యా, కొడుకూ చావటంవల్ల రామయ్యకు తగిన శిక్ష వేసినట్లే నని సంఘం సరిపెట్టుకుంది ఒకవిధంగా. కాని సుబ్రహ్మణ్యం అవివాహితకుమార్తెల మాట తలపుకొచ్చి రామయ్య రోజూ అర్ధరాత్రివేళ్ల నానాహైరానా పడటంమాత్రం ఇదివరకు మాదిరిగానే జరుగుతూనే వుంది. ఎదో అవ్యక్తశక్తి గుండెలు పట్టుకుని ఊపి చెంపదెబ్బ కొట్టి, "ఒరేయి! రామయ్యా

తాసిల్దారును చంపి దిక్కులేనివాళ్లను చేశావుగదట్రా పాపం ఆ పిల్లల్ని. వాళ్లు పెళ్లీ పెటాకులూ లేకుండా, అన్నంమెతుకులకూడా మొహం వాచి అఘోరిస్తుంటే, నిశ్చింతగా నిద్రపోదా మనుకుంటున్నావా? లే వెధవా! నీకడుపు చీలుస్తా" అని తనను తరుముతున్న ట్లనిపిస్తుంది. లేచి కూర్చుంటాడు తప్పనిసరిగా. ఇలా తనను హింసించడం కంటే మామూలుకోర్టువారు ఉరిశిక్ష వేసినా బాగుండును, ఒక్క అరగంట బాధతో సరిపోయేది!

తను తన తండ్రికి పెంపుడు. తనకు పిల్లలు లేక తనూ మళ్లా పెంపుడుచేసుకున్న సుదర్శనం యిలా అయ్యె! ఇరుపార్శ్వాలా నా అనేవా ళ్లెవరూ లేరు. ఎందుకూ యీ అస్తుంతా? తగలేసుకోనా? ఈ అస్తుంతా ఎవరన్నా తీసుకుని తనకు మనశ్శాంతి ప్రసాదించరాదూ? అలాంటి శక్తిగలవాళ్లే ఉంటే ప్రపంచంలోని కోటీశ్వరులు నిశ్చింతతో ఎన్నిహత్యలన్నా చెయ్యొచ్చు!

3

తన తండ్రిని చంపిన రామయ్యను చూడటానికి సావిత్రి కెంతమాత్రమూ మనస్సొప్పలేదు యింతకాలమూను. చూసే వుంటే ఈపాటికే గరల్‌స్కూలులో ఉద్యోగం ఒచ్చేది. ఇక తప్పేటట్లు కనిపించలేదు. తండ్రి ఇన్సూరుచేసిపోయాడు కనక ఆ డబ్బుపెట్టుకుని యింతకాలం గుట్టుగా కాలం గడిపారు అప్పచెల్లెళ్లు నలుగురూ. ఇప్పుడా డబ్బు కాస్తా అయిపోయింది. నలుగురు కన్యలు మాత్రమే, వేరే మొగ సహాయంలేకుండా, ఒక యింట్లో కాపురం వుంటే ఊళ్ళో యువకుల కెంత తేలిక భావమో సాధారణంగా ఊహించవచ్చు. కాని తాసిల్దారు సంపాయించిపోయిన మంచి పేరునుబట్టి ఆ యిల్లింతవరకూ ఎలాంటి అల్లర్లకూ గురికాలేదు. పెళ్లిళ్లయి కాపురాలు చేసుకుంటున్న ముగ్గు రప్పల్లోనూ రెండోఆమె భర్త జిల్లాజడ్జి కావడంచేత కన్నూ మిన్నూ కానకుండా వుంది. వాళ్లు వీరి గడపే తొక్కరు. మూడోఆమెభర్త అతి సనాతనభావాలు కలవాడు. రజస్వలలయి ఏళ్ళు గడిచినా పెళ్లిళ్లు చేసుకోకుండా కూర్చున్న మరదళ్ళ నీడ పడితేనే సనాతనత్వమంతా మంట కలుస్తుందని వీళ్లని దాదాపు వెలివేశాడు. మొదటి అప్ప సంసారపక్షం. మేనరికంకూడానయ్యె! అడపాదడపా ఒచ్చిపోతూండటం కద్దుగాని నడుంకట్టుకు మరదళ్ళ పెళ్లిళ్లు చేసేటంత తాహతు కలవాడు మాత్రం కాదు ఆమెభర్త సాంబయ్య. ఉద్యోగంకోసం అంటూ చదవక పోయినా ఇల్లు గడవటానికి ఉద్యోగం చెయ్యాలిసొచ్చేసరి కా చదువే అక్కర కొచ్చింది సావిత్రికి. దరఖాస్తులో తన స్థితిగతులూ, తండ్రిపేరుప్రతిష్ఠలూ అన్నీ ఉదాహరించినా, సిఫారసు లేనిదే ఉద్యోగం రావటం అసంభవ మని తేలిపోయింది. రామయ్య ఆ కమిటీ ప్రెసిడెంటుతో ఒక్క నోటిమాట చెబితేచాలు, టక్కిన వేసి తీరాలి. అంత విలువ వుంది అతని మాటకు. అయితే తన పితృహంతకుడిని తా నెళ్లి అర్థిస్తుందా?

తన బావగారైన జిల్లాజడ్జిని ఒక్కమాటు చూస్తే ఎక్కడో అక్కడ ఉద్యోగం ఇప్పిస్తాడని మన స్సూరించిందికాని, తండ్రి

పోయినతర్వాత యింతవరకూ తిరిగన్నా చూడని అప్పగుమ్మంలో కెళ్లటంకన్నా రామయ్యను ఒకమాటు సాయంచేయమని కోరటమే మెరుగనిపించింది సావిత్రికి. ఆత్మాభిమానం గల చెల్లెళ్లూ అదే సలహా చెప్పారు. చచ్చిపోయిన తల్లినీ, చంపబడ్డ తండ్రినీ, నిర్లక్ష్యం చేసిన అప్పనూ, వెలేసిన బావనూ, తమ దుస్థితినీ తలచుకుని తెల్లవార్లూ దుఃఖం చటంవల్ల తెల్లవారకట్ల ఏం కునుకుపట్టిందో ఏమో పాపం, సావిత్రికి మెళుకువ వచ్చేసరికి బారెడు ప్రొద్దెక్కింది.

అప్పుడే రైలు దిగొచ్చిన సాంబయ్యను చూసి సావిత్రి బావురుమంది—"బావా! మా గతేమిటీ?" అంటూను. సహజంగా గంభీరస్వభావ అయిన సావిత్రి అంత బేలగా దుఃఖంచడం సాంబయ్యకే ఆశ్చర్యంవేసింది. అనుకున్నప్రకారం ఉద్యోగం రాలేదని మాత్రం గ్రహించాడు. అంతమాత్రానికే యింత బిగలాపడాలా?

"ఎందుకు సావిత్రీ అలా యిదవుతావు? సంగతేమిటి?" అన్నాడు సాంబయ్య.

"నా పితృహంతకుడిని 'భిక్షాం దేహి' అనాల్సిన దురవస్థ పట్టింది బావా" అంది సావిత్రి ఎక్కెక్కేడుస్తూను. సాంబయ్యకు సరిగా అర్థంకాలేదు. చిన్నమరదలు సరస్వతి చెప్పింది "రామయ్య సిఫార్సుచేస్తే గరల్ స్కూలులో ఉద్యోగం యిస్తారనే ఉద్దేశంతో అతన్ని చూడా లనుకుంటోంది అక్కయ్య" అని.

సాంబయ్య దీర్ఘనిశ్వాసం విడుస్తూ ఒక క్షణం ఆగి "నువ్వు వెళ్ళొద్దు సావిత్రీ. రామయ్యతో నేను మాట్లాడొస్తా" నన్నాడు. ఏదో భారం దిగిపోయినట్లు సావిత్రి తెరిపిగా చూస్తూ "అయితే ఇప్పుడే వెళ్లిరా బావా! పొద్దెక్కితే ఆయన ఊళ్లోకి పోతాడేమో" అంది.

'భిక్షాం దేహి!' అని తనడిగితే ఒకటీ, తన తరఫున మరొక రడిగితే ఒకటీనా? వేస్తే గీస్తే ఆ ధర్మదాత వేసే ముష్టి ఎలాగూ తనకేగా! ఏమిటో వెధవమనస్సు! పిచ్చి తృప్తి!!

సాంబయ్య వెళ్ళేసరికి రామయ్య మంచంమీద పడుకునే ఉన్నా డింకా. తెల్లవార్లూ అసలు నిద్దరేపట్టలేదట. కళ్లల్లో ఒత్తులేసుక్కూర్చున్నవాడు కూర్చున్నట్టే ఉన్నాడు ఉబ్బసం తెర రావడంవల్ల. తెల్లగా తెల్లారింతర్వాత కాస్త నడుంవాల్చాడు. కొంచెం కునుకుపట్టిందో, లేదో "కడుపులో మంట బాబోయ్" అంటూ లేచికూర్చున్నాడు. మళ్ళా దగ్గుతెర నిలవేసింది. ఓ మోతాదుమందు పుచ్చుకుని డాక్టరుకోసం నౌకరును పరిగెత్తించాడు. డాక్టరొచ్చి ఒక ఇంజెక్షనిచ్చి వెళ్ళేసరికి దగ్గు కాస్త తమాయించడంవల్ల మళ్లా కాస్త పడుకున్నాడు. బాగా వయస్సుమళ్లిన వంటమనిషీ, ఒకరిద్దరు నౌకర్లూ తప్ప యింట్లో ఎవరూ లేకపోవడంచేత దివాణంలాటి లోగిలి బావురుమంటోంది. ఆ ముసలమ్మ కాస్త దూరపు చుట్టంకూడా అవడంచేత కేవలం వంటమనిషిమాదిరి కాకుండా, కాస్తంత ఆదరంతో రామయ్యకు మందూ మాకూ యిస్తూ కనిపెట్టుకునివుంటోంది.

వ్యాధేమాత్రమూ ప్రమాదకరమైంది కాకపోయినా, అదేం చిత్రమోగాని, తా

నింకా ఆట్టేకాలం జీవించననే అధైర్యం పుట్టింది రామయ్యకు. వ్యాపారమంతా గుమాస్తాల కప్పగించేశాడు. "ఆస్తిపాస్తులేంచేద్దామా" అనే ఆలోచనలోకూడా పడ్డాడు. ఏ దేవస్థానానికో, సత్రానికో రాసి పారేస్తే ఆలోకంలో యిన్నిళ్లు పుట్టుతాయి. ఏమో! తనకే నమ్మకం లేకపోయింది! ఈలోకంలో యింత వ్యథ అనుభవించాడుకదా! ఆ లోకంలోమటుకు తననిది విడిచిపెడుతుందా? మళ్ళా ఓకుర్రాణ్ణి దత్తు చేసుకుంటే, నోట్లో యిన్ని నీళ్ళన్నా పోస్తాడు. ఏమో! ఎవరి కెన్నిరోజులు నీళ్లున్నాయో యీమట్టిమీద! సుదర్శనం నన్నువిడిచిపెట్టి వెళ్ళిపోలేదూ? ఇలాగే తీసుకుంటూ ఇంకా త నెంతకాలం బతకాల్సుందో! "పాపీ చిరాయుః" అన్నారు. తీరా నిక్షేపంలాంటి ఏకుర్రాడో యీ పాపిష్టివాడి చేతుల్లో పడగానే ఎగిరిపోతాడేమో!

తాసిల్దారుగారి కూతుళ్లు చాలా కష్టదశలో ఉన్నారని ఆనోటా ఆనోటా వింటున్నాడు తను. ఒక్కమాటు వెళ్లి వాళ్ల కాళ్లమీద పడి, క్షమార్పణ వేడి యీ ఆస్తంతా వాళ్ల కప్పజెప్పితే, తను మనశ్శాంతితో నిశ్చింతగా చావవచ్చు. కాని తనకు మొహం చెల్లుతుందీ వాళ్ల ఎదుట పడటానికి? పోనీ, ఎవరిచేతనన్నా కబురుచేస్తే? అవును. అది బాగానే వుంది... ఇవాళ సుబ్బయ్యను పంపాలి అనుకుంటాగాని, వాళ్ళ నిక్కడికి రమ్మని కబురుచేస్తే ఒస్తారూ? పోనీ, తనే వెళ్లితే... నమ్ముతారూ తనను? కాదుకాదు...వాళ్లపేర విల్లు రాసేసి.. ఆత్మహత్యచేసుకుంటే!... మళ్లీ దగ్గుతెరా...గుండెమంటా ఒచ్చింది... శ్రీరామరామా! పగవాడికికూడా ఒద్దురా బాబూ............

కళ్లు తెరిచి చూసేసరికి ఎదురుగుండా కుర్చీలో కొత్తాయ నెవరో కూర్చునివుండటం కనిపించింది. సాంబయ్య ఫలానా అని రామయ్యకు తెలీదు. ప్రశ్నార్థకంగా చూస్తున్న రామయ్యచూపులకు సాంబయ్య లేచి నిలబడి "...నేను సుబ్రహ్మణ్యంగారి అల్లుడినండి...అంటే...తాసీల్దారుగా యిక్కడ పని చేస్తుండగా, దొంగలు కొట్టి చంపారు చూశారూ, ఆ సుబ్రహ్మణ్యంగారికండి... నేను మేనల్లుణ్ణికూడాను......నా పేరు సాంబయ్య అంటారు...ఏదో...తమతో..." అర్థోక్తిలోనే రామయ్య ఇక ఆపమటూ సైగచేశాడు. తను అధికప్రసంగం చేశానేమోననీ, ఒచ్చినపని సానుకూలపడదేమోననీ భయపడ్డాడు సాంబయ్య. రామయ్య తల తిరిగిపోయినట్టయింది తా నెత్తిన కర్రా, వేసిన దెబ్బా, పగిలిన నెత్తీ, కారిన రక్తమూ...అన్నీ ఒక్కమాటు తెరమీద సినిమాచిత్రాలల్లే పరిగెత్తి కళ్లు బైర్లుకమ్మించాయి. సంతతధారగా కన్నీరు కారటం మొదలెట్టింది. సాక్షాత్తు సుబ్రహ్మణ్యమే ఎదటి కొచ్చినట్టనిపించింది-మేనమామపోలికలు తీర్చిదిద్దినట్లు, మేనల్లుడు సాంబయ్య మొహంలో స్పష్టంగా కనపడటంవల్లనో ఏమో! రామయ్య యింత జబ్బుస్థితిలో ఉన్నాడని తెలీదు తనకు. తెలిస్తే యిప్పుడొచ్చేవాడే కాదు. ఆయనకు కష్టం కలిగించేమాట తనైనా అన్న దేముంది? ఫలానా అని గుర్తుచెయ్యటానికి "దొంగలు కొట్టి చంపిన తాసిల్దారుగా"రని చెప్పాడు...... సిఫారసు చెయ్యకపోతే పోనీగాని...కొంప

తీసి నామీదా, మరదళ్లమీదా దెబ్బ తియ్యడుకదా!...పుట్టలోఉన్న తాచును లేవగొట్టాడేమిటి తను కర్మంకాలి! మనిషి రక్తం ఒకమాటు రుచిచూస్తే ఇక ఒదలరంటారుకూడాను......

ఏం ప్రమాదం మూడుతుందోనని కంగారుపడుతూ గాభరాగా ..."చిత్తం! ... నేను మనవిచేసేది..." అంటూ ఏమో చెప్పబోతున్న సాంబయ్యను మంచందగ్గిరిగా రమ్మని పిలిచి "...మీరు సుబ్రహ్మణ్యంగారి అల్లుడుగారా !... మేనల్లుళ్లకూడానా ..." అంటూ కావిలించుకున్నట్లుగా మీద చేతులేసి పసిపిల్లాడల్లే బావురు మన్నాడు రామయ్య."ఆయన్ను చంపిం దెవరో మీకు తెలీదూ?..." అన్నాడు ఏడుస్తూనే... సాంబయ్యకంగారు మరీ ఎక్కువైంది. అతను సమాధానం చెప్పకముందే రామయ్య —"మీకే కాదు ... ప్రపంచానికంతా తెలుసు. ఎవరికీ తెలియకపోయినా... ఆ పరమాత్ముడికి తెలుసు...ఆయనకూ తెలీకపోయినా ... చచ్చి స్వర్గానఉన్న ఆ సుబ్రహ్మణ్యంగారికి తెలుసు... కనీసం నాకన్నా తెలుసు సాంబయ్యగారూ... ఈ ఛండాలుడు కదూ ఆయన్ను చంపింది..." అని మళ్ళీ బావురుమన్నాడు.

"నావల్ల అపరాధమైతే..." నంటూ సాంబయ్య ఏమో చెప్పబోతూంటే అర్ధోక్తిలోనే రామయ్య అందుకుని "...ఎంతకాలమని కుమిలికుమిలి చావను సాంబయ్యగారూ!... క్షమార్పణ కోరుకుంటానికి కూడా నాకు మొహం చెల్లటంలేదు. ఆయన సాక్షాత్తు ధర్మరాజు. ఆయనే ఇప్పుడుంటే తనను హత్యచేసిన నన్ను తప్పకుండా క్షమించితీరేవాడు. నాకీ శిక్ష ఎంతకాలం? నన్ను క్షమించరూ? మీరూ, మీభార్యా, మరదళ్లూ—ఒకరేమిటి? సుబ్రహ్మణ్యంగారి రక్తస్పర్శ గలవాళ్లంతా నేను చిందించిన ఆయనరక్తాన్ని ఒక్కొక్క చుక్క తమ రక్తంలో కలుపుకుంటే నా యీచేతుల మరకలుపోతాయి..."అని ఆగాడు. సాంబయ్యకిలాంటి మాటలు వినడం యిదే మొదలు. అందులోనూ రామయ్యలాంటి లక్షాధికారి తనలాంటి బహుసామాన్యమైన మనిషి యెదుట యిలాంటి మాటలు మాట్లాడటం సాంబయ్యను ఉక్కిరిబిక్కిరి చేసింది. రామయ్య మాంచి ఆవేశంగా కనిపించాడు... కొంపదీసి సంధిచేస్త లేం కాదుకదా! ఏదో వ్యవహారసంబంధమైన విషయాలు మాట్లాడుకుంటున్నారేమోననే ఉద్దేశంతో, లోపల్నుంచి వంటమనిషిగాని, ముందు దొడ్లో పశువులకొట్టం బాగుచేస్తున్న పనివాళ్లుగాని యీవేపేమీ దృష్టి సారించలేదు. డాక్టర్ను దిగబెట్టి మందు కొనుక్కురాబోయిన నౌకరింకా తిరిగి రాలేదు.

నిర్ఘాంతపోయి చూస్తున్న సాంబయ్యను కుర్చీ మంచందగ్గిరిగా లాక్కుని కూర్చోమని చెప్పి... "మీమరదళ్ల కింకా పెళ్లిళ్లు కాలేదు కదూ!...అవును, ఎలా అవుతుంది? పెళ్లిచేసే తండ్రిని కాస్తా నేను పొట్టనపెట్టుకుంటిని..." అన్నాడు రామయ్య.

"తమ రలా ఏమిటోగా మాట్లాడుతున్నారు..." అన్నాడు కాస్త ధైర్యం తెచ్చుకుని సాంబయ్య... కన్నీళ్ల చారికలలా ఉండగానే శుష్కమైన ఒక చిరునవ్వ

నవ్వి ..."మీరేమీ భయపడకండి...నేను ఒళ్లు తెలిసే మాట్లాడుతున్నా ... మీ మామగార్ని చంపింది మొదలు నేను పడుతున్న నరకయాతన ఆ పరమాత్ముడికి తెలియాలి... నే నింక ఎక్కువరోజులు బతకను. మీకు తెలిసే ఉంటుంది...నా పెంపుడు కొడుకు రైలుకిందపడి చచ్చి పోయాడు...నా కేమీ చింత లేదిప్పుడు...." దగ్గుతెర కొద్దిగా ఒచ్చేసరికి ఒక క్షణం ఆగి మళ్ళా సాగించాడు రామయ్య:

"చూశారూ! ఆ పిల్లలకు మీరే మొగ దిక్కు...పైగా మేనత్తకొడుకులు మీరు... పెళ్లిళ్లూ, పేరంటాళ్లూ చెయ్యాల్సింది మీరు..." సాంబయ్య ఏదో చెప్పబోతే నందివ్వకుండా . రామయ్యే తను చెప్ప దలుచుకుంది పూర్తిచేశాడు...

"నాకు తెలుసు మీ స్థితిగతులు...నా స్థితిగతులూ మీకు తెలుసు...గుమాస్తాల దగ్గిర అన్ని వివరాలూ ఉన్నాయి—ఏఏ ఫ్యాక్టరీల్లో ఎన్నెన్ని భాగాలు నాకున్నాయో!...నగదంతా బ్యాంకులో వుంది....ఇనప్పెట్టెలో వెండి బంగారా లున్నాయి....అంతా మీపరం చేస్తున్నా.... మీరు తిన్నా, మీభార్యాపిల్లలకు పెట్టినా సుబ్రహ్మణ్యంగారి రక్తమే.......మరదళ్ల పెళ్లిళ్లుమటుకు చక్కని సంబంధాలు తెచ్చి చెయ్యండి....తండ్రిలేని లోపం తీర్చటం మీ తరం కాదు....బ్రహ్మతరంకూడా కాదు.... అయినా శక్తివంచన లేకుండా...మనుష్య ప్రయత్నంగా...."

...దగ్గుతెర కొంచెం తీవ్రంగా ఒచ్చిందీమాటు...కాస్త తమాయించిన తర్వాత "నా ఉత్తరాధికారిగా మిమ్మల్ని నియమిస్తూ కాగితం రాస్తున్నా" అన్నాడు.

సాంబయ్య దిగ్భ్రమ చెందాడు. "...మీరు మనుష్యులు కారు...సాక్షాత్తు.." ....అర్ధోక్తిలోనే రామయ్య అందుకుని "రాక్షసిని...."అన్నాడు.





# ప్రాచీనఖగోళము

## ౯. గ్రహములు

### శ్రీ వేలూరి శివరామశాస్త్రి

పురాణములు 'రాహువు సూర్య చంద్రులను గ్రసించును' అని చెప్పును. 'రాహువు పాము. అది బ్రహ్మవరదానబలమున సూర్యచంద్రుల నాచ్ఛాదించును' అని వసిష్ఠుడును, 'రాహువు తమోమయుడు. మేఘమువలె లేచి పర్వములందు చంద్రుని, సూర్యుని ఆచ్ఛాదించును' అని దేవలుడును చెప్పి రని ఉత్పలుడు వ్రాసెను.


చంద్రగ్రహణమునకును, సూర్యగ్రహణమునకును కారణము చెప్పబోవుచు ఆర్యభటుడు 'రాహువు కల్ల' అని అనెను. వరాహమిహిరుడు—'రాహువు సింహికకొడుకు. అసురుడు. అమృతము త్రాగబోవుచుండగా రాహువును జూచి విష్ణువు చక్రముచే వాని తల తరిగెను. అమృతస్పర్శచే రాహుప్రాణములు పోవలేదు గాని వానికి గ్రహత్వప్రాప్తి కలిగెను.' ఇట్లు చెప్పు ఈ పురాణములు నిజమైన రాహువు గ్రహమయినచో రవిచంద్రులకువలె దానికి బింబ మేల లేదు ? రాహువునకు బింబమున్న దని పౌరాణికు లందురుకదా ! అది మన కాకాశమున కనబడ దేల ? బ్రహ్మవరప్రభావమున రాహువునకు కారశీకటిత్వము కలుగుటవలన అమాపూర్ణిమేతరతిథులందు కనబడ దని వా రందురు. మరి కొందరాచార్యులు సింహికాసుతునకు రాహువునకు పడగయు, తోకయు గలవుగాని అవి విభక్తాంగములు అనియు, ఇంకకొందరు 'రాహువునకు మూర్తి లేదు. అత డంధకారమయు' డనియును అందురు. కాని రాహువునకు మూర్తి ఉండి—తలయే యుండుగాక, తోకయే యుండుగాక—నక్షత్రమండలమున నియతగతి యుండి, తిరుగాడుచో ఆరు రాసుల చాటున నుండియే చంద్రసూర్యులనుమాత్రమే ఏల గ్రసింపవలెను ? రాహువుగతి నియతము కాదని యందురా, గణితముచే అతనిగతి తెలియుచునే యున్నదే. అతనికి తలయు, తోకయునే యున్నవని యందురా, ఆరు రాసు లెడముగా నుండియే యేమి, రెండు రాసులు మూడు రాసులు ఎడముగా నుండియే గ్రసింపవచ్చునే. రాహువు పామని యందురా—ఆ పాము తలతో మింగనిండు, లేక తోకతో మింగనిండు—సర్పాకారమగు నతని శరీరము తలతోకల నడుమ నున్న రాశిచక్రమునందలి అర్ధాంశమును, అనగా ఆకాశములో సగమును ఏల యాచ్ఛాదింపదు ? కావున ఈ మాటల నన్నిటి నట్లుంచి తత్త్వము విచారింతము.

చంద్రగ్రహణసమయమున చంద్రుడు భూచ్ఛాయ నడుమను, సూర్యగ్రహణసమయమున సూర్యుని నడుమను ప్రవేశించును. సూర్యునినుండి ఏడవ రాశిలో భూచ్ఛాయ తిరుగుచుండును. చంద్రుడు పున్నమనా డచటికి వచ్చును. చంద్రుడును, భూచ్ఛాయయు తూరుపుదెసగా పోవుచుండును. భూచ్ఛాయకంటె చంద్రుడు వడిగా పోవును. ఇందువలన చంద్రుడు తూరుపుదిక్కుగుండ భూచ్ఛాయలో ప్రవేశించును.

సూర్యగ్రహణసమయమున చంద్రుడును, సూర్యుడును ఏకరాశిలో నుందురుకాని సూర్యునిక్రింద నున్న చంద్రుడు వడిగలవా డగుటవలన పడమటినుండి వచ్చి సూర్యు నాచ్ఛాదించును. ఇందువలన చంద్రునిలో పడమటి సగమునందును, సూర్యునిలో తూరుపు సగమునందును గ్రహణమున కారంభము సంభవింపదు.

ఇటు లగుచో నెలనెలకును చంద్రగ్రహణ మేల రాదు ? భూచ్ఛాయ మొదలు పెద్దది. చివర చిన్నది. చంద్రుడు సూర్యునుండి ఏడవ రాశిలో నుండి భూచ్ఛా

యకు ఉత్తరముగనో, దక్షిణముగనో దాటిపోవును. ఎక్కువదూరము పోవనిరెండలకే పూర్వాభిముఖుడై భూచ్ఛాయలో ప్రవేశించును. దించును. ఈ కారణమున దేశవిశేషమునందు సూర్య గ్రహణము సర్వగ్రహణముగను, ఖండగ్రహణముగను కనబడును. మబ్బు అడ్డు వచ్చినచో నూటిగా కింద



(సూర్యగ్రహణము)

చంద్రగ్రహణము అన్ని దేశములందును సమానముగనే కానిపించును. కాని సూర్యగ్రహణము దేశభేదముచే ఒకచోట కనబడును, ఒకచోట కనబడదు. దీనికి కారణ మేమి?

చంద్రుడు సూర్యునికిందుగా పడమటినుండి వచ్చిన మేఘఖండమువలె వచ్చి సూర్య చ్ఛా నున్నవారికి సూర్యుడు కనబడడు. అటులే సూర్య డ్డొ కానొక దేశములలో కనబడనేకనబడడు. మబ్బునకు నూటిగా కింద ఉండక పక్కలనున్న కొందరకు సూర్యునిలో సాబాలును, కొందరకు నాలవపాలును, మరికొందరకు పరకపాలును కనబడును. గ్రహణమును అంతియే 1.

1. ౧౮౬౮ సంవత్సరమున ప్రకటితమయిన తత్వబోధిని అను మాసపత్రిక-౧ సంచిక-పూర్ణ సూర్యగ్రహణమునుగురించి పెద్ద వ్యాసము వ్రాసెను. దానినుండి గ్రహింపబడిన యీ దిగువ విషయము ప్రకృతమున కుపయోగింపగలదు:—"మీఁద వ్రాసిన చరితలోఁ గనుపఱచిన సంపూర్ణగ్రహణకాలము (౧౮౪౨ సం. ఫ్రాంసు దేశమందలి పెర్పిన్యాన్ అనియెడు పట్టణమందుఁగలిగిన సంపూర్ణగ్రహణము) ౨ నిమిషముగా నుండియుండ, ఇపుడు మనము చూడఁబోవునది (౧౮౬౮ ఆగస్టు ౧౮) ౫ లేక ౬ నిమిషముల కాలముఁ గలదిగా నుంచున్నది. అధికముగాఁ జీఁకటిఁ గొన్న సంపూర్ణగ్రహణకాలము ౭ నిమిషములకుఁ బైఁబడనేరదు. రాఁగల సంపూర్ణగ్రహణకాలము అటు నిమిషములుగా నుండుటకుఁ గారణ మేమనఁగా ఆకాలమందు సూర్యుడు భూమికిఁ దుంగోచ్చస్థానమందును, చంద్రుఁడు అతిసమీపస్థానమందును బోవుచున్నారు. ఇంతటి దీర్ఘ సంపూర్ణగ్రహణకాలము సంభవించుట యరుదు. జనులకుఁ దెలిసియుండునటువంటి గ్రహణము లీవఱకు రెండే కలిగియున్న వని తెలియవచ్చుచున్నది. ఆ రెంటిలో ౧ ది క్రీస్తుజననమునకుముందు ౫౮౫-వ సంవత్సరము మే నెల ౨౮-వ తేది గ్రీసుదేశమందుఁ గలిగెను. అది యాదేశపు గొప్పపండితులలో నొక్కరగు థేలిసు అనువారిచే గణింపఁబడి యెల్లరకును దెలుపఁబడిరెను. రెండవది క్రీస్తుశకము ౧౭౩౩ సంవత్సరము జూలై నెల ౧౩-వ తేది స్కాట్లండు దేశమందుఁ గనఁబడెను. వీనినెల్లఁ దలంచిచూడఁగా నీలాటి గ్రహణము ఇఁక నెన్ని శతాబ్దములకుఁ దరువాత ఎంత యరుదుగా సంభవించునో దాని మీరే యెఱుంగవచ్చును. కనుక యీ వచ్చెడు గ్రహణమును అలక్ష్యము చేయఁగూడ దని మన సోదరులకు మన మెచ్చరింపవలసినది మన ధర్మముగా నున్నది.

ఈ సంపూర్ణగ్రహణముయొక్క నీడ శ్రావణ-బహుళ అమావాస్యనాఁ డుదయాన, ఆఫ్రికాఖండము యొక్క అబిసీనియా దేశమందలి కాండార్ అను పట్నమునొద్దఁ గలిగి తూర్పుముఖముగా బేబల్‌మాండెల్ జలసంధిని దాఁటి అరేబియా దేశమందలి మోకాఏడన్ పట్టణముల మార్గముగా యవనసముద్రమునందుఁ బ్రవేశించి సుమారు ౬ గంటలకు హిందూస్థానపర్యాయద్వీపము పశ్చిమభాగమం దుండు గోవా, కారవారుదుర్గము అను పట్టణముల నడుమ ప్రవేశించి తూర్పుగట్టున నుండు కృష్ణాగోదావరీముఖద్వారముల మార్గముగా భరతఖండ

మరియు చంద్రుని కాచ్ఛాదకమగు భూమి పెద్దది. దానజేసి అర్ధగ్రస్తమగు చంద్రుని కొమ్ము మొక్కపోయిన చందముగా కానిపించును. సూర్యు నాచ్ఛాదించు చంద్రబింబము చిన్నది. దానజేసి అర్ధగ్రస్తుఁ డగు సూర్యుని కొమ్ము తీక్ష్ణముగా కనబడును.

దివ్యజ్ఞానము గల ఆచార్యులు కొందరు గ్రహణమునకీ పై కారణములు చెప్పిరి. కావున గ్రహణమునకసలు కారణము రాహువు కాదు గీహువు కాదు. పైజెప్పినదే శాస్త్రమున కర్థము.

---

మును వదలిపెట్టి బంగాళాఖాతముపై వ్యాపించి అండమానుద్వీపములకు నుత్తరముగాఁ బోయి మెర్గ్యుకెన్నాసరము లోనగు స్థలములను మలేయా యను పర్యాయద్వీపమును గడచి సయాంసింధుశాఖలో ౧౭-౫౦ గంటల కించుకముందుగాఁ బ్రవేశించును. అచ్చట సంపూర్ణగ్రహణకాలము ఆఱుమ్ముక్కాలుగంట. పిదప నచ్చోటి నుండి వెడలి కాంబోడియాపట్టణమును దాటి చీనాసముద్రమున కవ్వల బొర్నియోద్వీపమందుఁ బ్రవేశించును. అవ్వల సిలిబీస్ ద్వీపములఁ గడచి న్యూగినియను ద్వీపముయొక్క దక్షిణభాగమును బొత్తిగా మూసి న్యూహెబ్రిడీస్ అను ద్వీపముమీఁద వ్యాపించును. ఆచోట సాయంకాల మూఁడుగంటలకు సంపూర్ణగ్రహణ మారంభించును. ఆమీఁదట గ్రహణము తెలియనేరదు.


పైనఁజెప్పిన నీడ హిందూపర్యాయద్వీపమునకు వచ్చునపుడు ౧౪౩ మయిళ్లు విరివి గలదిగా నుండును. ఆ ఛాయామధ్యరేఖ విజయదుర్గము, కోలాపురము, గుంటూరు, మచిలీబందరు మొదలయిన స్థలములకు సమీపముగాఁ బోవును. సంపూర్ణగ్రహణకాలము మచిలీబందరునందు ౫ నిమిషములను ౪౭ క్షణములను, గుంటూరున ౫ నిమిషములు ౪౨ క్షణములును, కర్నూలునందు ౪ నిమిషముల ౧౦ క్షణములనుగా నుండును.

సంపూర్ణగ్రహణచ్ఛాయయొక్క యుత్తరదక్షిణపరిణామము ముందు చెప్పినట్లు కొండార్ మొదలు న్యూహెబ్రిడీసు పర్యంతము రమారమి ౧౫౦ మైళ్లు గలదిగా నుండును. పార్శ్వగ్రహణముగా నిది ప్రపంచము లోని పలుభాగములకుఁ దెలియవచ్చును. ఆ భాగము లేవనఁగా భూమధ్యసముద్రముయొక్క తూర్పుభాగము, నీలసముద్రమున నొక భాగము, కాస్పియన్ సముద్రము, ఏషియామైనరు, అరేబియా, పారసీకము, భరతఖండము, చీనాదేశపు దక్షిణభాగము, టిబేత్తు, ఫిలిప్పైను ద్వీపములు, పసిఫిక్కు మహాసముద్రము కొంతభాగము, ఆఫ్రికా ఖండముయొక్క ప్రాగ్భాగము మెడగాస్కరునకు, మొరిషస్ బోర్బొన్ ద్వీపములు, ఆస్ట్రేలియా వాండిమెన్సులాండు మొదలగునవియే. ఈ సంపూర్ణగ్రహణమందు నక్షత్రములును, గ్రహములును సుమారు నలువదికిఁ గొఱవడక కనఁబడును. వానిలో ముఖ్యములు—అంగారకుఁడు, బుధుఁడు, శుక్రుఁడు, మృగవ్యాధుఁడు, కృత్తిక మొదలగునవి. ఇందులో శుక్రుఁడు సూర్యునికిఁ జక్కని పడమట నుచ్చస్థానములోఁ బ్రకాశించును. శుక్రునికిఁ గొంచెము త్తరపశ్చిమముల నంగారకుఁడు తెలియఁబడును. బుధుఁడు సూర్యునికి నించుక యీశాన్యమూలగాఁ జూపట్టును. నక్షత్రములలో గొప్పదైన మృగవ్యాధము శుక్రునికిఁ జక్కని దక్షిణమందు వెలుఁగును. వీనిలో శుక్రుని నెవ్వరు నెప్పుడును నుచ్చస్థానమందుఁ జూచియుండరుగాన నది మిక్కిలి యద్భుతమైన వింత.

ఇదివఱకు నుగ్గడించినదిగాక సంపూర్ణగ్రహణకాలమునందుఁ గలిగెడు నని శాస్త్రజ్ఞులు తెలిపియుండు నాలుగు వింతలు గలవు. వానిలో (౧) కప్పుసు, అనునది సూర్యునిపైఁ జీఁకటి మూసికొనివచ్చి సూర్యుఁడు విదియచంద్రరేఖయుంబోలెఁ దోఁచునపుడు ఆ రేఖాంతములు పీడి కానుపించును. (౨) బేలీబీట్సు, అనునది సంపూర్ణగ్రహణ మగుటకుఁ గొంచెము ముందుగా సూర్యునియొక్క దారములవంటి కిరణముల ప్రకాశము నడుమ, పలుచోట్లఁ దునియలయి జపమాలవలెఁ దెలియఁబడును. మీఁదఁజెప్పిన రెండును చంద్రునివద్ద నుండెడు కొండల యుచ్చస్థానములని ఛాయచేతఁ గలుగుచున్న వని చెప్పుచున్నారు. ఈ రెండు వినోదములును దూరదృష్టి ముకురముచేతనే చూడఁగూడును. (౩) కొరోనా, అనునది సూర్యునిమీఁదఁ జంద్రుని ఛాయ వ్యాపించి సూర్యుఁ డున్న చోటు నలుపుగాఁ బోయినతర్వాత దానిచుట్టును మండలాకారముగా నొక కాంతి తెలియును. ఆ కాంతి పలురంగులు గలదిగా నుండు నని కొందఱు చెప్పెదరు. అది నల్లని బింబమునకు సమీపమందు మిక్కిలి ప్రకాశమైయుండును. సూర్యుఁడు మఱిగియున్నపుడు వానిఁ జుట్టియుండు వాతావరణమందు సూర్యప్రకాశము

అటు లగుచో శ్రుతిస్మృతి సంహితావాక్యములు బొల్లులా ?

చంద్రుడు అమావాస్యనాడుగాని, పూర్ణిమనాడు గాని పాతమునకు దాపున లేనిచో గ్రహణము పట్టదు.



(చంద్రగ్రహణము)

“గ్రహణ సమయములయం దిచ్చు దానమును అగ్నిహవనమును బడసి రాహువు తృప్తిపొందుగాక, అని బ్రహ్మ రాహువునకు వర మొసగెను. గ్రహణసమయమున రాహువునకు చంద్రసూర్యసాన్నిధ్యము కలుగునుగావున లోకులు రాహువు చంద్రసూర్యులను మింగుచున్నా డని అనుకొందురు. ఇట్లు లనుకొనుటకు మరి యొక కారణమును గలదు. సూర్యుడు పోవుచుండు దారికి ఉత్తరముగను, దక్షిణముగను చంద్రునకు గమనము కలుగుటకు హేతువు చంద్రపాతము. లోకు లా చంద్రపాతమునుగూడ రాహు వని అందురు” అని వరాహమిహిరుడు వ్రాసెను.

చంద్రపాతమునకు రాహు వని పేరు. ఇందువలన గ్రహణముతో రాహువునకు సంబంధ మేర్పడెను2.

అన్ని దేశములందును నేటికిని శాస్త్రముతో (Science) లోకశ్రుతికిని, పురాణాదులకును ఐక్యమొందగూర్చు యత్నము సాగుచునే యున్నది. వరాహమిహిరుడు మొదలుకొని భాస్కరునివరకు గల సిద్ధాంతకర్తలు శ్రుతిస్మృతిసంహితలతో ఖగోళవిజ్ఞానమున కేకవాక్యతకొరకు మిగుల పాటుపడిరి. భాస్కరుడు గ్రహణమునకు కారణము శంకించుకొని శిరోమణి వాసనచే—“సూర్యుని ఆచ్ఛాదకముకంటె చంద్రుని యాచ్ఛాదకము పెద్దది. ఎటులనగా అర్ధఖండితమగు

పడుటవలన అది గలుగుచున్నది. సూర్యుడు మరుగుపడని కాలమందు వాని రశ్మిచేత నది లయ మగుచున్నదిగనుక నప్పుడు మనకుఁ దెలియకపోవుచున్నది. (౪) రెడ్ ప్రామినెన్సు-అనునది బయటఁ బిచుకఁబడియుండు జ్వాలికలు. వీనిలోఁ గొన్ని సూర్యునిఁ జేరియుండునట్లును, గొన్ని చేరకయుండునట్లు నుండును. ఇవి వివిధపరిమాణరూపములు గలవై కొండలవలెను, బట్టాకత్తులవలెను, గొలుసులవలెను గానఁబడును. వీనికిఁ గారణం బిద్ది యని యింక నెవ్వరుఁ గనిపట్టలేదు. తెలిసికొనుటకై జ్యోతిశ్శాస్త్రజ్ఞులు మిగుల గమనము గలవారై యున్నారు. ఇవి కట్టి కన్నులకుఁ దెలిసినను దెలియవచ్చును. గ్రహణకాలములందు సాధారణదూరదృష్టిముకురముల నుపయోగింపరాదు. ఉపయోగించినం గంట నిప్పుపడి కన్ను చెడిపోవును. మసి వర్ణమిచ్చిన యద్దములఁ గొనియేని, పొగచూపిన యద్దములఁ గొనికాని, లేక గ్రహణకాలమునకని యాయా తపతీచియుండు సాధనములచేతనైనను జూడవచ్చును.

2. ఐదు గ్రహములకు సమాగమము లేనిదే గ్రహణము పట్టదని వెనుకటివా రనుకొనెడివారు. ఇది మిథ్య. కొందరు—గ్రహణమునకు వెనుకటి అష్టమినాడు నీటిలో నూనెబొట్టు వైచెడివారు. అది ఏ దిక్కుగా ప్రసరించునో ఆ దిక్కున గ్రహణము పట్టు ననియు, ఏ దిక్కుగా ప్రసరింపదో ఆ దిక్కున మోక్ష మగు ననియు అనుకొనెడువారు. ఇదియు మిథ్య అని వరాహమిహిరుడు. పై జనశ్రుతిని ప్రమాణముగా స్వీకరించినవాడు వృద్ధగర్గుడు. ఉత్పలుని టీక చూ.

చంద్రుని కొమ్ములు మొక్కపోయినవిగను, సూర్యుని కొమ్ములు తీక్ష్ణముగను కనిపించును. మరియు చంద్రగ్రహణపు స్థితికాలము దీర్ఘము. సూర్యగ్రహణపు స్థితికాలము అల్పము. ఈ రెండు కారణములచే సూర్యునాచ్ఛాదించు రాహువు వేరు; చంద్రు నాచ్ఛాదించు రాహువు వేరు. సూర్యచ్ఛాదకము లఘువు. కావుననే సూర్యుని, చంద్రుని ఆచ్ఛాదించువాడొక రాహువే కాడు. కారణ మేమనగా, ఒకనికి తూరుపున స్పర్శ. మరియొకనికి పడమట స్పర్శ. సూర్యగ్రహణ మొకప్పుడు కలుగును. ఒకప్పుడు కలుగదు. మరియు నొకానొకప్పుడు అమావాస్యచివర. మరి యొకానొకప్పుడు అమావాస్యకు మొదట. కావుననే గ్రహణము రాహుకృతము కాదు. అటు కాక, రాహువు లనేకు లందమా, ఊహుం. అసలు రాహువే లేడు. ఇటులు కేవలము గోళవిద్యాభిమానులే పలుకుదురు.

కాని యీ మాట వేదబాహ్యము. పురాణబాహ్యము. సంహితాబాహ్యము. ఏలనగా సంహితలు రాహు వష్టమగ్రహ మని చెప్పెను. పురాణము— 'సూర్యుడు రాహుగ్రస్తు డయినప్పుడు నీ రెల్లయు గంగ. ద్విజు లెల్లరు బ్రహ్మలు. దాన మెల్లయు భూదానము' అని చెప్పెను3. మరి మాధ్యందినశ్రుతి— 'అసురుడగు రాహువు సూర్యుని చీకటిచే వేధించెను' అని వక్కాణించెను.4

అసలుసంగతి ఏమనగా, రాహుగతి అనియతము. అతడు తమోమయుడు. బ్రహ్మవరప్రదానముచే రాహువు భూచ్ఛాయలో జొచ్చి చంద్రుని ఆచ్ఛాదించును. చంద్రునిలో జొచ్చి సూర్యుని ఆచ్ఛాదించును. ఇటులు చెప్పినచో ఆగమము లన్నిటికిని విరోధము ఉండదు" అని వ్రాసెను. ఈ వ్యాఖ్యకు భాస్కరు డెంత తటపటాయించెనో అద్దములో కనబడినటులు కనబడుచున్నది. లోకశ్రుతిలో రాహువు ఛాయామాత్రుడు. సిద్ధాంతమునందు చంద్రపాతము. ఈ ఉభయార్థములను పురస్కరించుకొని రాహువుచుట్టును పురాణములు సుందరముగా భావనాఖేల నొనరించెను.

## వివిధ గ్రహణములు

సవ్యము, అపసవ్యము, లేహము, గ్రసనము, నిరోధము, అవమర్దనము, ఆరోహము, ఆఘ్రాతము, మధ్యతమస్కము, తమోహస్త్యము అని గ్రహణము పదివిధములు.

౧. సూర్యచంద్రులలో నెవరికేని దక్షిణమున గ్రహణ మారంభమాయెనేని అది సవ్యగ్రాసము.

౨. వామభాగమున నారంభమాయెనేని అది అపసవ్యగ్రాసము.5

3. చంద్రబింబముగాని, సూర్యబింబముగాని నలుదెసలను చీకటిపడియే ముక్తమగుచో అది లేహనగ్రాసము.

౪. బింబములో సగపాలుగాని, మూడవపాలుగాని, నాలవపాలుగాని గ్రస్తమగుచో గ్రసనగ్రాసము.

౫. బింబమునకు ఒక్క పెస నారంభమై పిదప బింబమంతయు ఆచ్ఛన్నమై నడుమ నల్లని ముద్దవలె కనిపించినచో అది నిరోధగ్రాసము.

౬. బింబమంతయు సంపూర్ణముగా ఆచ్ఛాదితమై కొంచెము సేపటులే యున్నచో అది అవమర్దనగ్రాసము.

౭. మోక్షమగుపిదప మరల రాహు వాచ్ఛాదించునేని అది ఆరోహణగ్రాసము.6

---

౩. సర్వం గంగాసమం తోయం సర్వే బ్రహ్మసమా ద్విజాః
సర్వం భూమిసమం దానం రాహుగ్రస్తే దివాకరే.

4. స్వర్భానుర్హ వా ఆసురః సూర్యగ్ం తమసా వివ్యాధ.

౫. ఛాయ చంద్రుని అగ్నికోణమున ప్రవేశించినచో సవ్యము. ఈశానకోణమున ప్రవేశించినచో అపసవ్యము. ఇక సూర్యుని వాయుకోణమున ప్రవేశించుచో సవ్యము. నైరృతకోణమున ప్రవేశించుచో అపసవ్యమని ఉత్పలుడు.

6. ఇటులు పూర్వశాస్త్రముల ననుసరించి వరాహుడు చెప్పెనేకాని ఇట్టి గ్రాసము గణితగోళయుక్తిచే సంభావ్యము కాదు, మరి యిది ఉత్పాతవిశేషము అని ఉత్పలుడు.

౮. నిశ్వాసాంధమగు నద్దమువలె బింబమునందే కొంచెముప్రదేశమైనా కనబడినచో అది అఘ్రాత గ్రాసము.

౯. నడుమ చీకటియు, నలు ప్రక్కల నైర్మల్యము నున్నచో అది మధ్యతమోగ్రాసము.[7]

౧౦. పరిధిపర్యంతమున దట్టముగను, మధ్య భాగమున కొలది దట్టముగను చీకటి కానిపించుచో అది తమోహస్తగ్రాసము.

## వివిధ మోక్షములు

౧. చంద్రగ్రహణ మగ్నికోణమున విడుదల యగుచో దక్షిణహనుమోక్షము.

౨. ఈశానకోణమున విడుదల యగుచో వామహనుమోక్షము.

౩. దక్షిణదిక్కున విడుదల యగుచో దక్షిణకుక్షి.

౪. ఉత్తరదిక్కున నగుచో వామకుక్షి.

౫. నైరృతకోణమున నగుచో దక్షిణపాయువు.

౬. వాయువ్యకోణమున నగుచో వామపాయువు.

౭. తూరుపున మొదలుపెట్టి తూరుపుననే విడచినచో సంఛర్దనము.

౮. తూర్పున పట్టి పడమట విడిచినచో జరణము.

౯. రెండట బింబమధ్యము ప్రకాశము పొందిన యెడల మధ్యవిదరణము.

౧౦. నడుమ చీకటియు అంతభాగమున నైర్మల్యమును ఉన్నచో అంత్యదరణము.

ఇవి యన్నియు సూర్యునియెడలను చెల్లునుగాని ఎచటెచట పైని 'చంద్రునకు తూర్పున' అని కలదో అచటనచట 'సూర్యునకు పడమట' అనియు, ఎచట నెచట 'చంద్రునకు దక్షిణమున' అని కలదో అచట నచట 'సూర్యునకు ఉత్తరమున' అనియు ఈరీతిగ మిగిలిన అన్నిటిని విపరీతముగ మార్చుకొనవలయును.


సూర్యచంద్రులకువలెనే మిగిలిన గ్రహములకును గ్రహణము సంభవించును. 'రవితోగాని, చంద్రునితోగాని ఒకరాశిలోనుండి అచటినుండి విక్షేపము కానిచో గ్రాహకము ఆచ్ఛాదించుటచేని ఆచ్ఛాదితమగు గ్రహముకూడ గ్రస్తమని చెప్పవచ్చును.' అని ఉత్పలు డనెను. ఈరీతిగా బుధునకును, అంగారకాదులకును గ్రాసము సంభవించును. చంద్రు డన్ని గ్రహములకును కింద నున్నాడు. ఇందువల్ల చంద్రుడు సూర్యుని గ్రసించినచందముగనే బుధాంగారకాదులనుకూడ గ్రసించును.

సూర్యునినుండి ఆరురాశుల దూరముగా భూచ్ఛాయ ఎల్లప్పుడును తిరుగుచుండును. కొన్ని అంశలమాత్ర మెక్కువ యైనను, తక్కువ యైనను భూచ్ఛాయతోగాని, సూర్యునితోగాని చంద్రపాత మెంక తావునకు వచ్చినయెడలనే గ్రహణము సంభవించు నని సూర్యసిద్ధాంతము. అమావాస్యాంతమునందు సూర్యచంద్రుల రాశి మొదలగునవి సమానము లగును. పౌర్ణమాస్యంతమునందు సూర్యచంద్రు లారురాసు లెడముగా నుందురు. కాని ఉభయుల అంశాదులును సమానము లగును. ఈ రెండు సమయములందును ఆచ్ఛాదింపబడు గ్రాహ్యముల వ్యాసకళలను, ఆచ్ఛాదకముల వ్యాసకళలను కలిపి వాని సగమునుండి చంద్రవిక్షేపమును తీసివేయగా మిగిలినది ఛన్నము. ఈ ప్రక్కపుటలోని ఛేద్యకము చూచునది.

భూచ్ఛాయ క్రాంతివృత్తమునందును, చంద్రుడు తాను తిరుగుమార్గమునందును, అనగా విమండలమునందును ఉన్నారు. చంద్రవిక్షేపము క్రాంతివృత్తమునుండి పరిమితముగానున్నది. ఈఛేద్యకమునందు చ భూ అనునది చంద్రవిక్షేపము. చంద్రబింబవ్యాసార్ధమును, భూచ్ఛాయావ్యాసార్ధమును కూడగా వచ్చిన ఫలము చంద్రబింబవ్యాసముతో సమానమగుచో చంద్రచ్ఛాయ స్పృశించునేకాని తన్మధ్యమున ప్రవేశింపదని తెలియు

7. ఇట్టి గ్రహణము సూర్యునికే సంభవించును. ఏలన, సూర్యుని కడ్డుతగులు చంద్రు డల్పుడు. చంద్రగ్రహణమునందు ఛాద్య్య డను చంద్రు డల్పుడు. ఛాదకమగు భూచ్ఛాయ పెద్దది. కావున ఇటులు చంద్రగ్రహణము పొసగుటకు వీలు లేదని ఉత్పలుండు.

చుచే యున్నది. అవకాశము ఛాద్యముకంటె అధిక మాదియైనేని సంపూర్ణ గ్రహణము సంభవించును. లేదా




చ = చంద్రుడు; భూఛా = భూచ్ఛాయ; పా = పాతము.

రముకంటె విక్షేప మధిక మాదియైనేని గ్రహణసంభవమే యుండదు.[8]

అశ్విన్యాదిలక్షితమగు సూర్యకక్ష్యయు, దానికి ఈషత్తిర్యగ్వేష్టితమగు చంద్రకక్ష్యయు బృహద్వృత్తములు గాన వాని సంపాతబిందువులగు రాహుకేతువులు పరస్పరము ఆరురాసుల యెడములో నుండురు. మేషాదిని రాహు వున్నచో తులాదిని కేతు వుండును. వృషభాదిని రాహు వున్నచో వృశ్చికాదిని కేతు వుండును. ఈ రాహుకేతువులకు సదా విలోమగతి. రవిచంద్రులకు సదా అనులోమగతి. రవిరాహువులు ౩౪౬'౬౨ దినములకొకసారి కలియుదురు. అట్టి రవిరాహులయు రవికేతువులయు గాని కలయిక యెడ అమాపూర్ణిమలు ఘటిసించినచో సూర్యచంద్రగ్రహణములు కలుగును. రాహుకేతువుల కలయిక కలిగినను అమాపూర్ణిమలు రానియెడలను, వచ్చినను, రాహుకేతువులతో కలయిక లేనియెడలను గ్రహణము పట్టనేరదు.

---

8. యదా గ్రహోఽర్కేణ చంద్రేణవా సహైకరాశౌ భవతి; తత్కృతివిక్షిప్తో నభవతి; తదా ఛాదనాత్ గ్రాహకస్య గ్రస్త ఇత్యుచ్యతే— 'ఉత్పలః'

9. సూర్యచంద్రుల కొంత దూరములోనేని రాహువు వుండవచ్చును. మరియు కలసియే యుండవచ్చును. కాని రాహుకేతువులు పరస్పరము సమసప్తకములో నుండురు.

# కాలము - మృత్యువు

●

శ్రీ చల్లా పిచ్చయ్యశాస్త్రి

బుధునిఁగాఁ జూపు నొకపఱి, మూఢుఁ జేతు
ధీరు నొనరింతు వొకతూఱి దీనునట్లు
సుందరుఁ బొనర్తు వొకతఱి చూడరోఁత
వక్తమునిఁ జేతు నటు మూఁగ వక్తఁగాను
బంటి నొనరింతు మఱి, మను బంటిగాను
కుంటు నొనరింతు జంఘాలికు నటు కుంటు
కాలమా! శారదాంబుదజాలమట్లు
మార్చుచుందువు జీవుల మఱుఁగు తెరను
కనులకింపౌ 'ప్రపంచరంగ'స్థలమున
దప్పఁ బ్రాయని కర్మ 'నాటక'మునందు
కొన్నిటి 'సుఖాంతము'గ మఱికొన్ని గలకు
టమ్ముచందమ్మునను 'విషా'దాంతముగను
కదలు పాత్రలె నీకు లోఁగుదురు మాఱు డ్రు.
దురును, భగవంతుఁ డొక్కమాదిరి మొ మెపు

మృత్యువా! నీదు నడయును మెచ్చనగును
గాత్రశోధక వివిధరోగముల దండు
బంపి నీవు ముందుగాఁ బ్రాణివర్గమందు
నిందముఖమున వెడలింతు బొందిప్రాణ
ములను 'లుబ్ధుల' 'మూఢు'ల'ఖలు'ల'వంచ
కు'లను 'ద్రోహు'ల'పరనిందకు'లను 'లాల
సుల'ను 'ధర్మ'విహీనులఁ దెలిసియేని
వారి ఛాయలకుం బోవ భయఁపడెదవు
'త్యాగు'లను 'యోగు'లను 'మహాభాగు
నిర్మలు'ల'దేవభక్తుల' 'ధర్మసత్య' [వ్రత''వి
దీక్షిత'పరోపకారు'ల దేశములను
వెదకి గాలించి మ్రింగెదు 'వృద్ధు'లగుచు
చావు చావనువారల సరసకీవు
సాగిపోలేవు కోర్కుల సందడులను
వృద్ధులను గోరు పిన్నల 'నింతలంతి'
లయిన 'కూన'ల 'గుజ్జు'ల నలరువారి
సందుగొందుల గాలించి సంభ్రమించి
పెద్దపులివలెఁ బైఁబడి ముద్దయట్లు
మ్రింగెదవు సర్వకాలము సంగదోష.
మాఁగిమణివలెఁ బొనరించి మన సెఱింగి
విశ్వరూపుని విశ్వాత్ము వేదవేద్యుఁ
దలఁచువారు మృకండుపుత్రనయురీతి
నిఁక జయింతురు తప్పక నిజము నిజము
లెక్కసేయరు వారికి మ్రొక్కులిడుము.

---

# విజయదశమి

[ఏకాంకిక]

## శ్రీ బులుసు వేంకటేశ్వర్లు

### మొదటి రంగము

[ప్రవేశము : సుపార్శ్వమహర్షి యాశ్రమ ప్రాంతమున తపోనిష్ఠతో మహిషీరూపమున దితి.]

దితి : ఓ బ్రహ్మదేవా ! నీ కింకను దయ లేదా ! అబలనైనను నీదర్శనము కోరి పంచాగ్ని మధ్యమున నిలిచి తపించుచున్నానే ! జాలి లేదా ? చతురాననా ! సన్నిధిసేయవా ? దీనదయాళూ ! రక్షింపవా ? వాణీ పతీ ! కృప చూపవా ? (ధ్యానించుచుండును)

సుపార్శ్వ : (ప్రవేశించి) ఏమిది ! భార్గవవంశ జాడ నగు నే నన్న నావంతయు భయము లేక నా తప మునకు విఘ్న మొనరింపబూనిన యీ మహిషి యెవరు ? ఆహా ! పంచాగ్ని మధ్యమున నిలచియున్న దే! పశువుల కింత నియమనిష్ఠ యుండునా ? ఎవరో యీ రూపమున దపస్సు చేయుచున్నట్లు తోచుచున్నది. తెలిసికొందును. (దివ్యదృష్టిని చూచి) ఓహో ! తెలిసినది, తెలిసినది. ఇంద్రాదులగు సవతికొడుకులు తన కొడుకులను బాఱద్రోలి మహావైభవ మనుభవించు చుండగా జూడలేక దేవతలను జయించు పుత్రుని బడయగోరి బ్రహ్మదేవునిగుఱించి తపముచేయు దితి యీమె. ఈమెకోరిక సిద్ధించెనా జగత్ప్రళయమే రాగలదు. ఏమి చేయుదును ? సరే. ఈమెతపమునకు విఘ్న మొనరింపబూనెదను. ఇదియు దేవహిత మగును. కావున దోషము లేదు. (సమీపించి) ఓ దితీ ! నీ కిదేమి పని ? కశ్యపప్రజాపతిభార్యవైన నీ కీ తపము లేల ? చాలించి పొమ్ము. అబలలకు మహాదోషము తపము. పొమ్ము, పొమ్ము.

దితి : (వినిపించుకొనక మహాదీక్షతో నుండును)

సుపార్శ్వ : (కోపముతో) ఏమి ! నన్ను జూచియు వందనమైన జేయకున్న దే ! భార్గవవంశజు నింత చులకన చేసిన యీ దితి నిపు డూరక విడుతునా ? (కమండలువులోని జలము చేతిలో పోసికొని) ఇదిగో ! ఈ దితికి జనించు కొడుకు మహాభయంకరుడై ఈమెచేష్టకు దగినట్లు మహిషుడై యుండుగాక ! (శాపజలము విడుచును.)

దితి : మునీశ్వరా ! నీ శాపము నాకు వర ప్రసాద మగుగాక ! ఎట్టికొడుకైనను నా కింద్రాదుల జయింపగలుగువా డగు నని వరమీయ వేడుదును.

సుపా : దితీ ! నీ కదియును సిద్ధింపగలదు. నీ తపము జగత్త్రయసంక్షోభకరముగా నున్నది. త్వరలో బ్రహ్మ సన్నిధిసేయగలడు. వర మాత డొసగును.

(నిష్క్ర)

దితి : ఓ కమలగర్భా ! కరుణింపుము. సృష్టి కర్తా ! ప్రత్యక్షము కమ్ము. నీ వీనాడు, నాకు దర్శన మీయనిచో నాశరీరమును ఈ హోమకుండమున విడుచుట తప్పదు. (ధ్యానించును)

బ్రహ్మ : (ప్రవేశించి) మానినీ ! చాలింపుము, చాలింపుము. నీతపమునకు మెచ్చితిని. వరము వేడుకొనుము.

దితి : ఓహో ! భగవానులా ! (నమస్కరించి) మహాత్మా ! నీ కెఱుగని దేమున్నది ? అదితిపుత్రులు నాపుత్రులను నిర్జించి నన్ను పుత్రశోకదృశ జేసినైచి

---

* కథాభాగము మార్కండేయపురాణాంతర్గతము ; కల్పనము సొంతము.

వారు. తాము దయయుంచి, యింద్రాదులను జయించి స్వర్గరాజ్యమును పాలింపగలుగు సమర్థుగు పుత్రు నను గ్రహింప బ్రార్థింతును. దేవా! సుపార్శ్వమహర్షి మహిషుడు నాకడుపున బుట్టుగాక యని శపించి యున్నాడు.

బ్రహ్మ: దితీ! సరియే. మహిషముఖము గలిగి నను సగము శరీరము నరశరీరుడై నీవు కోరనట్టి పుత్రుడు నీకు గలుగ వరమిచ్చితిని.

దితి: ధన్యాత్మను దేవా, ధన్యాత్మను!

బ్రహ్మ: నీ విక తపము చాలించి పొమ్ము. (అంతర్ధానమగును)

దితి: ధన్యాత్మను దేవా, ధన్యాత్మను!

(నిష్క్రమి)

## రెండవ రంగము

[ప్రవేశము: విద్యున్మాలి, విప్రచిత్తి యను రాక్షసులు.]

విద్యు: వత్సా! వింటివా, మన యదృష్ట వార్త!

విప్ర: ఏ మది?

విద్యు: దితితపమునకు మెచ్చి బ్రహ్మదేవుడు ప్రత్యక్షమై యింద్రాదుల నోడించు పుత్రుడు కలుగు నని వర మిచ్చియున్నాడుకదా!

విప్ర: ఔనౌను. తరువాత?

విద్యు: దితి గర్భము ధరించి పుత్రుని గన్నది. ఆతడు శుక్ల పక్షచంద్రునివలె వృద్ధిపొందుచున్నాడు.

విప్ర: సరే. మంచివార్త చెప్పితివి. మన కిదే యదను. మన సైన్యములను సిద్ధపఱచి యా మహిషా సురునికడ కరిగి యాతని యాధిపత్యమున స్వర్గముపై దండెత్తుదము.

విద్యు: వత్సా! బాగుగా గ్రహించితివి. నే ననబోవునదియు నదియే.

విప్ర: ఎన్నాళ్లనుండియో యెదురుచూచు చున్నాము. ఇక ఆలస్యము వలదు. మహిషునాధిపత్యమున మనకు మహావిజయము తప్పదు.

విద్యు: ఇంకను సందేహమా! మన దినములు పండినవి.

రాక్షసుడు: (ప్రవేశించి) ఎవరు వారు? విద్యున్మాలి విప్రచిత్తులా? మీ రింకను సిద్ధము కాలేరి?

విద్యు: ఎందుకు?

రాక్ష: మీ రింకను వినలేదా? మన పెద్దలు మహిషాసురుని దగ్గఱ కేగి యాతని వీరత్వమును గాంచి యాడి 'వత్సా, స్వర్గరాజ్యము మనది. విష్ణుమూర్తి బలము సాతగా గొని దేవతలు మనవారిని జంపి మన రాజ్య మపహరించియున్నారు. ఇప్పుడు మనము వారిపై దండెత్తి మన రాజ్యము మనము జయింపవల యును. కావున, ఈ దానవానీకమునకు నీవే ప్రభు వవై యుద్ధమునకు సిద్ధము కమ్ము. నీభుజబలమున స్వర్గము మనవశమగును. నీవే ముల్లోకములకు రాజ వగుదు' వని హెచ్చరించిరి. మహిషుడు వెంటనే సింహ నాదము చేసి మీమీ సైన్యముల గొనిరం డని మనకు వర్తమాన మంపినాడు. కావున, మీరును మీమీ సైన్య ములతో వెనువెంటనే బయలుదేఱవలయును.

విద్యు: వత్సా! వింటివా? మనము నిదుర బోయిన తీవయే వేలికి దగిలినట్లైనది. రమ్ము. త్వరగా బోవుదము.

విప్ర: ఆహా! నా కుడికన్ను నదరుచున్నది. జయము మనదే.

రాక్ష: రండు. రండు. తక్షణమే పోవల యును. (నిష్క్రమి)

## మూడవ రంగము

[ప్రవేశము: శివుడు, విష్ణువు.]

శివు: మధుసూదనా! వింటివికదా బ్రహ్మ దేవుడు దితి కిచ్చిన వరవిశేషము?

విష్ణు : పశుపతీ ! వింటిని, వింటిని. మహిషుడు జన్మించి పెరిగి పెద్దవాడై స్వర్గమును ముట్టడించుటకూడ వింటిని.

శివు : కొంతకాలము దేవతలకు మహిషుని బాధలు తప్పవు.

విష్ణు : ఔను. దేవతలకు గర్వభంగము కావలయును. అపుడు బుద్ధివచ్చి మనపాలికి వచ్చి మొఱలిడుదురు. అపుడు మహిషాసురవధకు మన ముపాయ మూహింతము.

శివు : ఔను. ఈపాటి కింద్రాదుల నాతడు మర్దించియే యుండును. స్వర్గరాజ్యము నాక్రమించి యా రక్కసుడు పాలించుచునే యుండును.

విష్ణు : సత్యమే.

(తెరలో కలకలము)

శివు : అదిగో ! ఈ సంక్షోభము దేవతలదే. వారికీపాటికి మంగళాష్టకములై కాందిశీకత ప్రాప్తించి యుండును.

విష్ణు : ఔనౌను. ఆ వచ్చువారు వారే. చూడుము. బృహస్పతిని బురస్కరించుకొని యింద్రాదు లిటే వచ్చుచున్నారు.

శివు : రానిమ్ము. మన మేమియు నెఱుగనట్లుందము.

[ప్రవేశము : బృహస్పతి, ఇంద్రుడు, దేవతలు]

బృహ : ఇంద్రా ! దేవతలారా ! ఇదిగో ! హరిహరు లిరువురు నిటనే యున్నారు. జయజయధ్వానములతో సమీపింతము.

అందఱు : జయము, జయము, త్రిలోకనాథులారా ! జయము, జయము. పరమేశ్వరా ! జయము, జయము. మధుసూదనా ! జయము. హరిహరులారా ! నమో నమః.

శివవిష్ణువులు : ఓహో ! బృహస్పతీ ! ఇంద్రాది దేవతలారా ! అభయము. అభయము, రండు. రండు.

బృహ : నిఖిలలోకాధినాథులారా ! మహిషాసురుడు సర్వసైన్యములతో దండెత్తి స్వర్గమును జయించి పరిపాలించుచున్నాడు. దేవాదిదేవులారా ! రణమున నోడి పరాభవ మంది పాలోమిని గోలుపోయి మీ యుభయుల పాదపద్మముల నాశ్రయించి యభయహస్తమును గోరుచున్న యింద్రు డితడు !

ఇంద్రు : హరిహరులారా ! రక్షింపుడు. రక్షింపుడు. నన్నా దురాత్ము డెన్నిపాట్లు పెట్టినాడో యా దైవమునకే తెలియుక. మహాత్ములారా ! ఎన్ని జన్మములకైనను నాకే క్రిమికీటకజన్మ మిచ్చినను బాధలేదు కాని యీయింద్రపదముమాత్రము వలదు. రక్షింపుడు. రక్షింపుడు. (హరిహరుల పాదముల మ్రోలబడును)

శివు : ఇంద్రా ! అధైర్యపడకుము.

విష్ణు : త్రిదివాధిపా ! దుఃఖింపకుము. దుఃఖింపకుము.

బృహ : హరిహరులారా ! ఆ దుష్టరాక్షసుడు తేజమున సూర్యుడై, కాంతిని జంద్రుడై, ప్రతాపమున నగ్నియునై ముల్లోకముల సంహరింప విజృంభించుచున్నాడు.

దేవతలు : మహాదేవులారా ! మాపడ్డపాట్లేమని విన్నవింతుము ? మామాట లెక్కయేల? ఆ రాక్షసాధిపతి యముని దీనుని జేసి, వరుణుని బాధించి, వాయుదేవుని బీడించి, కుబేరు నవమానించి, ఈశాను నేడ్పించి, సిద్ధసాధ్యగంధర్వులను బానిసలుగను, విద్యాధరాదుల బంటులుగను పనులుగొనుచు గర్వించి యున్నాడు.

ఇంద్రు : దేవాదిదేవులారా ! ఇక వేయునేల ! ఆ మహిషాసురుని బాధలవలన స్వర్గవాసు లెల్లరును గాందిశీకులై పోయిరి. త్రిదివ మంతయు రాక్షసమయమైనది. ఇక మీరే యుపేక్షించినచో మా మానప్రాణములు మాకు దక్కవు. మీపాదముల శరణు చొచ్చితిమి. వెంటనే దైత్యనాశనమున కుపాయ మూహించి మమ్ము రక్షింపుడు.

శివు : దేవతలారా ! ఇక ఆ మహిషాసురుని దినములు దగ్గఱకు వచ్చినవి. మన తేజోంశములచే దేవి

మూర్తి నవతరింప జేయుదము. నేనును, విష్ణుమూర్తియు మామా ప్రధాన తేజోంశముల విడిచెదము. మీ రెల్లరును మీమీ తేజోంశముల బ్రజ్వరిల్ల జేయుడు.

విష్ణు : అట్లే. (ధ్యానించి మహాతేజస్వియై మహాతేజము ప్రజ్వరిల్ల జేయును.)

శివు : (మహాకోపముతో విజృంభించి తేజోంశ ప్రజ్వరిల్ల జేయును.)

దేవతలు : (ధ్యానించి తమతమ తేజోంశముల నిర్గమింపజేయుదురు.)

బృహ : ఓహోహో ! ఏమిది ! ఈ మహాపురుషుల తేజోంశములచే దేవీమూర్తి యవతరించు చున్నదే ! ఆశ్చర్య మాశ్చర్యము. అదిగో ! రుద్రతేజమున ముఖము, యమతేజమున కేశజాలము, విష్ణుతేజమున భుజములు, చంద్రతేజమున స్తనములు, ఇంద్రతేజమున నడుము, వరుణతేజమున జంఘలు, భూమితేజమున జఘనము, విరించితేజమున చరణములు, సూర్యతేజమున పాదాంగుళులు, వసుతేజమున కరాంగుళులు—ఇట్లే యితరదేవతల తేజోంశముల నితరావయవములు కలుగ నిదే దేవి యవతరించి మహాతేజము విరజిమ్ముచున్నదే !

దేవి : (అవతరించి నిలచును)

అందఱు : జయము. జయము. దేవీ ! జయము. జయము.

శివు : మహిషాసురమథనమున కవతరించిన యీదేవి కిదే నా త్రిశూలమునుండి పుట్టించిన త్రిశూలము నిచ్చుచున్నాను. (ఇచ్చును.)

విష్ణు : నే నిదే నా చక్రమునుండి కలిగిన చక్ర మిచ్చుచున్నాను. (ఇచ్చును.)

వరుణుడు : ఇదే నేను శంఖ మిచ్చుచున్నాను. (ఇచ్చును)

అగ్ని : నేను శక్తి నిచ్చుచున్నాను. (ఇచ్చును)

వాయువు : నే నిదే బాణాసనము, బాణములు నిచ్చెదను. (ఇచ్చును.)

ఇంద్రుడు : నే నిదే వజ్రాయుధ మిచ్చెదను. (ఇచ్చును)

యముడు : నేను కాలదండ మిచ్చుచున్నాను. (ఇచ్చును)

ఇతరులు : మే మిదే మామా యాయుధము లిచ్చుచున్నాము. (ఇచ్చెదరు)

క్షీరసాగరము : (సాకారమై వచ్చి) నేను దేవి కిదే వివిధాభరణములు, తెల్లపద్మము నిచ్చెదను. (ఇచ్చును)

హిమవంతుడు : (ప్రవేశించి) నే నిదే ఈ పెద్ద సింహమును వాహనముగా నిచ్చుచున్నాను. (ఇచ్చును)

కుబేరుడు : నే నిదే మధుపూర్ణపాత్ర మిచ్చెదను. (ఇచ్చును)

శేషుడు : నేనిదే ఫణిహార మిచ్చెదను. (ఇచ్చును)

దేవి : (అన్నియు స్వీకరించి) హా ! హా ! హా ! హా ! హా ! (సింహనాదము చేయును.)

బృహ : ఏమిది ! దేవి సింహనాద మొనరించినంతనే భూమి గిరగిర తిరుగుచున్నది ! పాతాళము ఘూర్ణిల్లినది ; కులపర్వతములు సంచలించినవి ! దిగ్గజములు చాపకట్టుగా గూలినవి ! తారకలు రాలిపడినవి ! బ్రహ్మాండము విరుగక ద్రోగుచున్నది ! సప్తసముద్రములు కలగిపోయినవి ! ఓహోహో ! అద్భుత మద్భుతము !

దేవతలు : దేవీ ! జయము ! జయము ! దేవసంరక్షిణీ ! జయము ! జయము !

శివు : దేవతలారా ! విలంబము వలదు. మీ రందఱు దేవిని బురస్కరించుకొని మీమీ యాయుధములు ధరించి మహిషునిమీది కురవడింపుడు.

విష్ణు : దేవతలారా ! లక్ష్మణమే బయలుదేఱుడు. మీకు జయమగుగాక !

ఇంద్రుడు : త్రిలోకపతులారా ! ఇదే మీయాజ్ఞ గైకొని పోయి వచ్చెదము. దేవతలారా ! హరిహరులకు దండప్రణామము లాచరించి దేవీపురస్సరముగా యుద్ధమునకు బయలుదేరుదము.

దేవతలు : అట్లే! (అందఱు అట్లొనర్తురు)

దేవి : (సింహనాదము చేయుచు నిష్క్రమించును.)

దేవతలు : (దేవిని అనుసరింతురు.)

## నాలుగవ రంగము

[ప్రవేశము : మహిషాసురుడు, సేనాపతులు రాక్షసులు.]

మహి : రాక్షసవీరులారా! స్వర్గభోగములను మీయిష్టము వచ్చినట్లుగా ననుభవించుచున్నారు గదా!

రాక్ష : మహారాజా! నీదయవలన మాకోరిక లన్నియు సిద్ధించినవి. అందఱముకూడ ఇంద్రభోగమే యనుభవించుచున్నాము.

చక్షురాసురుడు : (ప్రవేశించి) మహారాజా! జయము. జయము. రాక్షసేశ్వరా! జయము. జయము.

మహి : ఓహో! చక్షురుడా? ఏమి విశేషము?

చక్షు : దేవా! మనచే నోడిపోయిన దేవతలెల్లరును తిరిగి మహాశోభిమణయైన యొక స్త్రీని ముందిడుకొని సింహనాదములు చేయుచు మనపై దండెత్తి వచ్చినారు. సర్వసైన్యములు నాయత్తపఱచి మనము వెంటనే వారి నెదుర్కొనవలయును.

మహి : ఛీ! ఛీ! సిగ్గులేని యీ దేవతలోక యోధులు దానిని ముందిడుకొని వచ్చుచున్నారా? రానిమ్ము. ఈసారి వారి కందఱకు ప్రాయశ్చిత్తము కాగలదు.

చక్షు : దేవా! ఆలస్యము వలదు. అదిగో! రాక్షసుల హాహాకారములు వినవచ్చుటలేదా? వేగిరింపుడు. ప్రభూ! వేగిరింపుడు.

మహి : సేనాపతులారా! వెంటనే సర్వసైన్యములతో దేవసమూహముల నెదుర్కొనుడు. చక్షురా! నీసైన్యముతో ముందు నీ వరుగుము.

చక్షు : చిత్తము. దేవా! (నిష్క్రమించును.)

మహి : మహాహనుడా! నీసైన్యముతో నీవు వానిని ననుసరింపుము.

మహా : చిత్తము, దేవా! (నిష్క్రమించును.)

మహి : ఓయీ! అసిలోమా! ఏబదిలక్షల రథములతో నీవు నడువుము. ఉగ్రదర్శనా! కోటిస్యందనములతో నీవు బయలుదేఱుము. బిడాలా! ఏనూఱుకోట్ల తేరులతో నీవును సిద్ధము కమ్ము. మిగిలిన సేనాపతులెల్లరును మీమీబలములతో బయలుదేఱుడు. నేను నిదే సిద్ధపడుచున్నాను.

సేనాపతులు : చిత్తము, దేవా!

(నిష్క్రమి)

మహి : ఏమిది! ఇంద్రవరుణయమకుబేరాది మహాయోధులే నా ధాటి కాగలేక పాఱిపోయిరికదా! ఇపుడు వారందఱొక్క స్త్రీని ముందిడుకొని యుద్ధమున కేతెంచుటలో నేదేని రహస్య మున్నదా? ఏమైన నేమి! ఈసరి సర్వదేవవినాశము తప్పదు. ఈ పాటికి రాక్షససైన్యములు, దేవసైన్యములు కలియబడి పోరు సాగించుచుండును. నేనును బోయి క్షణమాత్రములో శత్రుమారణ మొనరించెదను.

(నిష్క్రమి)

## ఐదవ రంగము

[ప్రవేశము : ఇద్దఱు విద్యాధరులు]

మొదటివాడు : మిత్రమా! చిత్రాంగదా! మన మిట నిలచి యొరులకు గనబడకుండ దేవదానవులకు జరుగుచున్న చిత్రయుద్ధము నరయుదము.

చిత్రా : ఔను. ఇచటనే నిలుచుట మంచిది. అప్రక్క నెందఱో నిలచి కనుగొనుచున్నారు.

మొదటి : అదిగో! మహిషసేనాపతు లెల్లరు తమతమ సేనలతో విజృంభించి దేవితో గలియబడినారు.

చిత్రా : చిత్రము, చిత్రము! దేవియాయుధములు క్షణమాత్రములో వారిని దునుమాడుచున్నవి. చూడుమదిగో! దేవి యింకను విజృంభించుచున్నది.

మొదటి : అదిగో! దేవీవాహనసింహము రాక్షసపటలిని నాశముచేసి వేయుచున్నది.

చిత్రా : దేవివిజృంభణము గని దేవసైన్యములు జయజయధ్వానములతో మిన్ను మిట్టుచున్నవి.

మొదటి : మిత్రమా ! ఆశ్చర్య మాశ్చర్యము ! త్రిశూలవిహారమున దానవుల జీర చీరి, గదాయుద్ధమున వారిని మోదిమోది, ఖడ్గవిద్యావిధమున రాక్షసకోటిని నఱికి నఱికి, శరాసనకళానిపుణత నామె రొందఱినో కూల్చి వేయుచున్న దికదా !

చిత్రా : అహో ! ఏమి యీ రణరంగవైభవము ! దేవి చేయు సింహనాదములకే గుండె లవిసి కూలు వారును, ఆమెగదాఘాతమున దలలు బ్రద్దలై పడు వారును, ఖడ్గప్రహారమున ఖండఖండములై పడిపోవు వారును—ఈరాక్షసు లిక నేమి చేయగలరు ?

మొదటి : అదిగో ! చక్షురాసురుడు మహా సేనాని—అతడు దేవి నెదుర్కొన్నాడు. అయ్యో ! దేవిని శరవర్షముచే గప్పివేసినాడే !

చిత్రా : చెలికాడా ! భయపడకుము. అదిగో! దేవివలన దనశేరు ముక్కలు కాగా, విల్లు పోడుము కాగా, అతడు శూలముతో దేవిని పొడుచుచున్నాడు.

మొదటి : చిత్రము. చిత్రము. దేవి వానిని ఖడ్గముతో ముక్కముక్కలు చేసివైచినది.

చిత్రా : అయ్యో ! బాష్కలుడు దేవివిల్లు త్రుంచివైచినాడు.

మొదటి : అదిగో ! మఱియొక విల్లు గైకొని యామె యొక్క బాణముతో వానిని గూలవేసినదే !

చిత్రా : మిత్రమా ! ఆమూల నది యేమి ! ఆ కోలాహల మేమి ?

మొదటి : అయ్యో ! దేవతలే హాహాకారములతో బరుగులిడుచున్నారే ! ఏమది?

చిత్రా : ఓహో ! తెలిసినది, తెలిసినది. ప్రధాన సేనాపతులతో సైన్యములు నశించుట జూచి మహిషాసురుడు విజృంభించి దేవతలను జెల్లాచెదరు గావించుచున్నాడు.

మొదటి : అదిగో ! దేవిని సమీపించినాడా రాక్షసుడు !

చిత్రా : అయ్యో ! అయ్యో ! ఆ దుర్మార్గుడు మహిషరూపమే పూర్తిగా ధరించి దేవగణములను బలువిధముల హింసించుచున్నాడు.

మొదటి : చూడు. ఆరాక్షసేశుని యాద్ధర్శ్యము ! ధూమ్యాకాశముల నంటుచున్న యాతని మహాకాయమున దారకలు రాలిపడుచున్నవి ! భూమి కదలిపోవుచున్నది. మహాపర్వతము లాతని దేహము దాకి ఛిన్నాభిన్నమగుచున్నవి. అతని వాలగుచ్ఛమున వనధులు పిండలిగుం డగుచున్నవి. అతని నిశ్వాసములచే గుల పర్వతములు చూర్ణములై పోవుచున్నవి ! జగములల్లాడి పోవుచున్నవి !

చిత్రా : మిత్రమా ! దేవి యాతని సమీపించినది. ఇక భయము లేదు.

మొదటి : ఆశ్చర్య మాశ్చర్యము ! దేవి ఆమహిషరూపమున నున్న దానవుని ఖండింప నాతడు వెంటనే సింహరూపము ధరించి దేవిపై కురుకుచున్నాడు.

చిత్రా : వినది. ఆ సింహరూపము దేవిబాణమున జీలిపోగా నరరూపము ధరించినాడా రాక్షసుడు !

మొదటి : చిత్రము. చిత్రము! దేవి యారూపమును జెండాడినది.

చిత్రా : ఏమేమి! ఆదుర్మార్గుడు మరల గజరూపమున దేవితో బోరుచున్నాడే ! (చూచి) ఆ రూపముకూడ దేవి నశింపజేయగా మరల మహిషాసురుడైనాడే !

మొదటి : అదిగో ! దేవి చిఱునవ్వుతో వాని బాణముల నుపేక్షించి మధుపానము చేయుచున్నది.

చిత్రా : ఆ దుర్మార్గుడిదే సమయ మని దేవిపై మహాపర్వతములు విసరుచున్నాడు. బాణవర్షము కురిపించుచున్నాడు.

మొదటి : ఏమైనను దేవి చలింపకున్నది. అది గదిగో ! దేవి విజృంభించుచున్నది !

చిత్రా : ఆశ్చర్య మాశ్చర్యము ! దేవి ఒక్కయొగు రెగిరి మహిషాసురుని కంఠము పట్టుకొన్నది. కాలిక్రిందకు జేర్చి త్రొక్కివేయుచున్నది !

మొదటి : ఇప్పుడుకూడ మహిషాసురుడు మొగ మెత్తి యింకను పెనగజొచ్చినాడే!

చిత్రా : ఇ కేమున్నది? వినది. దేవి వాని శిరము నొక్కుమ్మడి త్రుంచివేసినది. అదిగో! దేవిపై దేవతలు పుష్పవర్షము జయజయధ్వనులతో గురియించుచున్నారు.

మొదటి : రమ్ము. రమ్ము. మనముకూడ దేవిని చేరి నమస్కరింతము. (నిష్క్రమింతురు)

## ఆఱవ రంగము

[ప్రవేశము : దేవి, ఇంద్రాదిదేవతలు, ఋషులు, గంధర్వులు, బృహస్పతి.]

ఇంద్రు : దేవీ! జయము, జయము! మహిషాసురమర్దనీ! జయము, జయము! దేవసంరక్షణీ! జయము, జయము!

ఋషులు : దేవీ! సమస్తదేవతాంశలచే జనించి లోకసంరక్షణకై మహిషాసురుని రూపుమాపిన నీకివే మా నమస్కృతులు. (మ్రొక్కుదురు.)

గంధర్వులు : దేవీ! జయము. దేవీ! జయము. (గానము చేయుదురు)

దేవతాస్త్రీలు : (పుష్పములు దేవిపై జల్లుదురు)

బృహ : దేవీ! త్రిమూర్తులే నీరూపము, బలము నిట్టిదని పేర్కొనలేరన్నచో నే నెట్లు నిన్ను వర్ణింతును? తల్లీ! దయామయివై నీ విట్లే లోకముల సంరక్షింతువుగాక!

ఇంద్రు : దేవీ! నీ రూప మచింత్యము. నీ మహత్త్వము రిపుక్షయకారి. నీ చరిత్ర మద్భుతము. నీ వలననే మేము బ్రదికితిమి.

ఋషులు : జగజ్జననీ! నీవే స్వాహాస్వధానామముల దేవతలను, పితరులను తృప్తి పొందింతువు. మోక్షార్థులగు మహామునులు నిన్నాత్మవిద్య యందురు. సమస్తవేదములకు నీవే నిధివి. తల్లీ! నీవే సర్వశాస్త్రసారమవు. అంబా! హరిభుజాంతరవాసినైన లక్ష్మివి నీవే. శివుని సామేను గాంచిన పుణ్యాత్మవు నీవే! అమ్మా! జగములకు నీవే కారణమవు. త్రిగుణరూపము, మూలప్రకృతి యన్నియు నీవే! అట్టి నీకివే మా పునర్నమస్క్రియలు. (నమస్కరింతురు)

బృహ : దుర్గా! ఉత్తమపుణ్యపురుషులయందు లక్ష్మివై, బుధజనులయందు బుద్ధివై, పవిత్రులయందు లజ్జవై, బ్రాహ్మణప్రవరులయందు కాంతివై వెలుగొందు నీకివే నా వందనసహస్రములు. (మ్రొక్కును)

దేవతలు : దేవప్రాణప్రదాయినీ! కాళికా! నీ సమస్తాయుధములతో మాకు నిత్యము రక్షయొసగుము తల్లీ! నీపవిత్రరూపమును గైసేయనిమ్ము తల్లీ! నీ బిడ్డల మగు మ మ్మెప్పుడును గనికరింపుము.

(చందనము మున్నగు ననులేపనములతో, ధూప దీపాదులతో, కుసుమపరంపరతో దేవిని పూజింతురు.)

దేవి : వత్సలారా! మీమీ భక్తిప్రపత్తుల కానందించితిని. మీ కేమి వరము కావలయునో కోరుకొనుడు.

ఇంద్రు : మహేశ్వరీ! భువనకంటకుడైన మహిషాసురుని మర్దించితివి. రాక్షససర్వనాశన మొనరించితివి. అంతకన్న, తల్లీ, మాకు గావలసిన దేమున్నది? ఐనను, మాచే నీవు సంస్మరింపబడుచు మా యాపద లెల్ల బాపుచుండ బ్రార్థింతుము.

దేవి : అట్లే యగుగాక!

ఇంద్రు : అనుగ్రహించితివి. జననీ! సర్వలోకకంటకు డైన మహిషాసురమరణదిన మగు నేటి దశమి తిథి 'విజయదశమి' యన త్రిలోకప్రజలకు మహోత్సవదిన మగుగాక! ఏయేట నవరాత్రములు నిన్నుపాసించిన ప్రజలకు దశమదినసము సర్వవిజయము నొసగూర్చుగాక! ఈపర్వము త్రిలోకముల నాచంద్రార్కము వెలయుగాక!

దేవి : వత్సా! అట్లే యగుగాక!

బృహ : త్రిలోకజననీ! నీ భూతభవిష్యదవతారముల గుఱించి యొక్కింత తెలిపి మము ధన్యాత్ముల జేయ బ్రార్థించుచున్నాను.

దేవి : సురగురూ ! నీప్రశ్నమున కుత్తర మిచ్చెదను. సకలదేవగణములారా ! సావధానులరై నా యవతారవివరణము వినుడు.

అందఱు : మహేశ్వరీ ! సావధానులము. ఆనతీయ వేడెదము.

దేవి : వత్సలారా ! తొల్లి మధుకైటభులు కమలాసనుని జంప సంకింప మహామాయనైన నే నవతరించి ప్రేరించినకారణమున విష్ణువు వారల జంపియుండెను. పిమ్మట శుంభనిశుంభు లను రాక్షసుల జంపుటకై సప్తమాతృకలతో నావిర్భవించి యాపని నెఱవేర్చితిని. ఇక ముందు దుష్టరాక్షసు లగు శుంభనిశుంభులే మరల నుద్భవించినపుడు వారిని జంపుటకు నందగోపకులమున యశోదాగర్భమున జనించి వింధ్యాచలమున వసించుచు నాపని యొనగూర్చుకొని 'వింధ్యవాసిని' అన బరగెదను. మఱియు 'రౌద్ర' నామమున నవతరించి విప్రచిత్తిసంతతిని సమయజేసెద. తరువాత రక్తములగు దంతముల మహారాక్షసుల భక్షింప 'రక్తదంతి' యనునామమున నావిర్భవించెద. ఆపిమ్మట శతవర్షావగ్రహమున మునులు తల్లడమంద 'శతాక్షి' నామమున నేను జనించి శతనేత్రముల మునిగణముల గాపాడుదును. తరువాత, త్రిలోకప్రజలను నాశరీర జనితశాకాహారముల బోషించి 'శాకంభరి' యనుపేర బొప్పారుదును. ఇంకొకమాఱు దుర్గుడను రాక్షసుని జంప 'దుర్గా' నామమున నవతరింతును. మఱి యింకొకమాఱు 'భీమ' నామమున జనించి రాక్షసుల నడచి సంయముల గాపాడుదును. ఇంకొకమాఱు లోకకంటకుడగు భ్రమరాసురుని సంహరింప 'భ్రామరీ' నామమున జనియింతును. ఇంతేకాక, ఏయుగమున నేసమయముల నాసురీసంపత్తి పెచ్చుపెరిగి లోకములకు బాధ కలుగునో అప్పుడప్పుడు తప్పక నే నవతరించుచు దుష్టశిక్షణము, శిష్టరక్షణము చేయుచుందును.

అన్నిటికన్న నా కధికప్రీతికర మైనది మహిషాసురమర్దనము. న న్నాయానామములతో నెవ రెప్పుడు స్మరించి కీర్తించినను వారివారికి సకలకామ్యములు సిద్ధింపజేయుదును. నన్ను నిరసించినవారికి నిరయమే ప్రాప్తింపజేయుదును. ఈ నాచరిత్రము విన్నవారికి, కన్నవారికి సకలశుభములు నొడగూడును. మీ కెల్లరకు శుభ మగుగాక ! నే నిటే పోయి వచ్చెద.

(అంతర్ధాన మగును)

ఇంద్రు : ఆహా ! దేవి యంతర్ధాన మైనదే !

బృహ : ఇంద్రా ! ని న్నీ శుభతరుణమున మరల నింద్రాధిపత్యమున కభిషేకింతును. సర్వశుభములతో నీవు వెలుగొందుదువుగాక ! (అభిషేకించును)

అందఱు : (హర్ష ధ్వను లొనరింతురు.)

ఇంద్రు : గురుదేవా ! నీయనుగ్రహమున సర్వసంపదలను మరల నందితిని.

బృహ : నీకు గావలసినవరము గోరుకొనుము.

ఇంద్రు : దేవా ! ఇంతకన్న గావలసిన దేమి ! ఐనను, గోబ్రాహ్మణులకు శుభపరంపర యగుగాక ! మనకు లభించిన యీ విజయదశమి పర్వము త్రిలోకముల కేటేట బహుపర్వదిన మగుగాక !

(అందఱు నిష్క్రమింతురు.)

# లేములవాడ చాళుక్యులు

(ఆగస్టుసంచిక తరువాయి)

శ్రీ నేలటూరి వెంకటరమణయ్య

## ౬

### బద్దెగ : సోలదగండడు

మొదటి యరికేసరి యెంతవఱకు రాజ్యపరిపాలన మొనర్చెనో తెలియదు. ఇతని తరువాత నతని పెద్దకుమారుడగు మొదటి నరసింహదేవుడును, దరువాత నితని పుత్రుడగు రెండవ యుద్ధమల్లుడును రాజ్యము చేసిరి. వీరినిగురించి యేమియు దెలియదు; శాసనములందుగాని, విక్రమార్జునవిజయమునందుగాని వీరి విషయము, విశేషములు గానరాకపోవుటవల్ల వీరు సామాన్యు లని యెంచవలసియున్నది.

రెండవ యుద్ధమల్లుని యనంతర మతని కుమారుడు బద్దెగడు రాజ్యాభిషిక్తు డాయెను. ఇతనికి సోలదగండ డను బిరుదు గలదు. నలుపదిరెండు సంగ్రామములలో నితడు విజయ మందెనట. ఇతనిచే బరాజితులైన శత్రువులలో ముఖ్యుడు భీముడు. ఇతడు శత్రుదుర్జయుడు; 'మెంప శేయం పిడివంతరె నీరొళ్గొత్తి భీమన నతిగర్వదిం పిడిదొ' అని పంపడును, 'భీమం భీమపరాక్రమైకనిలయం తం హేలయై వాగ్రహీ దుగ్రం గ్రాహ మివాన్తరంబుసమకే దోర్విక్రమా ద్బద్దెగః' అని పర్భణిశాసనగ్రంథకర్తయు బ్రశంసించియుండుటవలన బద్దెగ డతనిని కష్టపడి సాధించె నని చెప్పవలసియున్నది.

ఈ భీము డెవ్వడో గుర్తింపవలసియున్నది. మొదట బద్దెగడు వెలసిన కాలము నిశ్చయముగ దెలిసిన గాని భీముని యానవాలుపట్టుటకు సాధ్యము గాదు. బద్దెగని శాసనములు లేవు. అతని కాలమున కచ్చితముగ దెలియజేయు నాధారములును గానరావు. కాని యతని పూర్వికులయొక్కయు, సంతతివారియొక్కయు వృత్తాంతముల మూలమున నితడు మనిన కాల మిది యని యూహించుట కవకాశము గలదు. ఇతని ముత్తాతయగు మొదటి యరికేసరి నిరుపమదేవ ధ్రువునికి సమకాలికు డని పూర్వప్రకరణమున వ్రాసియున్నాడను. మఱియు ధ్రువుడు క్రీ. శ. ౭౮౦ మొదలు ౭౯౩ వఱకును పృథ్వీపరిపాలన మొనర్చియుండుటచేతను, మొదటి యరికేసరి సోదరుడైన వీరగ్రహుడు పై ధ్రువుని కుమారుడగు ముమ్మడి గోవిందచక్రవర్తి కనుగు చెలికాడగుటచేతను[1] మొదటి యరికేసరి క్రీస్తుశకము ఎనిమిదవ శతాబ్దముయొక్క చతుర్థపాదమునందు, అనగా క్రీ. శ. ౭౭౫-౮౦౦ ల మధ్యకాలమున వర్ధిల్లె నని నిశ్చయింపవచ్చును. బద్దెగ డరికేసరికి నాలవతరమువా డగుటచేత చరిత్రపరిశోధకుల యంగీకారమును బొందిన పద్ధతిబడి తరమునకు ౨౫ సంవత్సరములచొప్పున పరిగణించిచూచిన నతడు క్రీ. శ. ౮౫౦ మొదలు ౮౭౫ పర్యంతమును రాజ్యము చేసియుండు నని చెప్పవలసియున్నది. మఱియొకవిధమున లెక్కచేసి చూచినను పై యూహయే సరియైన దని తేలుచున్నది. బద్దెగని మునిమనుమడు ఇమ్మడియరికేసరి. ఇతడు క్రీ. శ. ౯౩౦-౯౩౬ ల మధ్యరాజ్యము పాలించిన నాల్గవ గోవిందరాజునకు సమకాలికుడు. ఇమ్మడి యరికేసరితండ్రియు, బద్దెగని మనుమడును నైన ఇమ్మడి నరసింహుడు క్రీ. శ. ౯౧౪ నుండి ౯౩౦ వఱకును రాష్ట్రకూట సామ్రాజ్యమును పాలించిన ముమ్మడి ఇంద్రవల్లభుని సామంతుడు. కావున నతడించుమించు క్రీ. శ. ౯౦౫

1. క్రీ. శే. రావుబహదూరు సి. ఆర్. కె. చార్లు గారి తెలింగాణశాసనములు. రాష్ట్రకూటగోవిందుని శాసనము. (అముద్రితము)

మొదలు ౯౩౦ వఱకును ప్రభుత్వము సల్పె ననుట యొప్పును. ఇమ్మడి నరసింహుని తండ్రియు, బద్దెగని పుత్రుడును నగు నిమ్మడి యుద్ధమల్లుడు క్రీ. శ. ౮౮౦-౯౦౫ ల మధ్య నుండె నని చెప్పవలసియున్నది. ఈ లెక్కప్రకారము చూచినను బద్దెగని కాలము క్రీ. శ. ౮౪౪ - ౮౮౦ అగుచున్నది. పై రెండు పరిగణనల ప్రకారము బద్దెగని కాలము క్రీ. శ. ౯ వ శతాబ్ది తృతీయపాదమని తేలుచున్నను నతడు కొంచెమించుమించుగ నీ శతాబ్దాంతమువఱకును జీవించియుండె నని తలచుట కవకాశము గలదు. క్రీ. శ. ౮౪౮ నుండి ౮౯౨ దాక వేంగిని పాలించిన పూర్వచాళుక్యగుణగవిజయాదిత్యు డొక బద్దెగని కభయ మిచ్చి రక్షించెనని పూర్వచాళుక్యశాసనములవలన దెలియవచ్చుచున్నది.

"అబ్దా త్సంగ్రామరంగే నిజబలసదసీనా
మంగిరాజో త్తమాంగం
తుంగాద్రేః శృంగ మర్వాక్ మకనిరివ మదా
పాతయత్కన్నరాజ్యాత్,
నిశ్శంకం పంకిలేన ప్రథితజనపదా
ద్దుర్గమా న్నిర్గమయ్య
ద్రాఘ్గావం యః ప్రవేశ్య ప్రభు రభయమనాః
ప్రత్యప ద్బద్దెగాఖ్యాత్ 1-a."

ఈ శ్లోకమునందు పేర్కొనబడిన బద్దెగడు సోలదగండబద్దెగ డే యని గవర్నమెంటు శాసనపరిశోధక శాఖవారు తీర్మానించియున్నారు 2. ఈ వ్యక్తినిర్ణయము సరియైనదే యని చరిత్రపరిశోధకులు అంగీకరించియున్నారు. పై జెప్పినరీతిని గుణగవిజయాదిత్యునిచే సోలదగండ డభయప్రదానమును బడసియుండినచో నతడు క్రీ. శ. ౮౮౦ తరువాతగూడ కొంత కాలము జీవించియుండె నని చెప్పవలసియున్నది ; ఏలనగా, పై నుదాహరింపబడిన శ్లోకము గుణగునిచే బద్దెగడు పరాజయము నందినది గుణగుని రాజ్యకాలము నందలి చరమదశయం దని సూచించుచున్నది. అందు మంగి మొదలగువారిపై విజయములు పూర్వాపరములను దప్పనీయక కాలక్రమము ననుసరించి వర్ణింపబడినవి. మొదట గుణగుడు మంగి నోడించెను ; పిమ్మట కన్నరసంకిలులను ; తరువాత బద్దెగని. వీరిలో మంగి నొలంబాధిపతి; కన్నరుడు రాష్ట్రకూటచక్రవర్తి; కృష్ణవల్లభుడను నది యితని సరియైన పేరు. రాష్ట్రకూటచక్రవర్తులందీ పేరింటివారిలో నితడు రెండవవాడగుటచే నితనిని జరిత్రకారు లిమ్మడి కృష్ణవల్లభు డందురు. సంకిలి హైహయవంశజు డను చేదిరాజు ; ఇమ్మడి కృష్ణవల్లభుని బావమఱది ; పూర్వచాళుక్యులతోడి పోరాటమున నిమ్మడి కృష్ణవల్లభునకు కుడిభుజము. బద్దెగడు రాష్ట్రకూటచక్రవర్తుల కాశ్రితుడగు సామంతుడగుటచే నతని యోటమియు గన్నర గుణగవిజయాదిత్యుల యుద్ధ సందర్భముననే గలిగె నని తలచుట యొప్పు. ఇమ్మడి కృష్ణవల్లభుడు తన తండ్రియగు ప్రథమామోఘవర్ష చక్రవర్తి మరణానంతరము క్రీ. శ. ౮౮౦ లో గద్దె నెక్కెను. తత్పూర్వ మతనికి గుణగవిజయాదిత్యునితో ఘర్షణ గలిగె నని తలచుటకు దగిన సాక్ష్య మెద్దియు లేదు. గుణగవిజయాదిత్యుడు క్రీ. శ. ౮౯౨ లో మృతి నందియుండుటచేత కన్నరసంకిలిబద్దెగులపై నతని విజయములు తత్పూర్వమే సంప్రాప్తములై యుండవలయును. అనగా పై విజయములు క్రీ. శ. ౮౮౦-౮౯౨ లమధ్య గలిగినవని తేలుచున్నది. కావున బద్దెగడు ౮౮౦-౮౯౨ల మధ్య తన మండలము నేలుచుండె నని చెప్పవలసియున్నది.

అప్పటి రాజులలో భీమనామధేయు డొక్కడే కానవచ్చుచున్నాడు. అతడు వేంగిరాజ్యాధిపతియైన ప్రథమచాళుక్యభీముడు. ఇతడు క్రీ. శ. ౮౯౨ లో దన పెదతండ్రియైన గుణగవిజయాదిత్యు డస్తంగతు డైనపిమ్మట వేంగిసింహాసనము నధిష్ఠించెను. ఇతడు బద్దెగనిచే బట్టువడియుండిన నది యితడు రాజ్యాధిపత్యమును వహించిన తరువాతనై యుండవలయును. ఈ యూహ సమంజసమేని బద్దెగడు క్రీ. శ. ౮౯౨ వ సంవత్సరమునకు తరువాతగూడ కొంతకాలము జీవించియుండె నని యొప్పుకొనకతప్పదు.

---

1-a. Cp. no. 26 of 1937-38, JAHRS. XI. P. 80 F.

2. ARE 1918, part II, para 5

బద్దెగనికి ప్రథమచాళుక్యభీమునితో కలహము పొసగుటకు ముఖ్యకారణములు రెండు కానవచ్చుచున్నవి. అతడు రాష్ట్రకూటుల కాశ్రితుడైన మాండలిక ప్రభు వని పైన నుడివియున్నాడను. రాష్ట్రకూటులకును, పూర్వచాళుక్యులకును నిరంతరములనుండియు జరిగి వచ్చుచుండిన పగవలన గలుగుచుండిన యుద్ధములలో బద్దెగనికోవవారు రెండు రాజ్యముల నడిమి గడిభూముల కధిపతులై యుండిన కారణమువలన రాష్ట్రకూటచక్రవర్తుల పక్షమున పూర్వచాళుక్యులతో దలపడుగ పోట్లాడవలసి వచ్చెను.

రాష్ట్రకూట ఇమ్మడి కృష్ణవల్లభుడు దన పూర్వుల పద్ధతి ననుసరించి పూర్వచాళుక్యరాజ్యముపై దండయాత్రలు సలుప నారంభించెను. కాని ఇతనికి విజయ మెప్పుడును చేకూర లేదు. మొదట గుణగవిజయాదిత్యునిచే సంపూర్ణపరాభవము నందెను. ఈ సందర్భముననే బద్దెగడు పరాజయ మందెనదికూడ. గుణగుని మరణానంతరము దన యభీష్టము నెఱవేర్చుకొనదలంచి కృష్ణవల్లభుడు మరల వేంగిపై దండయాత్రల నారంభించెను. ఏలిన ప్రభువువెంట తన సేనతోగూడ బద్దెగడును నడవవలసినవా డాయెను. మఱియు పూర్వచాళుక్యులపై దన తొంటి పగను దీర్చుకొనవలయు నను కోర్కె యొకటి యతని బురికొల్పియుండవచ్చును.

బద్దెగడు ప్రథమచాళుక్యభీము నెప్పు డెచ్చట బట్టుకొనెనో నిశ్చయముగ జెప్పుటకు వీలులేదు. కాని, లభించిన శాసనాదిసాక్ష్యమునుబట్టి దీని నూహించి కనుగొనుటకు గొంత యవకాశము గలదు. 'ముషకేయం భిడివంతరె నీరోళొత్తి భీమన నతిగర్వదం పిడిదెయ్', 'భీమం భీమపరాక్రమైకనిలయం తం హేలయై వాగ్రహీద్దుర్గం గ్రాహ మివాంతరంబుసమరే' యను విక్రమార్జునవిజయ పర్భణిశాసనవాక్యములు భీముడు బద్దెగనిచే బట్టుపడినది యొక జలయుద్ధమున నని సూచించుచున్నవి. జలయుద్ధ మనగా నీటిమీద చేయు యుద్ధము. ఇట్టియుద్ధము సముద్రముమీద నావికాదళముల మూలమున జరుగుట సామాన్యము. కాని రాష్ట్రకూటరాజులకు గాని, పూర్వచాళుక్యప్రభువులకుగాని నావికాదళము లుండినట్లుకాని, వారు తమ్ముకాలమున సముద్రముపై యుద్ధ మెప్పుడైన చేసినట్లుకాని తెలుపు సాక్ష్యము గానరాదు. నావలపై నిలచి నదులమీద చేయు యుద్ధమును, జలమయప్రదేశాంతర్గతదుర్గములపై చేయు యుద్ధమును జలయుద్ధ మనబడును. బద్దెగడు భీముని బట్టుకొనిన దిట్టివంటి యుద్ధముననే యై యుండవలయును. ఇమ్మడి కృష్ణవల్లభ ప్రథమచాళుక్యభీముల మధ్య నడచిన యుద్ధములలో నై చెప్పినట్టి నీటిపోరాట మెచటనేని జరిగియుండుట కవకాశము గలదేమో చూతము.

మనకు నేటివఱ కుపలబ్ధమైన శాసనసామగ్రిని బట్టి చూడగా నిమ్మడికృష్ణవల్లభుడు ప్రథమచాళుక్యభీముని రాజ్యకాలమున వేంగిపై రెండు పర్యాయములు దండెత్తి వచ్చిన ట్లున్నది. మొదటి దండయాత్ర ముదిగొండచాళుక్యప్రభువగు కుసుమాయుధుని యనుచరుడగు నల్లమెఱెడుకొడుకు వ్రాయించిన కొఱవిశిలాశాసనమున వర్ణింపబడియున్నది.

"శ్రీవిక్రమాదిత్యనృపాగ్రతనయుణ్డయ్న చాళుక్యభీమునకు కాచకర్దపర్వణనకు వేంగీశ్వరునకు రణమర్దాన్వయకులతిలకుణ్డయ్న కుసుమాయుధుణ్డు గన్నరబల్లహుని కస్తప్రాప్తంబయ్న రణమర్దకసీ(!)మ దన భుజబలపరాక్రమంబున దెచ్చి కణ్టియం గట్టి పట్టంబు గట్టి ఖడ్గసహాయుండై నేల యెల్లం గావంబూని ముంచి కొణ్డనాణ్డాదిగ వేంగిదేసము విష్ణువర్ధనుతో నర్ధరాజ్యంబు సేయుచున్న కుసుమాయుధు..."3.

ఈ దండయాత్ర ప్రథమచాళుక్యభీముని పట్టబంధమునకు ముందు నడచినది. గుణగవిజయాదిత్యుడు కాలగతి నందె నను వార్త చెవి సోకినంతటనె కృష్ణవల్లభుడు వేంగిపై నెత్తివచ్చిన ట్లున్నది. "కన్నరబల్లహుని కస్తప్రాప్తంబయ్న రణమర్దకసీమ" యని యుండుటచే వేంగిరాజ్యమందలి యుత్తరభాగము లతనికి స్వాధీనపడినట్లు తోచుచున్నది. రణమర్దకసీమ కృష్ణా

3. తెలిం. శాస. ఇతర. సం. ౧౨. కీ. శే. రావుబహాదూరు సి. ఆర్. కె. చార్లుగారు ప్రతిబింబానుసారము సవరించిన శాసనగ్రంథమునుండి సంగ్రహింపబడినది.

జిల్లాలోని కొండపల్లినుంచి హైదరాబాదురాజ్యములోని వరంగలుమండలాంతర్గతమైన కొలనిపర్యంతము వ్యాపించియుండినది. మంచికొండనాడు దీనికి జెందినదే. ఈ రణమర్దకసీమయందు నావికాయుద్ధమును సేయుటకనుకూలమైన నదులుగాని, జలదుర్గములుగాని లేవు. కావున బద్దెగడు ప్రథమచాళుక్యభీముని బట్టుకొనిన 'యంబుసమర' మీదండయాత్రయందు నడచెనని చెప్పుటకు వలనుపడదు.

రెండవ దండయాత్ర:—మఱియొక పర్యాయము కృష్ణవల్లభుడు వేంగిపై నెత్తివచ్చినట్లు ప్రథమచాళుక్యభీముని మసులిపట్టణతామ్రపట్టికలవలన దెలియవచ్చుచున్నది.[4] రాష్ట్రకూటసైన్యములే కాక కర్ణాటలాటాది మిత్రబలముగూడ వేంగిని ధ్వంసము సేయ వచ్చినవి. వీనికధిపతి గుండ దండనాయకుడు. శత్రువులు రాజ్యమును జొచ్చి వేంగీపురప్రాంతమువరకు వచ్చిరి. ఈ దండయాత్రయందు చాళుక్యభీముడును, నతని పుత్రుడైన ఇఱమర్తిగండడును శత్రులను మార్కొని ఘోరాహోరిగ బోరిరి.

"యస్స్వైహ్వవప్రముక్తై రిషుభి రభిహత
ప్రష్టపృష్ఠవ్యధావత్
కర్ణాటాద్యుద్ధరూటారటితపటునట
ద్ఘోటకా లాటకాళ్ళ."

అని చాళుక్యభీముడు తన ప్రతాపాతిశయము నుగ్గడించుకొనినను, రాష్ట్రకూటు లంత సులభముగ విడిచిపోలేదు. రాష్ట్రసంరక్షణభారమంతయు నిఱమర్తిగండని భుజములపై బడినది. ఓడిపోయినను రాష్ట్రకూటబలములు తరతరముగ మార్కొనగజగినవి. సందడికయ్యములు పెక్కు నడచినవి. చూడుడు, మచిలీపట్టణతామ్రశాసన మెట్లీ పోరాటమును వర్ణించుచున్నదో.

"మను ప్రియాత్మజో షోడశవార్షికః, యస్తు
* * * *
నిరవద్యపురరణే కరితురగఘను
ర్ధుర్ధరోగ్రవల్లభదణ్డాన్
ఆరుహ్య గజపతి.మ్మృగపతిరివ
హరిణా న్వికీర్యన్ విహసన్న ఘనత్ ॥
పెరువంగూర్గ్రామరణే
వల్లభదణ్డేన సహైయాభ్యం హత్వా
నిర్లాట్యచ దాయాదా
నవని మశేషా న్నిరాకులా మ్మహ్య మదాత్ ॥
నత్వాఽర్థిభ్యో ధనం కామ
మ్మహ్యత్రీం ధియం ద్విషామ్,
నిత్యాప్య దిశు సత్కీర్తి
న్నాకలోక మగా దసౌ ॥
కటాక్షేణాపి నాపశ్య ద్దేవ్య శ్చ పరయోషితః
ఆసు ఓభత్స్యయా మానం రిరంసు రమరాంగనాః ॥
తస్య దీనానాథబన్ధో బన్ధుసత్సలస్య
ఇతిమర్తిగణ్డాపరనామ్న శ్శుభధామ్నః పారలౌకికం
కార్యం కృత్వా..."

పై మహాహ్యతశాసనశ్లోకములందు నిరవద్యపుర పెరువంగూరుగ్రామము లను రణక్షేత్రములు రెండు పేర్కొనబడియున్నవి. ఇందు మొదటిదానియందు కరితురగఘనుర్ధరసహితమైన వల్లభదళములను మృగరాజు హరిణసమూహమును బోలి చెల్లాచెదరు గావించెనట. రెండవదానియందు లాటులను దాయాదులను వల్లభదండములోగూడ ధ్వంసముగావించి, వల్లభ దండాధీశుడైన గుండెనను వధించి, నిరాకులమైన రాజ్యమును దన తండ్రి కిచ్చెను; కాని యత డా యుద్ధముననే నిహతుడై వీరస్వర్గము నలంకరించెనట. ఇచట మొదట గమనింపదగిన దీ యుద్ధములు జరిగిన దేశము. నిరవద్యపురము ఇప్పటి నిడదవోలునకు ప్రాచీననామము. ఇది యిప్పటి పశ్చిమగోదావరిమండలమునందలి యేలూరునకు బూర్వోత్తరదిగ్భాగమున రమారమి యేబది మైళ్ల దూరమున మద్రాసుకలకత్తాయినుపదారిపై నున్నది. పెరువంగూ రెచట నుండెనో చెప్పుటకు వీలులేదు. అదియు బశ్చిమగోదావరీమండలాంతర్గత గ్రామమే. రెండు రణక్షేత్రములును కృష్ణాగోదావరీ నదుల డెల్టాల మధ్యప్రదేశమునం దనగా వేంగిరాష్ట్ర గర్భమున నున్నవి. రాష్ట్రకూటసైన్యములు వేంగిగడి

4. Cp 1 of 1913-14.

ప్రదేశములను దాటి రాష్ట్రమధ్యమునకు జొచ్చుకొని వచ్చినవి.

ఈ దండయాత్రయం దెచ్చటనైన 'అంబుసమరము'[1] జరుగుట కవకాశ ముండెనేమో చూతము. పూర్వచాళుక్యుల ప్రధాననగరము వేంగి. అది యిప్పటి యేలూరున కేడెనిమిది మైళ్ల దూరమున నుండెను. యుద్ధదృష్టి జూచిన నిది యంతటి బలిష్ఠమైన స్థలము గాదు; కాని దండయాత్రాదిఆపత్సమయములయందు వేంగి నేలు రాజులు దమ రాజధానిని వదలి సమీపమున నుండు కొల్లేరుసరస్సుమధ్యమందు జలదుర్గమున తల దాచుకొనెడివారు. కొల్లేటిదుర్గమును సాధింపజాలని శత్రువు వేంగిరాజ్యమును లొంగదీయ సమర్థుడు కాడు; ఈకారణమువలననే సముద్రగుప్తులకేశ్యాదిరాజులకు పూర్వకాలమందు కొల్లేటియం దంబుసమర మవశ్యము కర్తవ్యమాయెను. అట్లే యిమ్మడి కృష్ణవల్లభుని దండయాత్రయందును నడచియుండును. వేంగికి సమీపమునకు ప్రబలమైన రాష్ట్రకూటసైన్య మెత్తివచ్చినప్పుడు ప్రథమచాళుక్యభీము డాత్మరక్షణకు కొల్లేటిదుర్గమునకు బోవుట సహజము. ఈదుర్గమును ముట్టడించి స్వాధీనపరచు కొనుట కిమ్మడి కృష్ణభూపాలుడు ప్రయత్నము సల్పుటయు సహజమే. కావున బెద్దగడు మొసలిని నీటి యందు పట్టిన ట్లంబుసంగరమున బట్టిన దీ దండయాత్రా సందర్భమున కొల్లేటికోటయం దై యుండవలయును.

## ౮
## ఇమ్మడి నరసింహుడు

సోలదగండబద్దెగని యనంతర మతని కుమారు డిమ్మడి యుద్ధమల్లుడు ప్రభుత్వమునకు వచ్చెను. ఇత డంతటి విఖ్యాతుడు గాడు. ఇతని చరిత్రనుగూర్చి చెప్పదగిన విశేషాంశము లెవ్వియు లేవు.

ఇమ్మడి యుద్ధమల్లుని పిమ్మట నతని పుత్రు డిమ్మడి నరసింహుడు మండలాధిపత్యమును వహించెను. ఇతడు సుప్రసిద్ధవీరుడు. ఇతని పరాక్రమకృత్యములు పెక్కు విక్రమార్జునవిజయమందును, వేములవాడశిలా శాసనమునను వర్ణింపబడియున్నవి. ఈ రెండు ఆధార గ్రంథములయందును జెప్పియుండు నంశములను క్రోడీకరించి చూచిన నితని ముఖ్యకార్యముల నత్యంతసంగ్రహముగ నిట్లు పేర్కొనవచ్చును: (౧) లాటులను జయించెను; (౨) సప్తమాళవములను దగ్ధము గావించి వాని ప్రభువుల నోడించి వారియొద్ద కప్పము గొనెను; (౩) గూర్జరపతియగు మహీపాలు నోడించి తఱుము గొట్టి గూర్జరరాజ్యమును జయించెను; (౪) గంగాతీరమున గూర్జరరాజు నోడించి తన గుఱ్ఱములను గంగాజలముల దానమాడించి కాళప్రియమున దన యసిలతను, శిలాశాసనముతోడి విజయస్తంభమును స్థాపించెను.

విక్రమార్జునవిజయమునందును, వేములవాడశాసనమందును ఇమ్మడి నరసింహుడు పైపేర్కొనిన శత్రుల తోడ నేకాకియై పోరి జయమును బొంది వారికడ కప్పము గొనినట్లు కలదు. ఇదియంతయు సత్యము గాదు. ఇమ్మడి నరసింహుడు స్వతంత్రుడైన రాజు కాడు. రాష్ట్రకూటచక్రవర్తి కాశ్రితుడైన మాండలిక ప్రభువు. సుప్రసిద్ధకర్ణాటచరిత్రపరిశోధకులగు శ్రీయుత్. గోవిందపాయిగారు విక్రమార్జునవిజయము ప్ర. ఆ. లోని యిమ్మడి యరికేసరిప్రశంసయందలి-

"రుంద్రాంభోధిపరీత
హీంద్రరదారిన్నరీనరేంద్రం సాక్ష
దింద్రం తాననె సలెనెగ
ల్దిం దేంద్రన తోళె తొట్టిలాగిరె బళెదం"[1]

అను కందపద్యము నాధారము జేసికొని యిమ్మడి యరికేసరి రాష్ట్రకూటచక్రవర్తి ముమ్మడి యింద్రవల్లభునికి మేనల్లు డని వ్రాసియున్నారు. ఈ యభిప్రాయము దృఢపఱచుటకు దగిన యాధార మింకను లభ్యపడలేదు. కాని యది కేవల మసంగత మని త్రోసి పుచ్చుటకు వీలులేదు. ఏలనగా, 'నింద్రేంద్రన తోళె తొట్టిలాగిరె బళెదం' అను వాక్యమువలన నింద్రు డరికేసరి నెత్తి పెంచినా డని తెల్లమగుచున్నది. మఱియు-

"దేవిం రేవకనిర్మ్మడిక్షితిపతే
రింద్రస్య పుత్రీ న్నతాం
పౌలోమీ మివ వాసవశ్రియ మివ
శ్రీమన్మరధ్వంసకః

1. విక్ర. ఆ. ౧: ౪౪.

స్త్రీరత్నం పరిణీయ యేన నితరం
తస్యాః స్వపత్నీకృతా
నూనాం స సప్తసముద్రముద్రితమహీ
మ్మాన్నోన్నతే నాధునా". 2

అను, వేములవాడశాసనశ్లోకమువలన నింద్రవల్లభు డితనికి దన కుమారి రేవకనిర్మడిదేవి నిచ్చి వివాహముగావించె నని తెలియుచున్నది. మఱియు ఖర్పేడి తామ్రశాసనమందలి—

"రాష్ట్రకూటకులే ఖ్యాతే జాతా లోకాంబికా సతీ
క్షీరశ్రీ రివ క్షీరస్య తస్యాసీ త్సుదతీ ప్రియా." 3

అను శ్లోకము ఇతనికి రాష్ట్రకూటుల యాడపడుచు లోకాంబిక యను మఱియొక భార్య యుండె నని తెల్పుచున్నది. పై శాసనశ్లోకములు గోవింద పాయిగారి యభిప్రాయమునకు దోహద మిచ్చుచున్నవి. ఇది సత్యమేని యిమ్మడియరికేసరితల్లియు, నిమ్మడి నరసింహుని భార్యయు నగు జాకవ్వ రాష్ట్రకూట చక్రవర్తి యిమ్మడి యింద్రవల్లభుని సోదరి యగుచున్నది.

మఱియు నిమ్మడి నరసింహుని యుద్ధములన్నియు నతడు దన బావమఱదియు, ప్రభువును నైన నుమ్మడి యింద్రవల్లభుని పక్షమున నతని శత్రులతో జేసినవే. కాని స్వతంత్రముగ దనకొఱకు జేసినవి కావు. ఇమ్మడి నరసింహకృతములని పై జెప్పబడిన సాహసకార్యముల నన్నింటిని ముమ్మడి యింద్రరాజు చేసినట్లు నాల్గవ గోవిందరాజు క్యాంబేపట్టిక లందు చెప్పియున్నది.

"యన్మాద్యద్ద్విపదన్తఘాతవిషమం
కాలప్రియప్రాఙ్గణమ్
తీర్ణా యత్తురగై రగాధయమునా
సిన్ధుప్రతిస్పర్ధినీ,
యేనేదం హి మహోదయారినగరం
నిర్మూలమున్మూలితం
నామ్నాఽద్యాపి జనైః కుశస్థల మితి
ఖ్యాతిం పరాం నీయతే"4

ఇందువలన ముమ్మడి ఇంద్రవల్లభుని మహోదయవిధ్వంసమును, నిమ్మడి నరసింహుని గూర్జరాది విజయములును నొక్క దండయాత్రకు సంబంధించినవే యని తెలియుచున్నది 5. ఈ దండయాత్రయందలి యంశముల నింతవఱకెవ్వరును విపులముగ జర్చించి యుండలేదు. ఈ కారణమువలన విషయము నిచట

---

2. తెలింగాణాశాసనములు : ఇతర.

3. కై సాహిత్య ఔర్ ఇతిహాస్.

4. ఎ. ఇండి. సం. ౭, పెం. ౬, శ్లో. ౧౯.

5. క్యాంబేపట్టిక ననుసరించి ముమ్మడి యింద్రవల్లభుడు—

౧. కాలప్రియప్రాఙ్గణమును దన యుద్ధపుటేనుగుల దంతఘాతములతో విషమము గావించెను,

౨. యమునను దాటెను.

౩. శత్రునగరమైన మహోదయమును ధ్వంసము చేసెను.

విక్రమార్జునవిజయప్రకార మిమ్మడి నరసింహుడు

౧. లాటులను జయించెను.

౨. ఏడు మాళవములను జయించి మాళవరాజుల కడ కప్పము గొనెను.

౩. గూర్జర రాజు నోడించి యతని యేనుగుల బట్టుకొనెను. గూర్జరరాజు మహీపాలుడు పాఱిపోయెను.

౪. గంగాజలముల దన తురంగముల దాన మాడించె. కాళప్రియమున దన యశోలతను స్థాపించెను.

వేములవాడశిలాశాసనముబడి యిమ్మడి నరసింహుడు—

౧. ఏడు మాళవములను జయించి యచటి రాజులచే గప్పము గొనెను.

౨. ఎదురు వచ్చిన గూర్జరరాజసేనను నిర్జించి కాళప్రియమునందు దన శౌర్యమును బ్రకటించు శిలాశాసనమును నిలిపెను.

క్యాంబేపట్టికలకును, విక్రమార్జునవిజయ వేములవాడశిలాశాసనములకును కాళప్రియకదనము సామాన్యము. క్యాంబేపట్టికలలో నింద్రుడు యమునను దాటిపోయి శత్రునగరమైన మహోదయమును ధ్వంసము చేసిన ట్లున్నది. మహోదయమే శత్రుని పట్టణమో

ఇంచుక విస్తరించి వ్రాయుట యుచితమని తోచుచున్నది.

ఈ దండయాత్రకు ప్రధానకారణము రాష్ట్రకూటగూర్జరప్రతీహారులకు దరతరములుగ పెరిగివచ్చుచుండు వైరమే. గూర్జరప్రతీహారులు మొదట దక్షిణ రాజపుత్రస్థానమునం దుండిరి; క్రీ. శ. ౮-వ శతాబ్ద పూర్వార్ధమున ప్రథమనాగభటుని కాలమున వీరు మాళవమును జయించి యచట పాదుకొనిరి. మాలఖేడరాష్ట్రకూటసామ్రాజ్యస్థాపకుడగు దంతిదుర్గుడు, దేవరాజనునతడు సహాయము వేడగా మాళవముపై నెత్తి పోయి నాగభటు నోడించి గూర్జరప్రతీహారులను దన కరిగాపులుగ జేసికొనెనని పూర్వప్రకరణమున వ్రాసియున్నాడను. ఇదియే రాష్ట్రకూట ప్రతీహారరాజుల దీర్ఘద్వంద్వయుద్ధమున కంకురార్పణ.

దంతిదుర్గుని మరణానంతరము రాష్ట్రకూట సామ్రాజ్యమున నొక గొప్ప విప్లవము జరిగినది. చాళుక్యులు మరల విజృంభించిరి. వీరి నాయకుడగు రాహప్ప గతించిన చాళుక్యుల యధికారమును పునరుద్ధరించుటకై తన యావచ్ఛక్తిని వినియోగించి పోరాడదొడగెను. దంతిదుర్గునికి సంతు లేదు. కావున నతని వెనుక రాజ్యాభిషిక్తుడైన యతని పినతండ్రి మొదటి యకాలవర్షకృష్ణవల్లభుడు తన యాధిపత్యమును నిలుపుకొనుటకై యేడెనిమిదేండ్లు రాహప్పతో హోరాహోరిగ యుద్ధము సేయవలసివచ్చెను[6]. ఈ యుద్ధమున నీతడు నిమగ్నుడైయుండగా దంతిదుర్గునిచే జయింపబడిన యుత్తరదేశపు రాజులు రాష్ట్రకూటులను నిరాకరించి స్వతంత్రులైరి. కాని యతడు రాష్ట్రకూటుల యధికారము నుత్తరాపథమున నెలకొలుప మరల ప్రయత్నము సేయలేదు.

ప్రథమాకాలవర్షకృష్ణవల్లభుని యనంతర మతని పుత్రుడు సువర్ణవర్ష ఇమ్మడిగోవిందవల్లభుడు రాజ్యాభిషిక్తు డాయెను. ఇతడు గంగాయమునల మధ్య రాష్ట్రమును పరిపాలించుచుండిన ఇంద్రుడను రాజును నిర్జించినట్లు రామేశ్వరశిలా స్తంభశాసనములోని—

"తస్మా దభూ త్సూను రుదారకీర్తిః
ప్రభూతవర్షో భువ మాససాద;

---

యందు చెప్పియుండలేదు; కాని యా కాలమున మహోదయము గూర్జరప్రతీహారులకు రాజధాని యగుట చేత నింద్రుని శత్రువు గూర్జరప్రతీహారరాజని నిశ్చయముగ జెప్పవచ్చును. వేములవాడశాసనమున నిమ్మడి నరసింహుని ప్రతిఘటించుటకు గూర్జరరాజు సైన్యసమేతుడై వచ్చి కాళప్రియముకడ యుద్ధమున పాఱిపోయినట్లు చెప్పియున్నది. ఇతడు మహోదయాధిపతి గాని యన్యుడు గాడు; ఇట్లు నరసింహునిచే యుద్ధమున నోడి పరారియైన గూర్జరరాజు పేరు మహీపాలుడని విక్రమార్జునవిజయమువలన దెలియుచున్నది. కావున క్యాంబేవేములవాడశాసనములందును, విక్రమార్జునవిజయమునందును వర్ణింపబడిన దండయాత్ర యొక్కటియే యని నిశ్చయించవచ్చును. గూర్జరవిజయమునకు పూర్వము ఇమ్మడి నరసింహుడు సప్తమాళవములను సాధించెనని వేములవాడశాసనమందును, సప్తమాళవములకు పూర్వము లాటదేశమునుగూడ జయించినట్లు విక్రమార్జునవిజయమందును గలదు. లాటసప్తమాళవ ప్రస్తావము క్యాంబేపట్టికలందు గానరాదు. అందుచే వానికి గూర్జరదండయాత్రతో సంబంధము లేదని యెంచ గూడదు. అన్నియు గూర్జరదండయాత్రకు సంబంధించినవే. విక్రమార్జునవిజయకర్తయు, వేములవాడ క్యాంబేశాసనరచయితలును పై దండయాత్రను వర్ణించినప్పుడు ఎవ్వరికి ముఖ్యము లని తోచిన యంశములను వా రూదిచెప్పి తక్కినవానిని విడిచిపెట్టిరి. వీని యందు గాన్పించు భేదముల కిదియే కారణము.

6. మొదటి యకాలవర్షకృష్ణవల్లభుని ప్రథమశాసనము భోపఖళుదానశాసనము. దీనినే భారత ఇతిహాససంశోధకమండలిపట్టిక యందురు. ఇది క్రీ. శ. ౭౫౮ అక్టోబరు ౭వ తేది పై గ్రామము దానము సేయబడెనని తెల్పుచున్నది. (భార. ఇతి. సం. పత్రిక, సం. ౮, పుట. ౧౬౫) ఇందు రాహప్పనుగురించిన ప్రస్తావన లేదు. ఇతని రెండవ శాసనము క్రీ. శ. ౭౬౮ నాటి తలెగాంశాసనము. (ఎపి. ఇండి. సం. ౧౩.

యత్సైన్యయా ఒహీంద్రమదావమర్ద్దా
ద్దగ్గాపయో యామునవద్విభాతి7 ".

---

పుటలు ౨౭౫-౨౮౨). క్రీ. శ. ౭౫౮-౭౬౮ సంవత్సరములమధ్య ఇతని శాసన మొక్కటియైనను గావరాదు. తలెగా౯ పట్టికలయందును రాహప్పనుగూర్చి యేమియు గావరాదు; కాని యిందు శాసనోక్తదానము మణ్ణె నగరమున గంగులపై దండయాత్ర నడపుచు స్కంధావారమునం దియ్యబడినట్లుండుటచే (గంగానా ముపరి విజయస్కంధావారే మణ్ణెనగరే) నప్పటి కతడు రాహప్పను జయించియుండు నని తోచుచున్నది. వేంగీ విజయానంతర మియ్యబడిన క్రీ. శ. ౭౬౯ నాటి యువరాజ గోవిందుని యలాస్ తామ్రశాసనము (ఎపి. ఇండి., సం. ౬, పుట ౨౧౦) ఈ యభిప్రాయమును దృఢపఱచుచున్నది. రాహప్ప పేరు చెప్పకున్నను క్రీ. శ. ౭౭౨ వ సంవత్సరమునాటి బర్ధన్ పట్టికలందు (ఎపి. ఇండి. సం. ౧౪, పుట ౧౨౧-౩౦)—

"ఉల్లంఘితమర్యాదే
కలిజలధౌ వ్యాకులా నిమజ్జన్తీ
యేనోద్ధృతా ధరిత్రీ
శ్రీప్రలయమహావరాహేణ"

అను శ్లోకమున హద్దుమీఱి పొరలివచ్చిన కలిజలధి యందు మునిగియుండిన భూమిని శ్రీప్రలయవరాహుడు, అనగా ప్రథమాకాలవర్షకృష్ణవల్లభు డుద్ధరించినట్లు చెప్పియున్నది. కృష్ణుడు జయించి సామ్రాజ్యమును గొనినది రాహప్పకడనుండి యని క్రీ. శ. ౭౩౫ నాటి ధారావర్షధ్రువుని ఉంపారిపట్టికలలోని (ఎ. ఇండి., సం. ౯, పుటలు ౮౧-౮౯)—

"రాహప్ప మాత్మభుజజాతబలావలేప
మాజౌ విజిత్య నిశితాసిలతాప్రహారైః,
పాలిధ్వజావలిశుభా మచిరేణ యో హి
రాజాధిరాజపరమేశ్వరతాం తతాన"

అను శ్లోకమువలన స్పష్టపడుచున్నది. కావున ప్రథమాకాలవర్షుడు క్రీ. శ. ౭౫౮-౬౮ ల మధ్య రాహప్పతోడ ముమ్మరముగ పోరుచుండె నని నిశ్చయముగ జెప్పవచ్చును.

అను శ్లోకమువలన దెలియవచ్చుచున్నది. ఇందు పేర్కొనబడిన ఇంద్రుడు కాన్యకుబ్జాధిపతి. ఇంద్రాయుధు డని ఇతని సంపూర్ణ నామధేయము. ఇతడు శకాబ్దము ౭౦౫ (క్రీ. శ. ౭౮౩) ప్రాంతమున కన్యాకుబ్జమును పాలించుచుండినట్లు జినసేనకృతహరివంశమునందు చెప్పియున్నది8. ఇమ్మడి గోవిందవల్లభుడు కన్యాకుబ్జముపై నేల దండయాత్ర సాగింపవలసివచ్చెనో తెలియదు. ఒకవేళ రాష్ట్రకూటుల యధికారము నుత్తరాపథమున మరల నెలకొల్పుట కతడు ప్రయత్నము కల్పియుండవచ్చును; లేక తనతో ప్రతిఘటించి సింహాసనము నాక్రమించుటకు పోరుచుండిన తన తమ్ముడగు ధారావర్షధ్రువుని కింద్రుడు సహాయము సేయగా నింద్రుని శిక్షించుటకేనియు గావచ్చును.

ఇమ్మడిగోవిందుని దొలగద్రోసి ధారావర్షధ్రువుడు సింహాసనము నాక్రమించుకొనియెను. ఇతని రాజ్యారంభమున కన్యాకుబ్జరాజ్యమున నొక విప్లవము జరిగినది. ఇమ్మడి గోవిందుని కాలమున నచట రాజ్య మొనర్చుచుండిన ఇంద్రరాజును బాఱదోలి గూర్జరప్రతీహారవంశజుడైన ద్వితీయ నాగభటుడు కన్యాకుబ్జము నాక్రమించి గంగాయమునాంతర్వేదిని వశపఱచుకొని యుత్తరాపథమున కధిపతి యాయెను. మాళ్ఖేడురాష్ట్రకూటులకును గూర్జరప్రతీహారులకును నంతట ద్వంద్వయుద్ధము ప్రారంభమాయెను. దంతిదుర్గుని కాలమందువలె నుత్తరాపథమును దమచేతి క్రింద నుంచుకొనవలయు నని రాష్ట్రకూటుల సంకల్పము. దాక్షిణాత్యులను వింధ్యమును దాటి రానీయక వెనుకకు గొట్టవలయునని గూర్జరప్రతీహారుల దృఢనిశ్చయము. ధ్రువముమ్మడిగోవిందుల కాలమున రాష్ట్రకూటప్రతాపము మహోగ్రముగ ప్రజ్వరిల్లినది. అశేష భారతదేశమును వారి వెలిగొడుగునీడచే సంఛాదితమగు నను శంక పొడమినది. వారికి మాఱొడ్డి నిలిచిన రాజు లేడు; పరాజయము నందని సేన లేదు. గూర్జరప్రతీహారరాజులు దమ రాజ్యమును బాఱవిడిచి మరుదేశమున తల దాచుకొనిరి. కాని మొదటి యమోఘవర్షచక్రవర్తికాలమున పరిస్థితులు మారిపోయి

7. SII. IX. I. 68.

8. Pro. Ind. Hist. Congress 1945, 986.





నవి. రాష్ట్రకూటుల శౌర్యము సన్నగిలజొచ్చినది. ఉత్తరాపథమువైపు వారికి దృష్టి ద్రిప్పుట కవకాశము లేకపోయెను. గూర్జరప్రతీహారులు విజృంభించిరి. అమోఘవర్ష దత్తంగతుడు గాకపూర్వమే మిహిరభోజుడు మాళవము నాక్రమించుకొనెను; లాటదేశముపై నెత్తివచ్చి ఖేటకపురమును వశపఱచుకొనెను. కాని, తండ్రియనంతరము మాన్యఖేటసింహాసనము నధిష్ఠించిన ఇమ్మడి కృష్ణవల్లభుడు దళములను గూర్చుకొని పోయి మిహిరభోజుని దఱుమగొట్టుటయే కాక గంగానదీపర్యంతముగల శత్రురాష్ట్రమును ద్రొక్కివచ్చెను. అటుతరువాత నల్పకాలములో మిహిరభోజుడు దివంగతుడు కాగా నతని కుమారుడు మహేంద్రపాలుడు రాజ్యాభిషిక్తుడాయెను. ఇతడు తండ్రియంతటి పరాక్రమశాలి గాడు; రాష్ట్రకూటులతో దన పూర్వులవలె నితడు పోరాడిన ట్లగపడదు. క్రీ. శ. ౯౧౦ వ సంవత్సరమువఱకితడు ప్రజాపాలన మొనర్చినట్లున్నది. ఇతడు కాలధర్మము నందినపిమ్మట నితని జ్యేష్ఠపుత్రుడగు ద్వితీయభోజుడు రాజ్యాధిపత్యమును వహించి నాలుగేండ్లకాలము పుడమి నేలెను; కాని యితని యభ్యుదయమును సహింపక నితని యనుజుడు మహీపాలుడితని తొలగద్రోసి క్రీ. శ. ౯౧౪ లో సింహాసనము నాక్రమించుకొనియెను.

మహీపాలుడు శౌర్యవంతుడు. రాష్ట్రకూటులపై గసి తీర్చుకొన నిచ్ఛయు, రాజ్యమును పెంపొందించు కోరికయు నతనిని యుద్ధమునకు బురికొల్పినవి. రాజశేఖరకవియొక్క బాలభారతము లేక ప్రచండపాండవ మను నాటకప్రస్తావనయం దతని విజయము లిట్లు వర్ణింపబడియున్నవి:

"నమితమురలమౌళిః పాకలో మేఖలానామ్
రణకలితకలింగః కేలితట్కేరలేన్దోః,
అజనిజితకులూతః కున్తలానాం కుఠారః
హఠహృతరమఠశ్రీః శ్రీమహీపాలదేవః".

అనగా మహీపాలదేవుడు మురళులను, మేఖలలను, కళింగులను, కేరళులను, కులూతులను, కున్తలులను, రమఠులను జయించెనని యందలి భావము.

ఇందు పేర్కొనబడిన జనపదములందు మురళులు, కేరళులు, కున్తలులును దాక్షిణాత్యులు—కున్తలదేశము రాష్ట్రకూటసామ్రాజ్యమునకు హృదయమువంటిది. బళ్లారి, రాయచూరు, ధార్వాడ, బిజాపుర ఉత్తర కన్నడమండలములు ప్రాచీనకున్తలదేశమునకు జెందినవి. మహీపాలదేవుడు కున్తలులకు కుఠారమువంటివాడనగా రాష్ట్రకూటుల కతడు గర్భశత్రు వనియు, వారి నతడు జయించెననియు మన మర్థముచేసికొన వలసియున్నది.

మఱియు మహీపాలదేవునిగూర్చి పై శ్లోకముపై వ్యాఖ్యానమునం దిట్లు వ్రాసియున్నది:

"ఆదిష్టోఽస్మిన్మహీపాలదేవేన, య స్వేమాం పురా విదః ప్రశస్తిగాథా ముదాహరన్తి:

"యః సంశ్రిత్య ప్రకృతిగహనా
మార్యచాణక్యనీతిం
జిత్వా నన్దా న్కుసుమనగరం
చన్ద్రగుప్తో జిగాయ;
కర్ణాటత్వం ధ్రువ ముపగతా
నద్య తా నేవ హన్తుం
దోర్దర్పాఢ్యః స పున రభవ
చ్ఛ్రీమహీపాలదేవః.

ఇతి చణ్డకౌశికే ఆర్యక్షేమీశ్వరః. స ఏవా య మపి మహీపాలదేవ ఇతి తున నిశ్చయః."

ఈ రెండవ శ్లోకముపై వ్యాఖ్యయు గమనింప దగినది:

"గాథా మాహ—య ఇతి: యః చన్ద్రగుప్తః తదాఖ్యః మౌర్యభూపతిః, ప్రకృత్యా స్వభావేన గహనాం దుష్ప్రవేశాం దుర్బోధా మిత్యర్థః, ఆర్యస్య కులీనస్య సద్వంశజాతస్య ఇత్యర్థః......చాణక్యస్య కౌటిల్యస్య నీతిం నయం నీతిశాస్త్ర మిత్యర్థః, సంశ్రిత్య అవలంబ్య, నన్దాన్ యోగానన్దప్రభృతీన్ నన్దవంశీయాన్, జిత్వా పరిభూయ, కుసుమనగరం పుష్పపురాఖ్యం పాటలీపుత్రస్థం నన్దనగరం, జిగాయ జితవాన్ అధీనీచకారేత్యర్థః, అద్య ఇదానీం, దోర్దర్పాఢ్యః బాహుబలదర్పితః, సః చన్ద్రగుప్తః, కర్ణాటోఽస్య

నివాసః కర్ణాటః...తస్య భావః తత్త్వం, కర్ణాటత్త్వం కర్ణాట దేశాధిపత్య మిత్యర్థః, ఉపగతవాన్ ప్రాప్తవాన్, ఇదానీం కర్ణాటదేశలబ్ధరాజపదాన్ ఇత్యర్థః. తాన్ దేహాన్తరధారణేన పున ర్జాతాన్ పూర్వనిహతాన్ నన్దాన్ ఇత్యర్థః, నన్దవంశీయాన్ కతిచిత్ రాజ్ఞః ఇతి యావత్, హన్తుమేవ నాశయితు మేవ, ధ్రువం నిశ్చితం, పునః భూయోపి, శ్రీమహీపాలదేవః తదాఖ్యనృపతివిశేషః, అభవత్ ; నన్దాన్ ఛన్ద్రిగుప్తేన శ్రీమహీపాలాఖ్యయా జాతేన పునర్నిహతా ఇతి ప్రాక్తనీ ప్రసిద్ధి రితి భావః"9.

పూర్వము కౌటిల్యుని రాజనీతి నాధారపఱచుకొని చంద్రగుప్తమౌర్యుడు పాటలీపుత్రమును పాలించుచుండిన నందవంశజులను జయించెను ; ఇప్పుడు ఆ మౌర్యచంద్రగుప్తుడే మహీపాలదేవుడై యవతరించి కర్ణాటదేశరాజులై మరల జన్మమెత్తిన ఆ నందుల నోడించి కర్ణాటాధిపత్యమును బొందెనని పై శాసనము యొక్కయు, వ్యాఖ్యయొక్కయు సారాంశము. ఇందువలన గూర్జరప్రతీహారమహీపాలదేవుడు సమకాలిక కర్ణాటసామ్రాజ్యాధీశ్వరుడైన రాష్ట్రకూటచక్రవర్తి నోడించి కొంత రాష్ట్రమును వశపఱచుకొనె నని తెలియవచ్చుచున్నది. మహీపాలుని కాఱదోలి యతడాక్రమించుకొనిన దేశమును స్వాధీనపఱచుకొనుట కొఱకును, రాష్ట్రకూటుల ప్రతాపమును మరల గంగాయమునల మధ్యభూమియందు ప్రకటించుటకొఱకును ముమ్మడి ఇంద్రవల్లభుడు దండెత్తెను. ఈ దండయాత్రా సందర్భముననే వేములవాడ చాళుక్య ద్వితీయ రవసింహుడు మహీపాలుని దారసిల్లి యోడించినది.

ఈ దండయాత్ర ముమ్మడి ఇంద్రవల్లభుని రాజ్యాభిషేకమున కించుక పూర్వమే ప్రారంభ మైనట్లు తోచుచున్నది ; ఏలనగా, క్రీ. శ. ౯౧౫ ఫిబ్రవరియందతడు వ్రాయించిన బుసుమా తామ్రపట్టికలం దతడు మేరువు నున్మూలించె ననియు, గోవర్ధనము నుద్ధరించిన యుపేంద్రుని జయించె ననియు జెప్పియున్నది10.

ఇంద్రుడు నాశమొనర్చిన 'మేరవు' కనౌజియై యుండవచ్చు నని డాక్టరు కీల్ హారనుగా రూహించుచున్నారు11. అత డున్మూలించిన రాజు మహీపాలుడు గావచ్చు నని యభిప్రాయపడుచున్నారు12. కాని, డాక్టరు ఆల్టెకారుగారు పై యభిప్రాయములతో నేకీభవింపక, "ఇంద్రవల్లభునిచే నిర్జితుడైన యుపేంద్రుడు పరమారప్రభువగు కృష్ణరాజని తోచుచున్నది ; ఇతని కుపేంద్రు డను నామాంతరము గలదని యుదయపూరుప్రశస్తివలన దెలియుచున్నది...ఇతడు క్రీ. శ. ౯౦౦-౯౩౫ ల మధ్య రాజ్య మొనర్చెను. పరమారులు మొట్టమొదట గూర్జరప్రతీహారులకు సామంతులుగ నుండిరి ; వారిచే బురికొల్పబడి యుపేంద్రు డింద్రవల్లభుని రాజ్యారంభకాలమున నాసికమండలములోని గోవర్ధనముపై నెత్తివచ్చిన ట్లున్నది".13 ఆల్టెకారుగారి యభిప్రాయ మంగీకార్యమే. పరమారులుగూడ ప్రతీహారులవలె గూర్జరజాతికి జెందినవారే. వారును ప్రతీ

"కృతగోవర్ధనోద్ధారం హేలోన్మీలితమేరుణా
ఉపేన్ద్రి మిన్ద్రిరాజేన జిత్వా యేన న విస్మితమ్"

ఇందు పేర్కొనబడిన గోవర్ధనమును పారిజాతు డనువాడు ముట్టడించియుండగా నిమ్మడి గోవింద చక్రవర్తి వాని కాఱదోలి దాని నుద్ధరించె నని దౌలతాబాదు పట్టికలందు కలదు (EI. IX no. 26 V. 10).

"తత్సూను రావరుచిః ప్రథితో బభూవ
శ్రీపారిజాతవిభవాహరణప్రతీతః
గోవర్ధనోద్ధరణలక్షితబాహువీర్యో
గోవిందరాజనృపతిర్హరిణా సమానః"

ఈ గోవర్ధనదుర్గము నాశికజిల్లాయందున్న దని డాక్టరు ఆల్టెకారుగారు గుర్తించియున్నారు.

9. చణ్డకౌశికమ్—కలకత్తా ప్రచురణ. పుట ౫-౬. వ్యాఖ్యాత జీవానందవిద్యాసాగరుడు.

10. EI. IX pp 24-41 Verse 22.

11. EI. VII. App. P. 16 n 2.

12. EI. VII PP. 38 f.

13. రాష్ట్రకూటులు: వారి యుగము. పుటలు ౧౧౦-౧౦౧.

హారులతోఁగూడ మాళవమునకు వచ్చి యచ్చట స్థిర వసతు లేర్పఱచుకొనిరి. డాక్టరు ఆల్టెకారుగారి వ్యక్తినిరూపణ సమంజస మగునేని యింద్రవల్లభుడు గూర్జరప్రతీహారులతోఁ బోరాడుటకు దన రాజ్యాభిషేకమునకు ముందే ప్రారంభించె నని తేలుచున్నది. వేములవాడ చాళుక్యనరసింహుడు జయించిన సప్తమాళవాధిపతులలో నీ యుపేంద్రు డొక్కఁడని చెప్పవచ్చును.

మహోదయదండయాత్రయందు జరగిన యుద్ధాంశములన్నియు విపులముగ దెలియవచ్చుటలేదు; కాని పంపకృతవిక్రమార్జునవిజయపీఠికయందును, వేములవాడ శిలాశాసనప్రశస్తియందును నందలి ప్రధానఘట్టములు విశదముగ వర్ణింపబడియున్నవి.

మొదట లాటవిజయము: లాటదేశము పశ్చిమసముద్రతీరమునం దుండెను. దీనికి నర్మదాతపతుల మధ్య నుండు రాజపిప్లాసంస్థానములలోని కొండలయందు బుట్టి క్యాంబేయఖాతములోనికి బ్రవహించెడి కీమునది యుత్తరపుటెల్ల. మూరతుఠాణా మండలములను వేర్పఱచు దమణ్‌గంగానది దక్షిణపు సరిహద్దు. తూర్పున సహ్యాద్రియును, బశ్చిమమున సముద్రమును మేరలు. మఱియు నీ లాటదేశము సప్తకొంకణములయం దొక్కటి 14. దీని రాజధాని ఖేటకము. ఇప్పుడు దీనిని గయారా యందురు.

గూర్జరప్రతీహారమిహిరభోజుని బాఱదోలి యిమ్మడి కృష్ణవల్లభుడు లాటదేశమును స్వాధీనపఱచుకొనె నని పైన వ్రాసియున్నాడను. ముమ్మడి యింద్రవల్లభుని పక్షమున చాళుక్యయిమ్మడినరసింహు డీ దేశమును మరల జయించవలసివచ్చినట్లయిన, కృష్ణవల్లభుడు మరల నీ రాష్ట్రమును గోల్పోయె ననుట నిక్కము. నరసింహు డెవ్వరిని జయించి లాటమును స్వాధీనపఱచుకొనెనో తెలియదు; కాని గూర్జరప్రతీహార మహీపాలుడు మురళకుత్తలకర్ణాటకేరళదేశములను జయించియుండుట చేతను, లాటవిజయముతో నారంభమైన చాళుక్యనరసింహుని దండయాత్ర ప్రతీహారమహీపాలుని పరాజయముతోడను, మహోదయవినాశముతోడను ముగియుటచేతను లాటమున నోడిపోయిన ప్రతిపక్షీయాతడే యని విస్పష్ట మగుచున్నది.

లాటవిజయానంతరము మాళవ దండయాత్ర. ఈకాలమున మాళవ మేడు భాగములుగ విభజింపబడియుండెను. 14-a ఒక్క రాజు నాధిపత్యముక్రింద నుండక బహునాయకమై యుండెను. చాళుక్య యిమ్మడి నరసింహుడు దుస్సాధతరులగు నేడ్గురు మాళవ నృపులను జయించి వారియొద్ద కప్పము గొనె నని వేములవాడశిలాశాసనమున జెప్పియున్నది. ఈ యేడ్గురు రాజు లెవ్వరో, వారు పాలించుచుండిన ప్రదేశము లెవ్వియో తెలియదు. బగూమ్రాతామ్రశాసనమున నింద్రవల్లభునిచే బరాజితు డాయె నని చెప్పియుండు నుపేంద్రుడును, పరమారవంశజుడును, వాక్పతిరాజముంజుని పితామహుడును నైన యుపేంద్రుడును డాక్టరు అల్టెకారుగారు చెప్పిన ట్లొక్కఁడే యగుదురేని, చాళుక్యనరసింహుని కోడిన యేడ్గురు మాళవరాజులలో పరమారప్రభువగు నుపేంద్రు డొక్కఁడనియు, నత డోటమందినది పరమారుల కునికిపట్టయిన ధారాప్రాంతమునం దై యుండు ననియు మన మూహించవచ్చును. మాళవవిజయమును గూర్చి యింతకంటె విశేషించి మనకు దెలియవచ్చు నంశము లెవ్వియు

---

14. డినాస్టీస్ ఆఫ్ ది కానరీస్ డిస్ట్రిక్ట్సు, పుట ౩౧౦.

14-a. ఇట్లే కొంకణదేశమును కళింగము నేడు భాగములుగ విభజింపబడియుండె నని సప్తకొంకణ సప్తకళింగశబ్దములవలన విదిత మగుచున్నది. మఱియు గళింగమున సప్తమాడియము లను నొక దేశవిభాగ ముండినట్లు 'సప్తమాడియరాయచంద్రబింబాననాచికురవల్లరులపై జిన్నిపువ్వు'అను శ్రీనాథుని వాక్యమువలన దెలియుచున్నది. కృష్ణరాయలు 'మాడెములు' గాల్చె నని పెద్దన చెప్పుచున్నాడు. 'మాడె, మాడియ'ములు 'మాళియ'శబ్దమునకు రూపాంతరములు. 'మాళియ'ము 'మాళవ'ముయొక్క క్లిష్టరూప మని కొందఱి మతము. అగునేని సప్తమాళవములకును, సప్తమాడియములకును జరిత్ర కందని గూఢమైన సంబంధ ముండియుండవలయును.

లేవు. కాని యీ యుద్ధమునకు ప్రతిఫలముగ మాళవ దేశము సర్వమును రాష్ట్రకూటులకు స్వైవశమాయె నని దృఢముగ జెప్పవచ్చును.

## కాళప్రియప్రాఙ్గణము

లాటమాళవదేశములు రెండును రాష్ట్రకూటులకు స్వాధీనపడెను; కాని యంతటితో నింద్రవల్లభుడు తృప్తిపొందలేదు. కర్ణాటసామ్రాజ్యముపై నెత్తివచ్చి యం దశేషభాగమును గెలిచి స్వాధీన పఱచుకొన్నందుకు గూర్జరప్రతీహారమహీపాలునికి దగిన శాస్తి చేయవలసిన యావశ్యకత యొకటియు, రాష్ట్రకూటపాలిధ్వజమును మరల గంగాయమునాంత ర్వేదియందు నెలకొలుపవలయు నను దృఢసంకల్ప మొకటియు నతని ముందంజవేయ బురికొల్పినవి. కావున నతడు సైన్యములను గదల్చుకొని గూర్జరప్రతీహారసామ్రాజ్యలక్ష్మి కిరవైన మహోదయమువంక నడవవలసిన దని చాళుక్యనరసింహుని కాజ్ఞ యొసగెను.

మహీపాలుడు పారలివచ్చు సేనాసాగరము నాపుటకు దగు ప్రయత్నము సలుపక నప్రమత్తుడైయుండ లేదు. అతడును దళములను గూర్చుకొని రాష్ట్రకూటులను యమునానదిని దాటనీయక దిరుగగొట్టుటకై వచ్చి యా నదీతటమున విడిసెను. ఇచట విచారించ వలసియున్నది. బుగూమ్రాపట్టికలలో నింద్రవల్లభుడు కాలప్రియప్రాంగణమును దన యేనుగుల దంతఘాతముల వలన విషమతలము గావించి యమునను గుఱ్ఱపుదళము లతో దాటె నని చెప్పియున్నది. మఱియు వేములవాడ శిలాశాసనమున జాళుక్యనరసింహుడు ఎదురువచ్చిన గూర్జరరాజ్యసైన్యముల నోడించి కాళప్రియమున దన శౌర్యమును శిలాస్తంభమున బ్రకటించె నని యున్నది. ఈ కాళప్రియ మెచ్చటిది? ఇంతవఱకీ విషయ మునుగూర్చి వ్రాసిన పరిశోధకులందఱును కాలప్రియ ముజ్జయినియని నిర్ణయించిరి. దీనికి గారణము కాళ ప్రియుడు మహాకాళుడే యను వీరి యభిప్రాయము. సుప్రసిద్ధమహాకాళదేవాలయము ఉజ్జయినియం దుండు కారణమున కాలప్రియ ముజ్జయినియే యని వీరు తీర్మా నించిరి. డాక్టరు ఆల్టెకారుగారుమాత్రము పూర్వ పరిశోధకుల యభిప్రాయము ననుసరించి కాలప్రియ ముజ్జయినియే యని చెప్పినను నొకవేళ నవి రెండును భిన్నప్రదేశములు కావచ్చు నను శంకను వెలిబుచ్చిరి. ఇట్టి సందేహము వీరికి గలుగుటకు మూడు కారణము లను వీరు చూపిరి: (౧) బుగూమ్రాశాసనమున నింద్ర వల్లభుడు దన మదదంతిదంతఘాతలచే కాలప్రియ ప్రాంగణమున విషమము గావించి వెంటనే యశ్వదళము లతోగూడ నగాధమైన యమునాతరంగిణిని దాటినట్లు చెప్పియుండుట. ఇందువలన గాలప్రియము యమునా తటమున నుండె నను నూహ గలుగుచున్నది. (౨) మాళ్ఖేడునుండి కనోజికి బోవు మార్గమునం దుజ్జ యిని లేకపోవుట. (౩) మఱియు యమునకు దక్షిణపు టొడ్డున కాల్పి యను స్థల ముండుట. 'కాల్పి' యను నది 'కాలప్రియ'కు భ్రష్టరూపము. ఇచ్చట నిప్పటికిని కాలప్రియాలయము గలదు. మఱియు నిది మాళ్ఖేడు కన్యాకుబ్జముల మార్గమం దున్నది. ఆల్టెకారుగారు చూపిన కారణములలో రెండవది యంతటి సత్తు కలది గాదు. ఏలనగా, మహోదయదండయాత్రను నడపిన చాళుక్యఇమ్మడినరసింహుడు మొదట సప్తమాళవ ములను జయించి యటుపిమ్మట కాళప్రియమున దన కీర్తిస్తంభమును స్థాపించినట్లు వేములవాడ శిలా శాసనమునను, విక్రమార్జునవిజయపీఠికయందును జెప్పి యుండుటచేత రాష్ట్రకూటసైన్యములు మహోదయ మునకు బోవుటకు ముం దుజ్జయినికి బోవుటయం దసంగత మేమియు లేదు. కాని మహాకాళునకు గాళప్రియు డను నామాంతర ముండె ననుట కాధారము లెవ్వియు గానరావు. కావున కాళప్రియుడు మహాకాలుడు గాజాలడు; కాళప్రియ ముజ్జయిని కాదు. అది యమునాతటమందలి కాల్పియే 15.

---

15. వేములవాడశిలాశాసనమున జాళుక్యనర సింహుడు దన్నెదిరింపవచ్చిన గూర్జరరాజసైన్యము లను జయించి కాలప్రియమున దన కీర్తిస్తంభమును నెలకొల్పె నని చెప్పియున్నను (తెలిం. శా. ఇతర. సం. ౨౧, శ్లో. ౯) సమకాలికరచనయైన పంపభారత

ఇంద్రవల్లభుఁడు కాలప్రియప్రాంగణమును దన మదదంతిదంతఘాతలచే విషయము జేసెనని చెప్పియుండుటచే నతఁడు దన యుద్ధపు టేనుగులను డీకొలిపి యా స్థలమును స్వాధీనపఱచుకొనెనని తెలియుచున్నది. దీనికి గారణము వేములవాడశిలాశాసనమునందు విశద పఱచియున్నది. గూర్జరరాజు మహీపాలుఁడు రాష్ట్రకూటసైన్యముల నడ్డుపెట్ట నెదురునడచివచ్చి కాలప్రియప్రాంగణము నాక్రమించుకొనియెను. ప్రాంగణ మనగా ముంగిలి. దేవాలయము ప్రాకారసంరక్షితమగుటచే దానిని గూర్జరరాజు దన సైన్యమునకు వీడుగావించుకొనియెను. ప్రాచీనకాలమున దేవాలయప్రాకారములు కోటగోడలవలె బలితములుగ గట్టబడెడివి. ఈ కారణమున ప్రాకారములను దేవాలయపు గోట లని పిలచెడివారు. కాలప్రియప్రాంగణమునుండి గూర్జరరాజును లేవదీయుట కింద్రవల్లభుఁ డా దేవాయతనము వరికట్టి దాని కోటగోడలపై దన యుద్ధపు టేనుగులను బురికొల్పవలసినవాఁ డాయెను. ఇరు పక్షములకు రణము సాఁగెను. మహీపాలుఁడు కర్ణాటకుల నెదిరించి నిలువజాలక పాఱిపోయెను.

అతని వెన్నంటి తఱుముచు చాళుక్య నరసింహుఁడు కన్యాకుబ్జమువఱకు బోయెను. మహీపాలున కొకచోటనైన నిలిచి రాష్ట్రకూటసైన్యముల నెదుర్కొనుటకు శక్తి చాలదాయెను. కావున నతఁడు పంప డన్న 'ట్లుమ్మలించుచు గుడిచినచో గుడువజాలక, పడుకొనినయెడ బడుకొనలేక, నిలిచిన పట్టున నిలువలేక' బలాయితుఁడాయెను. రాష్ట్రకూటసైన్యములు నిరాతంకముగ గన్యాకుబ్జముపై నడచి యా పట్టణమును ధ్వంసముగావించెను. ఈ యంశము మహోదయము నింద్రవల్లభుఁడు కుశస్థలము గావించె నను బుగూమ్రాశాసనవాక్యమువలన దెల్లమగుచున్నది.

ఇమ్మడి నరసింహుఁడు మహోదయదండయాత్ర నుండి వెనుదిరిగివచ్చిన పిమ్మట నేమి చేసెనో, యెంత కాలము జీవించియుండెనో తెలియదు. ఇతని పుత్రుఁడగు నిమ్మడి యరికేసరి క్రీ. శ. ౯౩౦ ప్రాంతమున నిజమండలమున కధిపతి యైనట్లు తెలియుచుండుటచేత నితని పాలన యంతదనుక సాగె నని మన మూహింపవచ్చును. ఇమ్మడి నరసింహుఁడు వేములవాడచాళుక్యుల యం దెల్ల మేటికాఁడు. మున్మడి యింద్రవల్లభుని యుద్ధములన్నియు నితని యాధిపత్యముక్రిందనే నడచెను. లాటమాళవగూర్జరప్రతీహారుల నోటమి యితని పరాక్రమాతిశయమును, సైన్యనిర్వహణకౌశల్యమును వెల్లడిచేయుచున్నది. ఇంతటి సేనాధిపతి మఱియొకఁడు భరతఖండమునం దా శతాబ్దమున లేఁ డని చెప్పుట యతిశయోక్తి గాదు. [సశేషము]

---

మున నతఁడు విజయారంభపురస్సరముగ విజయగజము లనుబట్టి గూర్జరరాజధ్వజిని నోడించె ననియు, మహీపాలుఁడు నిలిచిన తావున నిలువక పాఱిపోయె ననియు, గంగావారియందు దన తురంగమమును మెఱయించి సుప్రసిద్ధమైన కాళప్రియమున దన భుజగర్వము పెంపున దన యసిలతను స్థాపించె ననియు జెప్పియున్నది (పంప. విక్ర. విజ. ౧: ౩౬-౩౮). దీనిని బట్టి చూడగా కాలప్రియ మనునది గంగాతీరమున నుండెనా యను సంశయము గల్గుచున్నది. బుగూమ్రాశాసనమున నింద్రవల్లభుఁడు మహోదయమును (కనోజిని) నాశము జేసినట్లు చెప్పియుండుటచేత రాష్ట్రకూటసైన్యములు గంగానదివఱకు దాడి చేసె నని నిశ్చయముగ జెప్పవచ్చును. వేములవాడశిలాశాసనమునకును, విక్రమార్జునవిజయమునకును భేద మేల కలిగెనో చెప్పుటకు వీలులేదు. దీనికి వాస్తవకారణ మేమైనను కాలప్రియము గంగాతీరమందలిది కాదు.

# విధురభూమిక

శ్రీ ముదివర్తి కొండమాచార్యులు

జిలుగుంబంగరుచాయ లల్లుకొన ప్రాచీదిఙ్నభోవీథులఁ
తలసూపుఁ, చరమాశ గ్రుంకు బిసినీనాథుండు తొల్లింటియ
ట్టుల;— అల్లే తరితీపు వెన్నెలల గండూషించుచుఁ కల్వనె
చ్చెలి జోకొట్టు వసంతజీవజగతీసీమఁ నిశా వేళలఁ.

తొలుసంజఁ మలుసంజ విచ్చు కుసుమస్తోమంపు టామోదముల్
వొలయఁ, నిర్ఝరిణీహృదంతరమునఁ పొంగెత్తు శైత్యమ్ము చి
ప్పిలగా పుణ్యసమీరణమ్ము సతముఁ వీచుఁ బ్రసాదైకమం
జులగీతామృతనిస్వనమ్ముల నభస్సుఁ మారుమ్రోయించుచుఁ.

సరసక్షీరము ధర్మదేవతలు గోసాధ్వుల్ ప్రవర్షించు; ని
ర్ఝరిణుల్ పూతజలప్రపూర్ణములు; సస్యశ్యామలంబై వసుం
ధర నేత్రోత్సవముం బొనర్చెడు; సముద్రస్వామి కావింపడే
ధరణీరంగతలమ్ముపై విలయనృత్య మ్మిప్పు డుప్పొంగుచుఁ.

తరువుల్ లేఁతచివుళ్ళతో, విరులతో దైవారు మాంగల్యమా
ధురి గైసేయుచు చైత్రమందు: పికసందోహమ్ము మాధ్వీమనో
హారకంఠమ్ముల నెత్తి పాడెదు; స్వకీయంబైన ధర్మైకసం
సరణ మ్మందెగదోయి! షడృతువులుఁ సంచారముఁ సల్పెడిఁ.

హిమవంతమ్మును వింధ్యముఁ చటులవహ్నిజ్వాలలం గ్రక్కి స
ర్వము నిర్దగ్ధమొనర్పఁబోవుగద: విశ్వక్షోణి ఛేదిల్లి చి
త్రముగా స్థావరజంగమప్రతతి లిప్తఁ స్వీయగర్భాంధకా
రమహాగహ్వరమం దణంచుకొనెనా? రాఁగిల్లి తా నీమెడఁ.

ఒకనాఁడుఁ శిఖ గోలుపోవదుర నైజోష్ణమ్ము సుంతైన; నిం
తకు నేమారుపు జెంద దొక్కయణువైనఁ పంచభూతాత్మక
ప్రకృతిఁ; కాని, ప్రసన్నతామధువు నాస్వాదింప వీ లేది? గొం
తుక కుచ్చుల్ బిగియించి వింత గనుగొంచుఁ నిల్చు నేదో యిటఁ.

అనుగుందల్లి సుధాన్నభిక్ష నిడగా, అయ్యయ్యొ! యేదో తటా
లున తా తన్నుకపోయె నీ యనదమూల్గుఁ సుంత లెక్కింపకే;
మను టెట్లో యిఁక మీఁద? నా అమృతధామమ్ముఁ దహింపంగ వ
చ్చిన దేదో పెదపెద్ద అంగ లిడుచుఁ జిహ్వల్ వెసం జాచుచుఁ.

కథానిక

# రిక్షావాలా

శ్రీ 'కరుణకుమార్'

ఆ దినం పెద్ద పండగ. కలిమికలిగిన మహారాజుల యిళ్లన్నీ కళకళలాడుతున్నవి. పచ్చతోరణాలు, పంతముగ్గులు, కొత్త గుడ్డలు, పిండివంటలు, మృష్టాన్నభోజనా — ఓ! సృష్టి యావత్తూ శోభాయమానంగా వెలిగిపోతోంది.

ఏయింట బట్టిగా పండగశోభ అనేక రూపాలతో అవతరించి నృత్యం చేస్తోంది. ఇంట్లోని ఆడా మొగా, చిన్నా పెద్దా కోడికూతక్షణంలోగా మొదలు క్షణం తీరిక లేక అనేకవిధమైన నూతనచైతన్యంతో తిరుగాడుతున్నారు. ఆరోజు చేసుకోవలసిన పిండివంటలు, వంటకాల విషయంలో గత రాత్రినుండీ బయల్దేరిన తర్కాలు, చర్చలు అనుకొన్నంత సూక్ష్మంగా తీర్మానాలు కావడంలేదు. ఒకరికి లడ్డూ లిష్టమైతే, మరొకరికి మైసూరుపాకుమీద మనస్సు మళ్లుతోంది. ఒకరికి పెరుగువడ లిష్టమైతే, మరొకరికి మెదువువడలు రుచి. ఒకరు పులిహోర ప్రతిపాదిస్తే, మరొకరు దధ్యోదనం ఉపపాదిస్తున్నారు. పెద్దల్లుడికి బొబ్బట్లమీద భ్రాంతి అయితే చిన్న అల్లుడికి అతిరసాలమీద ఆశ. ఇంతపండగ జరుగుతూంటే ఒక్క పప్పు ఉండక తప్పదు గదా? కనీసం రెండు కూరలు, ఒక వేపుడు, మూడు పచ్చళ్లు, ధప్పళం, కట్టుచారు, పిండివడియాలు, అప్పడాలు, పెరుగు — ఇంత మాత్రమైనా ఉండకపోతే ఎట్లా? ఇక క్షీరాన్నం లేనిది పండగగడియలు గడిచి బయటపడటం ఎట్లా?

తెల్లవారేసరికి పరుగబడి పోతున్నారు జనం — సంచీలు పట్టుకొని మార్కెట్టుమీదికి. తెల్లవారకుండానే పొరుగూళ్లనుండి పాలు, పెరుగు తెచ్చే అమ్మలక్కల కాళ్లకడ్డం తగిలి దారిలోనే బేరమైనా చేయకుండా ఎగరేసుకొని పోతున్నారు దధిక్షీరాలు. ఆరోజు సర్కారు ఆఫీసులకు, కచ్చేరీలకు, కోర్టులకు సెలవు. కాలేజీలకు, పాఠశాలలకు సెలవు.

ప్రపంచం యావత్తూ ఇంతటి శోభతో వెలిగిపోతూంటే, ఆ రిక్షావాలా చేసుకొన్న పాపకర్మమేమిటి? ఏమిటి వాడి అవతారం? ఇక వాడు తలకు నీళ్లు పోసుకొని కొత్తగుడ్డ ధరించేది ఎన్నడు? కప్పుకప్పరచీకటిలో వాడు రిక్షా లాగలేక లాగలేక ఈడ్చుకొంటూ దిక్కులుచూస్తూ వచ్చి బంగళాకాంపౌండు

గోడమీదినుండి బయటికి వంగిన పచ్చ గన్నేరు చెట్టుక్రింద వీధిలో వొరిగి పోతున్నాడు. కొత్తగుడ్డలు ధరించి, బయట తిరిగే ప్రతి సంపన్న గృహస్థుకీ లేచి నిలబడి దండాలు పెట్టుతున్నాడు. కాని, ఆనాడు వాడెవడి ముఖం చూచి బయలుదేరాడో, ఒక్కరూ చెప్పరు రిక్షా కావా లని.

సూర్యోదయం అయి ఎండబరుకుతోంది. చద్దినీళ్లు తాగే గడియలు. కాని యింటికాడ వాని భార్య గతరెండురోజులుగా పనిచెడి లేవడం లేదు.

కడచినరోజుకూడా వాడికి పాపిష్ఠిరోజే. ఆరోజు పొద్దస్తమానూ వాడు రిక్షా లాగి సాయంకాలానికి సంపాదించుకొన్న ఒక్క రూపాయిడబ్బులలోనూ, తన రిక్షాకు లాంతరుదీపం లేకుండా లాగుతున్నందుకు ఛార్జి చేస్తానని బెదిరించిన పోలీసుజవానుకు త్రాగుడుక్రింద పన్నెండు అణాలు లంచం పెట్టి, మిగిలిన నాలుగణాలూ రిక్షాఖామందుకు బాడుగక్రింద జమకట్టి, దణ్ణాలుపెట్టు కొన్నాడు. ఇక ఆరాత్రి వాడికి గుడిశలో మసలకుడుములతో కుక్షినిండి, తెల్లవార్లూ, తానూ, తనభార్యా కడుపులో కాళ్లు ముడుచుకొని కాలంగడిపేరు.

కాని, తెల్లవారినా వాడికి మంచి గడియలు వచ్చినట్లు లేదు. చద్దినీళ్లు తాగే వేళకు కడుపులో మంట లేచి నీరసించి, ఆకలి తీర్చుకోను ఇన్ని ఉప్పు శనగలు కొనుక్కోనూ వానిచేత దమ్మిడీ కనిపించని దుర్దిన మయిపోయింది ఆ మాయ దారిపాడుగదినం. కాయకష్టం చేసి జీవనం గడుపుకొనే అతగాడికి దేహీ అని చెయ్యి చాపి ఒక్క కానీడబ్బు ముష్టిఅడుక్కోను నోరు రావడంలేదు. బొడ్డున ఉన్న పొగాకు కాడ ఒకటి త్రుంచి, నోట పెట్టుకొని దాని రసంతో తన నీరసం పోగొట్టుకోవడానికి ఉవ్విళ్లూరుతున్నాడు రిక్షావాలా!

ఎండబడి పదిగంటలు పొద్దెక్కింది. పదకొండు అయింది. పన్నెండు కూడా అయింది. వొట్టు పెట్టినట్టు ఆరోజు రిక్షావాలాకు బాడుగ దొరికితే వొట్టు! ఎండ ముదిరి చిటచిటలాడుతోంది. మండే శరీరాన్ని గన్నేరుచెట్టునీడనే సేద తీర్చు కొంటున్నాడు. వచ్చే పోయే సంపన్నులను 'రిక్షా సామీ' అని అడిగిఅడిగి వాడికి ప్రాణం విసిగిపోయింది. ప్రాణం శోషిల్లి రిక్షాలోనే వొరిగి కళ్ళు మూసుకొన్నాడు రిక్షావాలా.

ఎంతకాల మావిధంగా పడిఉండినాడో, కాంపౌండుగోడమీదుగా విసరిన పుల్లాకుల విస్తళ్ల దొంతర దభీమని తన రిక్షాసమీపాన్నే క్రింద సైడుకాలువలో పడేవరకూ. వానికి మెలకువ వచ్చి కళ్లు తెరచి చూచేసరికి — ఎక్కడ కనిపెట్టుకొని ఉండినవో నూరు కాకులు వచ్చినట్లు వచ్చి ఆ పుల్లాకుల్ని ముక్కులతో, కాళ్ళతో ఈడ్చి చింపి లాగేస్తున్నవి. కాకులను తరముకూ నాలుగు పందులు ఆకుల్లో మూతులు పెట్టి గతకడం మొదలుపెట్టినవి. రెండు కుక్కలు వాయువేగంతో వచ్చి పందులపై బడి పుల్లాకులన్నిటినీ భీభత్సంచేసిపారేసినవి.

ఆ పుల్లాకుల్లోనుండి కొట్టిన కమ్మని వంటకాల వాసనకు రిక్షావాలానోరు ఊటలూరి, కడుపులో ప్రేగులు గుర్రుమని కొట్టుకోసాగినవి. అది వాని కొక అనను

భూతమైన అనుభవం. ఏనాడూ ఎరగని వాని ఆభిజాత్యం అడ్డు తగిలి సైకుకాలవల్లో పడిన పుల్లాకులమీద రోతనే పుట్టించింది. అందులో పందులు మూతిబెట్టిన వస్తువు తాను తాకడం ఎట్లా?

మిటమిటమంటూ సూర్యరశ్మి వేడెక్కిన కొద్దీ వాని శరీరం భగభగమని మండి పోతోంది. రెండుచెవులలోను శోషవల్ల హోరుమని శబ్దం బయలుదేరింది. ఆనాడు కూడా సాయంత్రంవరకూ వాడికి చిన్న డబ్బు సంపాదన లేపోయినట్టయితే యిక బ్రతకడం ఎట్లా? అతని కేమీ పాలుపో లేదు. తోటిరిక్షావాణ్ణి ఒక్క పావులా డబ్బులు అప్పు అడిగాడు. 'పండగపూటా బకు లేమి' టని ఈసడించి ఊరుకున్నా డత గాడు.

ఇంతలో కాంపౌండుగేటు తెరచుకొని ఒక పెద్దమనిషి బయటకు వచ్చి 'రిక్షా' అని పలకరించాడు.

ముఖమంతా కండ్లు చేసుకొని, కొండంత ఆశతో 'స్వామీ' అని రిక్షావాలా లేచి నిలబడి దణ్ణం పెట్టాడు.

"ఛార్జీలోకి ఏమి తీసుకొంటావు?"

"నీ దయ వచ్చినంత ఇవ్వు సామీ"

"తర్వాత తగువులాడితే నేను ఒప్పుకోను. మూడణాలకంటె ఎక్కువ నే నెన్నడూ ఇవ్వలేదు."

"నీచిత్తం." అని అంటూ, మూసిన గూడు ముందుకు విప్పి, తన వాహనం రోడ్డు మీదికి లాగి, దిండుమీది ధూళి దులిపి— "రా, స్వామీ" అన్నాడు రిక్షావాలా.

చేతిలోని తమలపాకులకు సున్నం రాచి పంటినందున కొరికి, "గోవింద, గోవింద" అంటూ రిక్షా అధిరోహించాడు ఆ పెద్దమనిషి.

ఆయన నొక స్థూలకాయుడు. నడిమి వయస్సువాడు. ముఖాన ఉన్న గంధం, అక్షతలూ అతను బ్రాహ్మణుడనే తెలియ జేస్తున్నవి. కాని కట్టిన ధోవతివల్లా, వేసుకొన్న కోటువల్లా అత డొక ప్లీడరో, సర్కారుఉద్యోగో అనికూడా అనుకో వచ్చి ఉంటోంది. అతని బరువుకు రిక్షా రవంత జవజవలాడిపోయిందిగాని క్రింద కమానులుమాత్రం విరగలేదు.

రిక్షాకు దణ్ణం పెట్టి కళ్ళకద్దుకొని, పరమాత్మా అంటూ గాడిపై కెక్కికొన్నాడు రిక్షావాలా. ఆ ఊపునకు బ్రాహ్మడి కడుపు లోని నీళ్లు కొబ్బరిబోండంలా గళగళ కొట్టుకున్నవి.

పాడురోడ్డు! మునిసిపల్ పరిపాలనంకటి అధ్వాన్నపు ప్రభుత్వం మరొకటి ఉండ బోదు. అడుగడుక్కీ రోడ్డు చెడిపోయి గుంతలు పడి ఎగుడూ దిగుడూను! ఎన్నెన్ని వేలు వసూలయినా ఈ మాయ దారి మునిసిపల్ బడ్జెట్టులో బొక్కపడడం, చివరకి రోడ్డు మరామ్మత్తుకి డబ్బు కొరతబడి పోవడమూను. ఆ పాపిష్ఠి రోడ్డుమీద పోతుంటే — పాపం, భక్తాయాసమయినా తీరకుండ బయలుదేరాడేమో—ఆ బ్రహ్మ డికి ప్రాణాంతకంగా ఉన్నది ఆ కుదుపు. రోడ్డుకి తగినట్టుగానే ఉన్నది రిక్షా కూడా. అదొక పాత బొచ్చె. కమానులన్నీ కదలిపోయి లొటలొటలాడుతూ రవంత

వల్లదప్పితే విరుచుకొని క్రిందపడిపోయేటట్టు ఉన్నది ఆయనఘటం. క్రింద దిండుని వల్లులే ఉన్నాయో ఏమో, పుటుకుపుటుకు మంటూ మనిషికి స్తిమితం లేకుండా పోతోంది. మిట్టమధ్యాహ్నపు ఎండేమో, బ్రాహ్మడికి మొఖంమీదా, మెడక్రిందా చిరుచెమ్మట పోసి శరీరం పేలినట్టు చిటచిట లాడిపోతోంది. 'ఎందు కెక్కితినా ఈ రిక్షా' అని ఆయన దిగులుపడుతూ కేకేస్తున్నాడుగాని, "రిక్షా నిలుపు" అని మాత్రం ఆయననోటి వెంట రావడంలేదు.

రిక్షావాడి బాధ ఆ పరమాత్ముడికే తెలియాలి. లోపలి మనిషిభారం తనకి మించిన భారంలా బరువెక్కిపోయింది. ఆ పాడురోడ్డుమీద ఆ రిక్షా లాగాలంటే అతగాడికి ప్రాణం తోకకి వస్తోంది. అందులో రెండు పూటలుగా అన్నరసం లోపలికి పోనటువంటి గడియ లేమో, వాడికి అడుగడుక్కీ ఒక గండమైపోయింది. ఎంతెంత దమ్ము పట్టి హుంకరించినా, గుండెదడా, ఆయాసమూ, నోరెండిపోవడమూ మాత్రమే కాని రవంతకూడా రిక్షా కదులుతున్నట్టు అతగాడికి కనిపించడంలేదు. "రిక్షా లాగలేను స్వామీ" అని వదలుకొంటే ఆరోజుకా మూడణాలుకూడా దక్కకుండా పోతవేమోనని అతగాడి దిగులు. ఆ మూడణాలూ మూడు వందల రూపాయలుగా అతనిహృదయంలో వెలిగిపోతున్నవి. అది ఆరణాలు తీసుకోవలసిన ప్రయాణమైనా తాను నోరువిప్పి బేరంచేస్తే అసలుకు మోసం రాగలదేమో అనే భయంచేత బ్రాహ్మడు మూడణాలంటే తానున్నూ మాబాగన్నాడు.

ప్రయాణంకుదుపునకు బ్రాహ్మడి నిండు కడుపు బరువెక్కి డొక్కలో సన్నని నొప్పి కూడా బయలుదేరుతోంది. పండగ భోజనంలో ఏయే పదార్థాలు, పిండివంటలు పడ్డాయో ఆయన కుక్షిలో—ఆ ఎండలో, ఆ రిక్షామీద, ఆ రోడ్డుమీద—బ్రాహ్మడికి ఆయాసం, వగర్పుకూడా పుట్టుకొని వచ్చినవి. భోజనానంతరం సేవించిన తాంబూలంవల్ల భుక్తాయాసం రవంత సర్దుకోవలసినదే నిజానికి; కాని ఆ దిక్కుమాలిన ప్రయాణంలో తాంబూలసేవన కూడా ఆయనకు వెగటుపుట్టి వికారంవల్ల ఛూ అని ఉమ్మివేసి ఊరుకున్నాడు. ఆ బాధపడలేక రిక్షా దిగి యింటికి పోవాలనుకొన్నాడు బ్రాహ్మడు. కాని సగందూరం వచ్చినతర్వాత దిగిపోతే పూర్తిగా మూడణాలూ తీసుకోకుండా విడిచిపెట్టుతాడా రిక్షావాడు? ఆరణాలు ఇచ్చుకోవలసిన ప్రయాణం తనకి మూడణాలకే దొరికింది. ఎట్లా పోగొట్టుకోవడం? పోగొట్టుకొని దిగితే, తిరిగి యింటికి పోవడం ఎట్లా? తాను నడిచి వెళ్లే స్థితిలో లేడే! మరణవేదనలో ఉస్సురని నిట్టూర్చి, "గోవింద, గోవింద" అని భగవన్నామం స్మరించాడు బ్రాహ్మణుడు.

"నారాయణమూర్తీ!" అని ఉస్సురంటున్నాడు రిక్షావాలా. 'కరువులో అధికమాసం' అన్నట్టు అక్కడ ఎత్తయిన బ్రిడ్జి ఒకటి దాపురమైంది. రిక్షావాడు హుం అని హుంకరించి బ్రిడ్జిమీదకి లాగుతూంటే శరీరం యావత్తూ ముచ్చెమటలు పోసి, గొంతులో వేడినిట్టూర్పువల్ల తడి ఎండిపోయి, ఒక్కొక్కతడవ తను ముందుకు లాగే రిక్షా అంత బరువుతోనూ తటాలున

వెనక్కి కూడా జరిగిపోతోంది. రిక్షా చెయ్యి జారితే ఏం ప్రమాదం సంభవిస్తుందోనని బ్రాహ్మడు భగవంతుడిమీద భారంవేసి, "భద్రం, భద్రం" అని పైనుండి క్రిందివాడికి హెచ్చరిక చేస్తున్నాడు.

బ్రిడ్జి ఎక్కేసరికి తిరపతికొండ ఎక్కినంత పని అయి, రిక్షావాడు తలక్రిందులై పోతున్నాడు కాని, బ్రాహ్మడు మాత్రం బ్రదుకు జీవుడా అని ఒక్క నిట్టూర్పు విడిచాడు.

కాని, కష్టసుఖాలు కావడికుండలు. బ్రిడ్జి ఎక్కి దిగుడులో క్రిందికి తిరిగేవరకు కొండమీదినుండి దొర్లించిన పుచ్చకాయలా జర్రున జారిపోతోంది రిక్షా. ఈసారి రిక్షా బలవంతాన లాగవలసిన ప్రమేయం వాడికి లేకపోయినప్పటికీ ఆదూకుడులో రిక్షాతో సమానంగా పరుగుపెట్టవలసివచ్చింది— రిక్షావాడికి. రిక్షాదూకుడుకు, ఆ గుతుక రాతిరోడ్డుమీద బ్రాహ్మడి శరీరం హూనం అయిపోయినట్టయి కడుపులో వెర్రిబాధ బయల్దేరి, రిక్షా పూర్తిగా క్రిందికి దిగే పర్యంతమయినా ఆ బాధకి తట్టుకోలేక—

"ఇస్సు, అబ్బా! నిలపరా నీయమ్మ కడుపు కాలా!" అని బ్రాహ్మడు వెర్రికేక పెట్టాడు.

ఆ కేకతో బేజా రెత్తి, బలవంతాన రిక్షా రోడ్డు పక్కకి లాగి నెమ్మదిగా కిందికి దింపేడు రిక్షావాలా.

ఆ బ్రాహ్మడికి అదేమి బాధో పాపం, రిక్షాలోనుండి క్రిందికి దిగడానికయినా సందులేకుండా రిక్షాలో కూర్చునే బయట రోడ్డుమీదికి ఒక్కు ఓక్కుమని డోక్కుంటూంటే, కడుపులోని హోళిగ ముక్కలు, ఆవడలు, క్షీరాన్నం, కూర ముక్కలు, సాఫుఛీనా కడిగివేసినట్టు భాళ భాళమంటూ బయటపడిపోయి ఆ బ్రాహ్మడికి ప్రాణం కడంటిపోయింది.

ఆ ప్రయాణపు దెబ్బకి మలమల మాడే కడుపులో చెయ్యిపెట్టి కలచినట్టయి రిక్షావాలాకి వికారం పుట్టి వొళ్లు తిరిగి ప్రక్కనే రోడ్డుమీద కూర్చుని చిన్నప్పుడు తిన్న దొంగకుపసరంతా కక్కుకుంటూంటే దోవన పోయే ఒక మోటారు అక్కడ నిలిచి—

"అయ్యో, పెద్దవానికి కొంత ఆపద వచ్చిం" దంటూ బ్రాహ్మణ్ణి ఎక్కించుకొని యింటిదగ్గర దిగబెట్టింది.



# రష్యన్ కథకుడు ఆంటన్ చెకోవ్

'చతుర్వేది'

ఏ పత్రిక చేతికి దొరికినా దాని చదువరి అందులో కథ ఉన్నదా, లేదా అని ముందుగా వెతుకుతాడు. ఒక్క తెలుగుసాహిత్యంలోనే కాదు, ప్రపంచసారస్వతంలోనే కథానిక ఈనాడు ఒక అద్వితీయమైన స్థానాన్ని సంపాదించుకున్నది. ఇప్పుడు నవలకాని, నాటకంకాని, కావ్యంకాని, వ్యాసం కాని కథానికతో పోటీచేసి నెగ్గలేవు.

దీనికి చాలా కారణాలు ఉన్నయ్. కాని ముఖ్య కారణం ఇద్దరు వ్యక్తులు—రష్యన్ కథకుడు ఆంటన్ చెకోవ్, ఫ్రెంచికథకుడు గై డీమాపసాం. కథకులుగా వీ రిద్దరూ అద్భుతమైన ప్రతిభను ప్రదర్శించారు. వీరి మూలాన్నే కథానికకి ఈనాడు విశ్వసాహిత్యంలో ఇంత అపూర్వమైన ఆదరణ లభించింది.

అందుకే ఒక విమర్శకుడు "కథానికారచనలో రెండు విశిష్టమైన, విభిన్నమైన పద్ధతు లున్నయ్. ఒకటి చెకోవ్ పద్ధతి; మరొకటి మాపసాం పద్ధతి. ఎంత స్వతంత్రుడైన కథకుడైనా తనకి తెలియకుండానే వీరిద్దరిలో ఒకరిని తప్పకుండా అనుసరించి తీరాలి" అన్నాడు. కథకులుగా వీరు తొక్కని దారి లేదు. వీరు చూపని శిల్పవిన్యాసం లేదు.

ఆంటన్ చెకోవ్ కథలు నాటకధోరణిలో నడుస్తయ్. మాపసా కథలు కావ్యశైలిని అనుసరిస్తయ్. తను ఎడంగా నిలబడి తన పాత్రలకి ప్రాణంపోసి వాటి మాటల్లోనూ, చేతల్లోనూ చెప్పదలచినదంతా ఇమిడ్చి చెకోవ్ కథని చకచకా నడిపిస్తాడు. తన పాత్రల్లో లీనమైపోయి, పాత్రలని ఛాయామాత్రులుగా వుంచి మాపసా తనే కథంతా చెబుతాడు. మాపసా తన కథల్లో అడుగడుగునా వ్యాఖ్యాతరూపంలో కనబడుతూ వుంటాడు. చెకోవ్ షేక్స్పియర్‌లాగా సజీవమైన పాత్రల్ని సృష్టించి వాటి ప్రవర్తనలోనూ, సంభాషణలోనూ తను చెప్పదలచుకున్నదంతా వినిపిస్తాడు. తను దూరంగా నిలబడి తన పాత్రలచేతనే కథ నడిపిస్తాడు. అనవసరమైన వర్ణనలూ, అప్రస్తుతమైన వ్యాఖ్యానాలూ చెకోవ్ కథల్లో కనిపించవు.

కథలద్వారా లోకాన్ని మరమ్మతు చెయ్యాలనే ఉద్దేశం చెకోవ్‌కి ఏకోశానా లేదు. హితోపదేశాలు చెయ్యటం, నీతిబోధనలకి పూనుకోవటం తన పని కాదని చెకోవ్ స్పష్టంగా చెప్పాడు. "దొంగతనం చెయ్యటం నేరం అన్న సంగతి అందరికీ తెలుసు. దొంగతనం చెయ్యటం ఎటువంటిదో చిత్రించటమే కథకుడి కర్తవ్యం. ఇది తప్పు, ఇది ఎన్నటూ చెయ్యరాదు అని బోధించటం నాపని కాదు" అన్నాడు చెకోవ్.

"కథల ఆదర్శం సత్యాన్ని చిత్రించటం" అని చెకోవ్ ఉద్దేశం. ఈ ఆదర్శాన్నే తన సాహిత్యంలోనూ, తనజీవితంలోనూ సాధించటానికి చెకోవ్ ఎంతో పాటుపడ్డాడు. అసాధారణమైన పాత్రలకీ, అసహజమైన సంభాషణలకీ, అతిశయోక్తితో కూడిన వర్ణనలకీ చెకోవ్ కథలలో స్థానం లేదు. అంతటా సహజత్వమే గోచరిస్తుంది. ఒకపాత్ర చెయ్యి కదిపినా, భుజాలు ఎగరేసినా, ఏపని చేసినా పాత్రోచితంగా వుంటుంది. సజీవమైన పాత్రలని సహజంగా చిత్రించటంలో చెకోవ్ అందెవేసిన చెయ్యి.

చెకోవ్‌కి శాస్త్రజ్ఞానంమీద చాలా అభిమానం. శాస్త్రీయదృక్పథం ప్రతికళాకారుడూ సాధ్యమైనంతగా అలవరుచుకోవాలని అతని అభిప్రాయం. శాస్త్రీయదృక్పథం లేని కళాకారుడు సత్యాన్ని యథాతథంగా చిత్రించలేడని చెకోవ్ ఉద్దేశం. "నేను రచయితగా జీవితం ఆరంభించకముందే డాక్టరు డిగ్రీకోసం చదవటం మొదలుపెట్టాను. వైద్యంలో నేను సంపాదించిన విజ్ఞానం వృథాపోలేదు. ఆ చదువు నా రచనలకి ఎంతో తోడ్పడింది. ఆ చదువువల్ల నా పరిశీలనాశక్తి చాలా పెంపొందింది" అంటాడు చెకోవ్. డాక్టరు రోగిని పరీక్షించి వ్యాధిని నిర్ధారణ చేసినట్లుగానే చెకోవ్ తన పాత్రలని నిశితంగా పరిశీలించి, వాటి స్వభావాలలోని మెలుకువలని మన కళ్లకి కట్టేట్లు వర్ణిస్తాడు. ఆ పరిశీలనలోనూ, వర్ణనలోనూ లేశమైనా అతిశయోక్తి కనిపించదు. చెకోవ్ కథల్లో కూడా డాక్టరుగానే కనబడతాడు.

ఆంటన్ చెకోవ్ ౧౮౬౦ వ సంవత్సరంలో పేదకుటుంబంలో పుట్టాడు. అతని తండ్రి ఏదో చిన్న దుకాణం పెట్టుకుని కాలం వెళ్లదీసేవాడు. ఎంతో

కష్టంమీద చిన్న తరగతులన్నీ దాటి డాక్టరు చదువులో చేరాడు. కాని డబ్బు లేదు. చదువుకోవాలనే ఆసక్తి ఎక్కువగా వుంది. డాక్టరు చదువుకి సరిపడ డబ్బు సంపాదించుకోవలసిన అగత్యం ఏర్పడింది. అందుకోసమే మొదట చెకోవ్ కలం చేతబట్టి రాయటం మొదలుపెట్టాడు. ఈ మొదటిదశకి సంబంధించిన రచనలన్నీ హాస్యప్రధానమైనవి. చెకోవ్ హాస్యంలో మొదట మోటుతనం వుండేది. కాని పోనుపోను చెకోవ్ అత్యుత్తమమైన హాస్యాన్ని సృష్టించగలిగాడు. చెకోవ్ నవ్వుతుంటే వానవెలిసిన వెంటనే వెన్నెల వచ్చినంత హాయిగా వుంటుంది. ఆ నవ్వు జీవితంలోని మారుమూలల్లో దాగిన కారుచీకటి నంతనీ పటాపంచలు చేస్తుంది. ఇంకొకళ్లయితే గుండెలు బాదుకుని ఏడ్చే పరిస్థితుల్లో చెకోవ్ చిరునవ్వులు వెదజల్ల గలిగాడు. ఈహాస్యం చెకోవ్ జీవితంలోనూ, రచనల్లోనూ వెల్లివిరిసే ప్రధానలక్షణం. పేదరికంవల్లా, క్షయవ్యాధివల్లా ఎన్ని బాధలుపడ్డా చెకోవ్ కుంగిపోలేదు. జీవితంలోని సుడిగుండాలలో చిక్కుకోకుండా హాస్యమే చెకోవ్‌ని కాపాడింది. ఈ హాస్యమే జీవితంలోని అన్ని దుఃఖాలనీ, అన్ని బాధలనీ ఓడించిన అద్భుతశక్తి.

కాని, జీవితంలోని కన్నీటితో పరిచయమున్నవాడే ఉత్తమమైన హాస్యాన్ని సృష్టించగలుగుతాడు. మెరిసే చిరునవ్వుమాటున తొణికే కన్నీరుకూడా కనబడాలి. అశ్రువులనూ, దరహాసాలనూ మేళవించగలిగిన రచయితే ప్రసాదమైన, మధురమైన హాస్యరసాన్ని చదువరులకి అందించగలడు. ఇటువంటి హాస్యం చెకోవ్ కథల్లోనూ, నవలల్లోనూ, నాటకాల్లోనూ అంతర్వాహినిగా ప్రవహిస్తూవుంటుంది.

చెకోవ్ రష్యన్ సారస్వతంలో ఒక విశిష్టమైన శక్తి. అంతే కాదు; ఒక అసాధారణమైన వ్యక్తి. రష్యాదేశమంతా విప్లవోద్రేకంతో రణదుందుభులు మోగించిన సమయంలో తనకి హింసాత్మకమైన విప్లవంమీద విశ్వాసం లేదని వెల్లడించాడు చెకోవ్. తన అభిప్రాయాన్ని నిర్భయంగా ప్రకటించి దేశీయుల నిరసనలకి, నిందలకి చలించకుండా నిలబడిన సాహసి చెకోవ్. అటువంటి సమరోత్సాహంలో జాతి అంతా మునిగి తేలుతున్నప్పుడు ఆ వెల్లు లో పడి కొట్టుకుపోకుండా దూరంగా నిలబడగలగటం సాధారణమైన వ్యక్తులకి సాధ్యంకాని పని.

కాని విప్లవవ్యతిరేకి అన్నంతమాత్రాన చెకోవ్‌ని చిన్నచూపు చూసేవారుండవచ్చు. అతనికి ప్రజల ఉద్యమాలమీద అభిమానం లేదనీ, ప్రజల అభ్యుదయంలో ఆసక్తి లేదనీ కొందరు భావించవచ్చును. నిజంగా ఆలోచిస్తే చెకోవ్ జీవితంలో వెల్లివిరిసే ప్రజాహితకాంక్ష, అతనిరచనల్లో నిండి తొణికే జీవకారుణ్యం విప్లవావేశంతో వెర్రికేకలు వేసేవారిలో ఎందరిలో కనిపిస్తయ్? అతను రాజకీయాల్లో జొరబడలేదు. అయినప్పటికి అనుక్షణంగా తోడిమానవుల శ్రేయస్సుకోసమే పరితపించేవాడు. ఇతడు చేసినంతటి ప్రజాసేవ సంఘసంస్కర్తలమనీ, విప్లవకారులమనీ గొప్పలు చెప్పుకొనేవారిలో ఎందరు చేసివుంటారో చెప్పటం కష్టం. చెకోవ్ జీవితంలోని ఒక్క సంఘటన చాలు. చెకోవ్ ౧౮౯౦ లో, అంటే సైబీరియన్ రైలుదారి పడకముందు ఒంటరిగా సైబీరియానుండా ఆసియాలో వున్న సాఘేలియన్ ద్వీపానికి వెళ్ళి అక్కడి ఖైదీల పరిస్థితులని పరిశీలించి వచ్చాడు. ఇది మానవమాత్రులకి సాధ్యంకాని ప్రయాణం. చెకోవ్ దారిలో పడ్డ ప్రయాసవల్లా, కష్టాలవల్లా భయంకరమైన క్షయవ్యాధికి గురికావలసివచ్చింది. అయినా చెకోవ్ వెనకాడలేదు.

డాక్టరు డిగ్రీవల్ల చెకోవ్ దమ్మిడీకూడా సంపాదించలేకపోయాడు. కాని ఆర్తులను రక్షించటానికి ఈ వృత్తి బాగా పనికివచ్చింది. ౧౮౯౨ లో నిజ్నినోవొగ్రాడ్‌లో కలరా విలయతాండవం ప్రారంభించింది. ముందువెనకలు చూడకుండా అక్కడికి దూకి చెకోవ్ క్షణంకూడా విరామం లేకుండా రోగులకి వైద్యసహాయం చేశాడు. అప్పుడు చెకోవ్ గర్భదరిద్రుడు. అతనిచేతిలో కలం ఆడితేనే నోట్లోకి ముద్ద. అతనే కుటుంబానికంతటికీ ఆధారం. కాని రోగుల సేవలో క్షణంకూడా రాసుకునే తీరిక లేదు. అటువంటి క్లిష్టపరిస్థితిలో చెకోవ్‌కి కృతజ్ఞతాపూర్వకంగా రష్యన్ ప్రభుత్వం కొంత వేతనాన్ని ఇస్తామన్నారు. ఇంకొకళ్లయితే ఆ స్థితిలో ఎగిరి గంతేసి పుచ్చుకునేవాళ్లు. కాని చెకోవ్ ఆ వేతనాన్ని తిరిగి పంపేశాడు. తను దారిద్ర్యంతో క్రుంగిపోయినాసరే, తన వ్యక్తిస్వాతంత్ర్యాన్ని ప్రభుత్వవేతనానికి బలిచేసి బానిస కాకూడదని చెకోవ్ స్థిరవిశ్వాసం. సొంత లాభం కొంతమాత్రమేకాదు, అంతా మానవుని పొరుగువారికి తోడుపడిన చెకోవ్ నిజంగా అసాధారణమైన వ్యక్తే. అందుకే ప్రఖ్యాతవిమర్శకుడు

మిడిల్టన్ మర్రీ చెహోవ్‌ని మహాత్ముల శ్రేణిలో చేర్చాడు.

వర్గపక్షపాతం చెహోవ్ రచనల్లో ఎక్కడా కనబడదు. దుర్గుణాలన్నీ ధనికులలోనూ, సద్గుణాలన్నీ బీదలలోనూ వుంటాయని చెహోవ్ చెప్పడు. స్వార్థత్వం, క్రూరత్వం అన్ని తరగతులవారిలోనూ, అన్ని తరహాల వారిలోనూ వుంటాయని చెహోవ్ వుద్దేశం. అందుచేత కేవలం బీదవాళ్ళమీదనే సానుభూతి చూపాలనే సంకుచితవాదం చెహోవ్‌కి గిట్టదు. మనిషి తన వర్గ భేదాన్ని మరిచిపోయి, జగత్కుటుంబంలో తానొక డుగా మెలుగుతూ, తోటిమనిషిని తనలాగా చూసు కోవాలని చెహోవ్ విశ్వాసం. అన్ని భేదాలకీ అతీత మైన మానవవ్యక్తిత్వానికే అగ్రపీఠం ఇవ్వాలని చెహోవ్ అభిప్రాయం.

ఈ హృదయవైశాల్యం చెహోవ్ రచనలన్నిటి లోనూ శరత్కాలపు వెన్నెలలాగా చల్లగా చదువరి మనసుని మంత్రించివేస్తుంది. అతని ఉత్తమకథానిక లైన 'డార్లింగ్', 'కిస్', 'మై లైఫ్', అతని విశ్వ విఖ్యాతి చెందిన నాటకం 'చెర్రీ ఆర్చర్డు' ఈ విశాల దృక్పథాన్నే ప్రదర్శిస్తాయి.

కొన్ని విషయాల్లో టాల్‌స్టాయ్‌కీ, చెహోవ్‌కీ పోలిక వుంది. ఇద్దరికీ ప్రేమ, స్వాతంత్ర్యం, సంపూర్ణ మైన స్వేచ్ఛా ఆరాధ్యదైవాలు. ఇద్దరికీ అసత్యంమీదా, హింసమీదా ప్రబలవిరోధం.

టాల్‌స్టాయ్‌మీద చెహోవ్‌కి ఎంతో భక్తి. సాహిత్యప్రపంచంలో టాల్‌స్టాయ్ ఎవరెస్టు శిఖర మని చెహోవ్ విశ్వాసం. "ఇంతగా నే నింకెవరినీ ప్రేమించలేదు. టాల్‌స్టాయ్ లేకపోతే నా జీవితంలో తీరని కొరత ఏర్పడుతుంది" అన్నాడు చెహోవ్. కాని టాల్‌స్టాయ్‌వైరాగ్యం చెహోవ్‌కి మింగలేని చేదు మాత్రగా గొంతుకి అడ్డంపడింది. జీవితంలోని రమ ణీయమైన వస్తువులన్నిటికీ దూరంగా తొలగిపోయి ముసలివేదాంతాలతో పొద్దుపుచ్చటం చెహోవ్‌కి చేత కాని పని. స్త్రీల అందమంటే టాల్‌స్టాయ్‌కి రోత, భీతి; చెహోవ్‌కి జోత, ప్రీతి.

సాహిత్యంలో చెహోవ్ ఆధునికుడు. శిల్పంలో అధునాతనుడు. కొన్నికథలు కేవలం రేఖాచిత్రా లుగా వుంటాయి. కథలో తను ఎంత చెబుతాడో అంతకి రెండింతలు చదువరిఊహకి వొదిలేస్తాడు. కొన్నికథల్లో ఒక్కొక్క సన్నివేశం ఒక్కొక్క సమగ్రచిత్రంగా వుంటుంది. మొత్తంమీద కథ కొన్ని చిత్రాలతో మాల గుచ్చినట్లుగా వుంటుంది. శిల్పంలో చెహోవ్ సిద్ధహస్తుడు, అద్వితీయుడు.

కాని ఆధునికుల లోపాన్ని ఇంత నిశితంగా మరే రచయితా విమర్శించలేదు. పూర్వయుగాల సాహిత్యానికీ, ఆధునికసాహిత్యానికీ వున్న భేదాన్ని స్పష్టంగా కనిపెట్టాడు. "మనలో ఏదో తీరని కొరత వుంది. మన కవిత్వాల జిలుగుతెరలని తొలగించి చూస్తే కనిపించే దేమిటి? శూన్యం శూన్యం!" అన్నాడు. ఎందువల్ల? దీనికి చెహోవ్ చెప్పే జవాబు: "పూర్వపు రచయితలకి ఒక నిర్దిష్టలక్ష్యం వుంది. వారి రచనలు చదువరిని ఒక స్పష్టమైన గమ్యానికి తోడ్కొని పోగలవు. కాని, మన రచనలకి ఆ శక్తి లేదు. మనకి మతం మీదగాని, ఆత్మమీదగాని, స్వర్గంమీదగాని, నరకం మీదగాని లేశమైనా విశ్వాసం లేదు. మనకి జనిమీదా విశ్వాసం లేదు. మనకి భీతి లేదు. ఆశ లేదు. మన ఆశ యాలకి గమ్యం లేదు. మన హృదయాల్లో గమ్యం చేరా లనే సందడికూడా లేదు. మన ఆత్మలు శూన్యంగా ఘోషించే అఖాతాలు. ఇటువంటి శూన్యంలోంచి నిజమైన కళ జన్మించదు". నిజంగా ఈ విమర్శ అద్భుత మైనది. శల్యపరీక్షచేసిన వైద్యుడు రోగాన్ని నిర్ధారణ చేసేటంత నేర్పుతో చెహోవ్ ఆధునికరచయితల మనస్తత్వంలోని లోపాన్ని కనిపెట్టగలిగాడు. ఆధుని కుడే ఆధునికులను గురించి ఇటువంటి విమర్శ చేయటం అసాధారణమైన విషయం. దీన్నిబట్టి చెహోవ్‌కి సత్యం మీద ఎంత ప్రీతి వుందో మనం తెలుసుకోగలం.

మూడువందల పుస్తకాలని ప్రచురించి, ప్రపంచ సారస్వతంలో భద్రమైన స్థానాన్ని సంపాదించుకుని చెహోవ్ క్షయవ్యాధిమూలంగా ౧౯౦౪ లో మర ణించాడు.

కాని పోయేముందు ఒక మిత్రుడికి ఉత్తరం రాస్తూ అందులో ఒక అమూల్యమైన తత్వాన్ని ఉప దేశించాడు. ఇది జీవితంలో తను తరించి ఇతరులకి చెహోవ్ ఉపదేశించిన తారకమంత్రం. దీన్ని ఒక్క మాటలో చెప్పాలంటే 'నిర్లక్ష్యం'. "ఏదీ మనసుకి పట్టించుకోకు. తామరాకుమీది నీటిబొట్టులాగా జారి పోతూ వుండాలి. లేకపోతే బతకటమే దుర్ఘటం" అంటాడు చెహోవ్. ఈ నిర్లక్ష్యం, ఈ నిర్లిప్తతా మాన వుడి ఆధ్యాత్మికజీవనానికి పునాదులు. ఎందుకంటే— జీవితం మనిషిని లెక్కచేయకుండా పోతూవుంటుంది. మనిషికూడా జీవితాన్ని లెక్కచెయ్యకుండా నిర్ల క్ష్యంగా కాలం గడపటం నేర్చుకోవాలి అని చెహోవ్ సిద్ధాంతం. ఇదే చెహోవ్ రచనలద్వారా లోకానికి అందించిన సందేశం.

# ప్రాచ్యశిల్పము - దాని ఆదర్శాలు

శ్రీ వేలూరి రాధాకృష్ణ

పాశ్చాత్యదేశాల్లో ఎక్కువగా రూపానికీ, అవయవ విశిష్టత్వానికీ శిల్పంలో ప్రాముఖ్యం ఇచ్చి, దివ్యత్వాన్ని స్ఫురింపజేయలేకపోయారు. ఎక్కువగా ఇది గ్రీకుశిల్పంలో కనుపిస్తుంది. మంచి అంగసౌష్ఠవమూ, నగ్నాకారమూ — ఈ పద్ధతి ఐరోపా దేశంలో వ్యాయామశాస్త్రసంబద్ధమైనది. ఇది అతి పురాతనకాలంనుంచీ అనుస్యూతంగా వస్తూన్నది. దీనిని మొదట హెల్లా సవలంబించాడు. తరువాత ఇటలీలో కళాభ్యుదయప్రచారపు సంపర్కంవల్ల పాశ్చాత్యులు కేవలదైహికమైన చిత్రణనే ముఖ్యంగా తీసికొని కృషిచేశారు. మన ప్రాచ్యశిల్పుల్లోని విశిష్టత యేమంటే, వారు రూపించిన శిల్పాలు అంగసౌష్ఠవమంత ప్రాముఖ్యంగా లేక, మనకు ఒక గాఢమైన ఆధ్యాత్మికదృష్టిని కలుగజేసినయ్. క్రీస్తుకు పూర్వం ఆరవ శతాబ్దంలో, ఐహికభావాలను కలిగించే శిల్పాలను రూపించటం డిపైన్ను స్కిలిస్‌తో ప్రారంభమై ఇరవయ్యో శతాబ్దంలో ఆగస్టేరోడాఁ వరకు కొనసాగింపబడి, మనకు వారి అతిమేధస్సును తెలియజేసి చక్కటి సంతుష్టిచెందిన మనస్సుతో మనల్ని శాంతపరుస్తుంది. కాబట్టి ఈ శిల్పనిరూపణవిధానం అతిప్రాచీనం కానీ, మాధ్యమికం కానీ, నవీనం కానీ వారి మేధస్సునే తెలియజేస్తుంది. కాని మన ప్రాచ్యశిల్పులు, పాశ్చాత్యుల మేధాయుతవిశిష్టత్వాన్ని పొందా మనుకున్నప్పటికీ, వారి కేవలమేధస్సును ప్రదర్శించుకోవటంకోసం గురి పెట్టుకోలేదు. వారి దృక్పథం అంతకన్న అతీతమైన, భావోద్రేకమైన దివ్యత్వాన్ని ఆదర్శించింది. ఆ శిల్పప్రదర్శనంవల్ల మనిషి కేవల శిల్పచాతుర్యంచేతనే తృప్తిపొందడు. దాని నిగూఢమైన భావాన్ని తెలిసికోయత్నిస్తాడు.

కాని పాశ్చాత్యదేశంలో అది కాదు. ప్రతివాడూ తన జీవనోపాధిని కల్పించుకొని, నిత్యభోజనానికి అమితమైన శ్రమ చేస్తాడు. ఆ శ్రమ చేసినతరువాత మనస్సుకు ఆహ్లాదకరమైన పరికరం ఒకటి కావాలి. ఆ పరికరం ఐహికానందాన్నివ్వాలి. అందువల్ల అక్కడ శిల్పులు దృష్టిలో పెట్టుకుందీ అదే; శ్రమజీవికి ఆనందాన్నిచ్చే అంగసౌష్ఠవం కల శిల్పాలని తయారుచేసి, వారి కాహ్లాదాన్ని కలిగించటం. ఆ చల్లటి, నిత్యమూ మంచు కురిసే దేశంలో వారికి విశ్రామసమయంలో జవసత్వాల నిచ్చేదీ అట్టి అంగసౌష్ఠవమూ, దైహికప్రాముఖ్యమూ గల శిల్పాలే. మన మనోవృత్తి దానికి పూర్తిగా వ్యతిరేకం. మనం ఎండలో పని చేసిచేసి ఉండటంవల్ల మనకు ఈ దేహసంబంధమైన సుఖానందముల కాలక్షేపం కాదు. దివ్యమైన భావోద్రేకంవల్ల, నిస్త్రాణ పొందిన మనస్సుకి కొంత జీవం వస్తుంది. మన శిల్పంయొక్క విశిష్టత అది.

అందువల్ల పవిత్రభావాలు కల మామూలు ప్రాచ్యునికి పాశ్చాత్యశిల్పంలో అర్థం కనుపించదు. అలాగే పాశ్చాత్యులకికూడ మన శిల్పం, బహుళమైన హస్తశిరములతో ఉండటంవల్ల ఆకర్షణ కలుగకపోగా అర్థరహితంగా గోచరిస్తుంది. శిల్పపు భావోద్రేకప్రబోధము మనలను సజీవం చేస్తుంది. అది మన జీవితానికి ఆటపట్టు. అది లేకపోతే మన జీవితమే లేదు. గ్రీకు శిల్పంలోని విశ్వసార్థకమైన ఆ నగ్నవిగ్రహాలు — వీనస్, ఎపోలో — అర్థరహితమైన అసభ్యప్రదర్శనంగా మనకు తోస్తుంది. మనకు వాటివల్ల ఆధ్యాత్మికమైన చింత కలుగకపోగా, ఏహ్యభావం కలుగుతుంది. బౌద్ధులు అనుకున్నట్లు సౌందర్యం, నగ్నత్వం ఇవన్నీ

నరకలోకానికి దారి అని మనవాళ్ల భావన. ఈ రెండిటికీ మానవానీకంయొక్క అత్యద్భుత శిల్పపు ఆదర్శాలకు అత్యంతవ్యతిరేకమై, ఎప్పటికీ సామరస్యం కుదరకుండా పోతోంది. గ్రీకులకు, ఎంత కాదన్నా బాహ్యసౌందర్యమే ముఖ్యాదర్శం. అందువల్ల వారి శిల్పదేవాలయాల్లో ఆ ఆదర్శాన్నే దైవంగా ఆరాధన చేశారు. కాని మనకు భావోద్రేకం కల ఆధ్యాత్మిక చింత జీవితపరమావధి. దానికి ప్రతినిధిగా ఏవిధమైన విగ్రహారాధనకుకూడా ఒకప్పుడు లెక్క చేయలేదు. కాబట్టి, ఉభయుల గమ్యములు వేరు. ఆదర్శములు వేరు. ఇవి ఎప్పటికీ ఏకీభవించవు. సామరస్యాన్ని పొందని పంథాలలో నడుస్తున్నయ్. పాశ్చాత్యశిల్పి ప్రాచ్యుల భావాలని అనుకరిస్తున్నాననడు. మనప్రాచ్య శిల్పి ఏ గ్రీకుశిల్పినీ తన ఆచార్యుడుగా తలపలేదు. కాని వారి శిల్పానుకరణ కాని, ఈ రెండు వ్యతిరేక భావాల కలయిక గాని అరుదుగా జరిగినా, అది కేవలఅపభ్రంశంగానూ, ఏహ్యంగానూ తయారయింది. పాశ్చాత్యశిల్పసంపర్కంవల్ల శక్తివంతం అయేబదులు అర్థవిహీనమైంది. దీనికి తార్కాణములు గాంధార, శిల్పములు, మొఘల్, డచ్ మిశ్రమమైన చిత్రాలూ రవివర్మచిత్రాలూ ఇంకా వున్నయ్.

* * *

తథాగతుడైన బుద్ధునిచేత చెప్పబడిన ప్రాచీన బౌద్ధమతము విగ్రహారాధన మనవసర మని. నిజానికి బుద్ధునివంటి మహామహుడు ఇంతవరకూ అవతరించలేదు—ఒక్క ఏసుక్రీస్తు తప్ప. ఆయనకూడా బుద్ధునివలె జీవితంలో చివరివరకూ నిష్కామదివ్యజీవితాన్ని గడిపాడు. బుద్ధుడూ, క్రీస్తూకూడా ఒకరికన్న ఒకరు, దేవుడు రూపం లేనివాడనీ, దానికోసం వృథా ప్రయత్నాలు వద్దనీ, అవి నిరుపయోగమైనవే ననీ బోధించారు. కొంతమంది దివ్యసందర్శనంకోసం పాటుపడుతున్న బ్రాహ్మణులతో సగుణనిర్గుణబ్రహ్మలయొక్క నైజాన్ని విశదీకరిస్తూ, అంధులు చీకటిగదిలో నల్లపిల్లి కోసం వెదకడంమాదిరి దా ప్రయత్నమని మందలించారు. కాబట్టి ప్రథమంలో బౌద్ధమతంలో విగ్రహారాధన లేదు, కాని కర్మవశాత్తూ, బుద్ధనిర్యాణానంతరం ఆయనమతస్థులు విగ్రహారాధన చేయటం ప్రారంభించారు. ఆయనతరువాత శిష్యులచేత ఆయనే దైవవిగ్రహంగా చేయబడి ఆరాధింపబడ్డాడు. ఆ కారణంవల్ల వారు అనుకోకపోయినప్పటికీ జన్మస్థలంలోనే బౌద్ధమతాన్ని రూపుమాపారు. ఈ బౌద్ధమతాంతర్ధానానికి ముఖ్యకారకులు కనిష్కుని తరువాత మహాయానులు; వారి ఉపకారులు గాంధారశిల్పులు. మనం ఇంతకుపూర్వం ముచ్చటించుకున్నట్లు వారి శిల్పం అధోగతికి తీసికొని వెళ్ళే పద్ధతి. అది వారు మన సార్నాథ్‌ని, బోరోబుదూర్‌ని, అనూరాధపురమును, దక్షిణదేశపు నటరాజుని, జావాలో చాందీచాంసీ సింగసారి, ప్రజ్ఞాపారమితుని మన కిచ్చిన ప్రాచ్యశిల్ప శాస్త్రమును అనుసరించేబదులు టోకెరియాలో, అటు నొరెంబర్గులోనూ అవలంబించిన విగ్రహశాస్త్రరీతిని అవలంబించారు.

* * *

బుద్ధుని అనుయాయులలో ప్రాచీనులు, అంటే హీనయానాన్ని అనుగమించినవారు, వారి గురుదేవుని రక్తమాంసములలో నిరూపించటానికి భయపడ్డారు. సార్నాథ్ మృగవనంలో, ప్రప్రథమమున బోధిస్తూ మహాసంబుద్ధిని పొందినట్లుగాని, కుసినగరంలో రెండు సాలవృక్షములక్రింద మహానిర్యాణాన్ని పొందినట్లు గాని, కపిలవాస్తునుంచి మహాభినిష్క్రమణం చేసినట్లు గాని ప్రతిమలలో, ఆయనజీవితంలోని దృశ్యాలని నిరూపించటంకన్న అశ్వత్థవృక్షంక్రింద కాని, శిరీష వృక్షం క్రింద కాని వట్టి సింహాసనాన్నిగాని, ధర్మ చక్రప్రవర్తనానిరూపణ గాని, స్తూపం గాని, ఒక వట్టి గుఱ్ఱంపైన రాజఛత్రం కాని నిరూపించితే అంత కన్న దివ్యత్వాన్నీ, భక్తినీ కలిగించవచ్చుని వారి అభిప్రాయం. నిజంగా ప్రాచీనబౌద్ధులు బుద్ధగయవద్దా, బార్హుత్ వద్దా అద్భుతమైన గ్రాధులను నెలకొల్పి, సార్నాథ్, సాంచీలవద్దా అద్భుతమైన స్తూపాలని నిర్మించి, బాగ్ పితల్‌కోరా, కార్లీ గుహాలలో చైత్యాలను తొలిచీ, ఇదివరలో ఎవరై నాలుగుసార్లు బుద్ధుడు శరీరాన్ని వీడిన విధంగా, ఈ నశ్వర శరీరాన్ని నిరూపించటం ఉపయోగం లేని పని అని

ఊహించి, ఆ మర్త్యశరీరంలో బుద్ధుణ్ణి రూపించటం మహాపాప మని నిశ్చయించి ఉండటం వల్లనే సర్వవ్యాప్తిని చెందే భావం, ఆయనబోధనలలోని శాశ్వతసత్యములే వారికి కావలసింది కాని ఈ నశ్వరశరీరం కాదు. కాని బుద్ధుని ప్రబోధాలలోని సత్యాన్ని నమ్మిన భారతీయులు, ముఖ్యంగా నాగులు రాళ్లనీ, రప్పలనీ కొలిచే ప్రాథమికపద్ధతినుంచి మారలేకపోవటంచేత, వారికి సరిపోవునట్లు చేయటంకోసం, కాబావద్ద చాలాకాలం కొలిచిన కోరల్, ఇస్లాంజాతుల సమన్వయంకోసం, ప్రాచీనకాలిఫ్‌లు, ఇస్లాంకళావలంబనలను తగ్గించవలసివచ్చినట్లుగా మన పెద్దలు మతభాగంగా కొంత కళకి ఒప్పుకోవలసివచ్చినది. అందువల్లే ఈ ప్రాచీనబౌద్ధస్మారకశిల్పాలూ ఆయనజీవితంలో ముఖ్యసంఘటనల నిరూపణలు మాత్రం గాని మరీ ఎక్కువగా పోతే, ఆయన పవిత్ర పాదముల చిహ్ననిరూపణ, అంతే. అంతకు మించి పోలేదు.

పైన నిరూపించిన మహామహాశిల్పాలను నిర్మించిన ప్రాచీనబౌద్ధులు బుద్ధుని మనిషి రూపంలో చిత్రించటం పాపం అనుకొని, ఆ భావననే ఖండించారు. వారికి మహాసంబుద్ధిని తెలిపే ఏకసింహాసనాన్ని ఒక వృక్షంక్రింద చూపించటం ముఖ్య చిహ్నంగా ఎంచారు. అల్లా అనేకరకాల వృక్షాల క్రింద సింహాసనాలని చూపించటంవల్ల, చివరి అవతారమైన గౌతమబోధిసత్త్వునికి పూర్వపు జన్మలకి చిహ్నం అని వారి భావన.

ఆవిధంగా, అశ్వత్థవృక్షం మాయాశుద్ధోదనులకు జన్మించిన గౌతమబుద్ధునికి చిహ్నం. శిరీషవృక్షము కాకసుంధునకు చిహ్నము. న్యగ్రోధవృక్షము కశ్యపునకు చిహ్నము. ఉదుంబరవృక్షము కనకమునికి చిహ్నము. అల్లాగే సార్నాథ్ మృగవనంవద్ద గౌతమ బుద్ధుని బోధనలకి చిహ్నంగా 'ధర్మచక్రపరివర్తనం' నిరూపించారు. రౌతులేని గుఱ్ఱంపై రాజఛత్రం కపిలవాస్తును పూర్తిగా విడిచివచ్చుటకు (బుద్ధుడు నిగ్రస్థుడు కాకమునుపు) చిహ్నం. స్తూపము మహాపరినిర్వాణమునకు చిహ్నము. ఇంకా ప్రాచీనప్రాచ్యశిల్పులు బుద్ధుని ప్రతిమ లేకుండా, ఆయనజీవితంలోని కొన్ని సన్నివేశాలని మహాచిత్రంగా చిత్రించారు. అదేవిధంగానే బుద్ధుడై, కపిలవాస్తునగరానికి వచ్చి, తండ్రి శుద్ధోదనుణ్ణి దర్శించినప్పుడు, శుద్ధోదనుడు బుద్ధునికి న్యగ్రోధవనాన్ని కానుకగా చదివించే సన్నివేశంలో, బుద్ధుని ప్రతిమ లేకుండా ఒక న్యగ్రోధవృక్షంతో ఆయన ఉన్నట్లు నిరూపించారు. కాబట్టి వీటన్నిటిని బట్టి, ప్రాచీనబౌద్ధులకు బుద్ధుని విగ్రహంగా ఆరాధించటం ఎంత భయమో, ఎంత హేయమోకూడా విశద మౌతుంది. కాని తరువాత తరువాత ఈ భావంలోని పవిత్రత పోయింది. ఎందువల్లనంటే, సంఘంలోని ప్రాచ్యశిష్టాచారసంపన్నులనీ, ఇంకా అనార్య జాతుల్ని నాగులూ, దస్యులూ, యక్షులూ మొదలైన వారిని కలుపుకోటంతో ఈ పవిత్రభావానికి ముప్పు వాటిల్లింది.

అట్టి మనస్సంబద్ధమైన బౌద్ధమతము క్రమక్రమేపీ మారి సమస్తజనమునకూ కావలసివచ్చే మతంగా మారింది. ఈ మతాన్ని అందరికీ తెలియజేయటంకోసం బుద్ధుని జాతకకథలు కావలసివచ్చినవి. వాటి కేవలవర్ణనమే కాకుండా, వాటిని పూర్తిగా చిత్రించి, ఆ చిత్రాలద్వారాకూడా ప్రబోధమూ, ప్రచారమూ బయలుదేరింది. ఆవిధంగా కళద్వారా బౌద్ధమతం ప్రచారం కావటం ప్రారంభించింది. దీనిని ప్రారంభించింది కనిష్కుడు. ఈతని రాజ్యము ఇప్పటి పెషావర్, కాశ్మీర్, ఆఫ్ఘనిస్థాన్ దేశాలు కలిపి. క్రైస్తవ మతానికి (కాన్‌స్టాంటైన్) సెయింట్‌పాల్ ఎల్లాగో కనిష్కునికి 'అశోకపియదాసి' అలాగ ఆదర్శం. ఈ మత ప్రచారంలో అతను రెండవ అశోకు డయ్యాడు. వసుమిత్రుని ఆధ్వర్యాన, అతని యాజమాన్యంక్రింద ఒక బౌద్ధమహాసభ జరిగింది. ఇది జరిగినతరువాత, దేశదేశాలకి మతప్రచారకుల్ని పంప నిశ్చయించారు. ఈ ప్రబోధానికి తోడుగా శిల్పం, చిత్రకళాగూడా సహాయంగా తీసికొన్నారు. అప్పటికి బాగా ఆరితేరిన మంచి మంచి శిల్పులనూ, చిత్రకారులనూ వెంట తీసికొని వెళ్లారు. వెళ్ళిన చోటల్లా బుద్ధునీ, ఆయనజీవితసన్ని

వేశాలనీ లోటులేకుండా చిత్రించారు. కొండ గుహల్లోనూ, మహారణ్యమధ్యంలోనూ, ఇక్కడనక, అక్కడనక ఎక్కడపడితే అక్కడ బౌద్ధచిత్ర వాఙ్మయం తయారుచేశారు. ఆ శిల్పాలే- ఆ చిత్రాలే ఇప్పుడు మనకు మహాసంపద ఐంది. ఈ చిత్రణనే 'గాంధారచిత్రలేఖన' మన్నారు.

బుద్ధుడు మహాపురుషచక్రవర్తి కాబట్టి, ఆయన యందు ముప్పయిరెండు మహాపురుషలక్షణా లున్న య్యన్నారు. ఆ శరీరము పూర్తిగా పురుషలక్షణమైనదీ కాదు. పూర్తిగా స్త్రీలక్షణమైనదీ కాదు-రెండింటినీ సమన్వయించుకున్న శరీరము. స్త్రీకున్న సౌందర్యమూ, పురుషునకున్న బలధైర్యస్థైర్యములతో మిళితమైనది. ఆయనఛాయ బంగారమూ, దంతమూ కలిపితే వచ్చు ఛాయ. శిరీషపుష్పదళమువలె సుకుమారమైనది. ముఖము పద్మమువంటిది. మధ్యపక్షమునం దున్న చంద్రుని తీరు కలది. కళ్లు అరవిరిసిన పద్మముల వంటివి. అజానుబాహువు. పాదములు పద్మమువలె ఎఱ్ఱనైనవి. మొత్తముమీద నిత్యనవయువకుని రీతి కల వాడు. గిరజాలు తిరిగిన కేశములు కలిగి తల కిరీట రూపాన్నిస్తుంది.

క్రమక్రమంగా శిల్పకళకూడా మతంతోపాటు పాకింది. కాని ఆ మతప్రచారంలోని భక్తి పూర్తిగా నశించింది. దాని పూర్తి నిబంధనలు సడలిపోయినవి. ఆయన జీవితకథలని ఏ లోహంలో చిత్రించనీ, ఏ చెక్కమీద చిత్రించనీ చివరికి అర్థవిహీన మైంది. గ్రీకులు వారి సావయవాదర్శాలను మన ప్రాచ్యసావయవాదర్శాలతో మిళితంచేశారు. కొంతకాలం ఇలా చిత్రించటానికి తంటాలు పడినతరువాత, వారి కిక చేతకాక, వారి కిది చేతకాని అసాధ్యమైన పని యను కొని మానేశారు. వారు అల్లా ప్రయత్నించి, మన కిచ్చిన శిల్పాలు బుద్ధులు, బోధిసత్వులు, ఇంద్రుడు, బ్రహ్మ, కుబేరుడు మొదలైన దేవతలు. చక్కగా కండరాలు తిరిగి ఇంత లావుగా అసహ్యంగా కను పిస్తయ్. వాటి వస్త్రధారణం మళ్లా మన ప్రాచ్య రీతిన! ఈవిధంగా, చైతన్యం లేని కండరములు కల గ్రీకుబౌద్ధశిల్పంతో అసలు శిల్పకళకే అనర్థం వాటిల్లి నది.



# ద్రవ్యోల్బణ సమస్య - దాని పరిష్కారము

శ్రీ చావలి వెంకటహనుమంతరావు

మన దేశములో ద్రవ్యోల్బణసమస్య కొంత కాలమునుండి ప్రభుత్వమును, ప్రజలనుకూడ ఎక్కువ కలవరపెట్టుచున్నది. ప్రజాసామాన్యము యొక్క జీవితఖర్చు అపరిమితముగ పెరుగుటవలన వారి జీవితభారము హెచ్చుచున్నది. ౧౯౩౯ సం.లో నున్న వస్తువులధరలతో ఈ రెండుమూడు సంవత్సరములలోని వస్తువులధరలు పరిపోల్చిచూచిన, ౩ రెట్ల నుండి ౩½ రెట్లవరకు ఈ ధరలు పెరిగినట్లు తెలియగలదు. వస్తువుల ధరలు పెరుగుట యనగా డబ్బు యొక్క విలువ తగ్గుట యన్నమాట. ఇదివరకు ఒక కుటుంబమునకు ౩౦, లేక ౪౦ రూపాయలు ఖర్చగుచున్న ఆ కుటుంబమునకే ఇప్పుడు ౧౦౦ లేక ౧౧౦ రూపాయల ఆదాయమున్నకాని ఇదివరలో జరిగినట్లు సంసారము జరుగుట కష్టమన్నమాట. అన్ని కుటుంబములలోను సరిగా ఇట్లే, ఇన్ని రెంతులే ఖర్చు పెరిగినదని కాదు; కాని సగటున దాని ఫలిత మది. కొన్ని కుటుంబములలో ఇదివరలోకన్న కొన్నిఖర్చులు తగ్గింపబడవచ్చును; లేక ఇతరవిధముల వారి జీవిత ఏర్పాట్లు మార్పుచెందియుండవచ్చును. ఈ విధముగ వస్తువులధర, జీవితఖర్చు పెరుగుటవలన ప్రజాసామాన్యములో ఆర్థికదుస్థితి రోజురోజుకు పెరిగిపోవుచున్నదని మాత్రము గ్రహింపవలెను. ఈ పెరుగుదలకు అనేక కారణము లుండవచ్చును, ఉన్నవి; కాని ద్రవ్యోల్బణము దాని కొక ప్రధానకారణమని ఖండితముగ చెప్పవచ్చును.

## ఆశ — నిరాశ

యుద్ధానంతరము ఆర్థికపరిస్థితులు మరల చక్కబడి యుద్ధపూర్వపుస్థితిగతులు క్రమేణ ఏర్పడునని చాలమంది ఆశించియుండిరి; కాని ఆ ఆశలు ఫలించలేదు. యుద్ధానంతరము ఇంకను ఏదేశముకూడ తన పూర్వస్థితికి రాలేదు. పరిశ్రమలు పునరుద్ధరింపబడి, వస్తువుల తయారుచేత ఎక్కువగ పెరిగియుండలేదు. కాని యుద్ధసమయములోను, యుద్ధానంతరము ఈ రెండుమూడు సంవత్సరములలోను కొంతమందివద్ద డబ్బు ఎక్కువ కూడుటయు, వర్తకులకు, సేద్యగాండ్రకు, మిల్లులు ఫాక్టరీలలో పనిచేయువారికి ఎక్కువ ఆదాయము దొరకుటయు జరుగుచున్న విషయము. ఈరాబడి ఎక్కువవలన, కొనుగోలువస్తువులు తక్కువగ నుండుట వలన వస్తువులధరలు హెచ్చిపోవుటయు, డబ్బున్నవారు వస్తువులను హెచ్చుధరలకైనను కొనుటకు సిద్ధముగ నుండుటయుకూడ జరుగుచున్న విషయమే. ఈ విధముగ ద్రవ్యోల్బణసమస్య మన దేశములోనేకాక ఇతరదేశములలోకూడ ప్రభుత్వములను, ప్రజలను కలవరపెట్టు సమస్యగా నున్నది.

## పెద్దల శ్రద్ధ, సలహాలు

ఈ సమస్య తీవ్రరూపము దాల్చి, దేశములో ఆందోళన హెచ్చయినతరువాత ప్రభుత్వమువారు, ఆర్థికశాస్త్రవేత్తలు, రాజకీయపక్షములవారు అందరును కూడ దీనిని గురించి శ్రద్ధ వహించుట మొదలుపెట్టిరి.

దాని పరిష్కారమునకై వివిధపార్టీలవారు చేసిన సలహాలను తరచిచూచిన, వారి సూచనలలో కొన్నింటిపై సర్వాంగీకార మున్నట్లు తెలియును. ఈ విధముగ అందరు అంగీకరించిన పరిష్కారపద్ధతులలో ఇవి ముఖ్యమైనవి: పరిశ్రమల ఉత్పత్తి నెక్కువచేయుట; ప్రజలకు ముఖ్యావసరములగు వస్తువులపై కంట్రోళ్ళను తిరిగి ఏర్పాటుచేయుట; రాష్ట్రప్రభుత్వములు మద్యపాననిషేధకార్యక్రమమును ఆపుచేయుట; కేంద్ర రాష్ట్రప్రభుత్వములు అనవసరఖర్చులను తగ్గించుట; ప్రజల చేతులలో తిరుగుచున్న అదనపుడబ్బును తగ్గించుట; విదేశములనుండి అవసరమగు వస్తువుల దిగుమతికి ప్రభుత్వము ఏర్పాట్లు చేయుట.

పై కార్యక్రమము అన్ని పక్షముల వారును సూచించినదై యుండగా, పరిశ్రమాధికారులు, ఆర్థికవేత్తలు, సోషలిస్టుపార్టీవారు వారివారి ప్రత్యేక సూచనలను ప్రభుత్వమునకు నివేదించియుండిరి. ఆర్థికశాస్త్రవేత్తలు చేసిన సూచనలలో ప్రత్యేకముగ గమనింపదగినవి కొన్ని కలవు. వ్యాపారలాభములపై పన్ను హెచ్చుచేయవలెననియు, పారిశ్రామికలాభములను ఇంతకంటె ఎక్కువ యుండకూడదని నిర్ణయించవలెననియు వీరు సూచించియుండిరి. కాని పారిశ్రామికాధికారులు చేసిన సూచనలలో పరిశ్రమలపైనను, లాభములపైనను పన్నుల భారము తగ్గినగాని ఎక్కువ వస్తూత్పత్తికి పరిశ్రమలలో డబ్బుపెట్టుబడిపెట్టుటకు తమకు ఉత్సాహము కలుగదనియు, కార్మికులు ఎక్కువ కాలము పనిచేయుట కంగీకరించవలెననియు, ప్రభుత్వమువారు నిర్ణయముచేసిన ౧౦ సంవత్సరముల పారిశ్రామికప్రణాళికలో మార్పులు చేయబడవలెననియు మరికొన్ని సూచనలను చేసియుండిరి. ఈ వివిధసూచనలు చేసినవారు వారివారి ప్రత్యేకసంస్థల అభిప్రాయములను వ్యక్తీకరించిరేకాని పూర్తిగ ప్రజాక్షేమమును మనస్సునందుంచుకొని నివారణోపాయములనుసూచించిరని చెప్పుటకు వీలులేకున్నది. వీటి నన్నింటిని సమన్వయించి, ప్రజలకందరకును బాధ్యులగు ప్రభుత్వము వారు ఒక స్థిరమైనట్టియు, దేశక్షేమదాయకమైనట్టియు ప్రణాళికను తయారుచేసి అమలునందుంచుట అతి ముఖ్యము.

## మరవరాని విషయము

ఇవన్నియు అటుంచి ప్రస్తుతసమస్యకు సంబంధించిన కొన్ని ప్రధానవిషయములు జ్ఞాపకముంచుకొనినచో, ముందుగా చేయవలసిన పను లేవి, నెమ్మది మీద చేయదగినవేవి అను విషయము నిర్ణయించుటకు వీలగును. ఈసమస్యకు ఈమధ్య వచ్చిన తొందర, ఇంత ప్రాధాన్యము కల్గుటకు కారణము ప్రజాసామాన్యమునకు కావలసిన తిండి, గుడ్డ, ఇతరవస్తువులకు విపరీతముగ ఖరీదు పెరుగుట, ఉన్న వస్తువులైనను అందరికి అందుబాటులో నుండకుండ నల్లబజారు (black market) లో హెచ్చుధరలకు అమ్ముడువోవుట. ఈ విధముగ ధరలు పెరుగుటవలనచే గవర్నమెంటు ఉద్యోగస్థులకు, కార్మికులకు, ఇతర నెలజీతములను పుచ్చుకొనువారికి కరువుభత్యములు, ప్రత్యేకజీతములు మొదలగునవి ఏర్పాటుచేయవలసిన అవసర మగుచున్నది. ధరలు ఇంకను హెచ్చుచున్నవని కారణము చెప్పి కార్మికనాయకులు ఇంకను కార్మికుల వేతనముల నెక్కువచేయవలెనని పదేపదే కోరుట, అది సమకూడనప్పుడు సమ్మెలను ప్రోత్సహించుటకూడ జరుగుచున్నది. ఈవిధమైన కార్మికఅశాంతిని కారణముగ తీసికొని పరిశ్రమాధికారులు ప్రస్తుతసందర్భములలో తమ బాధ్యతలను నిర్వర్తించుటకు పూనుకొనకుండ యున్నారు. ఈ సమస్యలన్నియు ఒకదాని కొకటి దగ్గరి సంబంధము కలదై యున్నట్లు పైన చెప్పినదాని వలన తేలుచున్నది; కాని వీటి కన్నింటికి మూల కారణము వస్తువుల ఖరీదు, జీవితఖర్చు పెరుగుదల.

## కర్తవ్యము

ఈ మూలకారణమును ఛేదించవలెనన్న చేయవలసినది: ఒకటి,వస్తువులను ఎక్కువగ తయారుచేయుట; రెండు, ప్రజలకు అవసరమగునట్టి వస్తువులు సరసమైన ధరలకు విరివిగా దొరుకునట్లు ఏర్పాటుచేయుట. ఈ విధముగ చేయవలెనన్న ముఖ్యఅవసరములపై కంట్రోలు ఏర్పాటుచేయుట తప్పనిసరి. ప్రజలకు ముఖ్యముగ కావలసిన వస్తువులు తిండి, గుడ్డ, వాటితరువాత నిత్యజీవనమందు అవసరమగు ఇతరవస్తువులు-సోపు, నూనె,

కాగితములు, కలములు మొదలైనవి. ఇంతవరకు ఎక్కువ ఆహారధాన్యములను తయారుచేయుట కేర్పరుపబడిన పథకములు ఎక్కువ జయప్రదముగ కొనసాగుటలేదని ఇండియా ప్రభుత్వపు ఆహారమంత్రి మొదలుకొని అందరును అంగీకరించినదే. పండుచున్న ధాన్యమైనను, కట్టుదిట్టముగు సరఫరామార్గములు లేమిచే కొంత, వర్తకుల యొక్క లాభముల దురాశవలన కొంత, ప్రజాసామాన్యమునకు సరసమైన ధరలకు దొరకుట లేదు. బియ్యపు కంట్రోలు రద్దుచేసినతరువాత బియ్యములో బ్లాక్ మార్కెట్ పద్ధతి విపరీతముగ పెరిగిపోయినది. అదే విధముగ మిల్లుగుడ్డపై కంట్రోలు ఎత్తివేసినతరువాత గుడ్డలధర విపరీతముగ హెచ్చిపోవుట, దాని పర్యవసానముగ తిరిగి కంట్రోలు ఏర్పాటుచేయుట జరిగినది. కంట్రోలు ఏర్పాటుచేయుటతో ప్రభుత్వమువారి పని పూర్తియైనదని తలచుట పెద్ద పొరబాటు. దానిని ఏర్పాటుచేయుటకన్న కంట్రోల్ పద్ధతి సరిగా, ప్రజాసామాన్యమునకు లాభదాయకముగ పనిచేయునట్లు చూచుట చాల ముఖ్యమైన సంగతి. ఇట్లు కంట్రోలు చేయబడిన వస్తువులు అందరకును కష్టము లేకుండ దొరుకునట్లు చేసినప్పుడే కంట్రోలుపద్ధతిలోని లాభము ప్రజలు పొందుదురు. లేకపోయిన వాటివలన ఎక్కువ నష్టమే కాని లాభ ముండదు. ఈ విషయములో ప్రభుత్వములపై పెద్ద బాధ్యత కలదని వారు గ్రహించవలసియున్నది.

## ‘రాక్షసి’ సంహారము

దీనికై కావలసినది బ్లాక్ మార్కెట్ పద్ధతులను పూర్తిగ నిర్మూలించుటయే. బ్లాక్ మార్కెట్ పద్ధతి ఇతరదేశములలో కూడ లేకపోలేదు. కాని చైనా మొదలగు దేశములలో బ్లాక్ మార్కెట్ దార్లకు మరణశిక్షయో, లేక ఇతరతీవ్రదండనయో విధించుటకు నిర్ణయింపబడినది. ఇంగ్లండువంటి దేశములో ప్రజాబాహుళ్యముయొక్క అభిప్రాయము బలమైనదిగా ఉండుటచే బ్లాక్ మార్కెట్ వ్యాపారస్థులు తమ వృత్తి లాభకరము కాదని త్వరలోనే గ్రహించగల్గెదరు. ఏమైనను మన దేశములో ఈ పెద్ద రాక్షసిని నిర్మూలించినకాని మన ఆర్థికస్థితి, ప్రజల కష్టములు గట్టెక్కవని గ్రహించుట అవసరము. దీనికై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వములు కంకణము కట్టుకొనవలసిన అవసరమెంతేని కలదు.

## పరిశ్రమాధికారులకు పసిడి సూచన

అటుపై, వస్తూత్పత్తిని హెచ్చుచేయు పద్ధతులను వెంటనే ఆచరణలో పెట్టవలసియున్నది. మన పారిశ్రామికాధికారులు నిజముగా దేశక్షేమమును కోరువారే యైన, వెంటనే ఇతరసాకులు చెప్పక తమతమ డబ్బును ముఖ్యమగు పరిశ్రమలను ఏర్పాటుచేయుటకై పెట్టుబడిపెట్టుటకు సంసిద్ధము కావలెను. మన దేశములో అనేకరకముల పరిశ్రమలకు తగు సావకాశము లున్నవని వేరుగ చెప్పనక్కరలేదుగదా? మాకు డబ్బు పెట్టుబడివలన తగు లాభములు వచ్చుటలేదు, లాభములు వచ్చినను వాటిని కార్మికులకు కరువుభత్యముల క్రింద, ఎక్కువ జీతనములిచ్చుటలో పంచిపెట్టవలసి వచ్చినచో సంపాదించి ఏమి లాభము? ఇట్టి వాదనలు పరిశ్రమాధికారులు మాని, తమ స్వంతలాభములు కొంతవరకు తగ్గించుకొనుట కంగీకరించియైన ముఖ్య పరిశ్రమలలో పెట్టుబడి పెట్టుటకు సిద్ధపడవలెను. వారంతట వా రట్లు సంసిద్ధులై యుండనియెడల, ప్రభుత్వము వారిని నిర్బంధించియైన పెట్టుబడి పెట్టించవలసి యుండును. వా రట్లు చేయకపోవుట పరిశ్రమలను ప్రభుత్వాధీనము చేయవలెనను వాదనకు చేతులార దోహదము చేసినవా రగుదురు. ఒక వంక ప్రభుత్వము తన స్వంతయాజమాన్యముక్రిందకు పరిశ్రమలను తీసుకొనువిధానము ఆపుచేయవలెనని వాదించుచు వేరొక వంక వస్తూత్పత్తికి తోడ్పడు క్రొత్తపరిశ్రమలలో పెట్టుబడి పెట్టక కూర్చొనుటవలన పరిశ్రమాధికారులు ఎవరికిని లాభముచేయుట లేదు. వెంటనే వస్తువుల కొరతను తొలగించుటకై విదేశములనుండి ప్రజాసామాన్యము ఎక్కువగ కోరువట్టి వస్తువులు దిగుమతియగుటకు ప్రభుత్వము శ్రద్ధవహించవలసియున్నది. ద్రవ్యోల్బణము కొంతవరకైన తగ్గించవలెననిన, బజారులలో ప్రజలకు అవసరమగు వస్తువులు విరివిగా నుండునట్లు చేయుట ఒక ముఖ్యమార్గము. మన దేశ పరిశ్రమల ద్వారా ఈ వస్తువులు తయారగుటకు కాలయాపన

జరుగునట్లు తోచిన విదేశములనుండియైన వాటిని దిగుమతిచేయుట తప్పనిసరి. ఈ పద్ధతి అవలంబించుటవలననైనను మన పరిశ్రమాధికారులకు, పెట్టుబడిదారులకు ఈ సమస్యయొక్క తీవ్రత తెలిసివచ్చిన దానికి సరియైన ఫలితము వచ్చిన దన్నమాటయే.

## ప్రభుత్వమువారి విధి

ఇంక ప్రభుత్వమువారు తమ వ్యయమును తగ్గించుకోవలెననియు, రాష్ట్రప్రభుత్వములు ముఖ్యముగ మద్యనిషేధకార్యక్రమమును నెమ్మదిగ కొనసాగించవలెననియు ఒక సూచన చేయబడినది. ప్రభుత్వములు తమ కార్యకలాపములలో జాగ్రత్త వహించవలెనని, ఖర్చు తగ్గించుకొనవలెనని ప్రత్యేకించి చెప్పవలసిన అవసరములేదు. కాని ఖర్చు తగ్గించుటకు ముఖ్యమార్గము ఎవరినో కొంతమంది ఉద్యోగస్థులను, బంట్రోతులను తొలగించుటవలన కాదు. తగ్గించవలసినది దూబరా ఖర్చు, ప్రత్యేకముగ ఏర్పాటుచేయబడిన భత్యములు మొదలగునవి. కొంతమంది ఉద్యోగస్థులను తొలగించుట వలన, నిరుద్యోగసమస్యకు బలము చేకూర్చుటయు, ఒక్కొక్కప్పుడు ప్రభుత్వశాఖలలో పని జరుగకుండ చేయుటయుమాత్రమే యగును. కాని నిజముగ ఖర్చు తగ్గుదల చాల తక్కువగా నుండును. ఇది కాక ముందుముందు దేశక్షేమమునకు, ప్రజాసామాన్యమునకు ఎక్కువ సహాయకారులుగా నుండు ముఖ్యస్కీములను, ప్రాజెక్టులను ఆపుచేయుట ఏమియు మంచి పని కాదని చెప్పవలసియున్నది. రామపాదసాగర్, తుంగభద్ర మొదలగు వ్యవసాయాభివృద్ధికి తోడ్పడు స్కీములను ఆపుదలచేసిన ముందుముందు దేశమునకు కలుగు లాభములను ఇప్పుడే తెలివితక్కువగ అరికట్టుటకాదా? అదియుకాక ఈ పద్ధతి ద్రవ్యోల్బణసమస్యాపరిష్కారమునకు ఎక్కువ సహాయము చేయునని తలంచుటకు వీలు లేదు. ఇంకియూ ప్రభుత్వమువారీ ముఖ్యవిషయమును మనస్సునం దుంచుకొని ఈ సూచనపై తమ నిర్ణయమునకు వచ్చెదరని ఆశించవలసియున్నది.

కాగా, రాష్ట్రములకు మంచి ఆదాయము నిచ్చు మత్తుపదార్థములపై పన్నును వెంటనే పూర్తిగ తొలగించుటయు, మద్యనిషేధకార్యక్రమమును అతి తొందరగ కొనసాగించుటయు ఎంతవరకు ప్రస్తుత సందర్భములలో సరియైనదో నిర్ణయించవలసియున్నది. మద్యనిషేధము చెడ్డది, అవసరము కానిది—అని ఎవరును వాదించుటకు సాహసింపరు. దానివలన ప్రజలకు అనేకలాభములు కలుగు నన్నమాట సర్వాంగీకారమే. కాని మద్యనిషేధమువలన ప్రభుత్వాదాయము కొన్ని కోట్లరూపాయలకు తగ్గిన దానిలోని లోటును పూర్తి చేయుటకు క్రొత్త పన్నులను విధించవలసియుండును. ఇదివరకే పన్నుల భారము వహించుటకు శక్తిలేక క్రుంగుచున్న ప్రజలు క్రొత్తపన్నులను భరించుటకు మరింత కష్టపడవలసియుండునని వేరుగ చెప్పవలెనా? ద్రవ్యోల్బణసమస్య వ్యాపారస్థులు, వ్యవసాయదారులు, వర్తకులు, కార్మికులు మొదలగు కొంతమంది విషయములో వర్తించును కాని, ఈ సంఘములకు చెందని ఇతరసామాన్యప్రజల విషయములో వర్తించదు. ఇతరులు తమతమ నిర్ణీతఆదాయములతో పొట్టపోసుకొనుటకే కష్టపడుచున్నారు. కాన ప్రభుత్వము తన విధానమును నిర్ణయించునప్పుడు ఈ ఇతరసామాన్యప్రజల స్థితిని పూర్తిగ ఆలోచించి తన నిర్ణయమునకు రావలసియుండును. ఏ నిర్ణయము వారు చేసినను వెంటనే దానిని ప్రచురించి, దాని నమలునందుంచుటలో ఎంత మాత్రము జాగు చేయకుండుట అవసరము.



# భూప్రదక్షిణము

శ్రీ మామిడిపూడి వెంకటరంగయ్య

హైదరాబాదువిషయమున వెంటనే తీవ్రచర్య తీసికొనవలె ననియు, ఆలస్యము చేసిన యెడల ప్రమాదము లనేకములు సంభవించు ననియు గతమాసపు భూప్రదక్షిణములో ఉద్ఘాటింపబడెను. ప్రజాభిప్రాయ మిట్టిదే అని నెహ్రూ ప్రభుత్వమువారు గ్రహించి సెప్టెంబరు 13 తేదీన హైదరాబాదుపై సైనికచర్యను ప్రారంభించిరి. అయిదు రోజులలో హైదరాబాదు సైన్యములు, రజాకార్లు ఓడిపోయిరి. నైజాం శరణాగతు డయ్యెను. ఇండియా ప్రభుత్వపు అధికారము హైదరాబాదుసంస్థానముపై స్థాపింపబడెను.

## రజాకార్ల పతనము

ఇంత సులభముగ నైజాం పడును అని ఎవ్వరు అనుకొనలేదు. కాని అది యిట్లు జరుగుటకు మూడు ప్రధానకారణము లని చెప్పవచ్చును. వీటిలో ప్రధానమైనది భారతీయసైన్యాధిపతుల చక్రవ్యూహము, సైనికుల శౌర్యము. ఏకకాలమున ఐదునైపుల నుండి సంస్థానముపై మన సైన్యములు దండెత్తినవి. భూదళములతోపాటు ఆకాశవిమానములుకూడ బహు నేర్పుతో పోరినవి. నాలుగురోజులలో తమ్ము నెదుర్కొనిన సైన్యముల నోడించి, సికిందరాబాదుపట్టణమునకు నలభైమైళ్లదగ్గరకు మన సైన్యములు వెళ్లగలిగినవి. ఎదిరించుటవలన మరి లాభము లేదని నిశ్చయించి నైజాం శరణాగతుడయ్యెను. ఇదిగాక నైజాం సైన్యమునకును, రజాకార్లకును పొత్తు కుదరకపోవుటచేతకూడ నైజాం లొంగిపోవలసినవాడయ్యెను. మన సైనికచర్య ప్రారంభమైన రాత్రియందే పాకిస్థాన్ గవర్నరుజనరలైన జిన్నా మరణించుటకూడ హైదరాబాదుపతనమునకు మరియొక కారణ మని చెప్పవచ్చును. యుద్ధము ప్రారంభమైనయెడల పాకిస్థాన్ సైన్యములు ఇండియాపై దండెత్తు ననియు, దానివలనను తమకు విజయము కలుగు ననియు రజాకార్లు నమ్మియుండిరి. జిన్నా మరణించుటచేత ఇట్టి సహాయము వారికి లభించుటకు వీలులేదయ్యెను. ఈ కారణములన్నిటి మూలమున మన సైనికచర్య అతిశీఘ్రముగ ముగియుటయు, నైజాం మన ప్రభుత్వమునకు లొంగిపోవుటయు సంభవించెను.

## సైనికచర్యయొక్క ఉద్దేశములు

రెండు ఉద్దేశములతో నెహ్రూ ప్రభుత్వము ఈ సైనికచర్యను ప్రారంభించెను. సికందరాబాదులో భారతీయసైన్యములను కొన్నిటిని చేర్చుట మొదటి ఉద్దేశము. రజాకార్ల సంస్థను రద్దుచేసి, వారిమూలమున కలుగుచుండిన ప్రమాదమును రూపుమాపుట రెండవ ఉద్దేశము. ఈ రెండింటికి వెంటనే అంగీకరించవలసిన దని నెహ్రూ ప్రభుత్వమువారు సైనికచర్య ఆరంభించుటకుముందు నైజామును కోరిరి. కాని

స్వలాభపరులును, అధికారోన్మత్తులును, పాకిస్థాన్ పక్షాభిమానులును అగు లైకతాలీమంత్రివర్గమువారి యొక్కయు, రజాకార్ల నాయకుడగు కాశింరజ్వీ యొక్కయు మాటలకు లొంగిపోయి నైజాం ఈ కోరికలను నిరాకరించెను. అందుచేత సైనికచర్య తప్పనిదయ్యెను. దానిమూలమున ఈ రెండు ఉద్దేశములు నెరవేరగలిగెను. భారతీయసైన్యములు సికందరాబాదులో యథాపూర్వకముగ స్థావరముల నేర్పరచుకొనినవి. రజాకార్ల సంస్థ అక్రమసంస్థ యని ప్రకటింపబడెను.

## హైదరాబాదుభవిష్యత్తు

కాని ఈ రెండును తాత్కాలికోద్దేశములు. మొదటినుండి ఇండియాకును, నైజామునకును విషయాంతరములనుగురించి కదా వివాదములు సంభవించియుండినవి. తక్కిన సంస్థానములవలె హైదరాబాదుకూడ ఇండియాలో చేరి, దేశరక్షణ, విదేశవ్యవహారములు, రాకపోకలకు కావలసిన సదుపాయములు అను మూడు విషయములలో ఇండియాప్రభుత్వమువారికి లోబడవలెననియు, ప్రజాస్వామ్యసిద్ధాంతముల ననుసరించి సంస్థానములో బాధ్యతాయుతప్రభుత్వమును స్థాపించవలె ననియు ఇండియాప్రభుత్వమువారు నైజామును కోరియుండిరి. కాని అతడు ఇందులో దేనిని చేయుటకును అంగీకరించక సర్వస్వతంత్రుడై ఉండుటకు నిశ్చయించుకొనెను. ఈ సర్వస్వాతంత్ర్యము తనకు సాధ్యము కాదన్న మాటను అతడు గ్రహించినవాడు కాడు. భరతఖండపు మధ్యభాగమున మరియొక పాకిస్థానము ఏర్పడుట భారతీయుల స్వాతంత్ర్యమునకు అత్యంతప్రమాదకర మనియు, అట్టిది ఇండియాప్రభుత్వమువారు ఎన్నటికిని జరుగనీయరనియు అతడు తెలిసికొనజాలడయ్యెను. వారవలంబించుచుండిన సామమార్గమునకు వారి పిరికితనమును, చేతకానితనమును కారణము లని అతడు దురభిప్రాయపడెను. ఇదిగాక కొంత కాలయాపన జరిగినయెడల పాకిస్థానము తనకు బహిరంగముగ సహాయము చేయగల దనియు, ఇంగ్లీషువారు బహిరంగముగ కాకపోయినను రహస్యముగ సహాయము చేయుదు రనియు అతడు విశ్వసించియుండెను. అందుచేత ఇండియాకును, నైజామునకును ఏర్పడిన వివాదము పరిష్కారము కాజాలదయ్యెను. దుర్యోధనునికి శకునివలె నుండిన లైకతాలీ, కాశింరజ్వీ మొదలైనవారు పదభ్రష్టు లగుటచేతను, ఇండియాసైన్యముల బలము తన సంస్థానములో సుస్థిరముగ నాటుకొనుటచేతను నైజాం ప్రస్తుతము ఇండియాప్రభుత్వమువారి సూచన లన్నిటిని అంగీకరించకతప్పదు. తక్కిన సంస్థానములవలె హైదరాబాదుకూడ ఇండియాలో చేరుటయు, ప్రజాస్వామ్యసిద్ధాంతముల ననుసరించి బాధ్యతాయుతప్రభుత్వము అచ్చట స్థాపనమగుటయు తప్పవు. ఈ రెండు పనులు పూర్తియగునవరకు సంస్థానపరిపాలన నైజాంచేతులలో గాక ఇండియాప్రభుత్వమువారి చేతులలోనే ఉండవలెను.

## హైదరాబాదు ఇండియాలో చేరుట

హైదరాబాదుకు ఇండియాలో చేరుటతప్ప గత్యంతరము లే దన్నమాట నిర్వివాదాంశము. హైదరాబాదు ఇండియాలో చేరినగాని ఇండియాకు శాంతిభద్రతలు చేకూరజాల వన్న మాటకూడ నిర్వివాదాంశమే. ఇట్లు జరుగుటయే ధర్మము, న్యాయము. కాని ప్రజాభిప్రాయము కనుగొనినపిమ్మటగాని హైదరాబాదు ఇండియాలో చేరు విషయము నిర్ణయముకావలసిన అవసరము లేదని నెహ్రూప్రభుత్వమువారు పదే పదే చెప్పుచుండిరి. ఇప్పుడుకూడ అట్లే చెప్పుచున్నారు. కాని ఈ విషయములో ప్రజాభిప్రాయమును ప్రత్యేకముగ ఓట్లద్వారా కనుగొనుట అవసరమా? అన్న విషయమునుగురించి కొంత ఆలోచించవలసియున్నది. భరతఖండములోని ఇతరసంస్థానములన్నియు ఇండియాలో చేరు విషయమున ప్రజాభిప్రాయమును కనుగొనవలె నను సూత్రమును మన ప్రభుత్వమువారు అనుసరించలేదు. పరిపాలకుల అనుమతిమీదనే ఇట్టిది జరిగెను. హైదరాబాదువిషయములో కూడ పరిపాలకుడగు నైజాంఅనుమతిమీదనే ఇది జరుపుటలో ధర్మవిరుద్ధము ఎట్టిది ఉండదు. కనుక ప్రజాభిప్రాయమునకై వేచియుండక వెంటనే నైజాం

అనుమతిమీద హైదరాబాదును ఇండియాలో చేర్చు కొనుటయే ఉత్తమమార్గము. అట్టి ఒడంబడికను అంగీకరించుటకు నైజాం ఇప్పుడు సర్వసిద్ధుడై ఉన్నాడు.

## ప్రజాభిప్రాయము

ఇందువిషయమై హైదరాబాదుసంస్థానములోని ప్రజల అభిప్రాయమును కనుగొన దలచుటలో అనేక కష్టము లున్నవి. ఈ ప్రజలు ఎంతో వెనుకబడి యున్నారు. మొగలాయీల పరిపాలనకాలమందు— అనగా ౨౫౦ సంవత్సరములకు పూర్వము—ఎట్టి స్థితి యందుండిరో అట్టి స్థితియందే వారిప్పుడున్నారు. ఇదిగాక సంస్థానమందు ప్రస్తుతము శాంతిభద్రతలు పూర్తిగ స్థాపితములు కాలేదు. ఇవి స్థాపితములగుటకు ఒక సంవత్సరమైనను పట్టును. రజాకార్లు పల్లెటూళ్లలో ఇంకను ఉన్నారు. వీరిని పట్టుకొనుటకు ఎంతో ప్రయత్నము కావలసియున్నది. వీరుగాక, ప్రజలను భీతావహుల జేసినట్టి దొంగలుకూడ ఉన్నారు. వీరితోపాటు కొన్ని జిల్లాలయందు—ముఖ్యముగా తూర్పుభాగములోని ఆంధ్రజిల్లాలలో—కమ్యూనిస్టుల ప్రాబల్యము హెచ్చుగా ఉన్నది. వారి చర్యలుకూడ శాంతిభద్రతలకు విరుద్ధములుగ నున్నవి. గతసంవత్సరము మస్య సంస్థానములో అరాచకము ప్రబలిన కారణముచేత దొంగలు, దారిదోపిడిగాండ్రు పెరిగిపోయి ఉన్నారు. వీరందరిని అణచి క్రమపరిపాలనను స్థాపించినతర్వాత గాని ప్రజాభిప్రాయము కనుగొనుటకు సాధ్యము కాదు. కనుక ఇందుకై వేచియుండక, నైజాంఅనుమతిమీద తక్కిన సంస్థానములవలె హైదరాబాదుసంస్థానమును కూడ ఇండియాలో వెంటనే చేర్చుకొనుటయు, చేరినట్లు ప్రకటించుటయు అత్యావశ్యము. కాలయాపన చేయుటలో అర్థములేదు; ప్రమాదముకూడ సంభవించవచ్చును. ఇట్టి ఒడంబడికకు నైజాము అనుమతించని యెడల ప్రజాభిప్రాయమును కనుగొనుటకు ప్రయత్నించవలసినదేగాని ప్రస్తుతము అట్టి మార్గము ననుసరించుట అనవసరము.

## కమ్యూనిస్టుల వైఖరి

ఈ సందర్భములో కమ్యూనిస్టుల వైఖరిగూడ గుర్తింపదగియున్నది. నైజాంలోని ఆంధ్రజిల్లాలలో మాటియందు వీరు తమ ప్రాబల్యమును స్థిరపరచుకొని నట్లును, సుమారు వేయిగ్రామములు వీరి వశమం దున్నట్లును తెలియుచున్నది. హైదరాబాదు ఇండియాలో చేరువిషయమున ప్రస్తుతము కమ్యూనిస్టులు ఒక వింతవాదమును ప్రతిపాదించుచున్నారు. నెహ్రూప్రభుత్వము, కాంగ్రెసు సంస్థయు సాహుకార్లయం దభిమానము కల దనియు, సామాన్యప్రజల యోగక్షేమములను అభిలషింపదనియు, ఇట్టి సందర్భములో హైదరాబాదు ఇండియాలో చేరుటవలనను సంస్థానములో దారిద్ర్యబాధను అనుభవించుచుండు కర్షకులు, కూలివాండ్రు సాహుకార్లకు దాసు లగుటయే అనియు, ఆ కారణముచేత హైదరాబాదు ఇండియాలో చేరక సర్వస్వాతంత్ర్యము ననుభవించు రాజ్యముగ నుండవలె ననియు వారి ప్రచారము. సుమారు ఒక సంవత్సరముగా వారిట్టి ప్రచారమును చేయుటయేగాక, ఈ ౧,౦౦౦ గ్రామములలో వారు విప్లవమార్గము ననుసరించి భూస్వాములను భూములనుండి తొలగించి తమ అధికారమును స్థిరముగ స్థాపించుకొనియున్నారు. రజాకార్లు అనేకులు వారి ఆయుధములను కమ్యూనిస్టులకు ఇచ్చివేసి రనికూడ తెలియుచున్నది. కనుక ఈ జిల్లాలలోని కమ్యూనిస్టులను, వారి ప్రచారమును అణచివేసినగాని ప్రజల నిజమైన అభిప్రాయమును కనుగొనుట కష్టము. ఈ పని పూర్తియగుటకు చాలకాలము పట్టును. ఈ కారణముచేతగూడ హైదరాబాదు భవిష్యత్తును ప్రజాభిప్రాయమును కనుగొనినతర్వాతగాని నిర్ణయించుటకు వీలులే దన్న వాదమును మన ప్రభుత్వమువారు వదలుకొనుట మంచిది.

## కమ్యూనిస్టుల ఉద్దేశము

ఒక హైదరాబాదులోనే గాక ఇతరప్రదేశములందు కూడ కమ్యూనిస్టులు ప్రస్తుతము ఇట్టి వాదమునే అనుసరించుచున్నారు. మన దేశములో బ్రిటిషు ప్రభుత్వము తొలగిపోయినతర్వాతగూడ పరాయిప్రభుత్వమునకు లోబడిన ప్రదేశములు కొన్ని ఇప్పటికిగూడ ఉన్నవి. ఫ్రెంచివారికి లోబడిన పుదుచ్చేరి మొదలైన అయిదు పట్నములు, పోర్చుగీసువారికి లోబడిన

గోవా మొదలైన మాహె పట్టణములు ఇట్టివి. సర్వస్వాతంత్ర్యము గల హైదరాబాదు మన దేశమునకు మధ్యన ఉండుటచేత ఎంత ప్రమాదమో పరాయి ప్రభుత్వమునకు లోబడిన ప్రదేశము లిట్టివి ఉండుట వలన కూడ అంతే ప్రమాదము ఉన్నది. ఇవన్నియు ఇండియాలో చేరినగాని మనకు సంపూర్ణస్వాతంత్ర్యము లభించినదని అనుకొనుటకు వీలులేదు. పరాయిప్రభుత్వములతో రాయబారములు జరిపి వీటిని మన ప్రభుత్వముక్రిందికి తెచ్చుకొనుట సక్రమమైన మార్గము. ఫ్రెంచిపట్టణములనుగురించి ఇట్టి రాయబారములు ఇంతకుముందే జరిగినవి. ఈ పట్టణములలోని ప్రజల అభిప్రాయమును ఈ విషయములో కనుగొని దానినిబట్టి వీటి భవిష్యత్తును నిర్ణయించవలసినదిగా నెహ్రూప్రభుత్వమువారు అంగీకరించిరి. ప్రస్తుతము ఈ ప్రజాభిప్రాయమును కనుగొనుటకు ఏర్పాటులు జరుగుచున్నవి. ఈ సందర్భములోగూడ కమ్యూనిస్టులు నెహ్రూప్రభుత్వమునకు విరోధముగ ప్రచారముచేయుచు, ఈ పట్టణములు ఇండియాలో చేరకూడదని ప్రజలకు దుర్బోధలు చేయుచున్నారు. ఫ్రెంచిపాలనముందే ఈ ప్రదేశము లుండుట ఉత్తమమని వారి వాదము. ఇట్టి వాదమును చేయుటలో ఒక అంతరర్థ మున్నది. ఏదో విధముగ కమ్యూనిస్టుప్రభుత్వమును మన దేశమందు స్థాపించుట వీరి ఉద్దేశము. ప్రపంచమందంతటను కమ్యూనిస్టు ప్రభుత్వములను దౌర్జన్యముమూలమున స్థాపించుటకు కంకణము కట్టుకొన్న అంతర్జాతీయకమ్యూనిస్టుసంస్థకు వీరు సంబంధించినవారు. ఇండోనీషియా, మలయా, బర్మాలలో వీ రిట్టి ప్రయత్నములను చేయుచున్నారు. ఇండియాలోకూడ ఇట్టి ప్రయత్నములు చేయుటకు వీరు సన్నాహము కొంతకాలమునుండి పన్నుచున్నారు. ప్రతిదేశములో ఏదోఒక ప్రదేశమున మొట్టమొదట తమ అధికారమును స్థాపించుటయు, క్రమక్రమముగ ఆ కేంద్రమునుండి తక్కిన ప్రదేశములకు తమ అధికారమును వ్యాపింపజేసికొనుటయు వారి వ్యూహములకు ప్రధానలక్షణము. హైదరాబాదులోని తెలంగాణా జిల్లాలలోను, పరాయి ప్రభుత్వమందుండు ఫ్రెంచిపట్టణములందును వా రిట్టి కేంద్రములను స్థాపించుకొనజూచుచున్నారు. ప్రపంచమందంతట కమ్యూనిస్టులకును, కమ్యూనిస్టేతరులకును ప్రచండసమరము జరుగనున్న ఈ కాలములో హైదరాబాదునందును, ఫ్రెంచిప్రదేశములందును కమ్యూనిస్టులు సంపాదించినట్టియు, సంపాదించదలచినట్టియు ప్రాబల్యము ఎట్టి ప్రమాదమునకు కారణమగునో ఊహించవలసియున్నది. బర్మాలోని కమ్యూనిస్టు లనేకములు ఇప్పుడిప్పుడే మణిపూరుసంస్థానములోనికి, పశ్చిమ బెంగాలులోనికి ప్రవేశించుచున్నట్లు తెలియుచున్నది. ప్రజలను దోచుకొనుట, గ్రామములను కాల్చివేయుట మొదలైన క్రూరకృత్యములను చేయుటలో రజాకార్లకును, కమ్యూనిస్టులకును విస్తారభేదము లేదు. రజాకార్లమూలమున ఎట్టి ప్రమాదము సంభవించనుండెనో అట్టి ప్రమాదమే కమ్యూనిస్టులమూలమున సంభవించనున్నది.

## శాంతిభద్రతలు

రజాకార్లను, దిండార్లను, కమ్యూనిస్టులను, విదేశములనుండి వచ్చి నైజాం సైన్యములో చేరియుండు అరబ్బీలు, పఠానులు మొదలగువారిని, సాయుధులను ఇతరప్రజలను నిరాయుధుల జేయుట అత్యవసరము. ఇది జరిగినగాని హైదరాబాదులో శాంతిభద్రతలు ఏర్పడవు. బ్రిటిషుపరిపాలనకాలమందు ప్రజలను వారు నిరాయుధుల చేసిరని మనము నిందించిన మాట వాస్తవమే. కాని జాతీయపరిపాలన ఏర్పడిన తరాత ప్రజలు సాయుధులై ప్రభుత్వమువారిపై తిరుగబడుటకు అవకాశము కలవారు కావలెనని అనుటలో అర్థమేమియు లేదు. అధునికకాలపు ఆయుధములు ప్రజల హస్తగతము లగుట ఎంతో ప్రమాదము. ఆయుధముల నుపయోగించు అధికారము ప్రభుత్వమువారి కొలువులో నుండు సైనికులకును, పోలీసులకునుదప్ప మరెవ్వరికి ఉండరాదు. బలప్రయోగము చేయు హక్కు, దౌర్జన్యము నుపయోగింపగల అవకాశము ఒక ప్రభుత్వమునకే ఉండవలెను. రాజ్యాంగనీతికిని, రాజధర్మమునకును ఇది ప్రధానలక్షణము. దీనికి విరుద్ధముగ ప్రజలలో ఎవరుగాని సాయుధులైనయెడల బందిపోటులు, దోపిడీలు, అంతర్యుద్ధములు మామూలగును. అధునిక ఆయుధ

లను సంపాదించు విషయములో కమ్యూనిస్టులు విపరీతమైన ప్రయత్నము చేయుచున్నారు. వారిని ఎదుర్కొనుటకు ప్రభుత్వమువారు ప్రయత్నించుటకు బదులు సామాన్యజనులను సాయుధుల జేయుట ఉత్తమమని వాదించువారు లేకపోలేదు. మన సరిహద్దుజిల్లాలలోని ప్రజలను దోచుకొనుచుండిన రజాకార్లను ఎదుర్కొనుటకుకూడ ఇదే మార్గమని అనేకు లిదివరకు వాదించుచుండిరి. కాని ఈ వాదనలన్నియు దూరదృష్టితో కూడినట్టివి కావు. ఎన్నడుగాని ఆయుధములు ప్రభుత్వమువారివద్దతప్ప ఇతరులవద్ద ఉండరాదు.

## హైదరాబాద సమస్య పరిష్కారమగుట

హైదరాబాదుసమస్య పరిష్కారమగుటకు కొంతకాలము పట్టునని దీనినిబట్టి మనము ఊహించవలెను. సికిందరాబాదులో మన సేనలు ప్రవేశించుట ఇందులో మొదటి మెట్టు. రజాకార్లను అణచుట రెండవ మెట్టు. అరబ్బీలను, పఠానులను ఇతర విదేశీయులను వారివారి దేశములకు పంపివేయుట మూడవ మెట్టు. కమ్యూనిస్టులను అణచివేయుట నాల్గవ మెట్టు. ఈ పని అంతయు ఇప్పుడు ఏర్పడిన సైనికగవర్నరు పూర్తిచేయవలెను. ఇది పూర్తిఅగువరకు సైనికప్రభుత్వమును రద్దుచేసి ప్రజాప్రభుత్వమును స్థాపించుటకు వీలులేదు. అటుతర్వాత ప్రజల విశ్వాసమునకు పాత్రులైన స్టేట్ కాంగ్రెసువారుగాని, ఇతరులుగాని అధికారములోనికి రావచ్చును. ప్రస్తుతము స్టేట్ కాంగ్రెసుకు ప్రజలలో ఎంత పలుకుబడి కలదో తెలియదు. వీరుగాక సోషలిస్టుపార్టీవారుకూడ సంస్థానములో పనిచేయుచున్నారు. కాని బ్రిటిష్‌వారు మన దేశమందుండి తొలగిపోవునాటికి మన జాతీయ కాంగ్రెసుకు ఉన్నంత పలుకుబడిగాని, ప్రాబల్యముగాని శ్రీ రామానందతీర్థగారి స్టేట్ కాంగ్రెసుకును, సోషలిస్టులకును ప్రస్తుతము హైదరాబాదులో లేదు. బ్రిటిష్‌వారి స్థానమున జాతీయకాంగ్రెసునాయకులు అధికారమునకు వచ్చినట్లు లైకలీస్థానమున స్టేట్ కాంగ్రెసునాయకులు వెంటనే అధికారములోనికి వచ్చుట ప్రమాదము. వారు సంస్థానమం దంతట పర్యటనము చేసి, ప్రజలలో పలుకుబడి సంపాదించుకొనవలసిన ఆగత్య మున్నది. అప్పటివరకు ఇండియా ప్రభుత్వమువారు నియమించిన అధికారులే హైదరాబాదును పాలించుచుండవలెను. నైజాము సింహాసనమం దుండవలెనా, భాషాప్రయుక్తరాష్ట్ర విధానము ననుసరించి తెలంగాణా జిల్లాలు ఆంధ్రరాష్ట్రమందును, కర్ణాటకజిల్లాలు కర్ణాటకమందును, మహారాష్ట్రజిల్లాలు మహారాష్ట్రమందును చేరిపోవలెనా — అన్న విషయములను పరిష్కరించుటకు ఇది సమయము కాదు.

## ఇతర విషయములు

సెప్టెంబరు నెలలో మన ప్రభుత్వమువారు ఎదుర్కొనవలసిన సమస్యలన్నిటిలో హైదరాబాదుసమస్య ఒక్కటి మిక్కిలి ప్రధానమైనది. బట్టలపైననేగాక ఆహారపదార్థములపైనకూడ క్రమక్రమముగ కంట్రోలును స్థాపించుట అవసరమని వారు ఈ నెలలో తీర్మానించిరి. విపరీతముగ పెరిగిపోవుచున్న ధరలను తగ్గించుటకు ఇదియే ఉత్తమమార్గమని వారిప్పుడు అభిప్రాయపడుచున్నారు. ఇదిగాక ఈ నెలలో భాషాప్రయుక్తరాష్ట్రసంఘమువారు మన రాష్ట్రములో పర్యటనముగావించి ప్రముఖుల నేకుల అభిప్రాయములను తెలిసికొనిరి. భాషాప్రయుక్తరాష్ట్రములు కూడదని ప్రముఖు లెవ్వరును చెప్పియుండలేదు. అందరు ఈ సూత్రమును ఒప్పుకొన్నవారే. కాని రాయలసీమకు సంబంధించిన శాసనసభ్యులు, మరికొందరుమాత్రము ఆంధ్రరాష్ట్రనిర్మాణమును వాయిదా వేయవలె నని కోరిరి. ఇట్టి నిర్మాణము వెంటనే జరుగవలెనని శాసనసభలో గావింపబడిన తీర్మానమునకు వీరిలో అనేకులు సుముఖులుగ నుండినవారు. అయినప్పటికిని వారిప్పుడు అభిప్రాయము ఏల మార్చుకొనిరో తెలియుట లేదు. హైదరాబాదుసమస్య పరిష్కారమైనగాని ఆంధ్రరాష్ట్రనిర్మాణము జరుగరా దని కొందరు వాదించిరి. కాని ఈ సమస్య ఇప్పుడు పరిష్కారమైనట్లే మనము భావించవచ్చును. కనుక ఈ వాదనకు ప్రస్తుతము ఎట్టిబలము లేదు. మద్రాసునగరవిషయమై మనవారిలో అనేకులు విభజనను ఆమోదించినట్లు కనబడుచున్నది. కూవంనదికి ఉత్తరమున నుండు భాగము ఆంధ్రరాష్ట్రములోను, దక్షిణమం దుండు భాగము అరవరాష్ట్రములోను చేరుట మంచి దని వారు సూచించిరి. ఇదియే అనుసరించదగిన మార్గము. ఇట్లు చేసినయెడల ఆంధ్రరాష్ట్రమునకు ఏది ప్రధానపట్టణముగ నుండవలె నను సమస్య పరిష్కారమగుటయే కాక, క్రొత్త ప్రధానపట్టణమును నిర్మించుటకై ఖర్చుపెట్టవలసిన కోట్లకొలది ద్రవ్యము మిగులును. కనుక రాజ్యాంగపరిషత్తువారు ఆంధ్రరాష్ట్ర నిర్మాణము నంగీకరించి, రాజ్యాంగప్రణాళికలో ఉదాహరింప

బహు రాష్ట్రములలో, అంధ్రరాష్ట్రమునుగూడ చేర్చ వలయునని ఆశించుచున్నాను.

## ప్రపంచమం దంతట అశాంతి

ఇది యొక విప్లవయుగము. ఒక ధర్మము మారి మరియొక ధర్మము నిర్మాణము కావలసిన సంధికాలము. ఇదివర కుండిన ధర్మము చాలవరకు శిథిలమై పోయినది. కాని దాని స్థానమున నిర్మింపదగిన ధర్మము ఎట్టిదిగ నుండవలెనో, దానిని శాంతిమార్గమున స్థాపించుటయా, లేక రక్తపాతము గావించి నిర్మించుటయా అన్న విషయములనుగురించి తీవ్రములగు అభిప్రాయభేదములు యేర్పడియున్నవి. అందుచేతనే ఏ దేశమందు చూచినను అశాంతియే కనుపించుచున్నది. ధర్మవ్యవస్థలు మారవలసివచ్చినప్పుడు రక్తపాతము ద్వారా గాక శాంతిమార్గమున మార్చుటకు అవకాశములు కల్పించు ఉద్దేశముతో రెండవ ప్రపంచ యుద్ధము ముగిసినతర్వాత నానాదేశపు రాజకీయ వేత్తలు ఆలోచించి 'ఐక్యరాజ్యసమితి' యొకదానిని స్థాపించిరి. ఈ సమితికి రెండు ప్రధానాంగములు. ఒకటి మహాసభ; రెండవది భద్రతాసంఘము. సమితిలో సభ్యత్వము వహించిన ౫౮ రాజ్యముల ప్రతినిధులందరు మహాసభలో సంవత్సరమున కధమము ఒక పర్యాయమైనను సమావేశమగుచుందురు. భద్రతా సంఘమునందు అన్నిరాజ్యములకు ప్రాతినిధ్యము లేదు. అగ్రరాజ్యములని ప్రఖ్యాతిగాంచిన బ్రిటను, అమెరికా, రష్యా, ఫ్రాన్సు, చైనాలకు శాశ్వత ప్రాతినిధ్య మున్నది. ఈ అయిదుగురు సభ్యులు కాక, మహాసభవా రెన్నుకొనిన మరి ఆర్గురు సభ్యులు— మొత్తము మీద పదకొండుసభ్యులు అందులో ఉన్నారు. ఈ భద్రతాసంఘము ఎప్పుడో ఒకప్పుడు కాక ఎల్లప్పుడు సమావేశమగుచుండును. మహాసభ కంటె ఇదియే ఎక్కువ ప్రాధాన్యము వహించి యున్నది.

## ఐక్యరాజ్యసమితి మహాసభ

ఈ మహాసభయొక్క మూడవ సమావేశము సెప్టెంబరు ౨౧ తేదీన ఫ్రాన్సుకు ప్రధానపట్టణమగు పారిస్ నగరములో ప్రారంభమయ్యెను. పరిశీలించ వలసిన విషయము లెన్నియో ఉండుటచేత సుమారు మూడుమాసములు ఈ సమావేశము జరుగనున్నది. కాని దీనినిగురించి ఒక అంశమును మరువకూడదు. ఈసభ ఒక ఉపన్యాసవేదిక. పరిశీలింపబడవలసిన విషయములనుగురించియు, ప్రపంచమందు శాంతి వృద్ధియగుటకును, అశాంతి అడుగంటుటకును కావలసిన సాధనములనుగురించియు ఇందు వాదోపవాదములు జరుగును. అనేకతీర్మానములు గావింపబడును. కాని ఈ తీర్మానములను అమలులో నుంచుటకు కావలసిన అధికారము గాని, వసతులుగాని ఈ మహాసభకు లేవు. మూడింట రెండువంతుల సభ్యులు ఆమోదించినగాని ముఖ్యవిషయములనుగురించిన తీర్మానములు చేయుటకు వీలులేదు. ఈ కారణముచేత మహాసభసమావేశములు గంభీరోపన్యాసములకును, వాక్చాతుర్యప్రదర్శనమునకు, పరస్పరప్రశంసకు, విమర్శకును అవకాశము కల్పించుచున్నదేగాని, కార్యరంగమున ప్రాధాన్యము వహించుట లేదు. తీర్మానములు క్రియారూపమును ధరించనంతవరకు ఈ సమావేశములలోని ప్రసంగములకు అంతవిలువ ఉండజాలదు. కాని సభ్యులుమాత్రము అతి ఉత్సాహముతోను, అతిశ్రద్ధతోను ఉపన్యాసములు గావించుచుందురు. ప్రపంచములోని అశాంతికి, యుద్ధసన్నాహములకు, భయమునకు రష్యా కారణమని బ్రిటను అమెరికాలు, వీరి సామ్రాజ్యకాంక్షయు సాహసకారివిధానమే కారణములని రష్యావారు పరస్పరము నిందించుకొనుచున్నారు. ఈ పదిరోజుల సమావేశములలోని ఉపన్యాసముల కిదియే ప్రధాన లక్షణము.

## భద్రతాసంఘము

భద్రతాసంఘము ప్రతిరోజు సమావేశమగుచుండు సంఘము. ఈమధ్య ఇందు చర్చింపబడిన విషయములలో హైదరాబాదుసమస్య ఒకటి. స్వతంత్ర రాజ్యములమధ్య సంభవించు వివాదములనుమాత్రమే విమర్శించుటకు ఈ సంఘమున కధికారము కలదు. హైదరాబాదు స్వతంత్రరాజ్యము కాకపోయినను దానికిని, ఇండియాకును మధ్య ఏర్పడిన వివాదమును చర్చించుటకు ఈ సంఘమువారు సిద్ధపడిరి. కోట్లకొలది ద్రవ్యమును ఖర్చుపెట్టి నైజాముయొక్క మంత్రులు విదేశములలో చేయుచుండిన ప్రచారమే దీనికి ముఖ్యకారణము. భద్రతాసంఘమం దుండు బ్రిటిష్ప్రతినిధుల పక్షపాతముకూడ దీనికి మరియొక కారణము. ఏవిషయమునుగాని పక్షపాతములేక న్యాయముగ విమర్శించవలెనను ఉద్దేశము ఈ సంఘమునకు లేదు. కాశ్మీరు, ఇండోనీషియా మొదలగు సమస్యలను వీ రిదివరకు పక్షపాతబుద్ధితోనే విమర్శించిరి. హైదరాబాదువిషయములో వీరి

వైఖరి ఇట్టిదే. మొట్టమొదట ఫిర్యాదుచేసిన నైజాం తన ఫిర్యాదును వదులుకొనినట్లు తెలియపరచినను, ఆ విషయమునుగురించిన విచారణను వదలుకొనుటకు వీరు అంగీకరించనైరి. నైజాంయొక్క పాత ఏజంట్లు ఖర్చుపెట్టుచుండిన ద్రవ్యమునుయొక్కయు, దానిమూలమున జరుగు ప్రచారమునుయొక్కయు ఫలితమే ఇది.

## బర్లిన్ సమస్య

ఈ భద్రతాసంఘము ఇప్పుడు ఒక క్లిష్టతమమైన సమస్యను పరిష్కరించవలసిన పరిస్థితులు ఏర్పడినవి. మూడుమాసములక్రిందట బర్లిన్‌నగరమునుగురించి రష్యాకును, బ్రిటన్, ఫ్రాన్సు, అమెరికాలకును మధ్య ఏర్పడిన వివాదమే ఈ సమస్య. రెండవ ప్రపంచయుద్ధము ముగిసినతర్వాత జర్మనీని నాలుగు నాలుగుభాగములు చేసి ఒక్కొక్కభాగమును వీరిలో ఒక్కొకరు వారి వశమున ఉంచుకొనిరి. తూర్పు భాగము రష్యాకంటుకు వచ్చెను. ఈ భాగములో జర్మనీకంతకు ప్రధానపట్టణమగు బర్లిన్ ఉన్నది. కాని పంపకములో దీనినిగూడ నాలుగుభాగములుగ జేసి, ఒక్కొకరు ఒక్కొక భాగమును తీసికొనిరి. ఇదంతయు తాత్కాలికవిభాగము. జర్మనీ భవిష్యత్తును నిర్ణయించు శాశ్వతఒడంబడిక ఈ నాలుగు దేశములవారు చేసికొనునంతవరకే ఈ విభజనలు అమలులో ఉండవలసినట్లుగా వారనుకొనిరి. ఇదంతయు మూడు సంవత్సరములక్రిందట జరిగెను. ఈ మూడు సంవత్సరములమధ్య నాలుగు దేశముల మంత్రులు అనేక పర్యాయములు సమావేశమైనను జర్మనీభవిష్యత్తును గురించి వారెట్టి నిర్ణయమునకును రాలేకపోయిరి. ఇంతేగాక ఈ మధ్యకాలములో రష్యాకును, తక్కిన మూడు రాజ్యములకును విపరీతములగు అభిప్రాయభేదములు కలిగి, ఒకరిపై ఒకరు యుద్ధముచేయుటకు కావలసిన సన్నాహములలో నిమగ్నులైరి. దానికి ఫలితముగా తమ పాలనములో నున్న పశ్చిమజర్మనీ నంతను ఒక ప్రత్యేకరాజ్యముగ నేర్పరచి, అందులో పరిశ్రమాగారములను వృద్ధిచేసి యుద్ధపరికరములు తయారుచేయుటకు మూడు రాజ్యములవారు తీర్మానించుకొనిరి. పశ్చిమజర్మనీలో తమ కట్టి స్థావరము లేనినాడు తూర్పు జర్మనీలో ఉండు బర్లిన్‌లో వీరికి స్థావర మెందుకుండవలెనని రష్యావారు వారిని బర్లిన్‌నుండి తరిమివేయుటకు సంకల్పించి పశ్చిమజర్మనీనుండి బర్లిన్‌కు వచ్చు రోడ్లను, కాలువలను, రైళ్లను బంధించిరి. కాని వీరు ఆకాశవిమానముల ద్వారా బర్లినుకు సరకులను తీసికొనిపోసాగిరి. ఈ విషయమై వీరి మధ్య అనేకసంప్రతింపులు జరిగెను. కాని రష్యావారు దిగ్బంధనమును రద్దుచేయక పోవుటయేకాక ఆకాశవిమానముల రాకనుగూడ అడ్డుపెట్టుచున్నారు. ఈ ఒత్తిడిమూలమున విసికి పశ్చిమరాజ్యములవారు ముగ్గురు బర్లినును ఖాళీచేయుదురని రష్యావారి అభిప్రాయము. కాని ఎన్నికోట్ల ద్రవ్యమైనను ఖర్చుపెట్టి ఆకాశవిమానములద్వారా బర్లినులో తమ ప్రాబల్యమును నిలుపుకొనుటకు వీరు దృఢనిశ్చయులై ఇందుకై యుద్ధమును మొదలుపెట్టుటకు సిద్ధముగ నున్నారు. కాని యుద్ధము ప్రారంభించుటకు ఐక్యరాజ్యసమితిరాజ్యాంగవిధానము ననుసరించి తమ వివాదమును పరిష్కరించవలసినదని వీరు భద్రతాసంఘమును కోరియున్నారు. దీనినిగురించి అక్టోబరు ౪ తేదీన చర్చ ప్రారంభమగును.

## చర్చలో విశేషములు

ఇట్టి సమస్యలనేకములను ఇదివరలో భద్రతాసంఘము చర్చించెనుగాని వాటిలో ఒక అగ్రరాజ్యము మరియొకఅగ్రరాజ్యముపై ఫిర్యాదు చేసియుండలేదు. ఇదియే అట్టి ఫిర్యాదులలో మొదటిది. జర్మనీ, జపానులను ఓడించుటలో కలిసి పనిచేసిన అగ్రరాజ్యములవారు యుద్ధము ముగిసినతర్వాత ప్రపంచవ్యవహారములన్నిటియందును ఐకమత్యముతో పనిచేయుదురన్న అభిప్రాయముతో ఐక్యరాజ్యముల సమితి ఏర్పాటుగావింపబడెను. అగ్రరాజ్యములవారు ఏకగ్రీవముగ అంగీకరించినగాని ఎట్టి విషయము భద్రతాసంఘము తీర్మానింపరాదను నిబంధన ఆ ఏర్పాటులో ఉన్నది. కాని అనేకవిషయములలో ఇట్టి ఐకకంఠ్యము కుదురలేదు. బర్లిన్ సమస్యలో వీరి మధ్యనే అభిప్రాయభేదములు ఏర్పడినవి గదా! భద్రతాసంఘమువారీ విషయమై చేయు చర్చలలో ఒకరి నొకరు తప్పుబట్టుట తప్ప మరెట్టి ఫలితము కలుగజాలదు. బ్రిటన్ ఫ్రాన్సు అమెరికాలవారు చేయదలచుకొన్న తీర్మానమును రష్యా తీవ్రముగ ప్రతిఘటించును. వీరిమధ్య ఏర్పడిన విభేదములలోని గుణాగుణములు ప్రపంచమునకంతకు చాటించుటతప్ప ఈ సంఘములోని చర్చలు మరెందుకు పనికిరావు. స్వయముగ ముఖాముఖిని జరుగుచున్న సంప్రతింపుల మూలమున పరిష్కారము కాజాలని బర్లిన్‌సమస్య భద్రతాసంఘపు తీర్మానములమూలమున పరిష్కారమగునని అనుకొనుట హాస్యాస్పదము.

## యుద్ధమే శరణ్యము

కనుక ఈ గడ్డుసమస్య పరిష్కారమగుటకు యుద్ధముతప్ప మార్గాంతర మున్నట్లు కనుపించుట లేదు. రెండుపక్షములవారు యుద్ధసన్నాహములను చేయు చున్నారు. రష్యా ప్రధానియగు స్టాలిన్ ఈయుస్లా వియ అనుచరరాజ్యములగు పోలెండు, హంగెరీ, బల్గేరియా, జెకోస్లావేకియా మొదలగువాటియొక్క ప్రధానులతో సంప్రతించి 'తూర్పు రాజ్యముల' ప్రత్యేకసమితి నొకదానిని నిర్మించి, అందులో తూర్పు జర్మనీకి సభ్యత్వము కల్పించజూచుచున్నట్లు తెలియు చున్నది. ఐక్యరాజ్యసమితిలోని సభ్యత్వమును రష్యా, రష్యాఅనుచరరాజ్యములును వదలుకొనునా అన్న ప్రశ్న అనేకులను ప్రస్తుతము కలవర పెట్టుచున్నది. వదలుకొనుట లాభకారి కాదని కొన్ని నెలల క్రిందట అమెరికా విదేశాంగమంత్రి జార్జి మార్షలు అభిప్రాయపడియుండెనను, కొద్దిరోజుల క్రిందట బ్రిటిష్ విదేశాంగమంత్రి బెవిన్ ఐక్యరాజ్య సమితిమహాసభలో గావించిన ప్రసంగమందు రష్యా వెళ్లిపోవుటవలన నష్టపెట్టిదియు లేదను అర్థము వచ్చు నట్టి మాటలను మాట్లాడెను. కాని రష్యామాత్రము సమితిని వదలి వెళ్లదని తోచుచున్నది. అందులో ఉండుటవలన ఇతరరాజ్యములను బహిరంగముగ అందరి ఎదుట ఖండించుటకు అవకాశ మేర్పడియున్నది. తన్నుగురించి ఇతరులు చేయు ఖండనలకు జవాబు చెప్పుటకు కూడ అవకాశ మున్నది. సమితిసభ్యత్వ మును వదలుకొన్నయెడల ఈ అవకాశములు రెండును అదృశ్యములగును.

## పశ్చిమరాజ్యములవారి యుద్ధసన్నాహము

యుద్ధ మారంభమైనయెడల ప్రప్రథమమున రష్యాకే జయము కలుగుటకు ఎక్కువ అవకాశము లున్నవి. యూరపుఖండములోని మూడింట రెండు భాగములు దాని వశమందున్నవి. తక్కిన భాగములోని రాజ్యములలో నొక్కొకదానియందును రష్యావిజ యమును కాంక్షించు కమ్యూనిస్టు లున్నారు. వీరు పంచమదళముగ ప్రవర్తించి రష్యాకు సహాయము చేయ సిద్ధపడియున్నారు. అందుచేత పశ్చిమజర్మనీ, హాలెండు, బెల్జియం, లక్సెంబర్గు, ఫ్రాన్సు దేశ ములపై దండెత్తుట రష్యాకు చాల సులభము. ఆకాశవిమానములద్వారా ఇంగ్లండుపై పడుటకూడ కష్టముకాదు. ఇందుచేతనే పశ్చిమరాజ్యముల వారు తీవ్రముగ యుద్ధసన్నాహములు చేయుచున్నారు. హాలెండు, బెల్జియం, లక్సెంబర్గు, ఫ్రాన్సు, ఇంగ్లండు దేశము లైదును కలిసి ఒక రక్షణవిధానమును ఏర్పరచు కొనిరి. వీరికి సహాయము చేయుటకు అమెరికా, కనడాదేశములవారు సిద్ధపడిరి. కనుక అట్లాంటిక్ మహాసముద్రమునకు రెండువైపుల నుండు దేశము లన్నియు ఒక సమాఖ్యగ ఏర్పడి, కలిసి యుద్ధము చేయ నున్నవి. సైనికదళములను తగ్గించుటకు ఇది వరలో ఇంగ్లీషుప్రభుత్వమువారు చేసిన ఏర్పాటు లన్నియు ఇప్పుడు రద్దుచేసిరి. సైనికుల సంఖ్యను వృద్ధిచేయుటకు కావలసిన ఏర్పాటులను గావించు చున్నారు. మొత్తముమీద రెండు మూడు నెలలలో యుద్ధము ప్రారంభమగుటకు ఎట్టి సన్నాహములు కావలెనో అట్టి సన్నాహము లన్నియు జరుగు చున్నవి.

## ఫ్రాన్సుయొక్క అస్థిరత్వము

ఈ సన్నాహములలో పశ్చిమరాజ్యముల వారి విధానమున ఒక గొప్ప లోప మున్నది. ఫ్రాన్సు దేశములో ప్రస్తుత మేర్పడిన అస్థిరపరిస్థితులే ఈ లోపము. ఒకప్పుడు యూరపుఖండమందంతట నాయకత్వము వహించిన ఫ్రాన్సుదేశము గత రెండు ప్రపంచయుద్ధముల ఫలితముగ మిక్కిలి దుర్బ లత్వము గాంచియున్నది. యుద్ధము చేయుటయందు ప్రజలకు ఉత్సాహము లేదు. యుద్ధములో జయము లభించునన్న విశ్వాసముకూడ వారిలో సన్నగిల్లియున్నది. దీనికితోడు ఆర్థికపరిస్థితులు అతిక్లిష్టస్వరూపమును ధరించి యున్నవి. ధరలు విపరీతములుగ పెరుగుచున్నవి. కార్మికులు ఎక్కువ కూలీలను కోరుచున్నారు. సమ్మెలు మామూలైనవి. దీనికితోడు శాసనసభలో అనేకపార్టీలు ఏర్పడుటచేత ఏ మంత్రివర్గము స్థిరముగ కొన్ని నెలలపాటైనను అధికారమం దుండుటలేదు. నిమిష నిమిషమునకు మంత్రులు మారిపోవుచున్నారు. కమ్యూనిస్టులకును, ఇతరపక్షములవారికిని తీవ్ర సంఘటనలు జరుగుచున్నవి. డీగాల్ అను నాయకుడు సాధ్యమైనయెడల నియంతృత్వప్రభుత్వమును స్థాపించ జూచుచున్నాడు. ఈసంఘటన లన్నియు నిలచి పోయినగాని ఫ్రాన్సుదేశము యుద్ధములో పాల్గొనజాలి యుండదు. (1-10-'48)

# మలయానిలుడు

## శ్రీ వావిలాల సోమయాజులు

"అకృతకామోదకురవకావికలసకుల
ముకులసకలవసాంతప్రమోదచలిత
కలితకలకంఠకులకంఠకాకలీ వి
భాసురములు వొల్చు మధుమాసవాసరంబు"

ఋతుచక్రభ్రమణంలో శబలితకాంతులీనుతూ గమిస్తున్న దానిని ఆంధ్రప్రబంధవనీవీథికి ఒక సంగీతకళా రహస్యనిధి ముగ్ధమోహనమధుమత్ప్రదగీతికతో ఆహ్వానించాడు. విచ్చేసి సమస్తజగత్తునూ సమ్మోహనశక్తితో కిమ్మీరితంచేస్తూ స్తుతిపాత్ర మౌతున్నది ఏతన్మాస లక్ష్మి.

'కాలః కరోతు కార్యాణి' అన్న ప్రాచీన సూక్తిని మనస్ఫూర్తిగ నమ్మి, కాలప్రభావాన్ని అనుభవపూర్వకంగా గుర్తించి, క్రాంతదర్శి వసంతుడు 'చిలుకల తేరు నెక్కి కొంతదూరమూ, మలయానిల రథమధిరోహించి కొంతదూరమూ ప్రణయ చైత్రయాత్ర సాగిస్తున్నాడు. అతడు వనవీథుల్లో సేనాసమేతంగా పయనిస్తున్నపుడు 'ప్రత్యగ్ర సాలాగ్రహర్మ్యవిటంకంబులు ప్రాకి వల్లివనజాస్యల్ వల్లీ రుత్ఫుల్లపల్లవహస్తంబుల భావిభావుకఫలోల్లాసంబుతో క్రొవ్విరుల్?' అపనోదితోత్కంఠ కలకంఠంతో వనలక్ష్మి 'నందనవనసుందరి నిను అందగాని రానిచ్చెనె?' అని సాకూతంగా ప్రశ్నించింది. 'శోభానవతరుణిమ మాకుమ్మక్కజీవనముల కిక— ఋతునేతా, వసంతా!' అని ఆనందోన్మత్తగానం చేసింది.

'...మన సఖుడు గురుడు దైవము' ఈ మాధవ స్వామి అని నమ్మి 'మనోవాక్కాయకర్మలా' అతని ఆజ్ఞలను పాలించే మలయమారుతుడు వసంతుని 'అభ్యుదయపరంపరాభివృద్ధికి' ఆనందాబ్ధిలో ఓల లాడుతూ నానారూపాలు ధరించినట్లుగా పొంగిపొర్లి పోతున్నాడు. ఆ వనప్రియుని ఆగమనవార్తావహుడై నాడు. విరహార్త వనదేవత ముఖసమీరాన్ని ఇతనికి గౌరవపురస్సరంగా ఎదురుపంపించినప్పుడు 'నిలువెల్లా పొంగిపోయి ఒకతెల్ల కాళ్లుగ వడిబారు'నది ఐపోయి నాడు; నర్తించాడు. ఇది గమనించిన ప్రబంధపరమేశ్వరుడు అన్నాడు:

"ఇది చనుదెంచె చైత్రమని
ఎల్లవనంబులకున్ ప్రమోదముల్
పొదలగ మేలివార్త గొని
బోరన వచ్చిన దాడికా దనన్
మృదువనదేవతాముఖస
మీర మెదుర్కొను నుల్లసిల్లె నిం
పొదవగ దక్షిణానిలము
నూనమనోహరఖేలనంబునన్".

వసంతుని నెచ్చెలికాడు కనుకనే, వచ్చేటప్పుడు ఈర్ష్యారహితుడై అతనికి ఎత్తిన కీర్తిధ్వజమై సుగంధ సేకరణం చేశాడు. అది ఒక లోకంలోది కాదు; ఒక నాటిదీ కాదు. అందుకనే ఓ ప్రబంధకవి అన్నాడు:

"కేళీసరోవీథి నాళీకవాటీ మ
ధూళీఝరీరాజి తేలి తేలి,
చోళీమహాభోగచూళీనవప్రసూ
నాళీసుగంధంబు లానియాని,
లోలీభవత్పుష్పధూళీచరద్భృంగ
పాళీనిరోధార్తి తాళితాళి,
తాళీవనీనారికేళీరసాల కం
కేళీహితచ్ఛాయ కెరలికెరలి,
మెలగు నామని మణిదరావలయనిలయ
కనకనందనచందనాకలితలలిత
వలితలవలీనికుంజాబ్జవదన మదన
కదనఘర్మాపహంబైన గంధవహము".

విభ్రమవిలాసాలతో సమస్తప్రపంచాన్నీ ఆకర్షించాడు గంధవహుడు. 'వర హిమానకరుంకనము లూడ్చి తెమల్చిన పత్రభంగముల్ ఘన నసియాడుచుక్ మొగుడి చెక్కులం పల్లవపాణి గప్పి నూతనలతికాలతాంగుల నుదారగతిక్' చలివాపినాడు; నెయ్యప్పుం బెనకువ నేర్పినాడు. 'అలరంజేసె నితాంతనూతనలతాంగాశ్లేషముల్ నిశ్చలలీలక్ మధుపాంగనాసమితికిక్; సంధించు తామ్రాక్షియా కలకంఠిని నేర్పు మెరయ' పలికించినాడు. లోకంఅతగాణ్ణి 'భుజంగగ్రామధామైక సంకలనాభాగ్యసవిలాసపాటవుణ్ణిగా' కీర్తించింది. అంతేకాదు, అతడూ రసికుడు, పల్లవుడు—పండుటాకులనే విసుతో కొమ్మల దాని నిచోళావకుంఠనాన్ని అపాస్తంచేసిన పిలిపితనం ఆతనిలో లేకపోలేదు.

ఎవ రితను? ఎక్కడివాడు? ఎందుకు వచ్చాడు?—అన్న ప్రశ్నలు ఉదయించినవి. అతడేమీ పుట్టుపూర్వోత్తరాలూ, పుట్టుమర్యాదలూ లేనివాడు కాదు అన్నారు భావకులు. వారిలో ఒకని సమాధానం వింటే మలయానిలుని చరిత్ర సమస్తమూ చక్షుర్గోచర మౌతుంది.

"దక్షిణాశావధూతనయుండై వనలక్ష్మి
పెంపున పొదరిండ్ల పెరిగిపెరిగి,
తేటితేటుల జోలపాటల పాటిల్లి
తీగె యుయ్యాలల తూగితూగి,
కమలాకరంబుల కమ్మపుప్పొడి గొల
నానుచు జల్లు పోరాడి యాడి,
కమలధూళీపాళికాకేళికల పొల్చి
మందమందవిహార మొందిమొంది,
యాగమస్థితి రొకిగి బాల్యంబు తరిని
మల్లెల జెనంగి పొంగుల మర్మమెరిగి,
సాముచేయుచు మాధవస్వామియాజ్ఞ
కంతుజోడై మెలంగు లేగాడ్పుకుర్ర"

అన్న ఇతని సమాధానంవల్ల అతని రాచపుట్టుక విద్యావిశేషాదులు అభివ్యక్తా లౌతున్నవి.

సృష్టిస్థితిలయకారకులైన త్రిమూర్తులనూ కేవలం 'గృహకుంభదాసులనుగా' చేసికూర్చోబెట్టిన కుసుమధన్వికి ఆప్తమిత్రుడ ననే 'అహంభావం' అతనికున్నది.

విచ్చలవిడిగా విర్రవీగి సంచరిస్తూ, 'మల్లికాకుసుమగళన్మకరందహేరాళధారాజలంబుల తడిసితడిసి, సరసిజాకరవసంతానసంక్రాంతవీచికాకణంబులమీద విడిసివిడిసి, ప్రత్యగ్రప్రసవసంపూరితచూతమంజరులపై సుడిసిసుడిసి, రతివియోగక్రాంతతరుణీజనస్వాంతజనితఖేదములలో జడిసిజడిసి, బహుళకోరకకుసుమసంభరితమంజుపటలవిహరణముదిత బంభరవితానమధురతరగీతసంస్తూయమానుడై' భాసిగన్నాడు ఇతను.

ఓనాడు మన భట్టుమూర్తి వనంలో 'మధుమత్తగంధవహం' విహరిస్తుంటే 'మహిళామండలమంజుల భ్రమరకామర్దంబు, శ్యామాముఖాంబురుహస్మృలిత పత్రఛేదనిపుణంబుక్, పద్మినీకంకణగ్రహణాపాదియునై సగంధవిటప్రాప్తితో విజృంభించి కనిపించాడు. 'అహో! రసికత' అని ఆయన ఆశ్చర్యపడ్డాడు.

వసంతవేళ ప్రానుపట్టుతూ ఉన్నది; తలిరులు పుట్టుతూ ఉన్నవి. ఈ వైరుధ్యానికి కారణం గోచరించింది కాదు ఎవరికీని. 'రవి గానిచో కవి గాంచునే కదా' అని ఊరికే అన్నారా పెద్దలు. కవిరాజు కారణం కనిపెట్టి అన్నాడు:

"వెలుగసుధారసాధరల
చెల్వపు పుక్కిటి తావి తీయనై,
పలుకులయందు తత్ప్రియుల
వక్త్రవిషజ్వలనోష్మ నెర్రనై,
నెలకొనడి తద్గుణద్వితయ
వేదసుమీ యన ప్రానుపట్టుటల్,
తలిరులు పుట్టుటల్ కనగ
తారొక్కొనె చందనశైలవాతముల్"

అని. విరహాకౌజలధులలో లోకం మునిగిపోతున్నదని 'ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే' అని పురుషోత్తముడు అన్నాడు గనుక మాట చెల్లించటానికి మాటిమాటికీ ప్రతివత్సరమూ మలయానిలశాలుడుగా అవతరిస్తుంటాడు ఆయన. అంతలోనే

మటుమాయమైపోతుంటవి విహి కాజలధులు. ఏమైపోతు న్నట్లు? ఓకవసంతోత్సవసమయంలో రాయలవారి భువన విజయంలో ఈ విషయమే చర్చకు వచ్చింది. సావ ధానులై అష్టదిగ్గజాలూ ఆలోచించారుగాని సక్రమ మైన సమాధానం రాలేదు. అప్పుడు అన్యక్షు కీకంనుంచి ఆ రాజకవి అన్నాడు :

"మలయకటకోటజస్థిత, కలకీసుతసేవ నిట్లు కనెనో తదాశా, నిలు వవగ నలసవృత్తిన, మెలగుచు నాపోకనించె విహికాజలధిన్" అని. అప్పుడు పరి షత్తులో హర్ష సూచకకరతాళధ్వనులు చెలరేగినవి.

అప్పుడప్పుడు మలయపవనుడు 'బొండుమల్లెల పరాగము లేచి నివిడంబుసేయు వెన్నెల రసంబు'. ఇంతకంటె బాల్యాంకవిచేష్టలు ఎన్నెన్నో చేశాడు. 'తుమ్మెదలకు ఓగిరమ్ములా నలరుల కమ్మదేనియలెల్ల కుమ్మరించె; కీరవారంబుల కొరి వేరంబుగా ఫలజాల ముల సేలపాలు చేసె; దొరల నంటున జారు తరుల నంటి పెనంగు నల లతకూనల తొలగద్రోసె; వని దమ యిచ్చ వర్తిల్లు ఖగముల కన్నులపై పరాగములు సల్లె'.—అయితే అందరూ ఇవి బాల్యచేష్టలక్రింద అంగీకరించక జాడ్యలక్షణా లన్నారు. ఇది మందు లేని రోగ మన్నారు కొందరు. లోకంలో వైద్యులు లేకనా? అంతదూరం ఆలోచించవలసిన అగత్య మేముంది, వసంతభిషగ్వరు డున్నాడుగదా అను కున్నారు. మరికొందరు పెద్దమనుష్యులు.—

"తెగిన మనోభవుని తిరుగ
  దెచ్చి కుజంబులకెల్ల బ్రాయముం
మగుడగ నిచ్చి అన్యభృత
  మంజలి మూగతనమ్ము వుచ్చి ము
జ్జగముల వార్తకెక్కిన వ
  సంతభిషగ్వరు డాప్తు డయ్యెనుం,
ఉడుగతి మాన్ప లేడ మరి
  దక్షిణవాయువునందు జాడ్యమున్"

అని నిశ్చయించారు. ఇది కేవలమూ జాడ్య మనటానికి వీలులేదు. ఈ చేష్టలన్నీ మారపరిచర్యలలో మలయానిలుడు ధరిస్తూఉన్న ఉన్మత్తవేషాలు. అతని వృత్తికి లక్షణాలు. 'భూతాయ భవ్యమ్.' ఈదోషా లన్నీ అతగాణ్ణి చుట్టుకోవా అనే అనుమానం కలిగితే 'కారయితుః కర్తృత్వమ్' అని సమాధానం. చేయిం చినవాడు మన్మథుడు; ఇతడు కేవలము అతని ఆజ్ఞా పాలకుడు మాత్రమే.

మదనమహారాజు సేవలో మలయమారుతుడు నానారూపాలు ధరించి వర్తిస్తుంటే లోకం తెలుసు కోలేక ఇతణ్ణి ఒక ప్రత్యేకజాతివాణ్ణిగా లెక్కగట్టి ఆ జాతిలో అనేకవ్యక్తుల లక్షణాలను పలుకుతూ—

"అంగజకృత్తాంతరంగజాయా కాంతి
  ఘోరవాయవ్యకింకారుతములు,
జరదురంగమపరిస్ఫురదుపహ్వరగిరి
  స్థైర్యరసంభారనిర్భరుతములు,
స్మరసమిాకస్విన్న నరసమూహోత్పన్న
  భూరిఘర్మాంభశ్శారారుతములు,
పథికమర్దనమహారథికమన్మథసహా
  యోరువరవిహారచారుతములు,
హారిగతి సంచరించె కావేరికాప్ర
తీరసారసకమల కహ్లారకుముద
సారసౌరభ్యసంభార భారవహన
మారపరిచారమంజులమారుతములు"

అని బహువచనంలో చెప్పుకున్నారు, కొందరు. అయినా 'ఏకం సత్ విప్రా బహుధా వదంతి' అని అనుకున్నారు.

'పథికవిరోగాగ్ని పాణింధమ 'మనే నామం అతనికి లోకంలో రూఢమైపోయింది విరహిణులు చేసిన దుష్ప్రచారంవూలంగా. ఆ అలుసు చూచుకొని ఓఅమ్మ 'అక్కట గంధవాహా, తగవా హరిణాంకుని గూడి పాంథులన్ పొక్కగజేయ' అన వెరపెట్టినట్లు మొదట కనుపించినా తరువాత 'పావకుని పొం దొనరించి జగమ్ము లేచు నీ అక్కొరగామి' మాన వని దబ్బిపాడించింది. అంతకంటె తెలివిగల మరో మహా తల్లి అతని లోకయాత్రకే భంగం కలిగించే ఆలోచన చేసి—

"అది గాదే చెలి, నీవు శీరకమహో
  హార్యంబుపై నున్న యా

మదిరోన్మత్తపుళింద నాయకులతో
    మాటాడి చంపింపకే,
కదనుల్ త్రొక్కుచు వాని వాహనములై
    కాల్దివ్వ నేణీమదో
న్మదసంఘంబుల చూల ఖింక నెటు దు
    ర్మార్గుండు రానేర్చునో !"

అని నిశ్చయించింది. కాని, పర్యాలోచనచేసి "ఈయవి వెర్రి ఊహాలు కదే !—అటు లేల రొమనర్తురే సఖీ......శబర పల్లవులన్ స్మర కేళిలో లురన్ జేయుచు మేలుసేయుచున్ చెల్వుడుగా మెలగున్ గదా" అని దైన్యం వహించింది. ఈ స్త్రీజనం అతణ్ణి సుమార్గు డన్నా, దుర్మార్గుడన్నా అతడు పట్టించుకోటం లేదు. నేటికీ—'చైత్రరథభూమీకళత్రచామరచల సంపల్లనూ, పటుఘర్మజలకణపక్ష్మతోహరవృత్తివల్లనూ ఇతడు 'వలపూ, మెలపూ ప్రసాదిస్తూ విహరిస్తూనే ఉన్నాడు.

'కామీ స్వతాం పశ్యతి'—కాము దుష్టులు. మలయానిలుని మంచి ఎరుగక అతనిమీద ఎన్నెన్నో నేరారోపణలు జరిపారు. పరోపకార బుద్ధిరహితుడని నిందించారు. వెన్నెలరాత్రివేళ శుక్తిమతీనదీతీరాన దాగిలిమూత లాడుతూ ఉన్న రాచకుమార్తెల నడిగితే అతని మంచి చెప్తారు, వారి శరీరపరిమళాన్ని గ్రహించి ప్రత్యుపకారం తలపెట్టి చెలికత్తెలు కంట పడకుండా దాగిలిమూతవేళ కప్పురపు దుమారం చల్లి మేలు చేశాడు గనుక.

శైత్యపరిమళాలంటే అతనికి అమితానందము. ఒక్కొక్కమాటు కంఠదఘ్నంగా అఘ్రాణించి ఉన్మత్తుడై—

"అమరాంగనాలుంగ
సంగతోన్నత వక్ష
ఘనసార కాశ్మీర
చర్చానిలమ్ములకు సోలసీ—
    వెర్రినై నాను నేనూ, ఇక
    విశ్వచాలన చేయ లేనూ—

ఖేచరీముఖసక
ర్పూరతాంబూలాది
వాసనానిశ్వాస
పవనచాలనలకున్ భ్రమసీ—
    వెర్రినైనాను నేనూ ఇక
    విశ్వచాలన చేయ లేనూ—"

అని ముల్లోకాలలో నాట్యంచేస్తూ సమస్తమూ మరిచి పోతుంటాడు. అటువంటిసమయంలో చూచిన వారు ఇతనికి వినయవిధేయతలు లే వంటారు. ఇది పొరబాటు. కవికులగురువు కాళిదాసు నడగండి—చెప్తాడు. అంతకంటే సాక్ష్య మేమి కావాలి ? వసిష్ఠాశ్రమానికి వెళ్లుతూ ఉన్న సుదక్షిణాదిలీపులను మలయానిలం సేవించే రీతిని చూచి ఆయన అన్నాడు:

"సేవ్యమానౌ సుఖస్పర్శైః శాలనిర్యాసగంధిభిః
పుష్పరేణూత్కిరై ర్వాతైః అధూతవనరాజిభిః".



ఖండాంతరఖ్యాతిగడించిన
ఆంధ్ర వైద్యశాస్త్రజ్ఞుడు

# కీ. శే. యెల్లాప్రగడ సుబ్బారావుగారు

దేవత లనగా మరి యెక్కడో లేరు. ఈ లోకంలోనే ఉన్నారు. తమలో అంతర్లీనమైఉన్న దైవాంశాన్ని ఉద్దీప్తపరుచుకొంటూ స్వార్థరాహిత్యంతో లోకకల్యాణానికై పాటుపడే మహనీయులంతా దేవతలేనని ఒకప్పుడు గాంధీ మహాత్ముడు చెప్పాడు. నిజంగా అంతేకదా! వారే జరా మరణాలు లేని దేశోద్ధారకులు.

ఈవిధంగా తమ జీవితసర్వస్వాన్ని దేశసేవకై, శాస్త్రపరిశోధనకై వినియోగించి లోకకల్యాణకారకులై, కీర్తి శేషులయిన మహనీయు లెందరో ఉన్నారు. అట్టివారిలో శ్రీ యెల్లాప్రెగడ సుబ్బారావుగారు ఒకరు. వీరి జీవితగాథ మాత్రం ఒక విశిష్టమైన ఉత్తమపథంలో నడిచింది.

వీరు ఆంధ్రపుత్రులు, తూర్పుగోదావరిజిల్లావాస్తవ్యులు. ౧౯౨౩ సం.లో అమెరికాదేశానికి వెళ్ళారు. ఆ నాటికి వీరి వయస్సు ౨౬ సంవత్సరాలు. అప్పటికే అష్టకష్టాలు పడి యేలాగో జీవనోపాధికి అవసరమైన విద్యను గడించి మదరాసుమెడికల్ కాలేజీలో పట్టభద్రుడైనాడు. ఎక్కడో వైద్యవృత్తి నవలంబించి పొట్టపోసుకొంటూ అస్మదాదులవలె కాలక్షేపం చేయక, దారిద్ర్యదేవత తనను అంటిఉన్నప్పటికీ, ఒక మహోద్దేశాన్ని మనసులో పెట్టుకొని తత్సాధనకై రాత్రింబవళ్లు తంటాలుపడి, తుద కుదకు అమెరికాఖండం ప్రయాణం సాగించారు.

స్వదేశాన్ని, సంసారాన్ని, బంధుమిత్రుల్ని పరిత్యజించి కేవలం విజ్ఞానకాంక్షతోను, లోకోపకారనిరతితోను ముందువెనుకలు ఆలోచించకుండా, ఎప్పటికప్పుడు భగవంతుడే తోడ్పడగల డనే విశ్వాసంతో ఖండాంతరయాత్ర తలపెట్టాడు. చివరకు అమెరికాకు చేరగలిగాడు.

అమెరికాకు చేరినతరువాత కొన్నాళ్ళపాటు తనకు దినభత్యము గడవటమే కష్టంగా ఉంటే ఆస్పత్రిలో రోగులకు మలమూత్రాదులను యెత్తి పరిచర్యచేసి, పొలాలలో బంగాళాదుంపలను త్రవ్వి కూలిపనిచేసి, దినభత్యమును సంపాదించుకొంటూ, ఒక వంక తన వైద్యశాస్త్రపరిశోధనలు సాగించుకొంటూ, పరదేశంలో కడగండ్లు పడుతూ అహంకతిసమైన నిత్యజీవితం గడిపాడు.

పాతికేండ్ల పరిశ్రమఫలితంగా, వైద్యశాస్త్రపరిశోధనలలో తన మనోరథసిద్ధిని బడయగలుగుతున్నానని, తాను అమితోత్సాహంతో కృషిచేస్తూ, కాస్త కడుపునిండా



అన్నంతినే రోజుల్లోను, ఆయనపరిశోధనఫలితాలు జగద్విఖ్యాతిని పొంది, విదేశీయశాస్త్రజ్ఞులంతా ఆయనను గూర్చి ప్రశంసించే సమయంలో—ఇట్టి ఖండాంతరఖ్యాతి ఈయనకు—అందులో ఒక ఆంధ్రునకు—ఎందుకు కలగాలని గాబోలు—ఆ మృత్యుదేవత ఈ మహనీయుణ్ణి మా

యార్కునగరంలో మొన్న ఆగస్టు ౯-వ తేదీన అమాంతంగా తన పొట్టను బెట్టుకుంది.

పాతికేండ్లక్రిందటి మాట. శ్రీ సుబ్బారావుగారు అమెరికాకు వెళ్ళకముందు ఒకసారి అతిసారవ్యాధితో ప్రమాదమైన జబ్బుచేయగా, ఇతరవైద్యాలవల్ల కుదరక పోతే, మిత్రుల సలహావల్ల చివరకు శ్రీ డాక్టరు అచంట లక్ష్మీపతిగారి ఆయుర్వేదచికిత్సను పొంది ఆరోగ్యవంతు డైనాడు. అప్పటినుండీ ఆయుర్వేదమునం దభిమాన మేర్పడి. శ్రీ లక్ష్మీపతిగారి పరిచయంవల్ల ఆయనగారికి పట్టిన పిచ్చి ఈయనకుకూడా పట్టి ఆయుర్వేదం చదవడం మొదలుపెట్టారు. మేధావిగనుక "అష్టాంగకముతావులాన గల్గు వైద్య మెనిమిదినెలలు సర్వమును నేర్చె" నన్నట్లుగా శీఘ్రకాలంలోనే దేశీయవైద్యశాస్త్రంకూడా క్షుణ్ణంగా చదివి, ఉభయవైద్యశాస్త్రనిష్ణాతు డైనాడు. ౧౯౨౦-౨౪ దాకా మదరాసు ఆయుర్వేదకళాశాలలోనే వైస్ ప్రిన్సిపాలుగా ఉండి, అమెరికాప్రయాణానికై ఉద్యోగం మానుకొన్నారు.

వైద్యంలో అసాధ్యరోగాలుగా పరిగణింపబడే 'కాన్సర్', 'ఫైలేరియాసిస్' మొదలైన కఠినవ్యాధుల కన్నిటికీ అమోఘంగా పనిచేయగల మందులు ఏవైనా కనిపెట్టాలని తన ఆశయంగా అపుడు చెబుతూ ఉండే వాడు. అప్పటికే ఈ వ్యాధుల్నిగూర్చి ఉభయవైద్యాల్లోను కొంత పరిశోధన చేసి కొన్ని వ్యాసాలు వ్రాశాడు.

ఒక భిషగ్వరుడు వైద్యరీతిని రోగాలకు చికిత్స జేసి మానవసేవ చేయాలంటే, ఓపినకొలది శారీరకంగా ఎంతమందికి మందు లిచ్చి, సేవజేసి, తృప్తిపరచగలుగు తాం గనక :—దానితో నాకు తృప్తిలేదు. అలా కాకుండా, సర్వసామాన్యంగా ఆతురులయిన మానవసామాన్యానికంతా ఉపయోగపడేటట్లు, అట్టివారిని బాధనుండి తొలగించేటట్లు, ఏదైనా కఠినవ్యాధికి నివారణోపాయం కనిపెట్టి, మానవ కోటిసేవ జేయడమే భగవత్సేవ కాగలదని, అట్టి పరిశోధన లోను, సేవలోను తాను నిమగ్నుడైయుండడమే తన ఆశయమని, అట్టి అవకాశాలు అనాటికి (౧౯౨౪ నాటికి) మన దేశంలో దుర్లభంగనుక, అమెరికాఖండం వెళ్ళడం, అక్కడ ఇట్టి పరిశోధనసాగించడం తన యిష్టమని పదేపదే చెబుతూ ఉండడం నే నెరుగుదును.

ఈయనకు గల విజ్ఞానతృష్ణ ఇంతింత అని చెప్ప డానికి వీలులేదు. ఎప్పుడూ ఏదో చదవడం, నోట్సు వ్రాస్తూ ఉండడం, మిత్రులతో చర్చిస్తూఉండడం, ఏదో తెలుసు కొందామని, తా నింకా ఏదో చెయ్యాల్సిఉందని తహతహ పడుతూ ఉండడం—ఇదే ఆయనపని. బహునిరాడంబ రుడు. అందరితోను కలిసిమెలిసి తిరుగుతూ వినమ్రుడై ఉండేవాడు.

ఈయన భారతదేశమును విడిచిన తరువాత లండన్ విశ్వవిద్యాలయమునందు 'Doctor of Tropical Medicine' అనే డిగ్రీని, హార్వర్డు విశ్వ విద్యాలయములో బయోకెమిస్ట్రీలో (Biochemistry) డిగ్రీని పొందిరి. పిదప హార్వర్డువిశ్వవిద్యాలయములో 'టీచింగ్ అండ్ ఫెలో షిప్' పదవిని కొన్నాళ్ళు నిర్వహించిరి. అటుపిమ్మట ఆ విశ్వవిద్యాలయములోనే అసోసియేట్ప్రొఫెసరుగా పని చేయుచు పిహెచ్. డి. డిగ్రీని సంపాదించిరి. ఆ రోజుల లోనే 'ఫిజియాలజీ' లో స్వతంత్రముగా మొన్నదగిన ఒక నూతనసిద్ధాంతమును కనిపెట్టగలిగిరి. "Muscular Contractions" (కండరముల సంకోచము)ను గూర్చి వీరు కనిపెట్టిన ఈ సిద్ధాంతముతో పాతసిద్ధాంతము లన్నియు తారుమా రయ్యెను. ౧౯౪౦ సం.లో న్యూయార్కు నగ రంలో పెరల్‌రివర్‌వద్దనున్న లేడర్లీ లేబరేటరీస్‌కు 'రీసర్చిడైరెక్టరుగా' నియమితులై, రు ౧౪,౦౦౦ వరకు వేతనమును బడయగలిగిరి. అమెరికాకు వెళ్లకముందు తాము తలచినవిధముగా 'ఫైలేరియాసిస్' (బోదవ్యాధి), 'కాన్సరు', 'లీవరు' వ్యాధినివారణనిమిత్తమై తమ పరి శోధనలవల్ల చికిత్సను కనిపెట్టినటుల వారి సహచరుల వల్ల తెలియుచున్నది.

వీరు కనిపెట్టిన ఔషధములనుగూర్చి, వీరి పరి శోధనాపాటవమునుగూర్చి మన కింకా విపులముగా తెలియ రాలేదు. ఎప్పటికప్పుడు వాటినన్నిటిని తెలుసుకొనుచు, అమెరికా దేశపు వైద్యపత్రికలతో సుపరిచయముగల ఆంధ్రులు, శ్రీ సుబ్బారావుగారికి పరిచితులు అయిన మదరాసు మెడికల్ కాలేజీలో ఫిజియాలజీ ప్రొఫెసర్ శ్రీ డి. వి. సుబ్బారెడ్డిగారు తెలుగులోను, ఇంగ్లీషులోను ఈ మహ నీయుని పరిశోధనగూర్చియు, వీరి వైద్యశాస్త్రపాండిత్య మును గూర్చియు ఒక గ్రంథమును వ్రాయదగుదురు. శ్రీ సుబ్బారెడ్డిగా రిందుకు పూనుకొనెదరుగాక యని ప్రార్థించు చున్నాను. ఇట్టిది శ్రీ సుబ్బారావుగారి స్మరణచిహ్నముగా గూడ నుండగలదు.

జగత్ప్రసిద్ధినొందిన 'పెన్సిలిన్', 'స్ట్రెప్టొమిసిన్' అనే ఔషధములు కనిపెట్టుటలో వీరు ప్రముఖపాత్రను నిర్వహించిరని అమెరికావిలేఖరులే వ్రాయుచున్నారు.

లేడర్లీలాబొరేటరీలో కొందరు శాస్త్రవేత్తలతో కలిసి వీరు 'అరియోమిసిన్' అనే ఒక ఔషధాన్ని కనిపెట్టారట! 'పెన్సిలిన్' ఔషధప్రయోగానికి గాని, 'స్ట్రెప్టోమిసిన్' ఔషధప్రయోగానికిగాని లొంగని జాడ్యాలను ఇది కుదర్చ గలదట!

వీరు జన్మదేశమును, సంసారమును వీడి పాతికేండ్లయినను, విదేశములలో పవిత్రజీవితమును గడుపుచు, ఒక రసాయనశాస్త్రవేత్తగా ప్రపంచఖ్యాతిని గడించుట, నూతనసిద్ధాంతములను క్రొత్తఔషధములను కనిపెట్టుట జూడగా,ఏనాడో ఆంధ్రదేశమున ఇట్టి రసాయనాచార్యుడుగా వెలుగొందిన సిద్ధనాగార్జునాచార్యుడు తలంపుకు వచ్చుచున్నాడు.

'జగత్పూజ్యప్రతాపోదయశ్రీలం బెందు' టకు 'విఘ్నకారణము' లైన 'అలస్యంబును కామినీజనరతాశ్యాసక్తియుజ జన్మభూలోలత్వంబును రోగపుం భయము దుర్లోభంబు సంతోషము'— ఈ ఆరు వీరివద్ద లేవనుట అతిశయోక్తి కాదు.

ఏమైన నేమి? ఏభై రెండేండ్లకే శతాయుష్కునివలె మరణించాడు. డాక్టర్ సుబ్బారావుగారి మరణంవల్ల వైద్యశాస్త్రనభోమండలంలో వెలుగొందే ఒక నక్షత్రం రాలిపోయింది. వీరి ప్రతిభ నిరుపమానమైనది. ఇట్టి ప్రతిభా సంపన్నుడు అస్తమించడంవల్ల అధునాతనభారతీయ శాస్త్రజ్ఞులలో అగ్రగణ్యుడు ఒకడు లోపించినాడు. వీరు పుట్టుకతో ఆంధ్రు లైనప్పటికీ పాండిత్యప్రతిభచేత ఈ వ్యక్తి ప్రపంచానికంతటికీ చెందుతాడు. తరాలు గడిచినా వీరి పేరు శాశ్వతంగా వెలుగొందుతూ ఉంటుంది.

ఆనాడు అమెరికాకు పంపునపుడు సెంట్రల్ స్టేషనులో సాగనంపుతూ, గంపెడాశతో పూలమాల వేసిన చేతితోనే — మిత్రుడు ఈమాట వ్రాస్తూ కన్నీళ్ళు విడుస్తున్నాడు.

"వైద్యశాస్త్రి"



# కలగూరగంప

## భారతీయ సంస్కృతిపై రష్యా అభిరుచి

భారతీయసాహిత్యము నాలుగు వేల సంవత్సరములనుండి వచ్చుచున్నది. సారస్వతగుణములోను, భావగాంభీర్యమున, విషయబాహుళ్యమున, సాహిత్యరూపములలోను ఉత్తమోత్తమములగు అనేక సాహిత్యగ్రంథములు ఈనాల్గువేలయేండ్లలో భారతీయులు సృష్టించినారు. దీనితో ఆసియాఖండములోని ఇతరప్రాచ్యదేశములపై సహితము వీరి సాహిత్యప్రభావము బయలుదేరి అభివృద్ధినందినది".

అని తులసీదాసరామాయణమును రష్యనులోనికి అనువదించిన ప్రొఫెసర్ అలెక్సిబరానికోఫ్ టాస్‌లో నొక వ్యాసమును వ్రాయుచు పలికినాడు. తన శక్తినంతను అనేకసంవత్సరములు ధారపోసి ఈ భారతీయ గ్రంథానువాదములకు కడంగి యుద్ధకాలమున సహితము ఈ పనిని పరిత్యజించక, తాను చేసిన కృషిని వివరించుచు వ్రాసిన వ్యాస మిది.

గతశతాబ్దమున, ఐరోపాలో భారతీయవిజ్ఞానమునుగూర్చి కృషిసలుపబడినది. ఈ కృషిలో జర్మన్ దేశీయులు మొదట శ్రమించినారు. ఈ కాలమున జారుప్రభుత్వమున రష్యాలోని విజ్ఞులు నిఘంటు కార్యమున నిమగ్నులైనారు. వీరిలో ఓల్డెన్‌బెర్గ్, అలెవస్కీలు సంస్కృతాభ్యాసమునకు దారితీసినవారు. సంస్కృతవాఙ్మయమున, వైదికబౌద్ధవాఙ్మయమున వీరికి అభిరుచి మెండు. వీరి కృషి క్రమేణ అనేకుల నాకర్షించినది. దీనితో ననేకభారతీయగ్రంథములు అనువదింపబడినవి.

భారతీయసంస్కృతిలో నిష్ణాతుడగు ప్రొఫెసర్ మినాయెఫ్ గతశతాబ్దపు ద్వితీయభాగమున మన దేశమునకు మూడుపర్యాయములు వచ్చినాడు. సంస్కృతమునుమాత్రమేగాక, పాళీప్రాకృతములనుకూడ నితడు నేర్చి పండితుడైనాడు. పాళీప్రాకృతములను అనేకులకు నేర్పుచు, చాలమంది పండితులను రష్యాలో నితడు తయారుచేసినాడు. ప్రస్తుతము లెనిన్‌గ్రాడనబడుచున్న పీటర్స్‌బర్గ్ ఆరోజులలో ప్రధానమగు విజ్ఞానకేంద్రము. ఇచటనే రోత్, బోయిట్లింక్ కలసి సంస్కృతనిఘంటువును తీసికొనివచ్చినారు. ఇదే ప్రపంచవిఖ్యాతినందిన St. Petersberg Woerterbuch.

ఈ శతాబ్దారంభమున రష్యాలో మన సారస్వతములపై అభిరుచి యెక్కువైనది. వీరిలో ప్రొఫెసర్ బరానికోఫ్ ముఖ్యుడు. ఇతనితో కలసి పనిచేసినవారిలో ఇతని శిష్యులగు ప్రొఫెసర్ క్రాస్నోడెంబోస్కీ, జారిన్‌లు ముఖ్యులు. హిందీ, ఉర్దూ, మరాఠీలలో అసమానపాండిత్యము నందినవాడు బరానికోఫ్. క్రాస్నోడెంబోస్కీ మరాఠీభాషను, జారిన్ వంగభాషను పట్టినారు. వీరిద్వరు లెనిన్‌గ్రాడుముట్టడి సందర్భమున అకాలమృత్యువువాతబడినారు. నికొలాయ్ టిఖోనోఫ్ వంగభాషావిద్వాంసుడు. గీతాంజలి, గోరా మొదలగు అనేక రవీంద్రుని కృతులను రష్యాభాషలోనికీత డనువదించినాడు.

ప్రథమ ప్రపంచసంగ్రామమున ప్రొఫెసర్ షెచర్‌బాట్స్కీ సంస్కృతవేదాంతనిఘంటువును ప్రచురించినాడు. క్రమేణ ఇతడు బౌద్ధవేదాంతమున మిక్కిలి కృషిసలిపినాడు. యుద్ధకాలముననే ఈయన మరణించినాడు. సోవియెట్ ప్రభుత్వము వచ్చినతర్వాత

భారతీయవిద్యావ్యాసంగము ఎక్కువైనది. రష్యా లోని 'ఎకాడెమీ ఆఫ్ సైన్సు' యొక్క ప్రాచ్య శాఖవారు రష్యన్-హిందీ నిఘంటువును తయారు చేసినారు. కాశీలోని నాగరీప్రచారిణీసభవారు అచ్చువేసిన హిందీశబ్దసాగరము మీ గ్రంథమునకు మూలము. ఈ 'ఎకాడమీ' వారు అన్యభారతీయ భాషలకు, రష్యనుకు ప్రత్యేకప్రత్యేకనిఘంటువులను ప్రస్తుతము తయారుచేయుచున్నారు. సోవియెట్ ప్రభుత్వముకూడ భారతీయభాషలను నేర్చుకొను వారికి ఎక్కువ ప్రోత్సాహ మిచ్చుచున్నది. లెనిన్ గ్రాడ్, మాస్కో, టష్కెంట్, టిఫ్లిస్ మొదలగు పెద్ద పట్టణములలో నేగాక కీవ్, ఖార్కోవ్ మొదలగు వానిలోసహితము హిందీ, ఉర్దూ, బెంగాలీ మొదలగు భారతీయభాషలు నేర్పబడుచున్నవి. రష్యన్ 'ఎకాడమీ' యొక్క ప్రాచ్యశాఖాసభ్యుడగు జార్జి అక్లైడియని గతసంవత్సరము ఢిల్లీలో జరిగిన ఆసియా జాతీయసంస్థకు వచ్చిన సోవియెట్ ప్రతినిధులలో ముఖ్యుడు. టిఫ్లిసిలోని స్టాలిన్ యూనివర్సిటీలో నీతడు సంస్కృతాధ్యాపకుడు.

హిందీ, ఉర్దూలలోనుంచి యిప్పటి కనేక గ్రంథములు రష్యన్‌లోనికి అనువదించబడినవి. ముల్క్ రాజ్ ఆనంద్ యొక్క 'కూలి', 'అస్పృశ్యుడు' అనునవి రష్యాలో చాలా ప్రసిద్ధినందినవి. ఎకాడెమీ యొక్క ప్రాచ్యశాఖవారు ఈమధ్య వారి వార్షిక సభలో నారుమాట్లు చర్చించి భారతీయుల రాజకీయ, సాంఘిక, ఆర్థిక, వైజ్ఞానికవిషయావగాహనకు నూతనప్రణాళికను తయారుచేసినారు. ఈ సభలో బెస్కోవ్స్కీ అనునాతడు ప్రేమచంద్ పై వ్యాసమును చదివినాడు. ప్రేమచంద్ యొక్క కథలను, నవలలను, వ్యాసములను అనువదింప నీతడు బూనుకొనినాడు.

మహాభారతము సమగ్రముగా ఐరోపాభాషల లోని కింతవరకు అనువదింపబడలేదు. రష్యావారీకొరత దీర్చ నెంచినారు. త్వరలో భారతానువాదము రాబోవుచున్నది.

ఈ కొద్ది విషయములను వివేచించినచో అభ్యుదయమునకై ప్రాకులాడుచు, అభ్యుదయమును అనుభవించుచున్న దేశము లేవో తెలియగలదు. మన అభ్యుదయరచయితలవలె నేటి రష్యావారు ప్రాచీన భారతీయవిజ్ఞానము, సంస్కృతి, సంప్రదాయము, సాహిత్యము నిరర్థకము లని భావించుట లేదు. సాహిత్యమును కేవలము భౌతికవిషయములకు, ఆర్థిక విషయములకు మాత్రమే వారు వినియోగించుట లేదు. ఇది మన మందరము గమనింపదగిన విషయము.

పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రి.

---

## మీసాలు

మగవానికి మీసం, మగువకు సిగ్గు పెట్టని నగలవంటివి. కాని కాలం తారుమారయ్యేకొద్దీ ఆచారవ్యవహారాలలో అవకతవకలు ప్రబలిపోవడంచేత మగవారు మీసాన్ని, మగువలు సిగ్గును పాటించక పోవడం పరిపాటైపోయినది. ఫలితం—స్త్రీలకు నూత్న యవ్వనంతోబాటు నూనూగుమీసాలు రావడం, పురుషులు యవ్వనపు తొలిరోజుల్లో తొంగిచూచే మొలకమీసాలను మొదలంట గొరిగించుకోవడం మామూలుగా పరిణమించింది. పూర్వం రయే వైదిక నిష్ఠాధురంధరులను బ్రాహ్మణోత్తములు తప్ప, తక్కిన వారంతా తప్పనిసరిగా మీసాలు పెంచేవారు. అది ఆనాటిసంఘమర్యాద. అందులోనూ రాజులవిషయంలో ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. "కుందేటికీ మీస మున్నది రంగారాయునికి" అన్న బొబ్బిలికథలోని వాక్యం మీసాలప్రతిభను చాటి చెప్పుచున్నది. అదే కథలో మరొకచోట "నూతికి మీసం లేదా నీకూ విజయరామరాజా?" అని రంగారాయుడు విజయ రాముని తూలనాడుతాడు. ఇదంతా చూస్తే మహా రాజుల ప్రతాపాలకు మీసాలు మానదండాలుగా ఉండేవని తోస్తుంది. కాలప్రభావంచేత యీ రాజుల ప్రతిభావిశేషాలు క్షీణించి క్రమేణ సామ్రాజ్యాలు చిన్న సంస్థానాలై, సంస్థానాలు సర్కారులో కలిసి పోవుచున్నట్లు, మీసకట్లు కుండిన విశిష్టతకూడా నానాటికి తీసికట్టయి తుదకు హిట్లరుకట్టుదాకా రావడం కాకుండా, అవికూడా అంతరించిపోయే సూచనలు కనబడుచున్నవి.

మన పెద్దలు కట్టు, జుట్టు, బొట్టు విషయంలో చూపిన శ్రద్ధ ఒకయెత్తు; మీసకట్ల విషయంలో చూపిన శ్రద్ధ ఒకయెత్తు! ఆ రోజుల్లో వాసననూనెలు పూసి దువ్వి మీసాలకు మెరుగుపెట్టేవారు. అందుకే "మింగ మెతుకులేదు, మీసాలకు సంపంగినూనె"అన్న సామెత పుట్టింది. "క్రిందపడ్డా, మీసాలకు మట్టి కాలే"దన్న వాక్యం పట్టి చూస్తే పరువుమర్యాదలు దక్కించుకొందుకు మీసం చివరిసాధనమని తెలియుచున్నది. అజాగ్రత్తతో యేపని చేసినా ఆపద తప్పదు అన్న నీతిని "చుట్టకాల్చడంలో తెలివితక్కువైతే మీసాలు కాలు"నన్న వ్యంగ్యవాక్యంలో యిమిడ్చి అందరికీ అర్థమయేటట్లు చేసినారు అనుభవజ్ఞులు. అందుబట్టి యోచించిన ఆకాలంలో చుట్టలతోబాటు మీసాలు యెంత ప్రాశస్త్యం కలిగి యుండినవో బోధపడును. అదీకాక, ఆ సామెత మీసాల సంరక్షణార్థం అగ్నిప్రమాదహెచ్చరికలా పనిచేసేది. ఇంకా పరిశీలిస్తే అసలు పెద్దమనిషి తరహాకే లక్షణంగా మీసాలు వుండేవని తోస్తుంది. ఇచ్చే దాతలు యిస్తే, ఆ యీవిని తప్పించేవారికి మీసాల అర్హత లేదని "రొయ్యకు లేదా మీసము" అని యొక కవి దూషించినాడు.

ఇతవేకాక యింకా కొందరు తమ రచనలలో మీసాలు మెలిపించి, వారికీ, వారి కవిత్వానికీ వన్నె తెచ్చినారు. "చెప్పకు మిట్టి తుచ్ఛసుఖముల్ మీసాలపై తేనియల్"అన్నాడు పెద్దన. "నూనూగు మీసాల నూత్నయౌవనమున శాలివాహనసప్తశతి నొడివితి"అని శ్రీనాథుడు తన నూనూగుమీసాలకే చిరంజీవిత్వం కల్పించినాడు. ఆధునికుల్లో చూస్తేకూడా మీసాల ప్రస్తావన దొరుకుతుంది. "కోడెవయస్సు నిన్నలమి గోటికి మీసము చిక్కనాడు"అని మీసాలు మెలిపెంచి, "కుంచెడేటికిగూడ పౌరుషము నిండిన గాథలు చెప్పి మీసముఁదీటిన తెల్గువీరులకు"అన్న చోట దువ్వి చూపినాడు మన జాతీయకవి జాషువ. చెళ్లపిళ్లవారిని చూచి 'వైదీకికి మీసా లెందు'కని యెవరో అడిగితే "ఒకటి ఆంధ్రం, మరొకటి సంస్కృతం"అని దువ్వి చూపి జవా బిచ్చినారట. ఇవన్నీ చూసెబోతే మన ఆంధ్రకవిత్వం నాడూ, నేడూ మీసాలు దువ్వుకొంటూ తన దర్జాను నిలుపుకొనుచున్నదని గుర్తించకతప్పదు.

మనలో వాదప్రతివాదాలు బలిసి, పాకం ముదిరి పందెందాకా వచ్చేసరికి పణంగా ఒడ్డే పవిత్ర వస్తువు మీసమే. "ఓడిపోతే యిది మీసంకాదు. మాట తప్పితే మీసం గొరిగించుకుంటాను" అంటారు మానధనులు. "పైసా నాస్తి, ప్రబలం జాస్తి; దమ్మిడీ నాస్తి, దసలుసలు జాస్తి"అని లోటారరం, పై బటారంగా గడిపేవారి మాట వస్తే "మీసానికి ఆశ, అంబటికీ ఆశే" అంటాము. వీతత్సందర్భంలో ఒకానొక బుక్కాఫకీరైపోయిన జమీందారొకడు యింట్లో అంబలి తాగి అన్నం మెతుకు మీసానికి అంటించుకొని వచ్చి అందరియెదుటా దులుపుకోవడం జరుగుచుండగా ఒకనాడు ఆయనగారి పిల్లవాడు వచ్చి "నాన్నా మీసాలమెతుకు పిల్లి తినేసిం"దనగా అందరూనవ్వడం, షదరు జమీందారు "మీసాలపిల్లి మెతుకు తినిం"దని సర్దడం, జ్ఞాపకపరచడం అసంగతం కాదనుకొంటాను. కొందరు ఎన్నడూలేని గొప్పతనం ప్రదర్శిస్తారు. ఎన్నడూ లేని భక్తి కనబరుస్తారు. ఎప్పుడూ వినని వేదాంతం యేకరువుపెడతారు. ఈ పగటివేషాలంతా తమ లోటుపాట్లను కప్పడానికే అయినా, అందులోనే పప్పులో కాలువేసి పట్టుబడిపోతారు. ఉదాహరణం: కొందరు తమపాండిత్యం ప్రదర్శించడం కోసం, "బ్రియ్యం యెంత బ్రైల? బృహష్పతి, వుపవాసం, పాయసం" అంటూవుంటారు. ఇటువంటి చేతిబీర కాయలకుగానే "అలవాటు లేని ఔపాసనం పడితే మీసాలు తెగకాలిందట" అన్న సామెత వచ్చింది.

పైవిషయాలనుబట్టి పరామర్శచేస్తే ఆంధ్రులకూ, మీసాలకూ అవినాభావసంబంధం కద్దని తోచుచున్నది. మన జీవితంలో వీనికి యింత పేరుప్రతిష్ఠలు, మనభాషలో విశిష్టస్థానం, కవితాప్రశంస కలగడమే యిందుకు ప్రబలనిదర్శనం. నిమ్మకాయను నిలిపేటంతటి మీసాల పటిమ ఆంధ్రునికే కద్దు. ఆంధ్ర భోజునికి మీసా లుండినవి. ఆంధ్రకవులకు నాడూ, నేడూకూడా అందము చేకూర్చేది మీసమే. ఆంధ్ర

జనాన్ని అయ్యరుహోటల్లో అరవసోదరులు అనవాలు పట్టడం విూసాలవల్లనే. ఈనాడు ఆంధ్రుని వ్యక్తిత్వము హీనమైనా నిలిచివుండం టే అది విూసంవల్లనే. ఆంధ్రుని వేషమునకు విూసము అందమునిచ్చును. విూసము పెంచి, వేషమునకు, వ్యక్తిత్వమునకు దోషము వాటిల్లనీక రాష్ట్రము సంపాదించి విూసము దువ్వేది యెన్నటికో యీ ఆంధ్రుడు?

చె. శ్రీ. వెంకటరామయ్య.

---



## తాతపూడి వెంకటసుబ్బారావుగారు

కాశీ విశ్వవిద్యాలయంలో యం. యస్‌సి. పరీక్ష ప్యాసై, ఆంధ్రవిశ్వవిద్యాలయంలో 'డాక్టర్ ఆఫ్ సైన్స్' కొరకు 3 సం.లు పరిశోధనలు సాగించి, తరువాత 3 సం.లు హైదరాబాదు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో కేంద్రప్రభుత్వంవారి 'బోర్డ్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసర్చ్' తరఫున ఆముదం నుండి వార్నీషులు, పెయింట్లు చేయుటనుగురించి పరిశోధనలు జరిపి, కొన్ని పేటెంట్లుకూడ తీసికొని, తరువాత గత ౪ సం.లుగా టాటా ఆయిల్ మిల్సుకంపెనీలో ప్లాస్టిక్ మీద పరిశోధనలు చేయుచుఉండి, అందులో ఇంకా అనుభవము సంపాదించుకొనుటకు బ్రూక్లిన్ పాలీ టెక్నిక్‌లో ప్రపంచవిఖ్యాతి పొందిన ప్రొఫెసర్ మార్కుగారిదగ్గరకు మొన్న సెప్టెంబరు ౭-వ తేదీన విమానంమీద న్యూయార్కు వెళ్లినారు.

---

# విమర్శనము

## నవభారతము

రచయిత : సీతంరాజు సుబ్రహ్మణ్యశర్మగారు, బి. కాం. (ఆనర్స్). ప్రకాశకులు : సుదర్శన పబ్లిషర్స్, ౧౦/౩ తంబుచెట్టివీధి, మద్రాసు ౧. వెల రూపాయిన్నర.

భారతదేశము తెల్లదొరల పెత్తనమునుండి తప్పుకొని స్వేచ్ఛావాయువులు పీల్చ నారంభించి మొన్నటి ఆగష్టు ౧౫కు సంవత్సరము పూర్తియైనది. ఈ తొలియేటి ఈ నవభారతములో మంచివి-చెడ్డవి ఎన్నెన్నో రాజకీయ సంఘటనలు జరిగినవి. వాటి నెదుర్కొనుటలో మన ప్రభుత్వమువారు ఎంతెంతో పాటుపడినారు. అలవిమాలిన ఎన్నో అటుపాటులకు పాలైనారు; అన్నిటిని నేర్పుతో తప్పించుకొన్నారు. ఆ సంఘటనలు, ఆ కృషి, ఆ ఆటుపోటులు, ఆ పరిష్కారము అన్నియు ఈ పుస్తకమునందు ౧౯ ప్రకరణములలో విశదముగా నిరూపింపబడినవి. వ్యష్టిగా ఇందలి విషయములు చర్విత చర్వణమే యైనను అన్నియు ఒక్కచో కూర్పబడిన ఈ సమగ్రసమితి సమష్టిగా ఒక క్రొత్తదనమును ప్రత్యేకించి స్థాపించుకొన్నదనవచ్చును. రాజకీయసింహావలోకనము చేయగోరువారికి ఇది మిక్కిలి ఉపయుక్తమై యుండగలదనుట కాక్షేపణలేదు.

## కాంగ్రెసు కథలు

మొదటిభాగము. రచయిత : దండిపల్లి వెంకటసుబ్బాశాస్త్రిగారు, ప్రకాశకులు : నవభారత్ పబ్లిషర్స్ లిమిటెడ్, కర్నూలు. వెల ౧ రూ.

ఇది ఒక క్రొత్త పద్ధతిని సంతరింపబడిన కథా సంపుటి. కాంగ్రెసు నిర్వహించిన స్వాతంత్ర్యసమరములో ఎంతో శ్రద్ధాభక్తులతో పాల్గొని, అపక్రవిక్రమత్యాగసాహసములు చూపియు కాలకర్మవశాత్తు తెరమరుగుననే ఉండిపోయిన కొందరు అజ్ఞాతవీరుల యథార్థకథ లివి. ఎక్కడెక్కడనుండియో వీనిని పోగుచేసి, చక్కని శైలిలో కమ్మని తీరున రచించి శాస్త్రిగారు నిజముగా మంచిపని చేసినారు. వీనిని చూడగా ఇంకను ఎందరు వీరులు ఇట్లు అజ్ఞాతముగా ఉండిపోయినారో కదా అని జిజ్ఞాస రేకెత్తకమానదు. వారి కథలుకూడ త్రవ్వితీసి శాస్త్రిగారు త్వరలోనే పాఠకలోకమున కందివ్వదురుగాక.

(స్వీకారము)

## మునెమ్మ మరణము ఇత్యాగులు

పద్యరచనల సంపుటి. రచయిత డా. కట్టమంచి రామలింగారెడ్డిగారు, ఆంధ్రవిశ్వకళాపరిషత్తు ఉపాధ్యక్షులు. ప్రకాశకులు : గ్రంథాలయపుస్తకశాల, పటమటపోస్టు (కృష్ణా). వెల రూపాయిన్నర.

## నేతాజీ బోసు వీరగాథ

బుర్రకథ తెగకు చేరిన పదము. రచయిత : ప్రయాగ నరసింహశాస్త్రిగారు, బి. ఏ. ౮, మునియప్పిళ్లవీధి, కోమలేశ్వరపేట, మద్రాసు ౨.

## మహాత్మా గాంధీ స్మృతిసంచిక

ప్రకాశకులు : స్త్రీహితైషిణీమండలి, బాపట్ల. వెల ౮ అ.

## మల్లికార్జున పండిత విజయము

గ్రంథకర్త : ముదిగొండ వీరభద్రమూర్తిగారు, మాదల. వెల రూ. ౧-౮-౦.

## కాళహస్తీశ్వర శతకము

మహాకవి ధూర్జటి రచించినది. ప్రకాశకులు : సాధన గ్రంథమండలి, తెనాలి. వెల ౭ అ.

---

Printed and Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press.
No. 7. Thambu Chetty St., G. T., Madras. Editor—S. Sambhu Prasad.